


www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 2-3-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 317 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి ఉ. 7.55 తదుపరి సప్తమి; నక్షత్రం: విశాఖ మ. 2.43 తదుపరి అనూరాధ; వర్జ్యం: రా. 6.55-8.36; దుర్ముహూర్తం: ఉ. 6.37-8.10; అమృతఘడియలు: శేషం ఉ. 6.56, తె. 5.00 మొదలు; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.37; సూర్యాస్తమయం: 6.19 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


హృదయపూర్వక శుభాకాంక్షలు
శ్రీ వసంత వెంకట కృష్ణ ప్రసాదు గారు
నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషిచేస్తూ..
నీతి నిజాయితీకి మారుపేరుగా, పేదల పక్షాన నిరంతరం
పోరాడుతున్న మైలవరం నియోజకవర్గ శాసనసభ్యులు
గౌ॥ శ్రీ వసంత వెంకట కృష్ణ ప్రసాదు గారు
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి
సమక్షంలో నేడు తెలుగుదేశం పార్టీలో చేరుతున్న
శుభసందర్భముగా వారికి మా హృదయపూర్వక శుభాకాంక్షలు
భవిష్యత్తుకు గ్యారెంటీ
సంక్షేమం అభివృద్ధి
ఇది బాబు గ్యారెంటీ
తెలుగుదేశం - జనసేన కూటమిని
గెలిపించుకుందాం...
మైలవరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 2-3-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

● జవాబు కావాలి జగనన్నా!

సీబీఐ విచారణలో తేలిన నిందితుల జాబితాలో అవినాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఉన్నారు. వారిని జగనన్న రక్షిస్తున్నారు. హత్యలో ప్రమేయమున్న వారిని జగన్ రక్షించడం, వారితో దగ్గరగా మెలగడం, సొంత చిన్నాన్న చనిపోతే ఐదేళ్లుగా ఏ మాత్రం పట్టించుకోకపోవడం చూస్తుంటే నాకూ సందేహం కలుగుతోంది. జగన్ పాత్రపైనా విచారణ జరగాలి. నిర్దోషి అయితే వదిలేయాలి. ఆరోజు ఉదయం గొడ్డలితో వివేకాను చంపారని జగన్ చెప్పారు. ఆయన ఆ విషయాన్ని ఎలా చెప్పగలిగారు. దీనికి కూడా దర్యాప్తులో జవాబు రావాలి! తనపై 11 కేసులున్నాయి... ఇది కూడా సీబీఐకి ఇస్తే 12వది అవుతుంది అని జగన్ అన్నారు. ఆ 11 కేసులలో పదేళ్లుగా విచారణ కూడా మొదలు కాలేదు. ఈ కేసు కూడా అలా ముగిసిపోకూడదన్నదే నా ఆవేదన!

- సునీతా రెడ్డి



వంచన.. మోసం... హత్యా రాజకీయాలు!

వైసీపీకి ఓటేయొద్దు!

ప్రజా తీర్పుతోనే నాకు న్యాయం

వివేకా హంతకులను రక్షిస్తున్న జగన్

నా అక్కా, చెల్లి అంటారే.. నేను చెల్లిని కాదా?

పెత్తందారులెవరు... ఎవరితో మీ యుద్ధం?

'విశ్వసనీయత, విలువలు' ఉత్తి మాటలేనా?

వివేకా హత్య విషయంలో గుర్తుకు రావా?

న్యాయం కోసం మొదట అడిగింది అన్ననే...

ఆయన చెప్పిన సమాధానాలతో ఆశ్చర్యపోయా!

ఈ కేసులో జగన్ పాత్రపైనా విచారణ జరగాలి

అవినాశ్ రెడ్డిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలి

వివేకా కుమార్తె సునీతా రెడ్డి డిమాండ్





అవినాశ్ హైడ్రామా...

వివేకా హత్య జరిగిన రోజు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము దాకా గంగిరెడ్డితో అవినాశ్ 25 సార్లు మాట్లాడారు. కర్నూలులో ఏం జరిగిందో మనందరికీ తెలుసు. ఒక అనుమానితుడిని (అవినాశ్ రెడ్డిని) అరెస్టు చేయడానికి వెళ్లిన సీబీఐ అధికారులు రెండు రోజులు ఎదురు చూడడం దేశంలో ఎక్కడైనా జరిగిందా? సీబీఐ అధికారులకు సహకరించాల్సిన పోలీసులు ఎందుకు మౌనంగా ఉన్నారో నాకు అర్థం కాలేదు. రెండు రోజుల తర్వాత ఉత్త చేతులతో సీబీఐ అధికారులు వెనక్కి వచ్చేశారు. వారిపై ఎలాంటి ఒత్తిడి ఉందో నాకు తెలియదు. అవినాశ్ రెడ్డిని కస్టోడియల్ ఇన్వెస్టిగేషన్‌కు తీసుకోవాలి.

- సునీతా రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): "మా నాన్న వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగి ఐదేళ్లు అవుతోంది. న్యాయం కోసం ఇప్పటికీ పోరాడుతూనే ఉన్నాను. నాకు జరుగుతున్న అన్యాయానికి ప్రజాతీర్పుతోనే తెరపడాలి" అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బాబాయ్ కుమార్తె నర్రెడ్డి సునీతా రెడ్డి పేర్కొన్నారు. తాను తొలుత జగనన్న సహాయమే కోరానని... కానీ, వంచనే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రభుత్వంలో హత్యా రాజకీయాలు ఉండకూడదు. ఇంత వంచన చేసిన పార్టీకి, మోసం చేసిన పార్టీకి... తన అనుకునే వాళ్లకి మాత్రమే సాయం చేసి... మిగిలిన వారికి అన్యాయం చేసే వాళ్లకు దయచేసి ఓటేయకండి! హత్యలు చేసే వారు మనల్ని పాలించకూడదు. మా అన్న పార్టీ

మిగతా 12వ పేజీలో...



తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో కాంగ్రెస్ సభకు హాజరైన జనం. షర్మిల అభివాదం

గల్లీలో పులి, ఢిల్లీలో పిల్లి

ఏపీని హత్యచేశారు.. ప్రత్యేక హోదా, రాజధాని, డీఎస్సీ.. అంతా జగన్ దగా

ప్రత్యేక హోదా పదేళ్లు ఇస్తాం.. ప్రతి ఇంటికీ రూ.5వేలు అభయహస్తం

తిరుపతి సభలో పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల.. ప్రత్యేక హోదాపై డిక్లరేషన్ విడుదల

'ఇండియా'పై కేంద్ర సంస్థలతో దాడులు: సచిన్

ఫ్యాన్, సైకిల్, కమలం గుర్తులను ఊరిబయట పడేయండి: సీపీఐ నారాయణ వ్యాఖ్య

11

ట్రాక్టరుతో గుద్ది చంపేశారు

తాగునీరు అడగటమే ఆమె నేరం

పల్నాడులో వైసీపీ మార్కు రాక్షసత్వం

టీడీపీ అభిమాని అంటూ నీళ్లు ఇచ్చేందుకు నిరాకరణ

ట్రాక్టరుతో గుద్దిన డ్రైవరు

ఆస్పత్రికి చేర్చేలోపే మృత్యువాత

మాచర్ల, మార్చి1 : తాగే నీళ్లలోనూ రాజకీయం చూసే వైసీపీ రాక్షసత్వం ఓ గిరిజన మహిళను బలి తీసుకుంది. ఆమెను అందరూ చూస్తుండగానే ట్రాక్టరుతో గుద్ది హత్య చేశారు. మాచర్ల నియోజకవర్గంలోని రెంటచింతల మండలం మల్లవరంలో ఈ దారుణం జరిగింది. వైసీపీ మార్కు అరాచకత్వానికి అద్దంపట్టిన ఈ ఘటన వివరాలు.. మల్లవరం గ్రామానికి

మిగతా 11వ పేజీలో...



సామినిబాయి మృతదేహం

ఏలూరులో అర్ధరాత్రి వైసీపీ అరాచకం

దాడిచేసి ఓ మహిళ ఇంటి స్థలం కబ్జాకు యత్నం

వైసీపీ నాయకులతో కలిసి రియల్టర్ దౌర్జన్యం

కోర్టులో కేసు ఉన్నా కుటుంబంపై దాడి 9

మనస్తాపంతో బాధితురాలి ఆత్మహత్యాయత్నం

రామేశ్వరం కేఫ్‌లో పేలుడు

బెంగళూరులో బాంబు కలకలం

క్షతగాత్రుల్లో హోటల్ సిబ్బంది, కస్టమర్లు

ఘటన స్థలంలో బ్యాటరీ, వైర్లు, మేకులు

వాష్‌బేసిన్ వద్ద బ్యాగ్ వదిలిన వ్యక్తులు

బెంగళూరు కుందళహళ్లి వద్ద ఘటన

బాధ్యులపై కఠిన చర్యలు: సీఎం

9

పది మందికి గాయాలు



పేలుడు సంభవించిన రామేశ్వరం కేఫ్



మార్చి నుంచే వడగాడ్పులు!

తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక

మే వరకు దేశంలో తీవ్ర ఎండలు 9

జూన్ చివరి నాటికి ఎల్‌నినో బలహీనం

నైరుతి సీజన్ రెండో భాగంలో మంచి వర్షాలు

వలంటీర్లను ఆపండి!

పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా చూడండి

వైసీపీకి ప్రచారం, ఓటర్ స్లిప్ పంపిణీ నిలపండి

వారి ద్వారా పథకాల అమలు వద్దు

రాజకీయ అవసరాలకు తెచ్చిన వ్యవస్థ అది

వలంటీర్లకు జీతాలుగా రూ.కోట్ల ప్రజాధనం

ఆ డబ్బును జగన్, వైసీపీ నుంచి రాబట్టండి

హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం



12



పర్యాటక శాఖ వారి 'కళా'ధర పోషణ!

ఏపీటీడీసీ రూట్లు ప్రైవేటు సంస్థకు

తిరుమల ప్యాకేజీకి డిమాండ్

భారీగా సొమ్ము చేసుకునే అవకాశం

వారం కిందటే రంగంలోకి కళాధర్

గుట్టుగా ఒప్పందం.. అమలు

తిప్పాల్సింది ఎలక్ట్రిక్ బస్సులు

తిప్పుతున్నది డొక్కు ప్రైవేట్ బస్సులు

పర్యాటక యూనిట్లకు ఉరితాడు

ఇప్పుడు ట్రాన్స్‌పోర్ట్ విభాగం 'అమ్మకం'

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

పర్యాటకులకు తిరుమల వెంకన్న దర్శనం చేయించే వీలు! మంచి లాభాలను అందించే రూటు! ఏపీతోపాటు చెన్నై, బెంగళూరు నుంచీ డిమాండ్! ఇదీ ఏపీ పర్యాటక సంస్థ (ఏపీటీడీసీ) నడిపే 'తిరుమల' ప్యాకేజీ ప్రత్యేకత! కానీ... ఏపీటీడీసీ తన బస్సులను మూలకు పడేసింది. అన్ని రూట్లను 'కళాధర్' అనే సంస్థకు కట్టబెట్టింది. అత్యంత గుట్టుగా జరిగిన ఒప్పందం ఫిబ్రవరి 23వ తేదీనే అమలులోకి వచ్చేసింది. ఏపీటీడీసీ 'కళా'ధర పోషణకు కారణమేంటి? దీని వెనుక తిరుమల ప్యాకేజీకి ఉన్న డిమాండ్‌ను

మిగతా 11వ పేజీలో...

'కోనసీమ'లో

జే ట్యాక్స్!

ఎమ్మెల్యే పేరిట రూ.కోట్లలో కప్పం

మట్టి మాఫియా నుంచి మద్యం దందా దాకా

కోనసీమ జిల్లాలోని ఆ నియోజకవర్గమే అడ్డా

ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ కొట్టే లక్ష్యంతో అక్రమార్జనలో టాప్ గేర్

పేదల స్థలాలు, మెరక పనుల్లో పండిపోయారు

ఆ జిల్లాలో ఇసుక ర్యాంపులు అక్కడే ఎక్కువ

ఇసుక కోసం నదీ పరివాహకాల్లోని లంకలు గుల్ల

షాడో ఎమ్మెల్యేగా పనిచేస్తున్న ఆ నేత బంధువు

ఆయన సమక్షంలోనే ఫైళ్లు క్లియర్ చేసే పరిస్థితి




ఆ నియోజకవర్గంలో ఎవరు లే-అవుట్ వేయాలన్నా రూ.లక్షల్లో కప్పం కట్టాల్సిందే. ప్రాంతాన్ని బట్టి ఎకరానికి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకు ఆ ఎమ్మెల్యేకు సమర్పించాలి. లే-అవుట్ భూముల్లో ఇళ్లు కట్టాలంటే దానికి రేటు సపరేటు. 'మేం కట్టబోం. రూల్ ప్రకారం పోతాం' అని ఎవరైనా అంటే.. ఇళ్ల ప్లాన్లు, నిర్మాణానికి అవసరమైన క్లియరెన్సులు అన్నీ ఆగిపోతాయి. మెరక పనుల నుంచి ప్లాట్లు రిజిస్ట్రేషన్ అయ్యే వరకు అడుగడుగునా అడ్డంకులు కలిగిస్తారు. చివరికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సైతం ఎమ్మెల్యే అనుచరగణం కనుసన్నల్లోనే పనిచేస్తున్నాయి.

(అమలాపురం, ఆంధ్రజ్యోతి)

మనసు పడితే దోపిడీ...కన్నుపడితే భూకబ్జాలు...ఆదేశిస్తే అక్రమాలన్నీ సక్రమాలే...డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ముఖద్వారంలోని ఆ నియోజకవర్గంలో ఆ ఎమ్మెల్యే మట్టి, ఇసుక దందాలతో పులిసిపోయారు. ఏకంగా నదీగర్భాలను సైతం కొల్లగొట్టి రూ.కోట్లు వెనకేసుకున్నారు. నియోజకవర్గంలో ఎక్కడ లే-అవుట్లు వెలసినా, అపార్టుమెంట్లు కట్టినా, భూముల రిజిస్ట్రేషన్లు జరిగినా ఎమ్మెల్యేగారి పేరిట 'జె ట్యాక్స్' వసూలు చేయాల్సిందే. ప్రతి పనిలోనూ వాటాలు దొరుకుతుండటంతో కొందరు అధికారులు పిలుపువస్తే చాలు పరుగులు పెడుతున్నారు. బడుగు, బలహీనవర్గాల ఇళ్ల స్థలాల పేరుతో రూ.కోట్లు నొక్కేయడమే కాకుండా ఆ స్థలాల మెరక పేరిట ఏకంగా మట్టి మాఫియానే సృష్టించారు. ప్రతి పనికీ రేట్లు నిర్ణయించి ఫైనాన్షియల్ సెటిల్‌మెంట్లు

మిగతా 12వ పేజీలో...



నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా

సాయిరెడ్డి!

మంగళగిరిలో గంజి చిరంజీవి అవుట్

అక్కడ ఎమ్మెల్సీ మురుగుడు కోడలుకు చాన్సు

కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జిగా ఇంతియాజ్

మూడు పేర్లతో వైసీపీ 9వ జాబితా విడుదల

అభ్యర్థులు దొరక్క జగన్ అగచాట్లు!

పిఠాపురం బరిలో ముద్రగడ?

ఆయన్ను వైసీపీలోకి తెచ్చేందుకు యత్నాలు!

నేడు టీడీపీలోకి వసంత

వైసీపీ ఎంపీలు వేమిరెడ్డి, లావు కూడా

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సైతం

మైలవరం నుంచి కృష్ణ ప్రసాద్ పోటీ?

నెల్లూరు సభలో వీపీఆర్

గురజాలలో లావు, కృష్ణమూర్తి చేరిక

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'మార్పులే ఉండవు. అభ్యర్థులంతా ఖరారయ్యారు' అని ప్రకటించిన వైసీపీ అధిపతి, సీఎం జగన్మోహన్ రెడ్డి మరో 'జంతర్ మంతర్' జాబితా విడుదల చేశారు. శుక్రవారం ఓ ఎంపీ, రెండు అసెంబ్లీ స్థానాలకు ఇన్‌చార్జులను ఖరారు చేశారు. అనూహ్యంగా.. నెల్లూరు లోక్‌సభ స్థానానికి రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డిని తెరపైకి తీసుకొచ్చారు. అలాగే మంగళగిరిపై మూడు ముక్కలాట కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డిని కాదని.. చేనేత వర్గానికి చెందిన గంజి చిరంజీవిని ఇన్‌చార్జిగా నియమించిన ఆయన.. శుక్రవారం ఆయన్ను కూడా పక్కనపెట్టేశారు. వైసీపీ ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు కోడలు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల కుమార్తె అయిన మురుగుడు లావణ్యను కొత్త ఇన్‌చార్జిగా నియమించారు. ఇక... 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పినట్లుగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్‌ను కర్నూలు అసెంబ్లీ ఇన్‌చార్జిని చేశారు. వాస్తవానికి అధికారపక్షం తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులు కనుచూపుమేరలో కనిపించడం లేదు. ఎన్నికల్లో ఫలితం ఎలా ఉంటుందో గ్రహించిన వైసీపీ నేతలు బరిలోకి దిగేందుకు సాహసించడం లేదు. దీంతో.. సరైన అభ్యర్థులు దొరక్క జగన్ విలవిలలాడుతున్నారు. ముఖ్యంగా పార్టీకి ఇంతకాలం అండదండలు అందించిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి.. వైసీపీ తరఫున లోక్‌సభకు పోటీచేసేందుకు

మిగతా 11వ పేజీలో...

జనానికి జగన్ బెదిరింపులు

నేను సీఎంగా లేకపోతే.. చదువులు సాగవు! 9

వసతి దీవెన, ఇతర పథకాలు ఏమవుతాయో!.. అక్కచెల్లెమ్మల బతుకులు ఛిన్నాభిన్నం

వ్యవసాయం గాలికి పోతుంది.. పేదల తరఫున పోరాడుతుంటే నాపై పెత్తందార్ల యుద్ధం

14 ఏళ్లు సీఎంగా ఉన్నా బాబు చేసిందేమీ లేదు.. పామర్రు సభలో సీఎం పాతపాట

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గాజా ఘోరం!

గాజాలో ఇంతకంటే పెద్దపెద్ద ఘోరాలే జరిగాయి కానీ, ఆకలితో ఉన్నవారిని కాల్చిపారేసిన ఆ ఘటనమీద ఓ మాటన్నా అనక పోతే అంతబాగోదని కాబోలు, అగ్రదేశాలు గట్టిగానే ఖండిస్తున్నాయి. ఈజిప్ట్‌నుంచి రఫా సరిహద్దుమీదుగా రొట్టెలపిండిని తీసుకొచ్చిన వాహనాలను వేలాదిమంది చుట్టుముట్టిన దృశ్యాలు మీడియాలో చూస్తున్నాం. ఆకలితో ఉన్నారు కనుక, కలుపుమొక్కల్నీ తినిబతుకు తున్నారు కనుక, ఆ ట్రక్కులు రాగానే వాటివెంట పరుగులుతీశారు, వాటికిందపడి మరణించారు, పరస్పరం కలయబడ్డారు. అన్నం కోసం జరిగిన ఆ తొక్కిసలాటలో గాయపడినవారు, ప్రాణాలు కోల్పోయిన వారు పోను మిగతావారిమీద ఇజ్రాయెల్ సైనికులు కాల్పులు జరిపారు. వాతావరణం తమకు ప్రమాదకరంగా పరిణమిస్తున్నదని గ్రహించి ఇజ్రాయెల్ సైనికులు ఈ పనిచేశారట. అధికారికలెక్కలకేమి కానీ, విచక్షణారహితంగా జరిగిన ఈ కాల్పుల్లో మరణాలు వంద దాటాయి, వెయ్యిమందికిపైనే తీవ్రంగా గాయపడ్డారు.

మానవత్వం మీద దాడి, నేరం, ఘోరం అంటూ ఖండించడానికి ప్రపంచాధినేతలకు చాలా పడికట్టు పదాలు అమ్ములపొదిలో సిద్ధంగా ఉంటాయి. ఐక్యరాజ్యసమితి పెద్దాయన ఎప్పటిలాగానే ఆవేదన వెలిబుచ్చారు. అన్యాయం, ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు అంటూ ఇటలీ, స్పెయిన్ దేశాధినేతలు కాల్పులవిరమణ గురించి ఓ మాటన్నా అన్నందుకు సంతోషించాలి. ఈ ఖండనమండనలను అటుంచితే, దక్షిణాఫ్రికా ప్రకటన ఒకింత భిన్నంగా ఉంది. అంతర్జాతీయ న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన ఆదేశాలను ఈ దారుణమైన చర్యతో ఇజ్రాయెల్ పూర్తిగా ఉల్లంఘించిందని అది వ్యాఖ్యానించింది. ఇజ్రాయెల్ జీనోసైడ్‌కు పాల్పడుతున్నదంటూ ఐసీజెలో దక్షిణాఫ్రికా కేసు వేసినప్పుడు, మానవతాసాయాన్ని అనుమతించడం, తన సైనికుల దమనకాండను నియంత్రించడం ఇత్యాది అంశాల్లో ఐసీజే తన మధ్యంతర తీర్పులో భాగంగా కొన్ని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. వాటి అమలు తీరుతెన్నులను తనకు నివేదించాలని కూడా ఆదేశించింది. ఈ ఘటన ఇజ్రాయెల్ వైఖరిలో రవ్వంతైనా మార్పు రాలేదనడానికి నిదర్శనమని వ్యాఖ్యానించిన దక్షిణాఫ్రికా ఈ ఘోరాన్ని ఐసీజే దృష్టికి తీసుకుపోవడానికి సిద్ధపడుతోంది.

ఈ దారుణాన్ని ఖండించడానికి అమెరికా అధ్యక్షుడికి మనసు రాలేదు. రెండు భిన్నమైన వాదనలు ఉన్నందున నిజం తెలియకుండా ఏం మాట్లాడాలని అమెరికా అడుగుతోంది. అసలు అక్కడ ఏం జరిగిందో వెంటనే ఓ నివేదిక ఇవ్వండి అని హంతకులనే అమెరికా అడిగింది. ఈ ఘటన అత్యంత సున్నితమైన కాల్పుల విరమణ చర్చలను మరింత సంక్లిష్టం చేస్తుందని వ్యాఖ్యానించింది. గాజాపూర్తిగా నేలమట్టమైనా, పాతికవేలమందిని ఇజ్రాయెల్ ఊచకోతకోసినా, వేలాదిమంది అన్నం, నీరు, మందులు లేక అల్లాడిపోతున్నా నిమ్మకునీరెత్తినట్టు ఊరుకున్న అమెరికా ఇప్పుడు ఓ వందమంది మరణించినంత మాత్రాన చలించిపోదు. ఈ ఘటనను ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేయాలని గురువారం భద్రతామండలి సమావేశంలో ప్రయత్నం జరిగింది. ఇజ్రాయెల్‌ను ఎలా తప్పుబతారంటూ అమెరికా ఆ ప్రయత్నాన్ని తిప్పికొట్టింది. ఇజ్రాయెల్‌కు ఆయుధాలు అందించే విషయంలో కానీ, అంతర్జాతీయ వేదికలమీద అండగా ఉండటంలోనూ అమెరికా వైఖరిలో ఏ మార్పూ ఉండబోదని దీని అర్థం. ఎటువంటి ఆంక్షలూ నియంత్రణలూ లేని ఆయుధ, ఆర్థిక ప్రవాహంతోనే ఇజ్రాయెల్‌ను ఈ కష్టకాలంలో ఆదుకోగలమని అమెరికా అధ్యక్షుడు నమ్ముతున్నారు. మరింత మానవతా సాయం విషయంలో ఇప్పటికే ఇజ్రాయెల్–హమాస్ మధ్య చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడితే, ఈ ఘటన తరువాత బందీల అప్పగింతకు సంబంధించి ఆయా పక్షాలతో జరుపుతున్న చర్చలను హమాస్ పూర్తిగా ఆపివేసిందని కూడా వార్తలు వస్తున్నాయి. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న ఈజిప్ట్, ఖతార్ ఇప్పుడు మరింత ఇబ్బందికరమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. నలభైరోజుల పాటు ఇరుపక్షాలూ మధ్యా కాల్పులు నిలిచిపోయి, ఆకలితో అల్లాడిపోతున్న ప్రజలకు కాస్తంత సాయం అందుతున్న ఆశలు ఇప్పుడు అడుగంటిపోతున్నాయి. నెలకుపైగా యుద్ధం ఆగితే ఆహారం అందుతుంది, ఆస్పత్రులు కాస్తంత పనిచేస్తాయి, నిలువనీడకోల్పోయిన వేలాదిమందికి తాత్కాలికంగానైనా ఆశ్రయం కల్పించే ప్రయత్నాలూ జరుగుతాయి. బందీల అప్పగింత వ్యవహారం కొలిక్కివస్తే కాల్పుల విరమణను నిరవధికంగా కొనసాగించే అవకాశాలూ ఉంటాయి. కానీ, అన్నార్తులమీద జరిపిన ఈ భయానకమైన దాడితో ఇజ్రాయెల్ మొత్తం వ్యవహారాన్ని మొదటకు తెచ్చింది.

విప్లవోద్యమంలో కొత్త కెరటం

విప్లవోద్యమ గమనంలో ఒక ముందడుగు. మూడు విప్లవ పార్టీలు కలసి ఒక పార్టీగా ఆవిర్భవిస్తున్నాయి. సిద్ధాంత, రాద్ధాంత దారుల్లో ఎన్నో సంస్థలు ఉన్నా విప్లవోద్యమం మాటకు, చేతకు పొంతన లేక అనేక మంది ఎంతో తండ్లాట పడుతున్నారు. బలమైన విప్లవోద్యమం, ఆచరణాయుత మార్గదర్శకత్వంలో బలమైన పార్టీ కావాలని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ(ఎం.ఎల్) ప్రజాపంథా, భాస్కర్ నంది, సంతోష్ రాణా నేతృత్వాన కొనసాగి అస్సాం, త్రిపుర, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలలో పనిచేస్తున్న పీసీసీ సీపీఐ (ఎం.ఎల్), అలానే 12 రాష్ట్రాలలో కార్మిక, రైతు ఉద్యమాలు నిర్వహిస్తున్న సీపీఐ(ఎం.ఎల్.) రెవెల్యూషనరీ ఇనిషియేటివ్ అనే మూడు విప్లవ సంస్థలు కలసి ఒకే పార్టీగా ఏర్పడాలని నిర్ణయించుకున్నాయి. ఈ సంస్థలు కలసి ఏర్పడే పార్టీని సీపీఐ (ఎం.ఎల్) మాస్‌లైన్ అని పిలవాలని నిర్ణయించాయి.

ఈ మూడు పార్టీల ఐక్యతా కార్యక్రమం, యూనిటీ కాన్ఫరెన్స్ 2024 మార్చి 3, 4, 5 తేదీలలో ఖమ్మంలో జరుగుతున్నాయి. మార్చి మూడున సాయంకాలం 3 గంటలకు ఎస్.ఆర్. అండ్ బి.జి.ఎన్.ఆర్. కళాశాల నుంచి పెవిలియన్ గ్రౌండ్ దాకా వేలాది మందితో భారీ ప్రదర్శన గ్రేట్ మార్చ్ నిర్వహించనున్నాయి. సాయంకాలం 6 గంటలకు అమరులు రవన్న, సంతోష్ రాణా నగర్ పెవిలియన్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ జరుగుతుంది. అలానే మార్చి 4, 5 తేదీలలో ఎంపిక చేయబడ్డ 300 మంది ప్రతినిధులతో ఆలిండియా యూనిటీ కాన్ఫరెన్స్ డి.వి.కె, భాస్కర్ నందినగర్ (భక్త రామదాసు కళ్యాణ మండపం)లో జరుగుతుంది. ఈ కాన్ఫరెన్స్‌లో విప్లవ కార్యక్రమం, నిబంధనావళి, రాజకీయ తీర్మానం, కేంద్ర కమిటీ ఎన్నిక, ఇతర తీర్మానాలు ఎజెండాగా ఉంటాయి. ఈ కాన్ఫరెన్స్‌కు జర్మనీ ఎం.ఎల్.పి.డి. పార్టీ నాయకులు, నేపాల్ సీపీఐ(ఎం.ఎల్) మషాల్ ప్రతినిధి, శ్రీలంక పార్టీ ప్రతినిధులు సౌహార్ద అతిథులుగా పాల్గొంటారు. మన దేశంలోని సోదర ఎం.ఎల్. పార్టీల ప్రతినిధులు కొందరు సౌహార్ద ప్రతినిధులుగా హాజరవుతున్నారు.



ఫాసిస్టు ప్రమాద బరిలో ఉన్న భారతదేశంలో కమ్యూనిస్టు విప్లవశక్తులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలసికట్టుగా ఫాసిజాన్ని ఎదుర్కోవడం నేటి జరూరు కర్తవ్యమని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ భావిస్తున్నది. చీకట్లో చిరుదీపం లాగా మూడు పార్టీలు ఐక్యం కావడం శుభపరిణామం. ఇది దేశంలో కమ్యూనిస్టు విప్లవకారులందరూ ఒకటి కావడానికి తోడ్పడాలి.

భారత కమ్యూనిస్టు పార్టీ ఈ డిసెంబర్ నాటికి ఏర్పడి వందేళ్ళు పూర్తవుతున్నది. రివిజనిజంను ధిక్కరిస్తూ 1969లో సీపీఐ(ఎం.ఎల్) ఏర్పడి 55 ఏళ్లు పూర్తయ్యింది. కానీ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమం ఉన్నత దశ నుంచి బలహీన దశలోకి మారింది. ప్రభావశీలత తగ్గిపోయింది. మొత్తం కమ్యూనిస్టు విప్లవోద్యమం దిశా, దశను ఎంచుకోవడంలోనే పొరపాట్లకు లోనయ్యింది. మితవాదానికి కొట్టుకుపోవడమో, దాని మీద కోపంతో అతివాదానికి పరుగు తీయడమో చేసింది. ఫలితంగా తగిన సమయంలో సరైన ఎత్తుగడలు అనుసరించక వైఫల్యాలు, నష్టాలు ఎదుర్కొన్నది. ఆదివాసీలు, దళితులు, పేదలు తదితర అణచివేయబడ్డ వర్గాల పునాదిలో పని చేసినా, ఆ ఉద్యమంలో మమేకమయి ఎన్ని త్యాగాలు చేసినా, కుట్ర కేసులు, కష్టాలు అనుభవించినా – తగిన ఫలితం అంటే బలమైన విప్లవోద్యమ నిర్మాణం జరగలేదు. ఈ వైఫల్యాలను సరిగ్గా, సక్రమంగా సమీక్షించుకోలేదు. సిద్ధాంత వైఖరుల్లో ఖచ్చితత్వం, ఆత్మవిమర్శ లోపించి, పెటీ బూర్జువా అహంభావం ప్రధానంగా పనిచేసి భారత కమ్యూనిస్టుల్లో అంతులేని చీలికలు, పేలికలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో భారత కమ్యూనిస్టు విప్లవకారుల్లో కొందరికి ప్రజా ఉద్యమం కంటే తుపాకి మీద ప్రేమ, నరోద్నిజం మీద మక్కువ ఏర్పడ్డాయి. ఆ ఆలోచన, ఆచరణ అనేక మంది లంపెన్ శక్తులకు కొంత ఆసరాగా కూడా మారింది. విప్లవం పేరిట అరాచకవాదం, లంపెనిజం కొనసాగుతున్నది.

వీర తెలంగాణ, నక్సల్బరీ, శ్రీకాకుళం, కరీంనగర్, గోదావరి లోయ పోరాటాలను విప్లవ కమ్యూనిస్టు ఉద్యమం నిర్మించింది. వేల మంది మట్టి మనుషులు ఆ పోరాటాల్లో మిలిటెంట్‌గా పాల్గొన్నారు. భూములు పంచుకున్నారు. వెట్టిచాకిరీ రద్దు చేశారు. భూస్వామ్య పీడన నడ్డి విరిచారు. వేతనాలు పెంచుకున్నారు. అలా ఎన్నో విజయాలు సాధించిన చరిత్ర ఆనవాళ్ళు ఉన్నాయి. ఎన్నో వందల మంది ప్రాణ త్యాగాలు చేసి ఎర్రజెండాను ఔన్నత్యంగా నిలిపారు. లక్షలాది మంది నిర్బంధాలను అధిగమించి ఉద్యమంలో నిలబడ్డారు. అయితే, ఈ ఉద్యమాల గాఢత, తీవ్రత కొంత ఉన్నా వాటి ప్రభావశీలత నేడు పరిమితంగా ఉన్నది. కమ్యూనిస్టు ఉద్యమంలోని చీలికలు, సరైన సిద్ధాంత రూపకల్పన జరగకపోవడం, ప్రపంచీకరణ, పెట్టుబడి విశృంఖలతను అర్థం చేసుకుని తగిన రంగాల మీద కేంద్రీకరించకపోవడంతో, మారుమూల అడవులే కార్యక్షేత్రంగా పరిమితమయిన దానిగా పరిగణించే పరిస్థితి ఏర్పడింది.

సీపీఐ(ఎం.ఎల్.) మాస్‌లైన్ భారతీయ విప్లవపంథాను, భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించాలని యత్నం చేస్తున్నది. చైనా తరహా పోరాటం మన దేశంలో చేయాలని ప్రయత్నించి కమ్యూనిస్టు ఉద్యమం నష్టపోయిందని భావించారు. నాటి చైనా సమాజానికి, నేటి భారతీయ సమాజానికి పొంతన లేదని భావించింది. భారతదేశం అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ దేశమని, భారత వ్యవసాయ రంగం పూర్తి స్థాయిలో పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానంలో ఉన్నదని విశ్లేషించింది. భారతదేశంలో పాలకవర్గం గుత్తపెట్టుబడిదారీ వర్గమని, బడా భూస్వామ్య వర్గం వారిలో భాగమని భావిస్తున్నది. భారత పెట్టుబడిదారీ వర్గం సామ్రాజ్యవాద అంతర్జాతీయ దోపిడీకి జూనియర్ భాగస్వామిగా ఉన్నదని భావిస్తున్నది. భారతదేశం రాజకీయ స్వాతంత్ర్యం పొందినా, ఆర్థికంగా సామ్రాజ్యవాదంపై ఆధారపడుతున్నదని భావించింది. బూర్జువా ప్రజాస్వామిక వ్యవస్థ తన పట్టును నిలుపుకోవడానికి, పార్లమెంటరిజంను, బూర్జువా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యంగా మార్చి దిగజార్చుతున్నదని భావిస్తున్నది. భారతదేశంలో 40 కోట్ల మంది కార్మికవర్గం, 12 కోట్ల రైతాంగం మీద ప్రధాన ఉద్యమ కేంద్రీకరణ ఉండాలని భావిస్తున్నది.

అలాగే నేడు భారతదేశంలో బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దేశాన్ని ఫాసిస్టు మత రాజ్యంగా మార్చాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయని విశ్లేషిస్తున్నది. స్వాతంత్ర్యోద్యమం, ప్రపంచ ప్రజాస్వామిక దృక్పథాల ప్రభావం నుంచి ఏర్పడ్డ భారత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి, పరిమిత ప్రజాస్వామిక స్వాతంత్ర్యాలను సైతం కాలరాచే యత్నం చేస్తున్నదని భావిస్తున్నది. ఫాసిస్టు ప్రమాద బరిలో ఉన్న భారతదేశంలో కమ్యూనిస్టు విప్లవశక్తులు, ప్రజాస్వామికవాదులు, ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు అన్నీ కలసికట్టుగా ఫాసిజాన్ని ఎదుర్కోవడం నేటి జరూరు కర్తవ్యమని సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ భావిస్తున్నది. చీకట్లో చిరుదీపం లాగా మూడు పార్టీలు ఐక్యం కావడం శుభపరిణామం. ఇది దేశంలో కమ్యూనిస్టు విప్లవకారులందరూ ఒకటి కావడానికి తోడ్పాడాలి.

■ **పోటు రంగారావు**
కన్వీనర్, మూడు పార్టీల ఐక్యతా కాన్ఫరెన్స్ కోఆర్డినేషన్ కమిటీ

(రేపటి నుంచి ఖమ్మంలో సీపీఐ(ఎం.ఎల్) మాస్‌లైన్ ఐక్యతా మహాసభలు)

‘మాయంటావు, మిథ్యంటావు’

గుడ్ మార్నింగ్. ఉదయం మీరు కళ్లు తెరిచిన వెంటనే ఎదురుగా ఉన్న దినపత్రికలో పతాక శీర్షిక ఏమి చెప్పుతుందో గమనించారా? ‘అన్నార్తులు ఇంకెవ్వరూ లేరు. పేదరికాన్ని భారత్ నిర్మూలించింది’ అనే కాదూ? ఆహా! అదొక వాస్తవంగా మీరు విశ్వసించాలని నీతి ఆయోగ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా) ప్రగాఢంగా అభిలషిస్తోంది. ప్రణాళికా సంఘం లాంటి గౌరవార్హమైన సంస్థనొకదాన్ని, పాలకుల అభిమానాన్ని సంపాదించుకోవడానికి ఆరాటపడే ప్రభుత్వ అధికారిక ప్రతినిధి స్థాయికి తగ్గించి వేశారు. పలు అభివృద్ధి సూచికలలో చాలా దిగువ స్థాయిలో ఉన్న వారి సంఖ్య దేశ జనాభాలో 11.28 శాతమని తొలుత నీతి ఆయోగ్ ప్రకటించింది. ఇప్పుడు ఆ సంస్థ సీఈఓ స్వయంగా భారత్‌లో పేదలు దేశ జనాభాలో 5 శాతానికి మించిలేరని ప్రకటించారు. ఏ ప్రాతిపదికన ఆయన ఈ ‘సత్యాన్ని’ కనుగొన్నారు? జాతీయ నమూనా సర్వే కార్యాలయం ప్రచురించిన ‘కుటుంబ వినియోగ వ్యయం సర్వే’ (హెచ్‌సిఇఎస్) నివేదిక ఆధారంగా అని ఆయన ఈ మహా సత్యాన్ని కనుగొన్నారు మరి. హెచ్‌సిఇఎస్ నివేదిక కొన్ని విస్మయకరమైన వాస్తవాలను వెల్లడించింది. అయితే భారత్‌లో పేదల సంఖ్య దేశ జనాభాలో 5 శాతానికి మించి లేదన్న నిర్ణయానికి ఆ వాస్తవాలు ఏ విధంగానూ దారి తీయలేదు.



■ **పి. చిదంబరం**

‘పళని’ పలుకు

‘కుటుంబ వినియోగ వ్యయం సర్వే’ను ఆగస్టు 2022, జూలై 2023 మధ్య నిర్వహించారు. 8,723 గ్రామాలు, 6,115 పట్టణాలలోను మొత్తం 2,61,745 కుటుంబాల (గ్రామీణ ప్రాంతాలలో 60 శాతం, పట్టణ ప్రాంతాలలో 40 శాతం)ను పరిగణనలోకి తీసుకుని ఈ సర్వేను నిర్వహించారు. నమూనా సముచిత రీతిలో ప్రాతినిధ్యం వహించిందిగానూ, సర్వే పద్ధతి గణాంక బద్ధంగా సక్రమంగా ఉందని భావిద్దాం. సర్వే లక్ష్యమేమిటి? ప్రస్తుత/ నామమాత్ర ధరలలో నెలవారీ తలసరి వ్యయం (ఎమ్‌పిసిఇ)ని గణించడం. సగటున ఒక వ్యక్తి నెలవారీ వ్యయం ఈ విధంగా ఉన్నది: ఎగువ 5 శాతం మందిలో గ్రామీణ ప్రాంతంలో ఒకొక్కరి నెలవారీ వ్యయం రూ.10,501; పట్టణాలలో రూ. 20,824; మధ్య స్థాయి ఆదాయ కుటుంబాలలో గ్రామీణ వ్యక్తుల నెలవారీ వ్యయం 3,773 కాగా పట్టణ ప్రాంతీయులలో ఒకొక్కరి నెలవారీ వ్యయం రూ.6,459; దిగువ స్థాయి ప్రజలలో గ్రామీణులలో ఒకొక్కరి నెలవారీ వ్యయం రూ.1,373 కాగా పట్టణ ప్రాంతీయులలో ఒకొక్కరి నెలవారీ వ్యయం రూ.2,001. మధ్యస్థాయి వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.3,094 కాగా పట్టణ ప్రాంతాల్లో రూ. 4,963. మొత్తం దేశ జనాభాలో 50 శాతం మంది నెలవారీ వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.3,094 కాగా పట్టణ ప్రాంతాల్లో రూ.4,963. మరి మిగతా 50 శాతం మంది విషయమేమిటి? ఆ నివేదిక ఇలా పేర్కొంది: మొదటి 0–5 శాతం మంది నెలవారీ వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1,373 కాగా, పట్టణ ప్రాంతాల్లో రూ.2,001, 5 నుంచి 10 శాతం మంది నెలవారీ వ్యయం గ్రామాల్లో రూ.1,782 కాగా పట్టణాలలో రూ.2,607; 10 నుంచి 20 శాతం మంది నెలవారీ వ్యయం గ్రామాల్లో రూ.2,112 కాగా పట్టణ ప్రాంతాల్లో రూ.3,157.

సరే, దిగువున ఉన్న 20 శాతం మంది వద్ద ఆగుదాం. గ్రామీణ ప్రాంతాల్లో ఒక వ్యక్తి తన ఆహారానికి, ఆహారేతర అవసరాలకు నెలవారీగా చేసే వ్యయం రూ.2,112 లేదా దినసరిన రూ.70 అయితే ఆ వ్యక్తి పేదవాడు కాదని నీతి ఆయోగ్ అభిప్రాయ పడుతున్నదా? అలాగే పట్టణాలలో ఒక వ్యక్తి తన ఆహారానికి, ఆహారేతర అవసరాలకు నెలవారీగా చేసే వ్యయం రూ.3,157 లేదా దినసరిన రూ.100 అయితే ఆ వ్యక్తి పేదవాడు కాదని నీతి ఆయోగ్ అభిప్రాయపడుతున్నదా? ప్రభుత్వానికి నేను ఒక సూచన చేయదలుచుకున్నాను: నీతి ఆయోగ్ అధికారులకు రూ.2,100 ఇచ్చి ఒక నెలరోజుల పాటు గ్రామీణ ప్రాంతంలో నివసించి, తమ జీవితం ఎంత భాగ్యవంతంగా గడిచిందో నివేదిక ఇవ్వమనండి.

సర్వేలో పరిగణనలోకి తీసుకున్న కుటుంబాలలో వ్యక్తుల వినియోగంలో ఆహార వ్యయాల వాటా గ్రామీణ ప్రాంతాల్లో 46 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 39 శాతానికి తగ్గిపోయిందని హెచ్‌సిఇఎస్ వెల్లడించింది. ఇది బహుశా నిజమే అయివుండవచ్చు. పెరిగిన ఆదాయం/ వ్యయం, ఆహార వినియోగం విలువ ఒకే విధంగా ఉండడం లేదా స్వల్పస్థాయిలో మాత్రమే పెరుగుతున్న కారణంగా హెచ్‌సిఇఎస్ వెల్లడించింది నిజమే అని విశ్వసించవచ్చు.

ఇతరత్రా లభిస్తున్న సమాచారం కూడా చాలా కాలంగా గమనంలోకి వస్తున్న వాస్తవాలను ధ్రువీకరిస్తున్నది. మన సామాజిక వర్గాలలో ఎస్సీలు, ఎస్టీలు మరెవ్వరి కంటే కూడా నిరుపేదలు. విడివిడిగా వారి వ్యయాలు దేశ సగటు కంటే కూడా తక్కువ. ఓబీసీలు సగటుకు సమీపంలో ఉంటారు. ‘సగటు’కు ఎగువున ఉన్న వారు ‘ఇతరులే’ అన్నది స్పష్టం. రాష్ట్రాల వారీ సమాచారం కూడా ఈ గమనార్హ వాస్తవాలను ధ్రువీకరిస్తున్నది. నిరుపేద భారతీయులు ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిషా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మేఘాలయలో ఉన్నారు. వీరి ఎమ్‌పిసిఇ అఖిల భారత స్థాయిలో గ్రామీణ ప్రాంతాల సగటు ఎమ్‌పిసిఇ కంటే దిగువ స్థాయిలో ఉన్నది. పట్టణ ప్రాంతాల ఎమ్‌పిసిఇని పరిగణనలోకి తీసుకున్నా గ్రామీణ ప్రాంతాల పరిస్థితి కంటే పెద్దగా భిన్నంగా లేదని స్పష్టమవుతుంది. నిరుపేదలు ఉన్న రాష్ట్రాలు చాలా కాలంగా బీజేపీ, కాంగ్రెసేతర పార్టీల పాలనలో ఉన్నవి కావడం గమనార్హం. 1995 నుంచి బీజేపీ పాలనలో ఉన్న గుజరాత్‌లో సైతం గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఎమ్‌పిసిఇ అఖిల భారత గ్రామీణ, పట్టణ సగటు ఎమ్‌పిసిఇ కంటే పెద్దగా మెరుగ్గా లేదు. ఇదొక ఆశ్చర్యకరమైన వాస్తవం.



భారతదేశ జనాభాలో పేదలు 5 శాతానికి మించి లేరని నీతి ఆయోగ్ ప్రకటించింది. దీని సూచితార్థం పేదలుగా పరిగణించదగ్గవారు ఎవరూ లేరని అనేవారు లేకుండా పోతున్నారని, భారతీయులు అందరూ సంపద్వంతులు అవుతున్నారనే కాదూ? ఇది నిజమే అయితే ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 80 కోట్ల మందికి నెలకు ఒక్కో వ్యక్తికి 5 కిలోలు చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా ఎందుకు పంపిణీ చేస్తోంది? పేదలు 5 శాతానికి మించి లేకపోతే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 వెల్లడించిన వాస్తవాల విషయమేమిటి?

భారతదేశ జనాభాలో పేదలు 5 శాతానికి మించి లేరన్న నీతి ఆయోగ్ వాదన నన్ను బాగా చికాకు పెడుతున్నది. ఆగ్రహం కలిగిస్తోంది. ఈ వాదన సూచితార్థమేమిటి? పేదలుగా పరిగణించదగ్గవారు ఎవరూ లేరని, పేదలు అనేవారు లేకుండా పోతున్నారని, భారతీయులు అందరూ సంపద్వంతులు అవుతున్నారనే కాదూ? ఇది నిజమే అయితే ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 80 కోట్ల మందికి నెలకు ఒక్కో వ్యక్తికి 5 కిలోల చొప్పున ఆహార ధాన్యాలను ఉచితంగా ఎందుకు పంపిణీ చేస్తోంది? పేదలు 5 శాతానికి మించి లేకపోతే జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే–5 ఈ క్రింది వాస్తవాలు ఎలా వెల్లడి అయ్యాయి : 6 నుంచి 59 నెలల వయసులో ఉన్న బాలల్లో 67.1 శాతం మంది ఎందుకు రక్త హీనతతో బాధపడుతున్నారు? అలాగే 15 నుంచి 49 సంవత్సరాల మధ్య వయసు ఉన్న మహిళల్లో 57 శాతం మంది రక్త హీనతతో ఎందుకు బాధడుతున్నారు? ఐదేళ్ల లోపు బాలల్లో 35.5 శాతం మంది ఎందుకు అనారోగ్యంతో బలహీనపడిపోతున్నారు? అలాగే ఐదేళ్ల వయసులోపు బాలల్లో 19.5 శాతం మంది పెరుగుదల ఎందుకు గిడసబారిపోతోంది?

ఢిల్లీ వీధుల్లో ఎంతో మంది బాలలు అడుక్కోవడం నీతి ఆయోగ్‌కు కనిపించడం లేదా? పేవ్‌మెంట్లపైన, వంతెనల కింద వేలాది వ్యక్తులు నిద్రపోతున్న దృశ్యాలు నీతి ఆయోగ్ అధికారుల గమనంలోకి రావడం లేదా? గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల కోసం 15.4 శాతం మంది ఎందుకు తమ పేర్లను నమోదు చేయించుకున్నారు? ఉజ్వల లబ్ధిదారులు ఏడాదికి సగటున కేవలం 3.7 సిలిండర్లను మాత్రమే ఎందుకు కొనుగోలు చేస్తున్నారు?

సంపన్నుల ప్రయోజనాలను మాత్రమే నెరవేర్చదలుచుకుంటే నీతి ఆయోగ్ ఆ పనిని నిరభ్యంతరంగా చేయవచ్చు. అయితే పేదలను పరిహసించవద్దు. పేదరికాన్ని నిర్మూలించడంలో ప్రభుత్వం సఫలం కాకపోవచ్చు. అయితే తనకళ్ల ముందునుంచి పేదలను పూర్తిగా తొలగించడానికి మహారాజశ్రీ ప్రభుత్వం చాల కష్టపడుతోంది. పేదల విషయమై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ మిథ్యా వాదనలను చూసిన తరువాత నేను అనువాదంలో చదివినవే అయినప్పటికీ ఒక మహాకవి మాటలను ఉటంకించకుండా ఉండలేను. ఆయన తన ‘మిథ్యావాది’ కవితలో ఇలా ప్రశ్నించారు: ‘మాయంటావా? అంతా మిథ్యంటావా?/ కనపడినది కనబడదని మాయంటావూ? అంతా మిథ్యంటావూ?/ కూలివాని గుండె చెరువు, బిచ్చగాని కడుపు కరువు, మాయంటావూ? అంతా మిథ్యంటవూ?’

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

నా పేరు రైతు..
నా పైరు కవాతు..!

మహమ్మారి గళానికి అమరిన అరదండమై
ఉరి తాడును హత్తుకునే మొండెమై
కాలం కొయ్యకు వేళ్లాడుతూ
చిరుగుతున్న వస్త్రమై
మిన్నంటి రెప రెప లాడుతున్న
వ్యవసాయ కార్మికులం

మనసును పంటకు కంచెగా కట్టి
దిష్టిబొమ్మలా వేళ్లాడే దేహం నా దుస్థితి కావచ్చు
చక్రమోలే గిర గిరా తిరిగినా
సమస్యల గాయాల బోనులో చిక్కి
వున్న దగ్గరే కూలబడి ఏడ్వటం నా స్థితి కావచ్చు
ఉరితాడుకు వేళ్లాడే
తల నాదే కావచ్చు... కానీ

ఏపుగా పెంచి సున్నితంగా తుంచి
ఎండబెట్టి గలగలా గంపకెత్తి
బస్తాల్లో బానెడు ఆశల్తో కుక్కి
మార్కెట్ యార్డుల్లో కెళ్తే
తల వేళ్లాడదీసిన పంట ధర
నా భరోసాను ముక్కలు చేసింది

విపణి శక్తులూ ప్రకృతి విపత్తులూ
మాయదారి కలుపు చట్టాలు
తల తాకట్టు పెట్టుకొమ్మన్నై
అన్నీ మమ్ముల్ని అమ్ముడు పొమ్మన్నై
అన్నీ మమ్ముల్ని అవమానించినై

వ్యవసాయానికి వెన్నెముకనై
అన్నపూర్ణదేశంలో రాజునై రారాజునై
అక్షర పుటల్లో వర్ణిల్లిన నేను
ఇప్పుడు చేతుల్ని నెత్తిమీద
చరుచుకుంటూ ఏకరువు పెడుతున్నా
కమ్ముకొచ్చిన కసాయి రక్కసిపై
ఉద్యమ మందును పూట పూటకూ పిచికారీ చేస్తున్నా
బ్రతుకు పంట ఎందుకుపచ్చగా పండదో వేచి చూస్తున్నా
ఇప్పటివరకూ
బలిపీఠంపై మోకరిల్లిన తల నాదే కావచ్చు
కానీ... ఇప్పుడిక సమస్యలను
ఉరితీసే తలారీని నేనే!
నాపేరు రైతు.. నాపైరు కవాతు..!

– కటుకోఝ్వల రమేష్

సాంస్కృతిక విశాఖ ధ్రువతార

స్వాతంత్ర్య సమరయోధులు, మాజీ మంత్రి స్వర్గీయ తెన్నేటి విశ్వనాథం గారి సాహిత్య, సాంస్కృతిక వారసులు కళాప్రపూర్ణ గణపతిరాజు అచ్యుతరామరాజు. 1924 మార్చి 5న జన్మించిన ఆయన పూర్వీకులది నేటి అనకాపల్లి జిల్లా, చోడవరం మండలం చౌడువాడ గ్రామం. దాదాపు ఐదు దశాబ్దాల పాటు, విశాఖ పట్టణ, నగర సాంస్కృతిక రంగాన్ని ప్రభావితం చేసిన మహనీయుడు. విద్యార్థి దశలోనే ఆయన పలు నాటికలు, నాటకాలలో నటించారు. ఆనాటికి ప్రసిద్ధమైన కొన్ని ఆంగ్ల భాషా నాటకాలలోనూ ప్రధాన పాత్రలు పోషించి నాటకరంగ నిష్ణాతుల ప్రశంసలందుకున్న ప్రతిభామూర్తి.


ఆ స్ఫూర్తితోనే ‘విశాఖ నాటక కళామండలి’ని స్థాపించారు. ఆ వేదిక ద్వారా ఎందరో నటులు, తర్వాతి కాలంలో నాటక రంగంలో అగ్రశ్రేణి నటులైనారు. విశాఖ పాతనగరంలో ఈనాటికీ ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్న శ్రీ జగన్నాథస్వామి దేవాలయ ప్రాంగణంలోని ‘గుజ్జనగూళ్ళు’ విశాఖ నాటక కళామండలి కార్యకలాపాలకు వేదిక. శ్రీశ్రీ, ఆరుద్ర, రా.వి.శాస్త్రి, అంగర సూర్యారావు, అత్తిలి కృష్ణారావు, గొల్లపూడి మారుతీరావు వంటి ప్రసిద్ధ రచయితల, నటుల సాహితీ, నాటక ప్రస్థానంలో ఈ గుజ్జనగూళ్ళు ప్రస్తావన, ప్రభావం లేకుండా ఉండదు.

ఇంకా ఎందరో యువ సాహితీకారులు, ఔత్సాహిక నటులకు అచ్యుతరామరాజు పెద్దదిక్కు. దిక్సూచి... గుజ్జన గూళ్ళు పెద్ద ఆశ్రయం. వారందరి కలయిక అక్కడే జరిగేది. ఆ తర్వాత ఆ బృందంలోని ఎందరో ఊహించని స్థాయికి, వృత్తిరీత్యా అనేక ప్రాంతాలకు వెళ్ళిపోయారు. కొందరు కౌమార దశలోనే భావజాల విభేదాలతో వేరుపడ్డారు. కానీ, అన్నిటికీ అతీతంగా ఆనాటి గుజ్జనగూళ్ళ పక్షులన్నీ ఆరాధించి, అభిమానించి, తమ హృదయాలలో ప్రత్యేక స్థానమిచ్చి గౌరవించే ఒకే ఒక వ్యక్తి అచ్యుతరామరాజు.

కొంతకాలం తరువాత నక్సల్‌బరి ఉద్యమ ప్రభావంతో శ్రీశ్రీ షష్ఠి పూర్తి సందర్భంగా, విశాఖలోనే విప్లవ రచయితల సంఘం (విరసం) ఆవిర్భవించింది. అప్పటికే తెలుగునాట రచయితగా ప్రసిద్ధులైన రా.వి.శాస్త్రి ఈ సంఘానికి పెద్దదిక్కు. విరసంకు అచ్యుతరామరాజు మార్గదర్శి. భావజాల వైరుధ్యాలున్నా రావిశాస్త్రికి అచ్యుతరామరాజు అంటే ఎంతో గౌరవం. అందుకు ప్రధాన కారణం ఆయనలో అణువణువునా నిండివుండే సానుకూల దృక్పథం, సౌహార్ద్రత. భావజాలాలు ఏవైనా, సాహితీ సాంస్కృతిక స్ఫూర్తి సాహితీవేత్తలు, నటీనటులలో పెంపొంది తన జన్మభూమి విశాఖపట్టణం తెలుగునాట ఒక ప్రత్యేక స్థానంలో నిలవాలన్నదే ఆయన స్వార్థం. తనకు పూర్వం ఆ రెండు రంగాలను ప్రభావితం చేసి, విశాఖకొక గుర్తింపు తెచ్చిన జయపూర్ రాజా విక్రమదేవ్‌వర్మ, మారేపల్లి రామచంద్రశాస్త్రి కవి, తెన్నేటి విశ్వనాథంలు ఆయనకు ఆదర్శం. వారు చేసిన అపురూప సాహితీసేవ గురించి చెబుతుంటే, ఆయనలో ఒక తన్మయత్వం, భక్తిభావం తొంగిచూసేది.

ఆ తర్వాతి కాలంలో విశాఖ నాటక కళాపరిషత్ స్థాపించి నాటక రంగ కార్యక్రమాలు కొనసాగించారు. సాహిత్యం, నాటకం ఆయనకు రెండు కళ్ళు. డా. కె.వి. గోపాలస్వామి, పోణంగి శ్రీరామ అప్పారావు, డా. గరికపాటి రాజారావు, నటరాజ్ కె.వెంకటేశ్వరరావు, చాట్ల శ్రీరాములు, జి.ఎస్.ఆర్. మూర్తి, ఎ.ఆర్. కృష్ణ, మంత్రిప్రగడ శ్రీనివాసరావు, వేదుల జగన్నాథరావు, జె.వి. సోమయాజులు, కొత్తుర్తి భాస్కరరావు, రుద్రరాజ్ కుమార్‌రాజా వంటి నాటకరంగ నిష్ణాతులతో రామరాజుకు ఆత్మీయానుబంధం పెనవేసుకుపోయింది.

ముఖ్యమంత్రులు, సాహితీవేత్తలు డా. బెజవాడ గోపాలరెడ్డి, దామోదరం సంజీవయ్య, దేశ ప్రధానిగా సేవలందించిన పి.వి.నరసింహారావు వంటి సాహితీవేత్తలతో, రామరాజు సాన్నిహిత్యం, సహ విద్యార్థులు, కుటుంబసభ్యుల అనుబంధాన్ని మించి ఉండేది. పీవీ రాష్ట్ర మంత్రిగా, ముఖ్యమంత్రిగా చేసిన కాలంలో, అచ్యుతరామరాజు విధాన మండలి సభ్యులు (1968–1974). జనసంఘ్ పార్టీ పక్షాన ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎన్నికైనారు. అయినా పార్టీ విధానాలు, కార్యక్రమాలు పాటించడం తన వరకే. అన్ని పార్టీల నేతలు, సభ్యులతో ఆయన అనుబంధాలు, ఆత్మీయతలు ఆదర్శప్రాయం, అనితరసాధ్యం.



విశాఖ పాతనగరంలో ఈనాటికీ ఆధ్యాత్మిక కేంద్రంగా విలసిల్లుతున్న శ్రీ జగన్నాథస్వామి దేవాలయ ప్రాంగణంలోని ‘గుజ్జనగూళ్ళు’ విశాఖ నాటక కళామండలి కార్యకలాపాలకు వేదిక. శ్రీశ్రీ, ఆరుద్ర, రా.వి.శాస్త్రి, అంగర సూర్యారావు, అత్తిలి కృష్ణారావు, గొల్లపూడి మారుతీరావు వంటి ప్రసిద్ధ రచయితల, నటుల సాహితీ, నాటక ప్రస్థానంలో ఈ గుజ్జనగూళ్ళు ప్రస్తావన, ప్రభావం లేకుండా ఉండదు. ఆనాటి గుజ్జనగూళ్ళ పక్షులన్నీ ఆరాధించి, అభిమానించి, తమ హృదయాలలో ప్రత్యేక స్థానమిచ్చి గౌరవించే ఒకే ఒక వ్యక్తి గణపతిరాజు అచ్యుతరామరాజు.

మండలి సభ్యునిగా ఉండగానే ఆనాటి విశాఖ–1 అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జనసంఘ్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. కొందరు ఆత్మీయులు, శ్రేయోభిలాషులు పరామర్శకు వచ్చి, "అయ్యో! మీవంటి గొప్పవారు ఓడిపోవడం చాలా ఆవేదన కలిగిస్తుందండీ" అంటే, "అయ్యో! నా భార్య పుట్టింటివారు (దాట్లవారు) కరుడుకట్టిన కాంగ్రెస్ అభిమానులు. నా భార్యే నాకు ఓటు వేయదు. ఇక నేనెలా గెలుస్తాను?" అని చమత్కరించేవారు. ఆ ఎన్నికల తర్వాత ఆయన రాజకీయాలకు స్వస్తి చెప్పి, పూర్తి సమయం సాహితీ, నాటకసేవకు వెచ్చించారు.

విశాఖ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘం సభ్యుల విభేదాల మధ్య ఇమడలేని, ప్రఖ్యాత కథా, నవలా రచయితలైన అంగర వెంకటకృష్ణారావు, గండికోట బ్రహ్మాజీరావు, మల్లాప్రగడ రామారావు, రామకోటి వంటి వారి పూనికతో 1971 ఏప్రిల్ నాలుగున ‘విశాఖ సాహితి’ పేరిట సంస్థను ఏర్పాటు చేశారు. కొన్నాళ్ళ తర్వాత ఆ సంస్థకి అచ్యుతరామరాజు సహకారం అవసరం అని భావించిన, స్థాపకులు ఆయనను గౌరవాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. వెంకటకృష్ణారావు మరణించిన తర్వాత, అచ్యుతరామరాజు విశాఖ సాహితికి అధ్యక్షులుగా, దాదాపు నాలుగు దశాబ్దాల పాటు దిశానిర్దేశం చేశారు. బ్రహ్మాజీరావు, రామారావు వృత్తిరీత్యా విశాఖ నుంచి బదిలీ కావడంతో ప్రధాన బాధ్యత రాజుగారే వహించి, కార్యక్రమాలు సమన్వయపరిచేవారు. ఆ విధంగా, ఒకనాటి మారేపల్లి రామచంద్రశాస్త్రి కవి గారి ‘కవితా సమితి’, తెన్నేటి విశ్వనాథం స్థాపించిన ‘విశాఖ సారస్వత వేదిక’ తర్వాత, విశాఖ సాహితీ చరిత్రలో ‘విశాఖ సాహితి’ అంతటి సముచిత స్థానం సంపాదించుకున్నది. వందలాదిమంది యువతీ యువకులను, కవులు, రచయితలుగా తయారవడానికి వేదికగా నిలిచింది.

రామరాజు ఎన్నో కథలు రచించారు. 1975లో ‘ఆంధ్రజ్యోతి’ వార పత్రిక నిర్వహించిన కథల పోటీలో, ఆయన రచించిన ‘కసి’ కథకు ప్రథమ బహుమతి లభించింది. ఆ కథ ఆధారంగా రూపొందుతున్న చలనచిత్రం షూటింగ్‌లో ప్రమాదానికి గురై రాజుగారి కాలు విరిగింది. ఆ సమయంలోనే చేతికి అందివచ్చిన కొడుకు శివాజీ ప్రమాదంలో మరణించారు. అంతటి కష్టాన్నీ తనలోనే దాచుకొని, తర్వాత మూడు దశాబ్దాలు ప్రజాజీవితంలో కొనసాగిన ధీశాలి రామరాజు. అద్భుతమైన కంఠస్వరం, అనితరసాధ్యమైన ఉపన్యాసనరళి వేలాదిమందిని ఆయనకి అభిమానులుగా మార్చింది. కానీ దురదృష్టవశాత్తూ, స్వరపేటికకు క్యాన్సర్ సోకి ఆ గంభీర స్వరం మూగవోయింది.

1987లో భారత కమ్యూనిస్టు పార్టీ, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి నేతల కోరిక మేరకు, ‘ఇస్కస్’ పక్షాన, ఆనాటి సోవియట్ యూనియన్‌లో పర్యటించారు. అనంతరం పలు సభలలో ఆయన పరిశీలన, అభిప్రాయాలు చెబుతుంటే కమ్యూనిస్టులనే అబ్బురపరిచేవి. 2004 జూన్ 10న రామరాజు మరణించారు. ఈనాటికీ ఆయన స్మృతి చిహ్నం ఏదీ విశాఖలో లేకపోవడం విచారకరం.

అర్ధశతాబ్దం పాటు, విశాఖ సాంస్కృతిక రంగంలో ఓ ధ్రువతారగా వెలుగొందిన ఆయన స్పృశించని కళాప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదు. ఎందరో రాజకీయ నేతలు, పాలకులు, సంపాదకులు, సాహితీ వేత్తలతో సాన్నిహిత్యం కేవలం సాహితీ సముపార్జనకే తప్ప, ఏ ఇతర ప్రయోజనాలు ఆశించని నిస్వార్థ సేవాపరాయణుడు. 1993లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ‘కళాప్రపూర్ణ’తో సత్కరించి, గౌరవించింది. ఆ మహనీయునికివే శతజయంతి నివాళులు.

• **బి.వి. అప్పారావు**

(మార్చి 5: గణపతిరాజు అచ్యుతరామరాజు శతజయంతి)

అక్షరాల గాండీవం

చరిత్ర నిగ్గు దేల్చాల్సిన
స్థిరమైన ఆనవాలొకటి
ఎప్పుడో కూలిపోయింది
స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం నెత్తురోడిన
నిండు చూలాల తల్లి పట్టెడు ఆశతో
కనిపెంచిన కవలలిద్దరు
ఇంకా కత్తులు దూసుకోవాలా!?

తలరాతలు కనిపించని బ్రహ్మసృష్టిలో
మందిరాలు, మసీదులు ఆరామాలంటూ
ఎన్ని విశ్వాసాలు ప్రతిష్ఠించామో కానీ
మోక్ష చింతన మరిచిపోతున్నామా!
సాష్టాంగ పడుతున్న ప్రతి వేడుకోలు
కడుపు కోసం, కన్నవారి కోసమే కదా

గమ్యమో, గమనమో
ముక్తో, విముక్తో
పయనించే రైలు ఒకే చోటికైనప్పుడు
విద్వేషాల సెగలు గక్కుతూ
మనుషులెందుకు
రైలు పట్టాల్లా విడిపోవాలి!?

యుగయుగాల పరివేదనలో
ముడుపుగట్టుకున్న నమ్మకాలు
నీకు– నాకు అందరికీ కడిగిన ముత్యాలే
ఇప్పుడవి రాజకీయ అంగడిలో
అమ్ముకోవాలా!?

గిట్టుబాటు ధరల చట్టం
ఎవరి చుట్టమై ఆగిపోయిందో తెలియదు
రైతే రాజన్న రాజధాని ఢిల్లీ
కురుక్షేత్రాన్ని తలపిస్తున్నప్పుడు
తవ్విపోయాల్సింది కాలనాళికలను కాదు
నిన్న గాక మొన్న
సర్కారు హామీ పడ్డ
తడారని సంతకాలను
కన్నీటి పొగలు (Tear Gases)
దేశమంతా కమ్ముకోకముందే
ధర్మరాజా కనికరించు...
కర్ణ కఠోర తాంత్రిక సంగీతంలో
సంవిధాన ప్రేమాక్షరాలు
We are the people of India
శ్రుతి చేసిన విధానమైన
గీతాబోధన కావాలేమో...
అర్జునా...
గాండీవం చేతబూను

– అమర్



కాకరాపల్లిలో వస అప్పారావు కుటుంబ సభ్యులకు రూ.3లక్షల చెక్ అందజేస్తున్న భువనేశ్వరి

కార్యకర్తలకు అండగా ఉంటాం

›› భువనేశ్వరి

అనకాపల్లి/మునగపాక, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమె అనకాపల్లి జిల్లా మునగపాక మండలంలో పర్యటించారు. చంద్రబాబు జైలుకు వెళ్లిన సమయంలో మనస్తాపంతో మృతిచెందిన వస అప్పారావు(కాకరాపల్లి), ముత్తుర్తి వెంకటరావు(గవర్ల అనకాపల్లి), పెంటకోట వెంకటరమణ (తోటాడ) కుటుంబాలను పరామర్శించారు. వారికి ధైర్యం చెబుతూ, ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షలు చొప్పున ఆర్థికసాయం అందించారు. ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరమైన అప్పారావు కుమార్తె సునీతకు వచ్చే విద్యా సంవత్సరంలో ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా విద్య వసతి అందించేందుకు చర్యలు చేపడతామని భువనేశ్వరి హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ధ నాగజగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, టీడీపీ, జనసేన పార్టీ నేతలు పాల్గొన్నారు.

నేడు గురజాలలో చంద్రబాబు పర్యటన

›› దాచేపల్లిలో రా..కదలి రా సభ

గుంటూరు సిటీ, మార్చి 1: తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలో జరగనున్న రా..కదలి రా కార్యక్రమంలో పాల్గొననున్నారు. నెల్లూరు జిల్లా పర్యటన ముగించుకుని హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 3.50 గంటలకు దాచేపల్లి మండలంలోని కేసానుపల్లి రానునున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు దాచేపల్లిలో జరగనున్న బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. రాత్రికి దాచేపల్లిలోనే బసచేసి ఆదివారం ఉదయం 8 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్ వెళ్లనున్నారు.

నీ చెల్లి ప్రశ్నలకు బదులివ్వు జగన్

›› బాబాయి హత్యకు గురైనా దోషులను పట్టుకోలేదు

›› ఈ దుర్మార్గుడు రాష్ట్రానికేం న్యాయం చేస్తాడు: అచ్చెన్న

శ్రీకాకుళం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'సాక్షాత్తూ నీ చెల్లి సునీత నీపై ప్రశ్నలు సంధిస్తోంది. వివేకా హత్య కేసుపై ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించి మరీ ఆయన కుమార్తె సునీతారెడ్డి చాలా విషయాలు చెప్పారు. వాటన్నింటిపైనా సీఎంగా జగన్‌రెడ్డీ.. నువ్వు బదులివ్వు' అంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన శ్రీకాకుళంలో మీడియాతో మాట్లాడారు. 'సొంత బాబాయి హత్యకు గురై ఐదేళ్లు అవుతున్నా ఇంతవరకు దోషులను పట్టుకోలేదు. చెల్లెలికే న్యాయం చేయలేని దుర్మార్గుడు రాష్ట్ర ప్రజలకు ఇంకేం చేస్తాడు. ఈ కేసులో అసలు నిందితుడు ఎవరో, చేయించిన వ్యక్తి ఎవరో ప్రజలందరికీ తెలుసు. జగన్ తీరుపై ఆయన చెల్లెలే ఢిల్లీలో ప్రశ్నించారు. తన తండ్రిని గొడ్డలితో నరికి చంపారని.. హత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోలేదని ఆమె చెబుతున్నారు. రాష్ట్రంలో ప్రజలెవరైనా జగన్‌కు ఓటు వేస్తే ప్రమాదకరమని తెలుసుకోవాలి' అని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

జగన్‌రెడ్డిని చిత్తుగా ఓడించండి: వైవీబీ



కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సర్పంచులు

కాకినాడ సిటీ, మార్చి 1: స్థానిక సంస్థల నిధులు కాజేసిన సీఎం జగన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో చిత్తుగా ఓడించండి.. అని ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. కాకినాడ కలెక్టరేట్‌వద్ద సర్పంచ్‌లు చేపట్టిన ధర్నాలో శుక్రవారం ఆయన మాట్లాడారు. అన్ని పార్టీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు ఈ ప్రభుత్వాన్ని ఓడించడం కోసం గట్టిగా పనిచేయాలన్నారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల నిధులు, విధులు, అధికారాలను జగన్‌రెడ్డి దొంగిలించాడన్నారు. జగన్‌రెడ్డి ఓడితేనే సర్పంచ్‌లకు మనుగడ... అనే నినాదంతో అన్ని జిల్లాలో కలెక్టరేట్‌లవద్ద ధర్నాలు తలపెట్టామన్నారు.

సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నం

›› ప్రత్యేక హోదా కోసం ప్లకార్డులతో నిరసన

›› వీవీ లక్ష్మీనారాయణ, చలసాని తదితరుల అరెస్టు



సీఎం క్యాంపు కార్యాలయ సమీపంలో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న వీవీ లక్ష్మీనారాయణ, చలసాని శ్రీనివాస్ తదితరులు

తాడేపల్లి టౌన్/ మంగళగిరి సిటీ/అమరావతి, మార్చి 1 : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని, విభజన చట్ట హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి యత్నించిన జయభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ. లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి పోతిన వెంకటరామారావు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ తదితరులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. జేఏసీ నాయకులు ప్లకార్డులు చేతబట్టి సీఎం క్యాంపు కార్యాలయం వెనుక వైపు ఉన్న ఆంధ్రరత్న పంపింగ్ స్కీమ్ వద్దకు రాగా పోలీసులు అడ్డుకున్నారు. అరెస్టు చేసి మంగళగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, అరెస్టయిన నేతలను సీపీఐ, సీపీఎం నేతలు పరామర్శించి సంఘీభావం తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఏపీకి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీల అమలే ప్రధాన ఎజెండాగా ఉండాలని అన్నారు. వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తిరుపతి వెంకన్న సాక్షిగా ప్రధాని మోదీ పదేళ్లపాటు ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పి మాట తప్పారని విమర్శించారు.

సీపీఐ రామకృష్ణ గృహనిర్బంధం

'చలో సీఎం కార్యాలయం' కార్యక్రమానికి సీపీఐ మద్దతు ప్రకటించిన నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను పోలీసులు గుంటూరు జిల్లా తాడేపల్లిలో గృహనిర్బంధంలో ఉంచారు.

అంటు వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోండి:సీఎస్

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు, పారిశుధ్య లోపం కారణాలతో డయేరియా వంటి అంటు రోగాలు ప్రబల కుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గుంటూరులో ప్రబలిన డయేరియా తదనంతరం చర్యలపై శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. రానున్న మూడు నెలలు అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం, డ్రైన్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శ్రీశైలంలో వైభవంగా ధ్వజారోహణ



విద్యుద్దీపకాంతుల్లో భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం.. శ్రీగిరి క్షేత్రంలో ధ్వజారోహణం

శ్రీశైలం, మార్చి 1: శ్రీశైలం మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నవాహ్నిక దీక్షతో 11 రోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. శుక్రవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని స్వామివారి యాగశాల ప్రవేశం కార్యక్రమంతో అర్చకులు ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. వేదస్వస్తి, చండీశ్వరునికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రధాన ధ్వజస్తంభం వద్ద ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భేరీపూజలో డోలు వాయిద్యానికి పూజాదికాలు చేసి, తరువాత నాదస్వరం ఆలాపనతో సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు శ్రీకాళహస్తి దేవస్థానం తరఫున ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వి.నాగేశ్వరరావు పట్టువస్త్రాలను సమర్పించారు. బ్రహ్మోత్సవాల రెండో రోజు నుంచి వాహనసేవలు మొదలవుతాయి. శనివారం భృంగివాహన సేవ నిర్వహించనున్నారు.

బొగ్గు నౌకలో విధులు నిర్వహిస్తూ ఇద్దరు యువకుల దుర్మరణం

›› హ్యాచ్ శుభ్రం చేస్తూ ఊపిరాడక మృతి.. కృష్ణపట్నం పోర్టులో దుర్ఘటన



కదిరి వేలు, యశ్వంత్

ముత్తుకూరు, మార్చి 1 : శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలోని అదానీ కృష్ణపట్నం పోర్టులో శుక్రవారం విషాదం చోటు చేసుకుంది. లంగరు వేసిన బొగ్గు నౌకలోని హ్యాచ్‌లో శుభ్రం చేసేందుకు వెళ్లిన ఇద్దరు యువకులు ఊపిరాడక మృత్యువాత పడ్డారు. కృష్ణపట్నం పోర్టు పోలీసుల కథనం మేరకు...ముత్తుకూరు అరుంధతివాడకు చెందిన కోడూరు కదిరి వేలు (33), ఇందిరమ్మ, గిరిజన కాలనీకి చెందిన కవరగిరి యశ్వంత్ (22) నౌకాశ్రయంలో విధులు నిర్వహిస్తున్నారు. పోర్టులోని బెర్త్ నెం.6లో లంగరు వేసిన రూయినింగ్-21 నౌకలో బొగ్గు అన్‌లోడింగ్ జరిగింది. శుక్రవారం నౌకలోని 6వ నెంబరు హ్యాచ్‌ను శుభ్రం చేయాల్సి ఉంది. అయితే, పొరపాటున కదిరివేలు, యశ్వంత్ 5వ నెంబరు హ్యాచ్‌లోకి దిగారు. మూసి ఉన్న ఈ హ్యాచ్‌లో విష వాయువుల తీవ్రతకు వారిద్దరు అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. గమనించిన అక్కడున్న సిబ్బంది వెంటనే వారిద్దరినీ బయటకు తీసుకువచ్చేసరికే ఊపిరాడక మృతి చెందారు. మృతులలో కదిరివేలుకు ముగ్గురు ఆడపిల్లలు ఉండగా, మరో మృతుడు యశ్వంత్‌కు ఆదివారం వివాహం జరగాల్సి ఉంది. కృష్ణపట్నం సీఐ వెంకటరెడ్డి, ఎస్ఐ శివనాంచారయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఐఐపీఈ భవన నిర్మాణానికి నేడు ప్రధాని భూమి పూజ

విశాఖపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) శాశ్వత క్యాంపస్ కోసం భవనాల నిర్మాణానికి ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శనివారం సాయంత్రం 5.15 గంటలకు భూమి పూజ చేయనున్నారు. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా 2016లో రాష్ట్రానికి ఐఐపీఈని కేంద్రం మంజూరుచేసింది. నాటి నుంచి ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఐఐపీఈ నడుస్తోంది. ఇప్పటివరకు నాలుగు బ్యాచ్‌లు రిలీవ్ కాగా, ఐదో బ్యాచ్ నడుస్తోంది. విశ్వవిద్యాలయం ఏర్పాటుకు గత తెలుగుదేశం ప్రభుత్వం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం వంగలి గ్రామంలో 201 ఎకరాలను కేటాయించింది. అయితే, భూ వివాదం నేపథ్యంలో ఇప్పటివరకు శాశ్వత క్యాంపస్ నిర్మాణ ప్రక్రియ ముందుకుసాగలేదు. కొద్దినెలల కిందటే భూ వివాదం కొలిక్కిరావడంతో శాశ్వత భవన నిర్మాణ పనులను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలోనే ప్రధాని నరేంద్రమోదీ భూమి పూజ చేయనున్నారు. శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులను సుమారు రూ.600 కోట్ల వ్యయంతో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంట్ (సీపీడబ్ల్యూడీ) చేపట్టనుంది. భూమి పూజ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా యంత్రాంగం, విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఐఐపీఈ ఏర్పాటు ఉద్దేశం, లక్ష్యాలు గురించి ప్రసంగించే అవకాశం ఉంది.

మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తులు

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 164 ఆదర్శ పాఠశాలలున్నాయని, ఆదివారం నుంచి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఐదో తరగతి సిలబస్‌తో ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. మోడల్ స్కూల్స్‌లో ఇంగ్లీష్ మీడియం మాత్రమే ఉంటుందని స్పష్టంచేశారు.

త్వరలోనే సెట్స్ పైకి



అగ్ర దర్శకుడు రాజమౌళి, మహేశ్ కాంబినేషన్‌లో వచ్చే సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా అని అభిమానులంతా ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ సినిమా గురించి రకరకాల వార్తలు వస్తున్నాయి. ఏ చిన్న విషయమైనా క్షణాల్లో వైరల్‌గా మారుతోంది. తాజాగా దర్శకుడు రాజమౌళి బళ్లారిలోని అమృతేశ్వర ఆలయ ప్రారంభోత్సవానికి కుటుంబసమేతంగా హాజరయ్యారు. అక్కడి రాజకీయ నాయకులతో మాట్లాడిన ఆయన మహేశ్‌తో తీస్తున్న సినిమా గురించి ప్రస్తావించారు. 'మహేశ్‌తో ఓ సినిమా చేస్తున్నా. ఈ చిత్రాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. ఇంకా టైటిల్ ఖరారు కాలేదు' అని అన్నారు. షూటింగ్ ఎప్పటినుంచో అనేది స్పష్టంగా చెప్పకపోయినా 'మహారాజ్' అనే టైటిల్ ఖరారు అయిందనే వార్తలపై ఆయన క్లారిటీ ఇచ్చినట్లయింది. భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ మూవీగా తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి కథను సంచలన రచయిత విజయేంద్ర ప్రసాద్ అందిస్తున్నారు. ఆఫ్రికా అడవుల నేపథ్యంలో యాక్షన్ అడ్వెంచర్‌గా దీనిని నిర్మిస్తున్నారు. మరోవైపు మహేశ్ ఈ సినిమా కోసం తన లుక్ మార్చుకున్నారు. ఆ సరికొత్త లుక్ ఉన్న ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అది చూసి అభిమానులు 'సూపర్' అంటూ ఎంతో మురిసిపోతున్నారు.


వారాణసిలో ఓదెల 2



ఓటీటీలో విడుదలై విజయం సాధించింది 'ఓదెల రైల్వే స్టేషన్'. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రానికి దర్శకుడు సంపత్‌నంది కథను అందించగా, అశోక్ తేజ దర్శకత్వం వహించారు. దీనికి సీక్వెల్‌గా 'ఓదెల 2' రూపొందుతోంది. తమన్నా ప్రధాన పాత్రను పోషించే ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం వారాణసిలో మొదలైంది. పలు భాషల్లో థియేటర్లలోనే విడుదల చేస్తామని నిర్మాత మధు చెప్పారు. విజువల్ ఎఫెక్ట్స్ కు ఎంతో ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. యూనిట్ విడుదల చేసిన టైటిల్ పోస్టర్ ఆసక్తికరంగా, ఆధ్యాత్మికంగా ఉంది. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్ సింహా, యువ, నాగ మహేశ్, వంశీ, గగన్ విహారి ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: సౌందర్ రాజన్, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/xOT3U1fలో చదవండి.

ఇంటర్వెల్ యాక్షన్ ఎపిసోడ్



నితిన్ హీరోగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకుడు. గత నెల్లో మున్నార్ షెడ్యూల్‌ను పూర్తి చేసిన చిత్రబృందం గురువారం నుంచి మరో షెడ్యూల్ కోసం రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నారు. ఫైట్ మాస్టర్స్ రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో ఇంటర్వెల్ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నారు. దీనికోసం భారీ సెట్ వేశారు. హీరోతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ చిత్రంలో నితిన్ సరికొత్త పాత్రలో అలరించనున్నారు. ఇటీవలే విడుదలైన టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్ కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బేనర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.



ప్రేమకథ ప్రారంభం

నేషనల్ అవార్డ్ విన్నర్ నరసింహ నంది దర్శకత్వంలో వస్తోన్న చిత్రం '1920 భీమునిపట్నం'. కంచర్ల ఉపేంద్ర, అపర్ణాదేవి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శుక్రవారం రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రారంభమైంది. కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్నారు. భారత స్వాతంత్ర్య పోరాటం నేపథ్యంలో పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఇందులో బ్రిటీష్ ప్రభుత్వ పోలీస్ ఆఫీసర్‌గా కంచర్ల ఉపేంద్ర, స్వాతంత్ర్య సమరయోధుడి కుమార్తెగా అపర్ణా దేవి నటిస్తున్నారు. వీరిద్దరిపై తీసిన ముహూర్తపు షాట్‌కు నిర్మాత క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడారు. సీతారామ్, సుజాత పాత్రల మధ్య నడిచే ప్రేమకథను దర్శకుడు ఎంతో అద్భుతంగా తీర్చిదిద్దారని ప్రశంసించారు. ఆస్కార్ స్థాయికి తగ్గట్లు చిత్రీకరణ జరుపుతామని వివరించారు. కొన్ని వాస్తవ సంఘటనలను ప్రేరణగా తీసుకుని చక్కటి భావోద్వేగాలతో తెరకెక్కిస్తున్నామని దర్శకుడు అన్నారు. తన కెరీర్‌లోనే ఇది విభిన్న చిత్రమవుతుందని నటుడు కంచర్ల ఉపేంద్ర అన్నారు. కెరీర్ తొలి దశలోనే నటనకు స్కోప్ ఉన్న మంచి చిత్రంలో నటించడం అదృష్టంగా భావిస్తున్నట్లు హీరోయిన్ అపర్ణా దేవి అన్నారు. ఈ చిత్రానికి సంగీతం:ఇళయరాజా, సినిమాటోగ్రఫీ: ఎస్ మురళీమోహన్ రెడ్డి, ఎడిటింగ్:నాగిరెడ్డి,కళ:సురేశ్ భీమగాని, సహ నిర్మాతలు: కంచర్ల సుబ్బలక్ష్మి, కంచర్ల సునీత.

తంత్ర శాస్త్రం నేపథ్యంలో



అనన్య నాగళ్ల, ధనుష్ రఘుముద్రి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'తంత్ర'. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి, రవి చైతన్య నిర్మిస్తున్నారు. మార్చి 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. తాంత్రిక పూజల నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. అనన్య మాట్లాడుతూ 'నాకెరీర్‌లో ఇది ఉత్తమ చిత్రం అవుతుంది, ఇకపై అంతా నన్ను 'తంత్ర అనన్య' అని పిలుస్తారు' అని అన్నారు. హారర్‌తో పాటు రొమాన్స్, సెంటిమెంట్ ఉన్నాయని ధనుష్ చెప్పారు. మనం కోల్పోయిన తంత్రశాస్త్రం అనే విజ్ఞానాన్ని గురించి ఈ సినిమాలో చెప్పబోతున్నాం అని దర్శకుడు తెలిపారు.

దిక్సూచి
DIKSUCHI

గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న - ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. రాత పరీక్ష ద్వారా ఆరోతరగతిలో అడ్మిషన్స్ ఇస్తారు. అలాగే ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 28 గురుకులాల్లో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. బోధన, వసతి ఉచితం. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తారు. తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థులు దరఖాస్తు ఫారంలో తాము ఎంచుకొన్న గురుకులాల ప్రాధాన్య క్రమాన్ని తప్పనిసరిగా సూచించాలి.

ఏపీ ఏకలవ్య గురుకులాల్లో ప్రవేశాలు



సీట్లు: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల వారీగా కేటాయించిన గురుకులాల్లో ఆరోతరగతిలో మొత్తం 1680 సీట్లు ఉన్నాయి. ప్రతి గురుకులంలో 60 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను బాలికలకు ప్రత్యేకించారు.

- ఏడోతరగతిలో బాలురకు 17, బాలికలకు 19; ఎనిమిదోతరగతిలో బాలురకు 32, బాలికలకు 8; తొమ్మిదోతరగతిలో బాలురకు 35, బాలికలకు 11 బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నాయి.

అర్హత: ఆరోతరగతిలో చేరాలంటే విద్యార్థులు గుర్తింపు పొందిన పాఠశాలలో అయిదోతరగతి చదివి ఉండాలి. ఇంటిదగ్గరే చదువుకున్న విద్యార్థులు కూడా అర్హులే. వీరికి తల్లిదండ్రులు/సంరక్షకులు డిక్లరేషన్‌ను సమర్పించాలి. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో చేరే విద్యార్థులు వరుసగా ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు ఉత్తీర్ణులై ఉండాలి.

- ఆరోతరగతిలో చేరే విద్యార్థుల వయసు 2024 మార్చి 31 నాటికి పదేళ్ల నిండి 13 ఏళ్ల లోపు ఉండా లి. ఏడోతరగతికి పదకొండేళ్ల నిండి 14 ఏళ్లలోపు, ఎనిమిదోతరగతికి పన్నెండేళ్ల నిండి 15 ఏళ్లలోపు, తొమ్మిదోతరగతికి 13 ఏళ్ల నిండి 16 ఏళ్లలోపు ఉండాలి.
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,00,000లు మించకూడదు.

రాత పరీక్ష: ఆరోతరగతికి నిర్వహించే పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ నుంచి 50; అర్థమెటిక్, తెలుగు అంశాల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు నిర్వహించే పరీక్షలు 200 మార్కులకు ఉంటాయి. వీటిలో ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10; మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 30; సోషల్ సైన్స్ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు.ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **రాత పరీక్ష తేదీ:** ఏప్రిల్ 13
- **మెరిట్ జాబితా విడుదల:** ఏప్రిల్ 25
- **ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** aptwgurukulam.ap.gov.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/6dYFDIsలో చదవండి.

బిట్స్ పిలానీ డబ్ల్యూఐఎల్‌పీ
పీజీ డిప్లొమా

బిట్స్ పిలానీ - వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐఎల్‌పీ) కింద పీజీ డిప్లొమా ఇన్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్ ప్రోగ్రామ్‌ని ఆఫర్ చేస్తోంది. కెరీర్‌కు బ్రేక్ ఇవ్వకుండానే ఈ కోర్సు చేయవచ్చు. వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఇంజనీర్ల కోసం దీన్ని రూపొందించారు. మాన్యుఫాక్చరింగ్‌లో డిజైన్, ఇంప్లిమెంటేషన్, మేనేజ్‌మెంట్ వ్యవహారాలపై ఇదంతా ఉంటుంది. మెకట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఐఓటీ, బిగ్ డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ తదితర టాపిక్స్ ఈ కోర్సుల్లో ఉంటాయి. మార్చి 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

మరిన్ని వివరాలకు: https://bitspilaniwilp.ac.in/pgd/postgraduate-diplomainsmartmanufacturing.php చూడవచ్చు.



ఆర్ఐఎంసీలో ప్రవేశానికి
ఏపీపీఎస్సీ నోటిఫికేషన్

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో ఎనిమిదో తరగతి(2025 జనవరి టర్మ్) ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాలనుంచి 2025 జనవరి 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2025 జనవరి 1 నాటికి పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష వివరాలు: మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125, మేథమెటిక్స్ నుంచి 200 జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి ఏపీపీఎస్సీ చిరునామాకు పంపించాలి. దరఖాస్తు ఫీజును డీడీ ద్వారా కూడా ఆర్ఐఎంసీకి పంపవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** మున్సిపల్ కార్పొరేషన్/గ్రామ పంచాయతీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్; నివాసం, కులం ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; విద్యార్థి ఫొటోలు 2
- **ఏపీపీఎస్సీ చిరునామా:** అసిస్టెంట్ సెక్రటరీ(ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ ఆఫీస్ దగ్గర, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం, ఎంజీ రోడ్, విజయవాడ- 520010, ఆంధ్రప్రదేశ్
- **ఆర్ఐఎంసీ చిరునామా:** రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్, గర్హి కంటోన్మెంట్, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248003
- **పరీక్ష తేదీ:** జూన్ 1 ○ **పరీక్ష కేంద్రం:** విజయవాడ
- **వెబ్‌సైట్:** www.rimc.gov.in, https://psc.ap.gov.in

సమ్మర్ ఇంటర్న్‌షిప్

ఆర్‌జీఐపీటీ

అమేఠీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)- పెట్రోలియం అండ్ ఎనర్జీ ఇంజనీరింగ్ విభాగంలో 'సమ్మర్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్' ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరు వారాలు. ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సంస్థకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్ ఆధ్వర్యంలో రీసెర్చ్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

అర్హత: ఇంజనీరింగ్ డిగ్రీ రెండో సంవత్సరం లేదా మూడో సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు; ఎమ్మెస్సీ మొదటి ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **ప్రోగ్రామ్ తేదీలు:** మే 27 నుంచి జూలై 12 వరకు
- **వెబ్‌సైట్:** www.rgipt.ac.in

నిట్ రూర్కెలా

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆర్‌కేఎల్)-సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. మే 16 నుంచి ప్రోగ్రామ్ ప్రారంభమౌతుంది. అకడమిక్ మెరిట్, టెక్నికల్ క్వాలిఫికేషన్స్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: బయోటెక్నాలజీ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇండస్ట్రియల్ డిజైన్, లైఫ్ సైన్స్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ, మేనేజ్‌మెంట్.

అర్హత: ప్రస్తుతం నాలుగో సెమిస్టర్ పరీక్షలు రాసిన బీఈ/బీటెక్ అభ్యర్థులు; ఆరో సెమిస్టర్ పరీక్షలు రాసిన బీఆర్క్/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్/డ్యూయెల్ డిగ్రీ అభ్యర్థులు; రెండో సెమిస్టర్ పరీక్షలు రాసిన ఎమ్మెస్సీ/ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్/ఎంబీఏ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది పరీక్షలు రాసినవారు, ఇప్పటికే డిగ్రీ/పీజీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

- **సమ్మర్ ఇంటర్న్‌షిప్ వ్యవధి:** మే 16 నుంచి జూలై 15 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 28
- **వెబ్‌సైట్:** nitrkl.ac.in

వెనకడుగు

ఎస్సీ రిజర్వ్‌డు స్థానాల్లో సిటింగ్‌ల మార్పుపై వైసీపీ అధినేత జగన్ తొలుత తీసుకున్న నిర్ణయంపై వెనకడుగు వేశారా? పామర్రు సభలో ఆయన ప్రసంగం చూస్తే అవుననే అనిపిస్తోంది. స్థానిక ఎమ్మెల్యే కైలే అనీల్‌ను పొగడ్తలతో ముంచెత్తిన సీఎం ఆ సీటును ఆయనకు దాదాపు ఖరారు చేసినట్టే అయ్యింది. ఎన్టీఆర్ జిల్లాలోని రెండు ఎస్సీ రిజర్వ్‌డు స్థానాల్లో తిరువూరు నుంచి రక్షణనిధిని పక్కనపెట్టిన జగన్.. నందిగామ నుంచి మొండితోక జగన్మోహనరావుకు మొండిచేయి చూపుతారని ప్రచారం జరగడం, దళితుల నుంచి వ్యతిరేకత రావడంతో ఆయన కృష్ణాజిల్లాలో ఎస్సీ రిజర్వ్‌డు అయిన పామర్రును అనీల్‌కే ఇవ్వాలని నిర్ణయించుకున్నారని, అందుకే పొగడ్తలతో ముంచెత్తారని వైసీపీ శ్రేణులే చర్చించుకుంటున్నాయి.


పామర్రు సభలో మాట్లాడుతున్న సీఎం జగన్, పక్కన ఎమ్మెల్యే కైలే

ఎస్సీ రిజర్వ్‌డు స్థానాలపై సీఎం జగన్ రివర్స్‌గేర్


- రెండు జిల్లాల్లో మూడు ఎస్సీ రిజర్వ్‌డు స్థానాలు
- తొలుత తిరువూరు నుంచి రక్షణనిధి ఔట్
- నందిగామ నుంచి మొండితోకకు మొండిచేయేనని ప్రచారం
- దళితుల్లో వ్యతిరేకత రావడంతో వెనక్కి..
- పామర్రు ఎస్సీ రిజర్వ్‌డు కైలే అనీల్‌కు దాదాపు ఖరారు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఎస్సీ రిజర్వ్‌డు స్థానాల్లో సిటింగ్‌లను మార్చేయాలని వైసీపీ అధినేత జగన్ తొలుత భావించారు. అదే ఊపులో తిరువూరు సిటింగ్ ఎమ్మెల్యే రక్షణనిధికి సీటు నిరాకరించి, ఆ స్థానంలో టీడీపీ నుంచి వైసీపీలో చేరిన నల్లగట్ల స్వామిదాసుకు కేటాయించారు. నందిగామ, పామర్రు నియోజకవర్గాల్లో సైతం సిటింగ్‌లను మారుస్తారన్న ప్రచారం జోరుగా సాగింది. విడతలవారీగా 8 జాబితాలు విడుదల చేసినా ఈ రెండు నియోజకవర్గాల సిటింగ్ ఎమ్మెల్యేలకు సీటు ఖరారు కాలేదు. దీంతో వారిపైనా వేటు తప్పదనే భావించారు. కానీ, శుక్రవారం పామర్రులో జరిగిన జగనన్న విద్యాదీవెన సభలో సీఎం జగన్ ప్రసంగంలో స్థానిక ఎమ్మెల్యే కైలే అనీల్‌పై ప్రశంసల వర్షం కురిపించడం చర్చనీయాంశంగా మారింది. 'అనీల్ మాదిరి ప్రతి ఒక్క ఎమ్మెల్యే పనిచేస్తే ప్రతి నియోజకవర్గానికి మంచి జరుగుతుంది. మనిషిలో నిజాయితీ ఉంది. నిబద్ధత ఉంది. నా తమ్ముడులాంటి అనీల్‌ను మీరందరూ గొప్పగా దీవించాలని మనసారా ఆకాంక్షిస్తున్నా' అంటూ వైసీపీ అధినేత వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా పామర్రుకు అనీల్ అభ్యర్థిత్వాన్ని జగన్ ఖరారు చేసినట్లేనని వైసీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి.

అప్పుడలా.. ఇప్పుడిలా..!

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో మూడు ఎస్సీ రిజర్వ్‌డు స్థానాలున్నాయి. వీటిలో 2019 ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులే గెలుపొందారు. ఇతర స్థానాల్లో కేవలం నియోజకవర్గాల మార్పిడికి పరిమితమవుతున్న జగన్.. ఎస్సీ రిజర్వ్‌డు స్థానాల విషయంలో మాత్రం సిటింగ్‌లకు టికెట్ నిరాకరిస్తూ వచ్చారు. ఎన్టీఆర్ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, కేవలం విజయవాడ సెంట్రల్ సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుకు సీటు నిరాకరించారు. అలాగే, రెండు ఎస్సీ రిజర్వ్‌డు స్థానాల్లో అభ్యర్థులను మార్చేందుకు సిద్ధమయ్యారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధికి టికెట్ నిరాకరించి మొండిచేయి చూపారు. నందిగామ నుంచి సిటింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మొండితోక జగన్మోహనరావుకూ ఈసారి టికెట్ ఇవ్వడం లేదని ఇప్పటికే వైసీపీ పెద్దలు స్పష్టం చేశారని సమాచారం. కృష్ణాజిల్లాలో ఏకైక ఎస్సీ రిజర్వ్‌డు స్థానమైన పామర్రు అసెంబ్లీ నియోజకవర్గ సిటింగ్ ఎమ్మెల్యే కైలే అనీల్‌కుమార్ సీటుపైనా తొలుత సందిగ్ధత నెలకొంది. అయితే నా ఎస్సీలు.. నా బీసీలు అని చెబుతున్న జగన్ వాస్తవంలో వారిని అణచివేస్తున్నారన్న ప్రచారం తెరపైకి వచ్చింది. దళిత నియోజకవర్గాలే లక్ష్యంగా సిటింగ్‌లకు మొండిచేయి చూపడం ఏమిటని దళిత నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు తనకు సీటు నిరాకరించిన జగన్‌పై రక్షణనిధి ఇప్పటికే నిప్పులు చెరిగారు. తనను నమ్మించి నట్టేట ముంచారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలతో కంగుతిన్న వైసీపీ పెద్దలు దళిత సిటింగ్‌ల విషయంలో వెనుకడుగు వేసినట్లు సమాచారం. అందులో భాగంగానే పామర్రు సభలో సీఎం అలా వ్యాఖ్యానించారని వైసీపీ శ్రేణుల్లో చర్చ నడుస్తోంది.

వంశీ, సింహాద్రి డుమ్మా


వంశీ


సింహాద్రి రమేశ్

పామర్రులో సీఎం సభకు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్ గైర్హాజరయ్యారు. మంత్రి జోగి రమేశ్, ఎమ్మెల్యేలు పేర్ని నాని, కొడాలి నాని, కైలే అనీల్, వైసీపీ మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టు, పెడన అభ్యర్థి ఉప్పాల రాము హాజరయ్యారు. వంశీ, రమేశ్ గైర్హాజరవ్వడం వైసీపీ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది. సీఎం జిల్లాకు వచ్చినా వీరు హాజరుకాకపోవడానికి గల కారణాలు ఏమై ఉంటాయనే అంశం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. గన్నవరం నుంచి వంశీకి టికెట్ ఇవ్వడం లేదు. మరోవైపు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌కు అక్కడ టికెట్ నిరాకరించి మచిలీపట్నం ఎంపీగా బరిలో నిలుపుతున్నట్లు ప్రకటించారు. కానీ, రమేశ్‌కు మొండిచేయి చూపడంలో భాగంగానే ఆయన్ను తాత్కాలికంగా ఎంపీ బరిలో నిలిపారన్నది వైసీపీ వర్గాల్లో జరుగుతున్న చర్చ. ప్రస్తుతం మచిలీపట్నం ఎంపీ బరిలో వైసీపీ తరఫున బాడిగ రామకృష్ణ కుటుంబం నుంచి ఎవరో ఒకరు పోటీ చేస్తారన్న ప్రచారం జరుగుతోంది. టికెట్లు నిరాకరించడం వల్లే వంశీ, రమేశ్ శుక్రవారం నాటి సభకు గైర్హాజరయ్యారన్నది వైసీపీ శ్రేణులు చెబుతున్న మాట.

మేం పోతాం.. పోనియ్యం..!


సీఎం ప్రసంగిస్తుండగానే వెనుదిరుగుతున్న మహిళలు, విద్యార్థినులు

- సీఎం సభలో విచిత్ర పరిస్థితి
- ఉక్కపోతకు ఉండలేక వెనుదిరిగిన జనం
- వెళ్లడానికి వీల్లేదని బారికేడ్లతో బిగేసిన పోలీసులు
- పోలీసులతో వాదులాడి జంప్
- తాగడానికి నీళ్లులేక.. తిండిలేక నానా అవస్థలు

పామర్రు, మార్చి 1 : పామర్రులో శుక్రవారం జరిగిన జగనన్న విద్యాదీవెన సభలో విచిత్ర సంఘటన చోటుచేసుకుంది. అధికారులు, అధికార పార్టీ నేతలు సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించి బస్సులు, వాహనాల్లో జనాన్ని సమీకరించినా.. సభ గ్యాలరీ మొత్తం విద్యార్థులు, డ్వాక్రాసంఘాల మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు, రాజకీయ నేతలతోనే నిండింది. ఇతర ప్రాంతాల నుంచి బస్సుల్లో పెద్దఎత్తున తరలించిన జనం లోపలికి వెళ్లినా అక్కడ కూర్చోలేకపోయారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ఉక్కపోతతో ఉడికిపోయారు. లోపల ఉండలేక బయటకొచ్చేందుకు ప్రయత్నించారు. ఎవర్నీ బయటకెళ్లనీయకుండా పోలీసులు బారికేడ్లతో బంధించేశారు. అయినా ఉండలేక కొందరు పోలీసులతో గొడవ పడి అక్కడి నుంచి బలవంతంగా బయటికొచ్చారు. కొంతమందికి తాగడానికి నీళ్లు దొరక్క సొమ్మసిల్లి పడిపోయారు. కొందరు వైద్య శిబిరాల్లో ఆరోగ్య సిబ్బంది ఇచ్చిన ఓఆర్ఎస్‌లతో సేదతీరారు.

సభకు రాకుంటే పథకాలు రద్దు

పామర్రులో శుక్రవారం నిర్వహించిన జగనన్న విద్యాదీవెన సభకు రాకుంటే ప్రభుత్వం సంక్షేమ పథకాలు రద్దు చేస్తామని అధికారులు, అధికార పార్టీ నేతలు హెచ్చరించడంతో రాక తప్పలేదని కొందరు రుసరుసలాడారు. గ్రామైక్య సంఘాల వీఓలు గ్రామ వలంటీర్ల ద్వారా సభకు తీసుకొచ్చారని చెప్పారు.


నడి ఎండలో రోడ్డుపై మహిళలు

రాష్ట్ర భవిష్యత్తు కోసమే బాబు వెంట

- ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్



నందిగామ, మార్చి 1 : రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ చంద్రబాబు వెంట నడవాలని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఆయన తన అనుచరులతో కలిసి శుక్రవారం రాత్రి హైదరాబాద్ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శనివారం ఉదయం 9 గంటలకు చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశంలో చేరుతున్నట్టు తెలిపారు. తాను ఎక్కడ నుంచి పోటీ చేయాలన్న విషయం చంద్రబాబు, లోకేశ్‌ల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు. సీటు కోసం, పోటీ కోసం కాకుండా రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు వంటి దార్శనికుడి వెంట నడవాలని తాను నిర్ణయించుకున్నట్టు చెప్పారు. అధినేత సూచనల మేరకు తన భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ఆయన చెప్పారు.

• ఇంటర్ పరీక్షలు ప్రారంభం



ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 99 కేంద్రాల్లో 39,544 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 38,822 మంది రాశారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేయడంతో పాటు 144 సెక్షన్‌ను అమల్లో ఉంచారు.

ఉద్యోగులంతా సీఎం సభకు..

తోట్లవల్లూరు సచివాలయ కార్యాలయాలకు తాళం!

- 6లో..

- డబ్బులిచ్చి సీఎం సభకు జనం తరలింపు.. పౌర సేవలకు ఆటంకం

చిత్రం.. విచిత్రం

ఒక 'చిత్రం' ఇప్పుడు పోలీస్ కమిషనరేట్‌లో ఓ విచిత్ర పరిణామాన్ని తీసుకొచ్చింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఓ ఐపీఎస్ అధికారితో ఓ ఇన్‌స్పెక్టర్ ఫొటో దిగడం.. వాట్సా్పుల్లో ఆ ఫొటో హల్‌చల్ చేయడం.. వెనువెంటనే సదరు ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేసేయడం వెనుక ఏదో జరిగిందన్న చర్చ ఇప్పుడు కమిషనరేట్‌ను కుదిపేస్తోంది.

కమిషనరేట్‌ను కుదిపేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ బదిలీ

- ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఓ ఐపీఎస్‌తో ఫొటో దిగినందుకే..
- నిబంధనలను తోసిపుచ్చి హడావిడి బదిలీ
- కమిషనరేట్‌లో పెరిగిన ఇన్‌స్పెక్టర్ల సంఖ్య
- సరిచేయడానికి 'రేంజ్' అస్త్రం
- ఎవరో ఒకరిని పావుగా కదిపే ఆలోచన



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడేళ్లు పూర్తి చేసుకున్న ఇన్‌స్పెక్టర్లు ఏలూరు రేంజ్‌కు వెళ్లిపోయారు. ఉభయ గోదావరి, కృష్ణాజిల్లాల్లో మూడేళ్ల సర్వీసు పూర్తయిన ఇన్‌స్పెక్టర్లు రేంజ్ నుంచి కమిషనరేట్‌కు వచ్చారు. ఇలా వచ్చిన వారందరినీ లా అండ్ ఆర్డర్, సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్ విభాగాల్లో సర్దుచేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇక్కడి నుంచి ఎంతమంది బదిలీపై వెళ్లారో అంతమందీ రేంజ్ నుంచి బదిలీపై వచ్చారు. ఎన్నికలకు యంత్రాంగం సిద్ధమవుతున్న తరుణంలో కొద్దిరోజుల క్రితం జరిగిన ఓ ఇన్‌స్పెక్టర్ బదిలీ ఇప్పుడు కమిషనరేట్‌ను కలవరపెడుతోంది.

అసలేం జరిగింది?

కొద్దిరోజుల క్రితం ఓ ఎస్ఐ కుమార్తె వివాహం నగరంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పోలీసు కమిషనరేట్ పరిధిలోని అధికారులు, ఉద్యోగులు హాజరయ్యారు. కాగా, ఇటీవల ప్రభుత్వం చేసిన తప్పులను ప్రశ్నించిన ఓ అధికారితో సదరు ఇన్‌స్పెక్టర్ ఫొటో దిగారు. ఈ ఫొటో రాష్ట్రస్థాయిలో ఉన్న అధికారుల వాట్సా్పల్లో ప్రత్యక్షమైంది. దీంతో ఆ ఇన్‌స్పెక్టర్ బదిలీ అనివార్యమైంది. అధికారులతో సరదాగా దిగిన ఫొటోలూ బదిలీలు చేస్తాయా అనే చర్చ పోలీసు వర్గాల్లో నడుస్తోంది. ఈ ఫొటోలో ఉన్న ఐపీఎస్ అధికారి అనేక విషయాల్లో ప్రభుత్వాన్ని నిలదీశారు. తన సర్వీసు విషయంలో చేసిన తప్పులను, ఉల్లంఘించిన నిబంధనలను కడిగి పారేశారు. ఆయనతో ఈ ఇన్‌స్పెక్టర్ ఫొటో దిగడమే ఈ బదిలీకి కారణమన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

అనివార్యంగా బదిలీ

మొత్తం అన్ని శాఖల్లో ఎన్నికల బదిలీలు పూర్తయ్యాక విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలోకీలక విధులు నిర్వర్తిస్తున్న ఈ ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేశారు. పోలీస్ కమిషనరేట్‌కు కేటాయించారు. ఆ అధికారి కొద్దిరోజుల క్రితమే కమిషనరేట్‌లో రిపోర్టు కూడా చేశారు. ప్రస్తుతం ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకపోవడంతో వీఆర్‌లో ఉన్నారు. ఈ ఇన్‌స్పెక్టర్ ఇంతకుముందు విజయవాడలో పలు స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోగా పనిచేసి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు వెళ్లారు.

బదిలీ తెచ్చిన తంటాలు

నగరంలో ఉన్న జనాభాను అంచనా వేసుకుని ప్రభుత్వం 55 ఇన్‌స్పెక్టర్ల పోస్టులను కేటాయించింది. బదిలీలు జరిగినా, అటాచ్‌మెంట్లు ఇచ్చినా ఈ సంఖ్యను దాటడానికి వీల్లేదు. విజిలెన్స్ నుంచి ఇన్‌స్పెక్టర్ కమిషనరేట్‌కు రావడంతో ఈ సంఖ్య ఇప్పుడు 56కి చేరింది. అంటే ఒక ఇన్‌స్పెక్టర్ అదనంగా ఉన్నట్టు. ఇప్పుడు కేటాయించిన సంఖ్యను సరిచేయడానికి అధికారులు నానా తంటాలు పడుతున్నట్టు తెలిసింది. ఈ సంఖ్యను సమానం చేయాలంటే అధికారుల ముందు రెండు మార్గాలే ఉన్నాయి. మొదటిది ఎవరో ఒక ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేయడం. రెండోది విజిలెన్స్ నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్‌ను రేంజ్‌కు పంపడం. విజిలెన్స్ నుంచి వచ్చిన ఇన్‌స్పెక్టర్ స్పౌజ్ కేటగిరీలో ఉండటంతో రెండో మార్గం వీలుపడదని భావిస్తున్నారు. దీంతో మొదటి మార్గం ఎంచుకున్నట్టు సమాచారం. ఉన్నది 55 మంది ఇన్‌స్పెక్టర్లే అని చూపించుకోవాలంటే ఎవరో ఒక ఇన్‌స్పెక్టర్‌ను బదిలీ చేయడానికి సన్నాహాలు జరుగుతున్నట్టు పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది.

'పశ్చిమ'లో పావులు..?

ఇన్‌స్పెక్టర్ల సంఖ్యను సమానం చేసే క్రమంలో కదలిక కత్తి పశ్చిమ మండలంపై వేలాడుతున్నట్టు సమాచారం. ఇక్కడ వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం, ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఈ నాలుగు స్టేషన్లలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు పశ్చిమగోదావరి జిల్లా నుంచి వచ్చారు. వీరిలో ఎవరి స్థానం కదులుతుందో తెలియడం లేదు. భవానీపురం ఇన్‌స్పెక్టర్‌కు తప్ప మిగిలిన ముగ్గురు ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్ ఇచ్చి దాదాపు నెల పూర్తయింది. భవానీపురం ఇన్‌స్పెక్టర్ మాత్రమే మూడు నెలల సర్వీసును పూర్తి చేసుకున్నారు. ఉన్నతాధికారుల చేతిలో పడిన ఒక 'చిత్రం' పోలీసు కమిషనరేట్‌లో విచిత్రమైన పరిస్థితిని తీసుకొచ్చిందని తెలుస్తోంది.



ఉద్యమంపై ఉక్కుపాదం

రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావడం చేతకాని ఎంపీలు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం దాసరి భవన్ నుంచి సీఎం కార్యాలయానికి బయల్దేరిన నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఆందోళనకారులను బలవంతంగా లాక్కెళ్లి జీపుల్లో పడేశారు.

మద్దతు ఇవ్వకుంటే పింఛన్లు కట్!

వలంటీర్లతో కలిసి అధికార వైసీపీ నేతల ఇంటింటి ప్రచారం..

- 6లో..

పేదల ఇళ్ల పేరుతో పక్కా మోసం!

విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం


తాళం వేసిన తోట్లవల్లూరు గ్రామ సచివాలయం

ఉద్యోగులంతా సీఎం సభకు..

- సచివాలయ కార్యాలయానికి తాళం!
- డబ్బులిచ్చి సీఎం సభకు జనం తరలింపు.. పౌర సేవలకు ఆటంకం

తోట్లవల్లూరు, మార్చి 1 : పామర్రులో శుక్రవారం జరిగిన విద్యాదీవెన సభకు అన్ని శాఖల ప్రభుత్వ అధికారులు, వైసీపీ నాయకులు మండలం నుంచి ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో జనాన్ని తరలించారు. ఒక్కొక్కరికి రూ.250, రూ.200, బిర్యాని ప్యాకెట్ ఇచ్చి బస్సుల్లోకి ఎక్కించారు. డ్వాక్రా మహిళలను సంబంధిత అధికారులు, బుక్ కీపర్లు గ్రూపుల వారీగా పేర్లు నోట్ చేసుకుని సభకు పంపారు. రానివారికి ఫోన్‌లు చేసి రుణాలు నిలిపివేస్తామని హెచ్చరికలు పంపి రప్పించారు. ఉపాధి కూలీలను కూడా తీసుకెళ్లారు. గ్రామ సచివాలయాల సిబ్బంది కార్యాలయాలకు తాళాలు వేయగా కొన్ని చోట్ల ఒక్కరిని మాత్రమే ఉంచి వెళ్లిపోవడంతో పౌరసేవలకు ఆటంకం కలిగింది.

సీఎం జగన్‌కు పామర్రులో ఘనస్వాగతం

పామర్రు : ఐదోవిడత విద్యాదీవెన పథకం ప్రారంభోత్సవానికి శుక్రవారం తొలిసారిగా విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్‌కు పామర్రులో ఘన స్వాగతం లభించింది. బందరు రోడ్డులో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద నేతలు పుష్పగుచ్ఛాలు, శాలువాలు కప్పి స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మాజీమంత్రి పేర్నినాని, కొడాలి నాని, మంత్రులు బొత్స సత్యనారాయణ, జోగిరమేశ్ ముఖ్యమంత్రికి స్వాగతం పలికినవారిలో ఉన్నారు. ఐజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, కలెక్టర్ రాజాబాబు జేసీ గీతాంజలిశర్మ తదితర ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు ఇచ్చారు. ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కార చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు.


అనారోగ్య బాధితులకు చెక్కుల అందజేసిన అధికారులు

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం చెక్కుల పంపిణీ

జిల్లావ్యాప్తంగా అనారోగ్యబాధితులకు అందాల్సిన ఫీజు రియింబర్స్‌మెంట్‌తో పాటు ఎన్వోసీలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాధిత కుటుంబాలకు పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. సీఎం వెళ్లిన గంటవ్యవధిలో స్థానిక ప్రవేట్ ఫంక్షన్ హాల్‌లో 20బాధిత కుటుంబాలకు రూ.28లక్షల తక్షణ సాయం కింద ప్రభుత్వం మంజూరు చేసిన చెక్కులను ప్రజాప్రతినిధులతో కలిసి కలెక్టర్ అందజేశారు.


పింఛన్ల పంపిణీలో వలంటీర్లతో స్వామిదాసు ప్రచారం

మద్దతు ఇవ్వకుంటే పింఛన్లు కట్!

- వలంటీర్లతో కలిసి అధికార వైసీపీ నేతల ఇంటింటి ప్రచారం..

తిరువూరు, మార్చి 1 : ఉమ్మడి కృష్ణా జిల్లాలో అధికారపార్టీ అభ్యర్థులు వలంటీర్లకు తాయిలాలు ఇస్తు తమకు అనుకూలంగా పనిచేయించుకునే ప్రయత్నం చేస్తుంటే, తిరువూరులో వైసీపీ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాసు వలంటీర్లతో కలిసి పింఛన్లు పంపిణీచేస్తు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండటం గమనార్హం. శుక్రవారం పట్టణంలోని 16వ వార్డులో వలంటీర్లు ఇంటింటికి వెళ్లి పింఛన్లు ఇచ్చే కార్యక్రమంలో ఉండగా స్వామిదాసుతో పాటుగా కొందరు వైసీపీ నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో తమకు మద్దతు ఇవ్వాలని, లేని పక్షంలో మీకు పింఛన్లు సక్రమంగా అందవని లబ్ధిదారులతో బెదిరింపు ధోరణిలో మాట్లాడటం గమనార్హం. పట్టణంలోని 16, 17 వార్డుల్లో టీడీపీ బలం అధికంగా ఉంది. మునిసిపల్ ఎన్నికల్లో ఈ రెండు వార్డుల్లో వరుసగా రెండుసార్లు టీడీపీ అభ్యర్థులు గెలుపొందారు. ఈ వార్డుల్లో పట్టుసాధించేందుకు విశ్వ ప్రయత్నం చేస్తున్న వైసీపీ నాయకులు చివరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారుల్ని మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై 16వ వార్డు కౌన్సిలర్ జీడిమళ్ల సత్యవతి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ఉదారపు మార్కేండేశ్వరరావు తదితరులు మునిసిపల్‌కమిషనర్ లోవరాజు, 9వ వార్డు సచివాలయంలో ఫిర్యాదు చేశారు. వలంటీర్లపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


జగనన్న విద్యాదీవెన చెక్కు అందజేస్తున్న కలెక్టర్ దిల్లీరావు

ఐదో విడత విద్యాదీవెన నిధులు ఎన్టీఆర్ జిల్లాలో రూ.31.72 కోట్లు విడుదల

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

వన్‌టౌన్, మార్చి1 : ఎన్టీఆర్ జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, బీఎడ్, అగ్రికల్చరల్, మెడికల్, నర్సింగ్ విద్య అభ్యసిస్తున్న 37178 మందికి విద్యాదీవెన పథకం అందిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. 33602 మంది తల్లుల ఖాతాల్లో 2023 చివరి త్రైమాసికానికి గాను శుక్రవారం రూ31.72 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థులకు విద్యను అందించేందుకు సీఎం ప్రత్యేక చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు అవుతు శ్రీ శైలజారెడ్డి, బెల్లం దుర్గ, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్ మొహియద్దీన్, భట్రాజ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ కూరపాటి గీతాంజలి, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కోఠారి, సోషల్ వెల్ఫేర్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వి.వి విజయశాంతి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, డ్వామా పీడీ జే.సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్ ఆవిష్కరణ

గవర్నర్‌పేట, మార్చి 1: మహిళా సమానత్వం సాధించిన నాడే దేశం ముందుకు పోతుందని కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 10న ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో నిర్వహించే ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ పోస్టర్‌ను కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. మహిళల్లో నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇలాంటి ఎగ్జిబిషన్లు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు స్వరూపరాణి, ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సంస్థ అధ్యక్షుడు ఎ.సునీల్‌కుమార్, సభ్యులు ప్రియాంక, లలితాసౌజన్య, సేఫ్ సంస్థ ప్రెసిడెంట్ జి.జ్యోత్స్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ దిల్లీరావు

గవర్నర్‌పేట, మార్చి 1 : ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్ పరీక్షలను కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అన్నారు. శుక్రవారం ప్రారంభమైన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సందర్శించారు. నగరంలోని బిషప్ అజరయ్య, శ్రీ శారద కళాశాలల కేంద్రాలను పర్యటించి విద్యార్థులకు ఏర్పాట్లు, పరీక్షల తీరును పశీలించారు. మొత్తం 99 కేంద్రాల్లో ఇంటర్ ఫస్టియర్ పరీక్షకు 39544 మందిగాను 38822 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి గదిలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని తెలిపారు. ఒక్కొక్క కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లు, 3500 మంది ఇన్విజిలేటర్లను నియమించి పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు సౌకర్యాలను కల్పించామన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.


బిషప్ అజరయ్య పరీక్షా కేంద్రాన్ని సందర్శించి, పరిశీలిస్తున్న కలెక్టర్ దిల్లీరావు

పేదల ఇళ్ల పేరుతో.. పక్కా మోసం!

- జగనన్న కాలనీలు కాదు మురికివాడలు
- స్థలాల పేరుతో కోట్లు కొల్లగొట్టిన నేతలు
- డ్వాక్రా మహిళల పేరున రుణాలు
- ఓటీఎస్ పేరుతో పేదల దోపిడీ
- జగన్‌రెడ్డి క్షమార్హుడు కాదు

\- నెట్టెం రఘురాం ధ్వజం



జగ్గయ్యపేట, మార్చి 1 : పేదలకు ఇళ్లు, నివేశన స్థలాల పేరుతో జగన్‌రెడ్డి పేదలను పక్కాగా మోసం చేశారని, డ్వాక్రా మహిళల పేరున వేలకోట్లు రుణాలు తీసుకుని అప్పులు పాలు చేశాడని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. పేదల ఇళ్లకు భారతీ సిమెంట్‌ను అంటగట్టి పేదల జీవితాలతో అడుకున్న జగన్‌రెడ్డి క్షమార్హుడు కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం తన నివాసంలో విలేకర్లతో నెట్టెం మాట్లాడుతూ, సంవత్సరానికి 5లక్షలు ఇళ్లు కడతానన్న జగన్‌రెడ్డి 3లక్షల ఇళ్లు కూడా నిర్మించలేదని ఆరోపించారు. ఇళ్ల నిర్మాణానికి కేంద్రం ఇచ్చిన రూ.1.80లక్షలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం చిల్లిగవ్వ కూడా ఇవ్వకుండా ఇళ్లు కట్టుకోవాలని లబ్ధిదారులను బెదిరించటంతో వారు అప్పుల పాలయ్యారన్నారు. డ్వాక్రా మహిళల పేరున రూ.35 వేలు చొప్పున రూ.3500 కోట్లు తెచ్చి ఏం చేశారని, టిడ్కో ఇళ్ల పేరు చెప్పి బ్యాంకు రుణాలు తెచ్చి లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వకుండా రెండు రకాలుగా నష్టపెట్టారని ఆరోపించారు. భారతీ సిమెంట్స్ బస్తాకు రూ.100 అధికంగా అంటగట్టి కోట్లు దండుకున్నారని, నాణ్యత లేని సిమెంటు వల్ల ఇళ్లు కూలిపోతున్నాయని ఆరోపించారు. ఓటీఎస్ పేరుతో కోట్లు వసూలు చేశాడని ఆరోపించారు. దేశంలో ఎన్టీఆర్ పేదలకు పక్కా గృహ పథకాన్ని ప్రారంభించి ఆదర్శంగా నిలిస్తే, చంద్రబాబు నూతన టెక్నాలజీతో టిడ్కో ఇళ్లను నిర్మించారని చెప్పారు. జగనన్న కాలనీలకు చెరువు ముంపు, పోరంబోకు, పల్లపు భూములు సేకరించారని, అనేక చోట్ల భూమి కొనుగోలు పేరుతో లక్షల కోట్లను ఆ పార్టీ ఎమ్మెల్యేలు దోచుకున్నారని ధ్వజమెత్తారు. పేదల పథకాలలో లక్షలకోట్లు అవినీతికి పాల్పడ్డ ప్రభుత్వానికి ఎంత మాత్రం అధికారంలో కొనసాగే నైతిక అర్హత లేదన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు ముల్లంగి రామకృష్ణారెడ్డి, కన్నెబోయిన రామలక్ష్మి, గద్దె రాజ్యలక్ష్మి, గింజుపల్లి రమేష్, అన్వర్, సంకా వెంకట్రావు, భాస్కర్, తాళ్లూరి వెంకటేశ్వర్లు, మొగిలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తల పోరాటమే గెలుపునకు నాంది : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 1 : వైసీపీ అవినీతి అక్రమాలపై టీడీపీ, జనసేన కార్యకర్తలు సైనికుల్లా పోరాడితే గెలుపు సునాయాసమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. శుక్రవారం రాత్రి నియోజకవర్గ కార్యాలయ ఆవరణలో శంఖారావం సన్నాహక విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, తాడేపల్లిగూడెం సభ తరువాత వైసీపీలో వణుకు పుట్టిందన్నారు. ఎన్నికలు 15 రోజులు ఉండగా టీడీపీ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇస్తున్నారని, శంకుస్థాపనలు మొదలు పెట్టారని అన్నారు. ఐదేళ్లుగా ప్రజల కష్టాలు ఇన్నీ అన్నీ కావన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు, కుంచే నాని తదితరులు పాల్గొన్నారు.

నాని ప్రజల విశ్వాసం కోల్పోయాడు : వెనిగండ్ల

గుడివాడ : ఎమ్మెల్యేగానే కాకుండా రాజకీయ నాయకుడిగా కొడాలి నాని ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాడని, కేవలం సీటు కోసమే చంద్రబాబు, పవన్‌లను నోటికి వచ్చినట్లు తిడుతున్నాడని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము ఆరోపించారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిత్యం రాజకీయ విమర్శలు చేసే నాని గుడివాడ అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. నాని తన 20ఏళ్ల పదవీకాలంలో వెనక్కి తిరిగిచూసుకుంటే లక్షల కొద్ది బూతులు, కొండంత అవినీతి తప్ప అభివృద్ధి మచ్చుకైనా లేదన్నారు. నాని అవినీతి చిట్టా లోకేశ్ రెడ్‌బుక్‌లో నమోదై ఉందని, చిన్నప్పుడు తాగిన ఉగ్గుపాలతో సహా కక్కాల్సిన సమయం ఎంతో దూరంలో లేదన్నారు. రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో, నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రజా సంపదను అడ్డగోలుగా దోచుకున్న నాని, గడ్డంగ్ గ్యాంగ్‌లు ఖచ్చితంగా ఊచలు లెక్కపెట్టాల్సిందేనన్నారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ మాట్లాడుతూ, ప్రజల గుండెల్లో ఉన్న చంద్రబాబు, పవన్‌లను విమర్శించే అర్హత నానికి లేదన్నారు. పవన్ ఆదేశాలను తు.చా తప్పక పాటిస్తామని స్పష్టం చేశారు.


వైసీపీ శ్రేణులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న వెనిగండ్ల, రావి

టీడీపీలోకి భారీగా చేరికలు

టీసీ నాయకుడు మరీదు రాహుల్ ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము సమక్షంలో శుక్రవారం 17వ వార్డుకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు 300 మంది పార్టీలో చేరారు. రాహుల్ చేరికతో 17వ వార్డు మరింత బలోపేతమైందని వెనిగండ్ల అన్నారు. యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, గోకవరపు సునీల్, జి.సత్యనారాయణ, యార్లగడ్డ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన పార్టీలకు ఘోరీ కడదాం

- ప్రత్యేకహోదా సాధించలేని ఎంపీలు రాజీనామా చేయాలి
- కేసులకు భయపడి కేంద్రానికి సాగిలపడుతున్న సీఎం జగన్
- విద్యార్థి, యువజన సంఘాల నేతలు

ధర్నాచౌక్, మార్చి 1 : ప్రత్యేక హోదా అంశంలో ప్రజలను మోసం చేస్తున్న పార్టీలకు రానున్న ఎన్నికల్లో ఘోరీ కడదామని, రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులు రాజీనామ చేయాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా తీసుకురావడం చేతకాని ఎంపీలు రాజీనామ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం దాసరి భవన్ నుంచి సీఎం కార్యాలయానికి బయలుదేరిన నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ ప్రభుత్వం, కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామని వైసీపీ ప్రభుత్వం ప్రజలను మోసం చేశాయని ధ్వజమెత్తారు. అమ్మ పెట్టదు... అడుక్కు తిననివ్వదు అన్న చందంగా ప్రత్యేకహోదా అడగరు, అడిగేవారిని అరెస్టు చేస్తారని ఎద్దేవా చేశారు.



ఆందోళనకారులను వాహనంలో ఎక్కించి స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

తనపై ఉన్న కేసుల భయంతో సీఎం జగన్ కేంద్రానికి సాగిలపడుతున్నారని విమర్శించారు. పోలీసులతో ఉద్యమాలను అణచలేరని, రానున్న రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు, వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి, లంకా గోవిందరాజులు, సింగంశెట్టి మోహన్‌ప్రసాద్, కె.కార్తీక్, గాడి అజయ్, సాయికుమార్, రాజేంద్ర తదితరులు పోలీసులు అరెస్టు చేసిన వారిలో ఉన్నారు.


పోస్టర్ విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, తదితరులు

7న పీబీ సిద్ధార్థలో బ్లిట్జ్ క్రీగ్

మొగల్రాజపురం, మార్చి 1: పీబీ సిద్ధార్థ కళాశాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదిన కళాసాలస్థాయిలో బ్లిట్జ్‌క్రీగ్-2024 అంతర్రాష్ట్ర పోటీలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడానికి పోస్టర్ ప్రజంటేషన్, కంప్యూటర్ క్విజ్, కోడింగ్ అండ్ డీకోడింగ్, డేటాథాన్, స్పాట్ ఫొటోగ్రఫీ, నిధి అన్వేషణ, సంగీత వాయిద్యాల పోటీలు, మిస్టర్ అండ్ మిస్, షార్ట్ ఫిల్మ్ పోటీలు ఉంటాయన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. డైరెక్టర్ వేమూరి బాబూరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ రవికిరణ్ పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై అధికారుల దాడి.. మూడు యంత్రాల సీజ్



గన్నవరం, మార్చి 4 : గుట్టుచప్పుడు కాకుండా సాగిస్తున్న అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించి మూడు యంత్రాలను సీజ్ చేశారు. మండలంలోని కొండపావులూరు పంచాయతీ శివారులోని దుబ్బులగుంట చెరువులో అధికార పార్టీ నేత అండతో యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం మైనింగ్ అధికారి శివపార్వతి ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి మూడు ఎక్స్‌కవేటర్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. తవ్వకాలు జరిగిన చెరువును మైనింగ్ ఏడీ పరిశీలన చేశారు. అనర్హత వేటుకు గురైన ఎమ్మెల్యే వంశీ, ఆయన అనుచరుల అండదండలతో సాగుతున్న తవ్వకాలపై దాడికి వెళ్లిన అధికారులను అక్కడ ఉన్నవారు ప్రతిఘటించే ప్రయత్నం చేశారు. అధికారులు ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసి గన్నవరం స్టేషన్‌లో అప్పగించారు. తవ్వకాలపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్టు తెలిసింది. గ్రామస్థులు ఇప్పటికే జిల్లా కలెక్టర్, మైనింగ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా.. దీనిలో భాగంగానే శుక్రవారం దాడులు జరిగాయి.

రబీ పంట నమోదు ముసాయిదా జాబితా సిద్ధం

లబ్బీపేట, మార్చి1 : రబీ సీజన్లో విత్తిన పంటలను ఇ-క్రాప్‌లో నమోదు చేసి బయోమెట్రిక్ ధృవీకరణ పూర్తి అయిన ముసాయిదా జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం రైతు భరోసా కేంద్రాలలో ఈ నెల 3వ తేదీ వరకు ప్రదర్శించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారిణి ఎస్.నాగమణమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాను గ్రామ సభలు నిర్వహించి పేర్లను రైతులకు చదివి వినిపించడం జరుగుతుందని, పంట నమోదులో ఎటువంటి తప్పులున్నా రైతులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులను అందజేస్తే వాటిని పరిశీలించి దిద్దుబాటు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏవైనా తప్పులు దొర్లితే దరఖాస్తు రూపంలో సంబంధిత గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కొత్త, దిద్దుబాటు చేసిన రికార్డ్స్ ను వీఆర్వో, విఏఏ, విహెచ్ఏ నిర్ధారణ, ఆమోదానికై మండల వ్యవసాయ అధికారికి తహసీల్దార్‌కు పంపడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియ ఈ నెల 5వ తేదీ లోగా పూర్తి చేయడం జరుగుతుందని, ఆమోదం పొందిన తరువాత తుది జాబితా ఈ నెల 8న అన్ని రైతు భరోసా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దిల్లీరావు, అధికారులు

పోలింగ్ కేంద్రాల్లో విస్తృత స్థాయిలో మౌలిక సౌకర్యాలు

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

వన్‌టౌన్, మార్చి1 : ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 1781 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ రూరల్‌లో భాగమైన గన్నవరం నియోజకవర్గానికి చెందిన 82 పోలింగ్ కేంద్రాలతో కలిపి మొత్తం 1863 పోలింగ్ కేంద్రాలలో విస్తృతస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా ఎన్నికల ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు ప్రణాళిక బద్ధంగా అన్ని చర్యలను తీసుకుంటున్నట్టు తెలిపారు. తుది ఓటర్ల జాబితా ప్రకటించిన నాటినుంచి ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతికూల వార్తల పరిష్కార నివేదికను రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించినట్టు చెప్పారు. జిల్లా కంట్రోల్‌రూమ్‌లో సంబంధిత మెటీరియల్‌ను సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఈయూ పోరాటాల ఫలితమే ఏఏఎస్

బస్‌స్టేషన్, మార్చి 1 : ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) చేసిన పోరాటాల ఫలితంగానే ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం(ఏఏఎస్) సాధ్యమైందని యూనియన్ నేతలు పేర్కొన్నారు. ఏఏఎస్ కలిపేందుకు ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో విద్యార్హతల్లో సడలింపు చేసినందుకు ఆర్టీసీ యాజమాన్యానికి శుక్రవారం కృతజ్ఞతలు తెలుపుతూ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నర్సయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. ఎండీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలకు అనుగుణంగా అడ్మిన్ ఈడీ కేఎస్ బ్రహ్మానందరెడ్డి ఉత్తర్వులు జారీచేశారని, దీనివల్ల ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు చేకూరతాయని పేర్కొన్నారు.

కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా శోభన్‌బాబు


కేయూ వీసీ జ్ఞానమణిని కలిసిన శోభన్‌బాబు


మచిలీపట్నం టౌన్, మార్చి 1 : కృష్ణా విశ్వవిద్యాలయం నూతన రిజిస్ట్రార్‌గా ఆచార్య కె.శోభన్‌బాబు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నరసరావుపేట జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్‌గా మేథమెటిక్స్ విభాగం హెచ్‌వోడీగా పనిచేస్తున్న శోభన్‌బాబు ఇక్కడ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం, కాకినాడ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలల్లో సహాయ ఆచార్యులుగా పనిచేశారు. అలాగే విజయనగరం కళాశాలలో సహ ఆచార్యులుగా విధులు నిర్వహించారు. కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ బీటెక్ కో-ఆర్డినేటర్, జవహర్‌లాల్ నెహ్రూ పరీక్షల విభాగం అడిషనల్ కో-ఆర్డినేటర్‌గా పనిచేశారు. శోభన్‌బాబును విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.


నాక్-ఎ గుర్తింపు చూపుతున్న కళాశాల కార్యదర్శి

వీకేఆర్ అండ్ వీఎన్‌బీకి నాక్-ఎ గుర్తింపు

గుడివాడ : స్థానిక వీకేఆర్ అండ్ వీఎన్‌బి ఇంజినీరింగ్ కళాశాలకు నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడియేషన్ కౌన్సిల్, బెంగుళూరు వారు నాక్-ఎ గుర్తింపునిచ్చారు. శుక్రవారం కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య మాట్లాడుతూ, గత ఏడాది డిశంబరు 14, 15 తేదీల్లో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడియేషన్ కౌన్సిల్, బెంగుళూరు త్రిసభ్య కమిటీ కళాశాల నాణ్యత ప్రమాణాలు, విద్యాబోధన, ప్రయోగశాలలు, విద్యార్థులకు ఉద్యోగ అవకాశాల కల్పన, గ్రంథాలయం వంటి వాటిని రెండు రోజుల పాటు నిశితంగా పరిశీలించి నాక్-ఎ గుర్తింపును యిచ్చారన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కళాశాల డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరమశివునికి నూలు పాగా



పెడన, మార్చి 1 : పరమ శివభక్తుడైన చేనేత కార్మికుడు వరదా సోమేశ్వరరావు తన చేనేత మగ్గంపై శివదేవునికి నూలు పాగా తయారు చేశాడు. అత్యంత నియమ నిష్టలతో రేయింబవళ్లు శ్రమించి సోమేశ్వరరావు తన ఇష్టదైవమైన పరమేశ్వరుడి కోసం ఈ పాగా తయారు చేశాడు. ఈ పాగాను మహాశివరాత్రి నాడు లింగోద్భవ సమయంలో పాలకొల్లులోని క్షీరరామలింగేశ్వరస్వామికి సమర్పిస్తానని సోమేశ్వరరావు పేర్కొన్నాడు. స్వామికి శివరాత్రి రోజున నూలు పాగా సమర్పించడం తమ వంశస్తులకు ఆనవాయితీగా వస్తోందని చెప్పారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

'మార్పు కోసం సీపీఎం' ప్రారంభం

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 1 : విజయవాడ నగరం పాలకుల నిర్లక్ష్యానికి గురైందని, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వానికి భజన చేయడం తప్ప నియోజకవర్గం సమస్యలపై శాసనసభలో గళం లేవనెత్తలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 7 వరకు తలపెట్టిన 'మార్పు కోసం సీపీఎం' కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో ఇంటింటికీ వెళ్లి వైసీపీ ఐదేళ్ల పాలనలో పాలకుల నిర్లక్ష్యంతో నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిన విధానాన్ని స్థానికులకు వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సెంట్రల్‌లో కమ్యూనిస్టులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

మహిళలూ.. ఓటు బ్యాంకుగా మారొద్దు

● కరపత్రం ఆవిష్కరణ

గవర్నర్‌పేట, మార్చి 1: చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శుక్రవారం లెనిన్ సెంటర్‌లోని లెనిన్ విగ్రహం వద్ద మహిళలు ఓటు బ్యాంకుగా మారవద్దు, మన హక్కుల సాధనకై పోరాడుదాం అన్న కరపత్రం ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా సంఘం కో-కన్వీనర్ రాధ మాట్లాడుతూ మార్చి 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం సందర్భంగా రానున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో మహిళలను చైతన్యం చేసే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా ఓటర్లను ఆకర్షించడానికి వివిధ పార్టీలు ఉచిత పథకాలను తమ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటిస్తున్నాయని, పథకాలకు ఆశపడుతూ పేద మహిళలు తమ హక్కులపై నేతలను నిలదీసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. అందుకే మహిళా చైతన్యం దిశగా సంఘం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనుందని, అందులో బాగంగా కరపత్రాన్ని ప్రజలకు చేరవేస్తామని తెలిపారు. కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో సంఘం నేతలు మంజరి లక్ష్మీ, పర్వీన్ సుల్తానా, సయ్యద్ జరీనా బేగం, రాజేశ్వరి, ఎస్. జాన్సీ, సవేరా తదితరులు పాల్గొన్నారు.



చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ

గద్దెకు హ్యాట్రిక్ విజయం తథ్యం

గద్దె రామ్మోహన్‌కు జనసేన నేతల సత్కారం

పటమట, మార్చి 1 : త్వరలో జరగనున్న అసెంబ్లీల్లో ఎన్నికల్లో తూర్పు నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న గద్దె రామ్మోహన్ అత్యధిక మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించడం తథ్యమని జనసేన నాయకులు పేర్కొన్నారు. అశోక్‌నగర్‌లోని శాసనసభ్యుని కార్యాలయంలో శుక్రవారం జనసేన నాయకులు గద్దె రామ్మోహన్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విధ్వంసాలను వాటితో పాటు 2024 ఎన్నికల్లో గెలిచిన తర్వాత టీడీపీ-జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో అమలు చేసే సంక్షేమ పథకాల గురించి ఉభయ పార్టీల కార్యకర్తలు ఇంటింటికీ వెళి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. జనసేన నాయకులు మాట్లాడుతూ గద్దెను ఎమ్మెల్యేగా 50 వేల ఓట్లకు ఒక్క ఓటు తక్కువ కాకుండా మెజారిటీతో గెలిపించుకోవాలని, అప్పుడే జనసేన-టీడీపీల పొత్తుకు అర్థం ఉంటుందన్నారు. జనసేన నాయకులు వెన్నా శంకరరావు, కృష్ణమోహన్, గుండు రాము, ముత్యాల కృష్ణమోహన్, వెంకటేశ్వరరావు, రాఘవ, భాస్కర్, సురేష్, దాసు పాల్గొన్నారు.



గద్దెను సత్కరిస్తున్న జనసేన నేతలు

బాబుతోనే యువత భవిష్యత్

యువతకు ఉద్యోగాలు, ఉపాధి, ఉన్నత విద్య సకాలంలో అందాలంటే విజనరీ చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పేర్కొన్నారు. అశోక్‌నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం గద్దెను మొదటిసారి ఓటు వేయనున్న కొంత మంది యువత కలిసి వారి మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఆయన యువ ఓటర్లతో పలు విషయాలు చర్చించారు. మొదటి సారి ఓటుహక్కు వినియోగించుకునేవారు చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలనే లక్ష్యంతో పనిచేయాలని, దీనికి మా సహకారం అందిస్తామని తెలిపారు. సాయి, ప్రభాస్, వరుణ్, విజయ్, జశ్వంత్, హర్ష, గద్దె తనయుడు క్రాంతికుమార్ కూడా ఉన్నారు.

యువకుడు ఆత్మహత్య

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 1 : వాంబేకాలనీకి చెందిన మానం వెంకన్న గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాల ప్రకారం మానం వెంకన్న(32) వడ్రంగి పనిచేస్తున్నాడు. గురువారం భార్య వైఎస్సార్ కాలనీలోని పుట్టింటికి వెళ్లింది. తిరిగి వచ్చే సరికి వెంకన్న ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ- జనసేన సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందాం

జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ

భారతీనగర్, మార్చి 1: టీడీపీ, జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సరానికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందజేస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించారని కృష్ణాజిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. తూర్పు పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలోని మెయిన్ రోడ్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం జరిగింది.ఈ కార్యక్రమంలో గద్దె అనురాధ, గద్దె క్రాంతి కుమారు పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి వచ్చే ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అమలుచేసే సంక్షేమ కార్యక్రమాలను వివరించి కరపత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సంక్షేమ పాలన తెచ్చుకునేందుకు టీడీపీ- జనసేన సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు. సైకిల్ గుర్తుపై ఓటువేసి గద్దె రామ్మోహన్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, డివిజన్ అధ్యక్షుడు గొల్లపూడి నాగేశ్వరరావు, కోడూరు ఆంజనేయవాసు, సలిమిశెట్టి రాజామణి, తదితరులు పాల్గొన్నారు.

52వ డివిజన్‌లో..

వన్‌టౌన్: 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు (చంటి), క్లస్టర్ ఇన్‌చార్జి నందం భవాని ప్రసాద్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ సూపర్ 6 పథకాల గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పిళ్ల రామకృష్ణ, తేలు సూరిబాబు, దేవర కల్యాణ్, గిరీష్, పల్లంటి ఆదినారాయణ పాల్గొన్నారు.



స్థానికులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న గద్దె అనురాధ

టీడీపీ- జనసేన పొత్తుతో వైసీపీ చిత్తుచిత్తు

వన్‌టౌన్: టీడీపీ-జనసేన పొత్తుతో వైసీపీ చిత్తుచిత్తు అవుతుందని జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు. 54 వ డివిజన్‌లో సమన్వయకర్తలతో కలసి శుక్రవారం రాబోయే ఇంటింటికీ టీడీ పీ- జనసేన ప్రభుత్వం ప్రచారాన్ని నిర్వహించారు రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేన .పొత్తు ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలన్నారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముస్లిం, మైనారిటీల అభివృద్ధి కోసం వారి సమస్యల కోసం తాను కృషి చేసానన్న సంగతిని గుర్తు చేశారు. ముస్లిం సోదరులు తనను గుండెల్లో పెట్టుకున్నారని, ఎన్నికలలో ఆదరిస్తారని పేర్కొన్నారు. జనసేన-టీడీపీ ప్రభుత్వంలోనే సామాన్య ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. జనసేన-టీడీపీ పొత్తుతో వైసీపీ చిత్తు చిత్తు అవుతుందని చెప్పారు.



ప్రచారం నిర్వహిస్తున్న పోతిన మహేశ్

టీడీపీలో చేరికలు

పాయకాపురం, మార్చి 1 : నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన 150 మంది శుక్రవారం టీడీపీలో చేరారు. మొగల్రాజపురంలోని బొండా ఉమా నివాసంలో ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని సూచించారు. నేతలు దెందుకూరి మురళీకృష్ణంరాజు, రఘు, బెజ్జం రామకోటయ్య, జంపన విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొండా ఉమా

వాకర్లతో కేశినేని శివనాథ్ నడక

వన్‌టౌన్, మార్చి 1: టీడీపీ సీనియర్ నాయకుడు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కేశినేని శివనాథ్ (చిన్ని) శుక్రవారం వెటర్నరీ కాలనీలోని లయోల గ్రౌండ్స్‌లో, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ గ్రౌండ్స్‌లో వాకర కలిసి నడిచారు. స్నేహపూర్వకంగా వారిని కలుసుకున్నారు. కాసేపు వాకింగ్ చేస్తే సమకూరే ఆరోగ్యం గురించి, ఇతరత్రా అంశాలపై మాట్లాడుకున్నారు.



టీడీపీ కార్యకర్తకు బుద్దా పరామర్శ

విద్యాధరపురం, మార్చి 1: టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి బుద్దా వెంకన్న అనారోగ్యానికి గురైన పశ్చిమలోని 42వ డివిజన్‌కు చెందిన దేవరపు ఉమామహేశ్వరావును శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పత్తి నాగేశ్వరరావు, చుంచుకొండయ్య, గోళ్ల కేశవరావు, యూవీ శివాజీ, మలంపాటి దుర్గా, దంగేటి శివరాం ప్రసాద్, గుండు సుధాకర్ తదితరులు కూడా ఉమామహేశ్వరావును పరామర్శించిన వారిలో ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వన్‌టౌన్, మార్చి1: గాంధీహిల్ సబ్‌స్టేషన్ 11కేవీ నైజం గేట్ ఫీడర్‌లైన్ల మరమ్మతులు, నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్‌మెన్ బంగ్లా, మధిరవారి వీధి, ఏనుగుల వారి వీధి, నూకల వారి వీధి, ఆబోతుల వారి వీధి, ఇస్మాయేల్ వీధి, పెద్ద సత్తార్ వీధి, అబ్దుల్ రజాక్ వీధి, మహాలక్ష్మి టెంపుల్ వీధి, రెల్లి వీధి, కొండ, మేకల వారి వీధి, సీఎస్ఐ చర్చి ఏరియా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.



వీరాంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం

చిట్టినగర్, మార్చి 1: ఆంజనేయవాగు సెంటర్‌లో వీరాంజనేయస్వామి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం శుక్రవారం దేవస్థానం ప్రాంగణంలో జరిగింది. ఆలయ ఈవో వెంకటేశ్వరరావు నూతన పాలక మండలి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. పాలకమండలి చైర్మన్‌గా నందిపాటి శ్రీనివాసరావు, సభ్యులుగా చలమలశెట్టి జగదీష్, అయితా మాణిక్యాలరావు, పోతిన గాయత్రి, యలమంచిలి భవాని, పువ్వుల తులసి, గుర్రం బేబి, ఎక్స్‌అఫీషియా సభ్యుడిగా విన్నకోట శ్రీనివాసరావు ప్రమాణస్వీకారం చేశారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, షేక్ ఆసిఫ్, పలువురు నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 1 : ప్రేమ పేరుతో ఓ యువతిని వేధిస్తున్న యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం గద్దె వెంకటరామయ్య నగర్ ప్రాంతానికి చెందిన యువతి నగరంలోని కళాశాలకు శ్రీను అనే వ్యక్తి ఆటోలో రోజూ వెళ్లి వస్తోంది. శ్రీను యువతిని ప్రేమిస్తున్నానంటూ వేధింపులకు పాల్పడటంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 1 : నందమూరి నగర్ జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాల ప్రకారం రామకృష్ణాపురంకు చెందిన బండి సాయి కిరణ్ ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి తన ద్విచక్రవాహనంపై నందమూరినగర్ నుంచి ఇంటికి వస్తున్నాడు. నందమూరి నగర్ జంక్షన్ వద్దకు రాగానే కారు అతి వేగంగా వచ్చి సాయికిరణ్ వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో గాయపడ్డ వ్యక్తిని చుట్టు ప్రక్కల వారు ఆసుపత్రికి తరలించారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోండి

కార్పొరేటర్ బోయి సత్యబాబు



చిట్టినగర్, మార్చి 1: వీధికుక్కల దాడుల్లో ప్రజలు తీవ్ర గాయాలపాలవుతున్నారని 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు అన్నారు. గతంలో కుక్కల దాడిలో ఇద్దరు మృతి చెందారన్నారు. శుక్రవారం ఖాదర్‌వీధిలో కుక్కల దాడిలో గాయపడిన వృద్ధురాలిని ఆయన పరామర్శించి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల నియంత్రణ అంటూ ఆపరేషన్‌ల పేరిట లక్షలకు లక్షలు ఖర్చు పెడుతున్నా కుక్కల నియంత్రణలో అధికారులు. పాలకులు విఫలమయ్యారన్నారు. గతంలో 50వ డివిజన్‌లో ఓ వృద్ధురాలు, బాలుడు మృతి చెందిన ఘటన ఆయన అధికారులకు గుర్తు చేశారు. వెంటనే కమిషనర్ స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.

వన్‌టౌన్‌లో ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

వన్‌టౌన్, మార్చి 1: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు వన్‌టౌన్‌లో శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ద్వితీయ భాష పేపర్ - 1 పరీక్ష జరిగింది. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని గాంధీజీ మహిళా కళాశాల సెంటర్‌లో 276 మందికి గాను 272 మంది పరీక్ష రాశారు. కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని కేబీఎన్ కాలేజీలో రెండు సెంటర్లను ఏర్పాటు చేశారు. 10 ఎ సెంటర్‌లో 660 మందికి 645 మంది, 10 బీ సెంటర్‌లో 413 మందికి 409 మంది పరీక్ష రాశారు. కొత్తపేట సీఐ గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



కేబీఎన్ కాలేజీ వద్ద బారులు తీరిన విద్యార్థులు

● భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోనే మానవ మందిర రోడ్డులో ఉన్న చైతన్య కళాశాలలో 326 మందికి 321 మంది, విద్యాధరపురం కబేళా ప్రాంతంలో ఉన్న గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో 200 మందికి 198 మంది పరీక్ష రాశారు. భవానీపురం స్వాతి రోడ్డులోని నారాయణ కళాశాలలో 554 మందికి 545 మంది, భవానీపురంలోని ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో 205 మందికి 199 మంది పరీక్ష రాశారు. గొల్లపూడి చైతన్య బాలుర కాలేజీలో 626 మందికి 616 మంది, ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో 368 మందికి 358 మంది, సహస్ర జూనియర్ కాలేజీలో 272 మందికి 268 మంది పరీక్ష రాశారు.

తండ్రి మందలించాడని ఇల్లొదిలిన కుమారుడు

విద్యాధరపురం,మార్చి1: తండ్రి మందలించాడని కుమారుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీనిపై భవానీపురం పోలీసులకు తండ్రి ఫిర్యాదు చేశాడు. భవానీపురానికి చెందిన సూరాబత్తుల కుమార్‌కు, భార్య, ఇద్దరు కుమారులు. పెద్దబ్బాయి విక్రాంత్ గుంటుపల్లిలోని స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. గురువారం విక్రాంత్ బాబాయి కుమార్తెను ఏడిపిస్తున్నాడని తండ్రి మందలించాడు. ఒక దెబ్బ కొట్టాడు. ఆ తరువాత నుంచి ఆ బాలుడు కనిపించలేదు. కుమారుడి తండ్రి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాల ఘర్షణ.. పరస్పర ఫిర్యాదులు

విద్యాధరపురం,మార్చి1: ఇరువర్గాలు ఘర్షణపడి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. మాట మాట పెరిగి ఆటో డ్రైవర్‌పై ఇద్దరు దాడి చేశారు. ఈ ఘటనపై భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాము ఆటో యూనియన్ రిజిస్ట్రేషన్ పని మీద పైడి దుర్గారావుతో కలిసి తిరుగుతున్నాడు. మధ్యాహ్నం 2గంటలకు ఓ కార్యక్రమానికి వెళ్లాలని దుర్గారావు అడుగగా అతనిని వెళ్లాల్సిన చోట దించాడు. అక్కడే ఉన్న జి. కృష్ణ చైతన్య, జి. వెంకటేష్‌లు అడ్డుకుని కొట్టారు. అక్కడున్న వాళ్ళు సర్దుబాటు చేశారు. కృష్ణచైతన్య, వెంకటేష్‌లు వైన్ షాపు వద్ద ఉండగా రాము కుమారుడు అక్కడకు వెళ్లి తన తండ్రిని ఎందుకు కొట్టారంటూ గొడవపడ్డాడు దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

● కాగా రాముపై కృష్ణచైతన్య భవానీపురం పోలీస్‌స్టేషన్ ఎదురు ఫిర్యాదు చేశాడు. గురువారం కుటుంబ సభ్యులతో కలిసి కృష్ణచైతన్య ఓ కార్యక్రమానికి వెళ్లాడు. అయితే అతను శివమాలలో ఉండడంతో షాదీఖానా గ్రౌండ్ వద్ద వేచి ఉన్నాడు. ఈ సమయంలో మద్యం మత్తులో ఉన్న రాము అక్కడకు వచ్చి కృష్ణచైతన్య బండి తాళం తీసుకున్నాడు. తాళం అడిగినందుకు గొడవపడ్డాడు. చుట్టుపక్కల వారు వచ్చి విడిపించారు. కాగా కృష్ణచైతన్య ఫోన్ రావడంతో అప్పలస్వామి కాలేజీ వద్ద ఉన్న గవర్నమెంట్ వైన్‌షాపు వద్దకు వెళ్లాడు. అక్కడే ఉన్న రాము, అతని కుమారుడు వెనుక నుంచి వచ్చి కొట్టారు. కృష్ణచైతన్య తమ్ముడు వెంకటేష్‌ను కూడా కొట్టి దుర్భాషలాడారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నందిగామ ఆర్డీవోగా రవీంద్రరావు

నందిగామ రూరల్, మార్చి 1: నందిగామ ఆర్డీవోగా రవీంద్రరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామ న్నారు. ముఖ్యంగా రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 2 మార్చి 2024



పోషకాహారం తీసుకుంటున్నా
ఒక్కసారిగా నిస్సత్తువ ఆవరిస్తోందా?
అయితే అలసటకు లోనుకాకుండా
చేసే ఈ 'పవర్ స్నాక్స్' ట్రై చేయండి.

'పవర్ స్నాక్స్'!

వంటిల్లు

రాగి బిస్కెట్లు

వంద గ్రాములు రాగుల్లో 330 కేలరీల శక్తి ఉంటుంది. రాగుల్లోని క్యాల్షియం బుద్ధి బలాన్ని పెంచుతుంది. కాబట్టి సుగర్‌లెస్ ఈవినింగ్ స్నాక్‌గా రాగి బిస్కెట్లు ఇవ్వవచ్చు. వీటిని ఎలా తయారు చేయాలంటే...

కావలసిన పదార్థాలు:

రాగి పిండి - 1 కప్పు,
యాలకుల పొడి - అర టీస్పూను
సొంఠి - చిటికెడు, గుడ్డు - 1
ఉప్పు - అర చెంచా, రైస్ బ్రాన్,
ఆయిల్ - అర కప్పు

తయారీ విధానం:

- రాగి పిండి, యాలకుల పొడి బాండీలో వేసి నూనె లేకుండా రెండు నిమిషాలపాటు వేయించాలి.
- ఇప్పుడు గుడ్డు, సొంఠి, ఉప్పు వేసి కలపాలి.
- చివర్లో నూనె వేసి ముద్దలా కలపాలి.
- ఈ ముద్దను చిన్న ఉండలుగా చుట్టి, గుండ్రంగా బిస్కెట్లుగా వత్తుకోవాలి. ఈ బిస్కెట్లను బటర్ పేపర్ వేసిన ట్రేలో పరుచుకోవాలి.
- ఓవెన్‌ను ప్రీ హీట్ చేసుకోవాలి. 180 డిగ్రీల దగ్గర 8 నిమిషాలపాటు బేక్ చేసి తీయాలి.

ఖర్జూర లడ్లు

కావలసిన పదార్థాలు:

ఖర్జూరాలు - 1 కప్పు, పచ్చి కొబ్బరి - అర కప్పు
జీడిపప్పు - 1 కప్పు, కొబ్బరి నూనె - రెండు టీస్పూన్లు



ఖర్జూరంలో విటమిన్ బి6, రాగి, మెగ్నీషియం ఉంటాయి. జీడిపప్పులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి ఎదిగే పిల్లల బుద్ధి బలానికి ఎంతో అవసరం. కాబట్టి వీటినెలా తయారు చేయాలంటే....

తయారీ విధానం:

- ఖర్జూరాలను విత్తనాలు తీసి గంటపాటు నీళ్లలో నానబెట్టాలి.
- తర్వాత ఆరబెట్టి పక్కనుంచాలి.
- జీడిపప్పులో కొబ్బరి కలిపి, బ్లెండ్ వేయాలి.
- దీన్లోనే ఖర్జూరాలు, కొబ్బరి నూనె కూడా వేసి మళ్లీ బ్లెండ్ చేయాలి.
- ఇలా తయారైన చిక్కని మిశ్రమాన్ని ఉండలు చుట్టాలి.
- వీటిని ఫ్రిజ్‌లో చల్లబరిచి పిల్లలకు ఇవ్వాలి.

జొన్న వడ

చిరుధాన్యాల్లో ముఖ్యమైనవి జొన్నలు. గ్లూటేన్ లేని సురక్షితమైన పోషకాహారంగా వీటిని పరిగణించవచ్చు. శరీరానికి సరిపడా మాంసకృత్తులు, పీచుపదార్థం జొన్నల ద్వారా పొందవచ్చు. ఒక కప్పు జొన్నల్లో 12 గ్రాముల ఫైబర్ ఉంటుంది. పిల్లలకు రోజుకి అవసరమైన పీచులో ఇది 48%. కాబట్టి జొన్న వడలను మార్నింగ్ లేదా ఈవినింగ్ స్నాక్‌గా పిల్లలకు ఇవ్వాలి. వీటిని ఎలా తయారు చేయాలంటే...



కావలసిన పదార్థాలు:

జొన్న పిండి - 1 కప్పు
శనగపిండి - అర కప్పు
అల్లం తురుము - అర టీస్పూను
వెల్లుల్లి తరుగు - 1 టీస్పూను
పెరుగు - 1 కప్పు
ఉప్పు, కారం, పసుపు - సరిపడా
నీళ్లు - తగినన్ని
నువ్వులు - 2 టీస్పూన్లు
నూనె - వేపుడుకు సరిపడా

తయారీ విధానం:

- పైన చెప్పిన పదార్థాలన్నీ టినీ గిన్నెలో వేసి నీళ్లు చేర్చి ముద్దలా కలుపుకోవాలి.
- గుండ్రంగా వడలు చేసుకుని పక్కన పెట్టుకోవాలి.
- బాండీలో నూనె పోసి వడలను ఎర్రగా వేయించుకోవాలి.
- కొబ్బరి లేదా అల్లం చట్నీతో వేడిగా వడ్డించాలి.

మేకప్

బ్యూటిఫుల్ బాడీ కోసం...

మేకప్ ముఖానికే పరిమితం చేస్తే, మరి చేతులు, పాదాల పరిస్థితేంటి? మన ముఖంతో పాటు శరీరం కూడా ఆకర్షణీయంగా కనిపించాలంటే బాడీ మేకప్ ఎంచుకోవాలి.

చర్మం నునుపుగా మెరుపులీనుతూ కనిపించేలా చేసే ఈ బాడీ మేకప్ పూర్తిగా శరీరానికే పరిమితం. పొట్టి దుస్తులు ధరించినా, ఆకర్షణీయమైన మేజోళ్లు ధరించినా, టాప్‌లెస్ డ్రస్సులు ధరించినా ఎబ్బెట్టుగా కనిపించకుండా ఉండడం కోసం సెలబ్రిటీలు ఈ బాడీ మేకప్‌ను ఎంచుకుంటూ ఉంటారు.

- **రెండింటికీ తేడా:** ముఖానికి వేసుకునే మేకప్ పలుచగా, ఎక్కువ మెరుపును కలిగి ఉంటుంది. బాడీ మేకప్ మందంగా ఉండడంతో పాటు, పిగ్మెంట్‌ను కూడా కలిగి ఉంటుంది.
- **దుస్తులకు అంటుకోదు:** ముఖానికి మేకప్ వేసుకుంటే పొరపాటున చెరిగిపోతుందేమోనని కంగారు పడుతూ ఉంటాం. కానీ బాడీ మేకప్ అలా కాదు. ఇది దుస్తులకు అంటుకోదు. అయితే ఎక్కువగా చమట పట్టే తత్వం ఉన్నవాళ్ల మేకప్ చెరిగినా దుస్తులకు అంటుకున్నట్టు కనిపించకుండా ఉండడం కోసం లేత రంగు దుస్తులను ధరించడం మేలు.



ఇలా ఎంచుకోవాలి

- ఫేసియల్ మేకప్ ఐటమ్స్‌ను ఎంచుకునేటప్పుడు అనుసరించే నియమాలనే బాడీ మేకప్ ఎంచుకునేటప్పుడు కూడా అనుసరించాలి. బాడీ మేకప్‌లో భాగంగా ఎంచుకునే ఫౌండేషన్లు, కన్‌సీలర్లూ నాణ్యమైనవే అయి ఉండాలి.
- చర్మపు రంగుకు దగ్గరగా ఉండే బాడీ మేకప్ ఎంచుకోవాలి. లేత గులాబీ రంగు చర్మం కలిగినవాళ్లు, బీజ్, క్రీమ్ షేడ్స్ ఎంచుకోవాలి. ఐవరీ, బఫ్, ట్యాన్ బాడీ షేడ్స్ కూడా బాగుంటాయి.
- బాడీ బ్రాంజర్లు, బాడీ హైలైటర్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. చర్మపు రంగుకు దగ్గరగా ఉండేవాటినే ఎంచుకోవాలి.
- ఆయిల్ ఫ్రీ, వాటర్ ప్రూఫ్... ఈ రెండు పేర్లు ఉన్న వాటినే ఎంచుకోవాలి.

మేకప్‌కు ముందు

- చర్మానికి నాణ్యమైన మాయిశ్చరైజర్ అప్లై చేసుకోవాలి.
- పగుళ్లు, గాయాలు లాంటివి లేకుండా చూసుకోవాలి.
- మానిక్యూర్, పెడిక్యూర్ చేయించుకోవాలి.
- బాడీ స్క్రబ్బింగ్ లేదా బాడీ పాలిషింగ్‌తో చర్మం మరింత మెరుస్తుంది.
- వ్యాక్సింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/DtzukOV లో చదవండి.

సెలబ్ ఫిట్



కెరీర్‌కు శ్రీకారం చుట్టింది తెలుగులోనే అయినా...
'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'తో దిశా పటానీ స్టోరీనే మారిపోయింది.
ఆ చిత్రం ఇచ్చిన విజయం... వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది.
నాజూకైన రూపం.. గమ్మత్తయిన చూపులు.. దిశ అభిమానుల హృదయ సామ్రాజ్ఞి అయింది.
'ఇప్పుడు మీరు చూస్తున్న నా ఈ రూపం రాత్రికి రాత్రి వచ్చింది కాదు. దాని వెనుక కొన్నేళ్ల శ్రమ ఉంది' అంటున్న దిశ 'వర్కవుట్' ఇది..

దిశ.. మెరుపుతీగలా

వరుణ్‌తేజ్ హీరోగా వచ్చిన 'లోఫర్' చిత్రంతో వెండితెరకు పరిచయమైంది దిశా పటానీ. మరుసటి ఏడాదే మంచి బ్రేక్ వచ్చింది. భారత క్రికెట్ జట్టు మాజీ సారథి ఎంఎస్ ధోనీ జీవి కథ ఆధారంగా తీసిన 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ'లో సుశాంత్‌సింగ్ రాజ్‌పుట్ సరసన నటించిన దిశ... ఒక్కసారిగా స్టార్ హీరోయిన్ అయిపోయింది. బాలీవుడ్‌లోనే కాకుండా ఓ చైనీస్ చిత్రంలోనూ అవకాశం దక్కించుకుంది. ఉత్తరప్రదేశ్ బరేలీలో పుట్టిన దిశ... అమినిటీ యూనివర్సిటీ నుంచి డిగ్రీ పట్టా పొందింది. ఆమె తండ్రి జగదీశ్‌సింగ్ పోలీస్ అధికారి. తల్లి హెల్త్ ఇన్‌స్పెక్టర్. అక్క కుష్బూ భారత సైన్యంలో లెఫ్టినెంట్. తమ్ముడు సూర్యాంశ్. గ్లామర్ ప్రపంచం మీద ఉన్న ఆసక్తితో అందాల పోటీల్లో పాల్గొంది. హీరో టైగర్ షరాఫ్‌తో కలిసి ఓ మ్యూజిక్ వీడియోలో నటించిన దిశ... ఆ తరువాత అతనితో కలిసి 'భాగీ2', 'భాగీ3' చేసింది. ప్రస్తుతం ఆమె చేతిలో నాలుగు చిత్రాలు ఉన్నాయి. వాటిల్లో ఒకటి ప్రభాస్‌తో, మరొకటి తమిళ హీరో సూర్యాతో నటిస్తోంది. ఈ రెండూ భారీ బడ్జెట్ సినిమాలు. సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పుడూ అభిమానులతో టచ్‌లో ఉండే ఆమెకు ఫాలోయింగ్ కూడా తక్కువేం లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆరు కోట్ల మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. పని ఒత్తిడిలో ఎంత బిజీ అయినా... వ్యాయామానికి మాత్రం విరామం ఇవ్వదు ఈ బ్యూటీ. ఎందుకంటే అదే తనను ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంచుతుందంటుంది.

వర్కవుట్ ఇలా...

'క్రమం తప్పని వ్యాయామం, మితంగా ఆహారం... పర్‌ఫెక్ట్ ఫిజిక్ కావాలంటే ఇవే ప్రధానం. ఎప్పుడూ వర్కవుట్స్ కాకుండా రెగ్యులర్‌గా కొన్ని స్టంట్స్, నాట్యం కూడా చేస్తుంటాను. వాస్తవానికి నాకంటూ ఓ ఫిట్‌నెస్ మంత్రా అనేది లేదు. కానీ... రోజూ జిమ్‌లో కష్టపడతాను. అందరినీ నేను కోరేది ఏంటంటే... ఉదయం లేవగానే ముందు మంచం దిగండి. బయటకు వెళ్లండి. రన్నింగ్, జాగింగ్, జిమ్, డ్యాన్స్... ఏది నచ్చితే అది చేయండి. అప్పుడప్పుడు కాకుండా... ఏదైనా సరే దైనందిన జీవితంలో భాగం కావాలి. అన్నింటి కంటే ముఖ్యంగా ఆరోగ్యకరమైన పోషకాహారం తీసుకోవాలి. మనం ఎలా కనిపిస్తున్నామన్నదే కాదు... ఎంత ఆరోగ్యంగా, ఎంత సంతోషంగా ఉన్నామన్నది కూడా ముఖ్యం. నిత్యం వ్యాయామం, సరైన ఆహారపు అలవాట్లవల్ల ఇప్పటికిప్పుడు మీలో మీకు మార్పు కనిపించకపోవచ్చు. కానీ కొన్నేళ్ల తరువాత అది మీ జీవితాన్నే మార్చేస్తుంది' అంటూ ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది దిశ. సాధ్యమైనంతవరకు ఉదయం, సాయంత్రం జిమ్‌కు వెళుతుంది. ఇష్టంతో కష్టపడుతుంది.

- ఉదయం జిమ్‌కు వెళ్లగానే ముందుగా కార్డియో ఎక్సర్‌సైజ్‌లుంటాయి.
- ఆ తరువాత శారీరక దారుఢ్యం కోసం లైట్‌వెయిట్, కొన్ని రోజులు హెవీవెయిట్ ట్రైనింగ్.
- వ్యాయామాలతో పాటు రకరకాల యాక్టివిటీస్ కూడా ఉంటాయి. చేతులు, కాళ్లూ బలంగా తయారవడం కోసం, చువ్వలా ఫ్లెక్సిబిలిటీ కోసం జిమ్నాస్టిక్స్ సాధన.
- వీటితోపాటు సమయాన్ని బట్టి కిక్ బాక్సింగ్, డ్యాన్స్. 'నాట్యంతో మనసు పరవశిస్తుంది. రోజంతా ఉల్లాసంగా ఉంటుంది. నా ఫిట్‌నెస్ మెనూలో డ్యాన్స్ అతి ముఖ్యమైనది'.
- మనసిక ప్రశాంతతకు కనీసం అరగంట యోగా
- ఒకవేళ బరువు పెరిగితే... ఆ రోజు కసరత్తుల తీవ్రత ఇంకాస్త పెరుగుతుంది.
- ఏ కారణంగానైనా జిమ్‌కు వెళ్లలేకపోతే... ఇంట్లోనే ఓ గంట ట్రెడ్‌మిల్

'మన శరీరాన్ని సరైన ఆకృతిలో పెట్టుకోవడం... ఫిట్‌గా ఉండటం అందరికీ అవసరం. అప్పుడే ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండగలుగుతాం.'

ఇదీ మెనూ...

'నా డైట్ చాలా సింపుల్. పోషక విలువలు, పిండి పదార్థాలు గల ఆహారం తీసుకొంటాను. పోషకాహారం అంటే... కూరగాయలు, చికెన్, గుడ్లు వంటివి. చపాతీ లేదా అన్నంతో తింటాను. ఏం తిన్నా అందులో పోషక విలువలు ఉండేలా చూసుకోవాలి. వారాంతాల్లో ఎప్పుడైనా నాకు నచ్చినవన్నీ లాగించేస్తాను' అంటున్న దిశకు స్వీట్స్ బాగా ఇష్టం. పాన్ కేక్, ఐస్‌క్రీమ్స్ తెగ తింటుంది.

- ఉదయం వ్యాయామానికి ముందు గుడ్లు
- జిమ్ నుంచి రాగానే చికెన్/ గుడ్లు/ పన్నీర్‌తో కూడిన పోషకాహారం
- బ్రేక్‌ఫాస్ట్‌లో ఓట్స్‌తో పాలు లేదా మరేదైనా అల్పాహారం
- మధ్యాహ్నం సాధారణంగా బ్రౌన్ రైస్‌తో చికెన్
- రాత్రిపూట పోషకాలు పుష్కలంగా ఉండేవి చికెన్, గుడ్లు, సలాడ్స్ అప్పుడప్పుడు బ్రౌన్ రైస్
- స్నాక్స్ సమయంలో పండ్లు, పండ్ల రసాలు, బాదం, పీనట్స్, బాయిల్డ్ చికెన్

'మనం చేసే పని ఎంత ముఖ్యమో, నిద్ర కూడా అంతే ముఖ్యం. అందుకే కనీసం రోజుకు ఎనిమిది గంటలు నిద్ర పోతాను. రాత్రి త్వరగా పడుకుని, ఉదయం త్వరగా లేస్తాను'.



దధిక్షీరే సమేపక్వా త్వర్ధభాగావశేధితె!
అష్టమాంశాన్ క్షిపెత్తత్ర తండులాన్నిస్తుచాన్ స్తిలాన్!
ప్రియాలవనసాబ్జానాం మజ్జాం మాత్రాసమాం క్షిపేత్!
క్షీరాదర్ధ ఘృతం చైవ శర్కరాం చ తథాన్యసేత్!
సిద్ధె త్రికటుకోపేతః కర్పూరేణాదివాసితః!
ఏవమ విష్యందనోనామ దేవలోకేపి దుర్లభః!
యస్మిన్ పక్వేపిహి ఘృతం స్యందతె సర్వతోముఖమ్!

విష్యందనం అనే పాయసం

'విష్యందనం' అనే పాయసం దేవతలకు కూడా దొరకదంటూ దీని తయారీని వివరించాడు క్షేమశర్మ. 'విష్యందనం' అంటే చుక్కలు చుక్కలుగా పడేదని, ప్రవహించేదని అర్థాలు. ఇప్పుడు మనం వండబోయేది అలా ఉండాలన్నమాట. ఇది గుండెకి మంచిదని, బలకరమైనదని, పిల్లలకు పెడితే ఎదుగుదల బావుంటుందనీ, పురుషుల్లో జీవకణాలు పెరుగుతాయనీ, వాతాన్ని, వేడినీ తగ్గిస్తుందనీ దీని ప్రభావాన్ని తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో వివరించాడు క్షేమశర్మ.

పాయసానికి ఇవి సాధారణ గుణాలే! కానీ విష్యందనం తక్కిన పాయసాలకన్నా ప్రత్యేకమైంది. దీన్ని ఎలా తయారు చేసుకోవాలో చూద్దాం.

- ఒక కప్పు పాలు, అదే గ్లాసుతో మజ్జిగ తీసుకోండి. రెండింటినీ కలిపి సన్న సెగన బాగా కలుపుతూ మరిగించాలి. సగానికి సగం మరిగేంతసేపు దగ్గరే ఉండి కలుపుతూ ఉండాలి.
- ఇప్పుడు అదే కప్పులో నాలుగో వంతు దంపుడు బియ్యం లేదా పట్టు తక్కువ బియ్యం ఈ మరుగుతున్న పాలలో కలపండి. పావు కప్పు పొట్టు తీసిన నువ్వుపప్పు కూడా అందులో కలపండి. ఇవి రెండూ 3-4 చెంచాలకన్నా ఎక్కువ పట్టవు.
- పాలలో బియ్యం, నువ్వుపప్పు చక్కగా ఉడికి మెత్తగా అన్నం తయారవుతుంది. ఇది ఒక విధంగా చక్కెరపొంగలి లాంటిదే.
- ఇందులో అదే కప్పులో సగం నెయ్యి, సగం పంచదార కలిపి ఉడికించండి.
- చక్కగా ఉడికిన తరువాత అందులో శొంఠి, పిప్పళ్లు, మిరియాల పొడిని తగినంత కలపండి.
- స్టవ్ ఆర్పేశాక కొద్ది సేపు ఆగితే ఈ విష్యందనం చల్లారుతుంది. అప్పుడు చిటికెడంత పచ్చకర్పూరం కలిపితే పరిమళభరితంగా ఉంటుంది.



ఇలా తయారైన విష్యందనంలో జీర్ణకోశాన్ని బాగు చేసి, జీర్ణశక్తిని పెంచే గుణమే ప్రధానంగా ఉన్నదని క్షేమశర్మ పేర్కొన్నాడు.

పాలలో మజ్జిగని గానీ, మజ్జిగలో పాలు గానీ కలిపి తీసుకోకూడదని, అది విరుద్ధాహారం అవుతుందని ఆయుర్వేద శాస్త్రం చెప్పింది. మజ్జిగ పులిసిందని, అందులో పాలు కలుపుకొని తినటం విరుద్ధాహారం అవుతుంది. పెరుగన్నం తినగానే పాలతో చేసిన ఐస్ క్రీమ్ తినటం విరుద్ధాహారం. పెరుగు ఆవడ తినగానే కాఫీయో టీయో తాగటం విరుద్ధాహారం.

పాలు, మజ్జిగ కలిపి తయారు చేసిన వంటకాలు, పానీయాలు మనకు అనేకం ఉన్నాయి. ఉదాహరణకు 'రసాల' అనే తీపి లస్సీని పాలు, మజ్జిగలను బాగా చిలుకుతూ తయారు చేస్తారు. ఉత్తరాదిలో దీని వాడకం ఎక్కువ. ఈ విష్యందనం కూడా అటువంటి వంటకమే.

కేవలం పాలతోనే ఈ విష్యందనాన్ని కాయవచ్చు కదా... మధ్యలో ఈ మజ్జిగని కలపటం దేనికి అనే ప్రశ్నకి ఒక సమాధానం ఉంది. 'లాక్టో బాసిలై' అనే ఉపయోగపడే బాక్టీరియా కోసం మనం పెరుగుని, మజ్జిగనీ వాడుతున్నాం. ఈ లాక్టో బాసిలై పాలని... పెరుగులా మారుస్తుంది. లాక్టిక్ యాసిడ్ వలన ఆ పెరుగుకి పుల్లదనం కలుగుతుంది. పొయ్యి మీద కాచినందువల్ల మజ్జిగలోని ఈ బాక్టీరియా నశించిపోయినా, లాక్టిక్ యాసిడ్ అలానే ఉండిపోతుంది. పాలతో కాచిన పాయసంలో లేని లాక్టిక్ యాసిడ్... మజ్జిగ కలిపి కాచిన ఈ విష్యందనంలో ఉంటుంది. లాక్టిక్ యాసిడ్ శరీరానికి చాలా మేలు చేస్తుంది. కొన్ని రకాల పోషకాలు వంటబట్టేందుకు ఇది సహకరిస్తుంది. కొవ్వును తగ్గిస్తుంది. పేగులను బలపరుస్తుంది. కొన్ని రకాల కేన్సర్లకు కూడా ఇది ఔషధంగా పనిచేస్తుంది.

పాలలో మజ్జిగ కలిపితే ఆ పాలు పెరుగులా తోడుకుంటాయి. మజ్జిగలో పాలు కలిపితే... ఆ మజ్జిగ కూడా పెరుగులా తోడుకుంటుంది. కానీ, పాలనూ మజ్జిగనూ కలిపి సగానికి మరిగేంతసేపు కాస్తే, మజ్జిగలోని ఉపయోగపడే బాక్టీరియా చచ్చిపోతుంది కాబట్టి, వాటితో వండిన పాయసం పెరుగులా తోడుకోదు. పాలు, మజ్జిగ కలిపి తయారు చేసిన స్వీట్ లస్సీ లేదా సాల్ట్ లస్సీ కూడా చేసిన వెంటనే తాగితే పెరుగులా తోడుకోదు. లేదా ఫ్రిజ్జులో పెట్టుకున్నా తోడుకోదు. మిల్క్ అండ్ బటర్‌మిల్క్ బిస్కట్స్ తయారు చేస్తున్నారు. నిమ్మరసం, పాలు కలిపి విరిగిన గుజ్జుతో రసగుల్లాలు చేస్తున్నారు.

ఆధునిక ఆహార శాస్త్రవేత్తలు, ఆయుర్వేద పండితులు విష్యందనం లాంటి వంటకాల తయారీ గురించి, వాటి ఆరోగ్య ప్రభావం గురించి సైన్సు పరంగా విశ్లేషించిన సందర్భాలు లేవు. ఎవ్వరూ ఇలాంటి ప్రజోపయోగకర అంశాలమీద దృష్టి సారించలేదు. క్షేమశర్మ 'క్షేమకుతూహలం' పరమ ప్రామాణిక గ్రంథం. అందులో ఈ విష్యందనం వంటకాన్ని... జీర్ణశక్తిని పెంచే ద్రవ్యాలలో ఒకటిగా పేర్కొన్నాడు.

• గంగరాజు అరుణాదేవి

సమ్మర్ కేర్



రోజురోజుకూ పెరుగుతున్న ఎండల్లో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు వైద్యులు. లేదంటే అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని చెబుతున్నారు. ఆ జాగ్రత్తలేంటంటే...

ఎండలో బయటకు వెళుతున్నారా..?

సమయానికి ఆహారం తీసుకోవాలి. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీళ్లు తాగాలి. ఎండలో ఉద్యోగాలకు, ఆటలకు వెళ్లేవారైతే మరో లీటరు అదనంగా తీసుకోవాలి. అంటే చమట రూపంలో శరీరం నుంచి బయటకు పోయే నీటిని తిరిగి శరీరానికి అందించాలనమాట. దాని వల్ల హైడ్రేషన్ సాధారణ స్థాయిలో ఉంటుంది. బయటకు వెళ్లేవారు నల్ల కళ్లద్దాలు, గొడుగు లేదా టోపీ పెట్టుకోవాలి. వదులైన, కాటన్ దుస్తులు ధరించాలి. టైట్‌గా ఉండే జీన్స్, పాలిస్టర్‌లాంటి దుస్తులకు సాధ్యమైనంతవరకు వేసవిలో దూరంగా ఉంటే మేలు. అలాగే చాలామంది ఎండలో నుంచి ఇంటికి రాగానే స్నానం చేయడం, లేదంటే చల్లనీళ్లతో ముఖం కడుక్కోవడం, ఫ్రిజ్‌లో నుంచి నీళ్లు తీసుకొని తాగడం చేస్తుంటారు. ఇది చాలా ప్రమాదకరం. ఎందుకంటే శరీర ఉష్ణోగ్రత ఎప్పుడూ బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలి. అలాకాకుండా ఒక్కసారిగా ఉష్ణోగ్రతలో మార్పు వస్తే శరీరం దాన్ని తట్టుకోలేదు. తలనొప్పి, జ్వరం, గొంతులో మంట లాంటి సమస్యలు వస్తాయి. బలహీనంగా, సున్నితంగా ఉన్నవారికైతే ఒక్కోసారి ప్రాణానికే ప్రమాదం ముంచుకురావచ్చు. కనుక ఎండలో నుంచి ఇంట్లోకి రాగానే... శరీరం సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చేవరకు రెండు మూడు నిమిషాలు విశ్రాంతినివ్వాలి. ఆ తరువాతనే నీళ్లు తాగడం కానీ, ముఖం కడుక్కోవడం కానీ చేయాలి. అదేవిధంగా గంటలతరబడి ఏసీలో కూర్చొని ఒక్కసారిగా ఎండలోకి వెళ్లడం కూడా సమస్యలను కొనితెచ్చుకోవడమే. క్రమంగా ఏసీని తగ్గించుకొని, కాసేపు ఏ బాల్కనీలోనో ఉండి, అప్పుడు బయటకు వెళ్లాలి.

అమిత్ షా కారుపై 'సీఏఏ'

నంబర్ ప్లేట్ వీడియో వైరల్



న్యూఢిల్లీ, మార్చి 1: కేంద్ర హోం మంత్రి అమిత్ షా కారు నంబరు వైరల్ అయింది. 'బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి షా పార్టీ కేంద్ర కార్యాలయానికి కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) సమావేశంలో పాల్గొనడానికి హాజరయ్యారు' అంటూ ఓ వీడియోను మీడియా సంస్థ ఒకటి తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. ఫిబ్రవరి 29న పోస్టు చేసిన ఆ వీడియోలో షా కారు నంబరు డీఎల్1సీఏఏ4421. దానిలో సీఏఏ (సిటిజెన్స్ అమెండ్‌మెంట్ యాక్ట్) అని ఉండడాన్ని గమనించిన ఎక్స్ ఖాతాదారు ఒకరు దానిని హైలైట్ చేస్తూ రీపోస్టు చేయడంతో అది వైరల్ అయింది. పోస్టు చేసి 24 గంటలు గడవక ముందే దానిని లక్ష మందికిపైగా వీక్షించారు. 2,300 మంది ఇష్టపడ్డారు. అనేక మంది తమ వ్యాఖ్యానాలను జోడించారు. 'దీని అర్థం సీఏఏని వారు తప్పనిసరిగా అమలు చేస్తారని' అని ఒక ఎక్స్ యూజర్ వ్యాఖ్యానించగా.. మరొకరు 'సీఏఏ వాళ్ల దృష్టిలో ఎప్పుడూ ఉంది' అని పేర్కొన్నారు. కాగా, మోడల్ కోడ్ అమలులోకి రాకమునుపే సీఏఏ విధివిధానాలను నోటిఫై చేస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేయనున్నదని సమాచారం.

ప్లే స్టోర్ నుంచి మ్యాట్రిమోనీ యాప్స్ తొలగింపు

» 10 సంస్థల యాప్‌లపై చర్య.. వీటిలో భారత్ మ్యాట్రిమోనీ

న్యూఢిల్లీ, మార్చి 1: సెర్చ్ ఇంజిన్ దిగ్గజం గూగుల్ చార్జీల చెల్లింపు వివాదంతో భారత్‌కు చెందిన పలు మ్యాట్రిమోనీ యాప్స్‌ను ప్లే స్టోర్ నుంచి తొలగించింది. బిల్లింగ్ నిబంధనలపై యాప్ డెవలపర్లతో విభేదాలు నెలకొన్న సమయంలో గూగుల్ తీసుకున్న చర్య స్టార్టప్ మార్కెట్‌లో తీవ్ర చర్చనీయాంశమైంది. శుక్రవారం ప్లే స్టోర్ నుంచి పది సంస్థల యాప్‌లను గూగుల్ తీసివేసింది. వీటిలో మ్యాట్రిమోనీ.కామ్‌కు చెందిన భారత్ మ్యాట్రిమోనీ, క్రిస్టియన్ మ్యాట్రిమోనీ, ముస్లిం మ్యాట్రిమోనీ, జోడీతో పాటు ఇన్ఫో ఎడ్జ్‌కు చెందిన జీవన్ సాథీ ఉన్నాయి. గతంలో గూగుల్ 15 నుంచి 30 శాతం చార్జీలను వసూలు చేసేది. అయితే, నియంత్రణ సంస్థల (యాంటీ ట్రస్ట్) ఆదేశాల అనంతరం 11 నుంచి 26 శాతం రుసుములు విధిస్తోంది. కానీ, ఈ చార్జీలను కూడా అడ్డుకునేందుకు కొన్ని స్టార్టప్ సంస్థలు ప్రయత్నించడం వివాదానికి కేంద్రమైంది. చార్జీల విధింపు, యాప్‌ల తొలగింపు విషయంలో గూగుల్‌కు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చింది. అనంతరం ప్లే స్టోర్ నిబంధనల ఉల్లంఘనపై భారత్ మ్యాట్రిమోనీ.కామ్, ఇన్ఫో ఎడ్జ్‌లకు గూగుల్ మాతృసంస్థ అల్ఫాబెట్ నోటీసులు పంపింది. వీటిని తాము పరిశీలిస్తున్నామని.. తదుపరి చర్యలపై ఆలోచిస్తున్నామని ఆయా సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. ఈలోగానే గూగుల్ చర్యలు తీసుకుంది. ఈ పరిణామాన్ని భారత ఇంటర్నెట్ చరిత్రలో చీకటి రోజుగా మ్యాట్రిమోనీ.కామ్ ఫౌండర్ మురుగవేల్ జానకీరామన్ అభివర్ణించారు.

లోకం తీరు



ఇప్పుడవన్నీ ఎందుకులే సార్..
అటు తిరిగి ఇటు తిరిగి మన మీదికే వస్తే కష్టం!

నేను సీఎంగా లేకపోతే..
చదువులు సాగవు!

» విద్యాదీవెన సభలో జగన్ బెదిరింపులు

మచిలీపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తాను సీఎం పదవి నుంచి తప్పుకొంటే రానున్న రోజుల్లో పిల్లల చదువులు సక్రమంగా సాగవని సీఎం జగన్ బెదిరింపులకు దిగారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం కొనసాగదని, విద్యారంగం గాలికి పోతుందని హెచ్చరించారు. 'అక్కచెల్లెమ్మల బతుకులు ఛిన్నాభిన్నమవుతాయి. వ్యవసాయం గాలికి పోతుంది. రైతన్నలు చతికిలపడిపోతారు. విద్యాదీవెన, వసతిదీవెన పథకాలు ఏమవుతాయో దేవుడికే తెలియాలి' అని వ్యాఖ్యానించారు. కృష్ణాజిల్లా పామర్రులో విద్యాదీవెన నిధులు జమ కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. రాష్ట్రంలో 9.44 లక్షల మంది విద్యార్థులకు విద్యాదీవెన ద్వారా రూ.708.68 కోట్లను బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలకు తోడుగా నిలబడి విద్యారంగంలో పెనుమార్పులు తెస్తుంటే పెత్తందారీ మనస్తత్వంతో ఉన్న కొందరు తనపై యుద్ధం ప్రకటించారని.. పేదలకు తోడుగా నిలబడి యుద్ధం చేస్తున్నది మీ అన్నేనని అన్నారు. తాను పదవి నుంచి వైదొలిగితే భవిష్యత్‌లో జరిగే నష్టమేంటో అందరూ తెలుసుకోవాలని చెప్పారు. ప్రతిపక్ష నాయకుడు, ఆయన దత్తపుత్రుడు రానున్నరోజుల్లో అనేక అబద్ధాలు చెబుతారని.. ప్రతి ఇంటికీ కేజీ బంగారం కొని ఇస్తామంటారని.. బెంజ్ కారు ఇస్తామని చెబుతారని, వారి మాటలు నమ్మవద్దని కోరారు. మంత్రులు బొత్స సత్యనారాయణ, మంత్రి జోగి రమేశ్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎదుట జగన్ రాజకీయ ప్రసంగం

మచిలీపట్నం/పామర్రు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): అది విద్యాదీవెన నిధుల విడుదల కార్యక్రమం.. సీఎం సభ కోసమంటూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ కాలేజీల నుంచి బస్సుల్లో విద్యార్థులను పామర్రుకు తీసుకొచ్చారు. దీనితో సంబంధం లేని డ్వాక్రా మహిళలను కూడా తరలించారు.. విద్యార్థుల ఎదుట జగన్ పక్కా రాజకీయ ప్రసంగం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టిన తనపై ప్రతిపక్ష నాయకుడు, ఆయన దత్తపుత్రుడితో కలసి యుద్ధం ప్రకటించారని చెప్పడంతో సభకు హాజరైనవారు విస్తుపోయారు. తాను సీఎం పదవి నుంచి దిగిపోతే విద్యాదీవెన, వసతి దీవెన అమలు జరగదని బెదిరింపులకు దిగడం, విద్యార్థుల ఎదుట రాజకీయ విమర్శలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. సభకు జగన్ దాదాపు గంట ఆలస్యంగా పామర్రు చేరుకున్నారు. సభావేదికకు కిలోమీటరున్నర దూరంలో ఉన్న హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో వచ్చారు. ఆయనకు స్వాగతం పలికేందుకు సుమారు రెండు గంటలపాటు విద్యార్థులను, డ్వాక్రా మహిళలను మండుటెండలో రోడ్డుకు ఇరుపక్కలా నిలబెట్టారు. వేదికకు 2-3 కిలోమీటర్ల దూరంలో వాహనాలను నిలిపివేయడంతో ఎండలోనే నడిచి రావలసి వచ్చింది. వచ్చాక కూడా ఎండలోనే నిలబెట్టడంతో అల్లాడిపోయారు. సభ ముగిసిన తర్వాత ఆటోలో వెళ్తుండగా తోట్లవల్లూరుకు చెందిన చీకుర్తి రమేశ్ (55) అనే వ్యక్తి గుండెపోటుతో మార్గమధ్యంలో మృతిచెందారు. సభకు సీఎం ఆలస్యంగా రావడంతో విసుగుచెందిన కొందరు విద్యార్థులు.. వేదిక కుడివైపున ఉన్న గ్యాలరీని తోసివేశారు. పోలీసులు వారిని పదేపదే నిలువరించాల్సి వచ్చింది. సభకు హాజరైనవారికి తాగునీరు కూడా సక్రమంగా సమకూర్చలేదు. విద్యార్థులకు స్నాక్స్ ప్యాకెట్లు ఇచ్చి సరిపెట్టారు. కార్యక్రమానికి అవనిగడ్డ, గన్నవరం శాసనసభ్యులు సింహాద్రి రమేశ్ బాబు, వల్లభనేని వంశీమోహన్ హాజరుకాలేదు.

రూ.39,125 కోట్లతో రక్షణ కొనుగోళ్లు

న్యూఢిల్లీ, మార్చి 1: త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసేందుకు రూ.39,125 కోట్లతో ఐదు భారీ రక్షణ సాధన కొనుగోలు ఒప్పందాలపై భారత్ శుక్రవారం సంతకాలు చేసింది. దీనిలో భాగంగా బ్రహ్మోస్ క్షిపణులు, రాడార్లు, ఆయుధ వ్యవస్థలు, ఏరో ఇంజన్లను సేకరించనున్నారు. బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్(బీఏపీఎల్)నుంచి రూ.19,519 కోట్లతో బ్రహ్మోస్ క్షిపణులు కొనుగోలు చేస్తారు. మరో రూ.988 కోట్లతో నౌకల్లో ఉపయోగించే బ్రహ్మోస్ వ్యవస్థను కొనుగోలు చేయనున్నారు. ఇక మిగ్-29 విమానాల కోసం ఆర్‌డీ-33 ఏరో ఇంజన్ల కొనుగోలుకు ప్రభుత్వ రంగ ఏరోస్పేస్ దిగ్గజం హెచ్ఏఎల్‌తో రక్షణశాఖ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ప్రాజెక్టు విలువ రూ.5,249.72 కోట్లు. రూ.7,688.82 కోట్లతో క్లోజ్ ఇన్ వెపన్ సిస్టమ్(సీఐడబ్ల్యూఎస్), రూ.5,700 కోట్ల వ్యయంతో హైపవర్ రాడార్ (హెచ్‌పీఆర్)లను కొనుగోలు చేయడానికి ఎల్‌అండ్‌టీ సంస్థతో ఒప్పందం కుదిరిందని రక్షణ శాఖ వెల్లడించింది.

రూ.2,000 నోట్లలో 97.62% తిరిగొచ్చాయ్..

» రూ.8,470 కోట్ల విలువైన నోట్లు ఇంకా ప్రజల వద్దనే

ముంబై, మార్చి 1: రూ.2వేల నోట్లలో దాదాపు 97.62% తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయని, అయితే రూ.8,470 కోట్ల విలువైన నోట్లు ఇంకా ప్రజల వద్దనే ఉన్నాయని ఆర్బీఐ శుక్రవారం వెల్లడించింది. పెద్ద నోట్ల రద్దు తర్వాత 2016 నవంబరులో రూ.2,000 నోటును ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు 2023 మే 19న ఆర్బీఐ ప్రకటించింది. అప్పటికి చలామణిలో ఉన్న ఈ నోట్ల విలువ రూ.3.56 లక్షల కోట్లుగా ఉంది. అయితే ఈ విలువ 2024 ఫిబ్రవరి 29 నాటికి రూ.8,470 కోట్లకు తగ్గిందని ఆర్బీఐ పేర్కొంది. రూ.2వేల నోట్లను ప్రజలు ఇంకా దేశవ్యాప్తంగా ఉన్న 19 ఆర్బీఐ కార్యాలయాల్లో మార్చుకోవడం లేదా ఖాతాల్లో డిపాజిట్ చేసుకోవచ్చని పేర్కొంది.

ఎన్నికల ప్రచారానికి ప్రార్థనా స్థలాలు వద్దు: ఈసీ

న్యూఢిల్లీ, మార్చి 1: ఆలయాలు, మసీదులు, చర్చిలు, గురుద్వారాలు ఇలా ఏ ప్రార్థనా స్థలాలనైనా ఎన్నికల ప్రచారం కోసం ఉపయోగించుకోవద్దని, వాటి పేరుతో ఓట్లు అడగవద్దని కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలకు సూచించింది. కులం, మతం, భాష పేరుతో ఓట్లు కోరవద్దని తెలిపింది. మరికొన్ని రోజుల్లో లోక్‌సభ, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రానున్న నేపథ్యంలో ఈ సూచనలు చేసింది. ఎవరి విశ్వాసాలనూ కించపర్చవద్దని పేర్కొంది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. అయోధ్యలో రామాలయ ప్రారంభాన్ని ప్రధాన ప్రచారాస్త్రంగా మలుచుకోవాలని బీజేపీ యోచిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం హెచ్చరికలు చర్చనీయాంశమయ్యాయి.


మార్చి నుంచే వడగాడ్పులు!

తెలుగు రాష్ట్రాలకు వాతావరణశాఖ హెచ్చరిక.. మే వరకు దేశంలో తీవ్ర ఎండలు

» జూన్ చివరి నాటికి ఎల్‌నినో బలహీనం

» నైరుతి ద్వితీయార్థంలో మంచి వర్షాలు





విశాఖపట్నం/హైదరాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): భూమధ్య రేఖకు ఆనుకుని పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం తీవ్రంగా ఉన్న ఎల్‌నినో పరిస్థితులు వేసవి చివరి వరకూ కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో పసిఫిక్‌లో ఉపరితల ఉష్ణోగ్రతలు వేడిగా ఉండనున్నందున ఆ దిశగా వచ్చే గాలులతో దేశంలో మార్చి నుంచి మే నెల వరకూ మూడు నెలలు ఎండలు తీవ్రంగా ఉంటాయి. అనేకచోట్ల పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ప్రత్యేకించి మార్చిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తర కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశాలో వడగాడ్పులు వీస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. వేసవి మూడు నెలలకు(మార్చి నుంచి మే వరకు) సంబంధించి బులెటిన్ విడుదల చేసింది. మార్చి నుంచి మే వరకూ దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. అదే సమయంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. దీంతోపాటు వడగాడ్పులు వీచే రోజుల సంఖ్యా ఎక్కువ కానున్నాయి. మార్చిలో దక్షిణాది రాష్ట్రాలు, మధ్యభారతంలోని పశ్చిమ ప్రాంతాలు, ఈశాన్య, వాయువ్య భారతంలో పగటి ఉష్ణోగ్రతలు, హిమాలయ ప్రాంతాలు తప్ప దేశంలోని మిగిలినచోట్ల రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. ఏపీ, తెలంగాణ, ఉత్తర కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశాలో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు ఇప్పటికే ఎక్కువగా నమోదుకావడంతో పాటు వేడి వాతావరణం నెలకొన్న విషయాన్ని వాతావరణ నిపుణులు గుర్తుచేస్తున్నారు. మార్చిలో దేశంలో వాయవ్య భారతం, కేరళ, కర్ణాటకతోపాటు ఈశాన్య రాష్ట్రాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. దీర్ఘకాలిక సగటులో 117% అంటే 29.9 మి.మీ. వర్షపాతం కురుస్తుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కాగా, వాయవ్య భారతంలో పంజాబ్, హరియాణా, రాజస్థాన్‌లో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉండడంతో గోధుమ దిగుబడి తగ్గుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఆగస్టు, సెప్టెంబరుల్లో మంచి వర్షాలు

పసిఫిక్‌లో ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్‌నినో వేసవి చివరి వరకు కొనసాగి తరువాత జూన్ నుంచి బలహీనపడి తటస్థ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయి. జూన్ నుంచి తటస్థ పరిస్థితులు ప్రారంభమై ఆగస్టు నాటికి లానినా మొదలవుతుందని అంతర్జాతీయ వాతావరణ మోడళ్లతోపాటు ఐఎండీ అంచనా వేస్తున్నాయి. దీంతో నాలుగు నెలల నైరుతి రుతుపవనాల సీజన్ రెండో భాగం అంటే ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేలకు మైక్రోచిప్‌లు పెట్టాలా?

» వారిపై నిరంతర పర్యవేక్షణ ఎలా సాధ్యం: జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ, మార్చి 1: ఎంపీలు, ఎమ్మెల్యేల కార్యకలాపాలను నిరంతరం డిజిటల్ మార్గాల ద్వారా పర్యవేక్షిస్తుండాలని కోరిన పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీలు, ఎమ్మెల్యేల భుజాలకు ఏమైనా మైక్రోచిప్స్ పెట్టాలా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత ఎంపీలు, ఎమ్మెల్యేలు రాజుల్లా వ్యవహరిస్తున్నారని, అందువల్ల వారి రోజువారీ కార్యక్రమాలన్నింటినీ సీసీటీవీ కెమేరాల్లో రికార్డు చేయించి పర్యవేక్షించాలని కోరుతూ సురేందర్ కుంద్రా అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఈ ఫుటేజీని ప్రజల మొబైల్ ఫోన్లను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇదేం పిటిషన్ అంటూ ప్రశ్నించిన జస్టిస్ చంద్రచూడ్..ఎంపీ, ఎమ్మెల్యేల భుజాలకు మైక్రోచిప్‌లు అమర్చాలా అని అడిగారు. వారికి మాత్రం ప్రైవసీ హక్కు ఉండదా అని ప్రశ్నించారు. ఇలాంటి పిటిషన్ వేసినందుకు రూ.5 లక్షల వరకు జరిమానా విధించవచ్చని అన్నారు. దీనిపై కుంద్రా స్పందిస్తూ 15 నిమిషాల సమయం ఇస్తే అంతా వివరిస్తానని చెప్పారు. అందుకు ప్రధాన న్యాయమూర్తి అనుమతి ఇచ్చారు. సమయానికి మించి మాట్లాడుతుండడంతో మధ్యలో ఆపి ప్రస్తుతానికయితే జరిమానా విధించడం లేదని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి పిటిషన్లు వేయకూడదని హెచ్చరించారు.

ఆశారాం బాపు శిక్ష రద్దుకు సుప్రీంకోర్టు తిరస్కరణ

న్యూఢిల్లీ, మార్చి 1: వృద్ధాప్యం, అనారోగ్య కారణాల దృష్ట్యా జైలు శిక్షను రద్దు చేయాలని కోరుతూ తనను తాను దేవునిగా చెప్పుకొనే ఆశారాం బాపు చేసిన వినతిని శుక్రవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. రేప్ కేసులో దోషిగా తేలిన ఆయన ప్రస్తుతం యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్నారు. పోలీసు కస్టడీలో ఉంటూ మహారాష్ట్రలోని ఖోపోలీలో ఉన్న మాధవ్‌బాగ్ హార్ట్ హాస్పిటల్‌లో చికిత్స పొందవచ్చంటూ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేసిన సూచనను అంగీకరించారని ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ కోర్టు దృష్టికి తెచ్చారు. అలా అయితే దీనిపై తొలుత రాజస్థాన్ హైకోర్టునే ఆశ్రయించాలని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాల ధర్మాసనం సూచించింది.

లక్షదీవుల్లో నౌకాదళం కొత్త స్థావరం

ఐఎన్ఎస్ జటాయు పేరుతో వచ్చే వారం ప్రారంభం

» హిందూ మహాసముద్రంలో శత్రువుల కదలికపై నిఘా కోసం ఏర్పాటు

» ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లపై జరిగే కమాండర్ల సదస్సులో స్థావరానికి పచ్చజెండా



న్యూఢిల్లీ, మార్చి 1: హిందూ మహాసముద్రంలో శత్రువుల సైనిక, వాణిజ్య పరమైన కార్యకలాపాలపై ఓ కన్నేసి ఉంచటానికి వీలుగా భారత నౌకాదళం.. ఐఎన్ఎస్ జటాయు పేరుతో లక్షదీవుల్లో ఒక కొత్త స్థావరాన్ని వచ్చే వారం ప్రారంభించనుంది. తొలుత కొద్దిమంది అధికారులు, సిబ్బందితో మొదలుపెట్టి ఆ తర్వాత దీనిని పూర్తిస్థాయిలో విస్తరించనుంది. లక్షదీవుల్లోని మినికాయ్ ద్వీపంలో ఈ స్థావరం ఉంటుందని రక్షణశాఖకు చెందిన ఒక అధికారి తెలిపినట్లుగా ఏఎన్ఐ వార్తాసంస్థ శుక్రవారం వెల్లడించింది. మాల్దీవులకు దాదాపు 80 కి.మీ.ల దూరంలో ఉండే ఈ స్థావరంతో నిఘాపై మరింత పట్టు పెరుగుతుందని ఆ అధికారి పేర్కొన్నారు. ప్రస్తుతం అండమాన్ నికోబార్ దీవుల్లో ఉన్న ఐఎన్ఎస్ బాజ్‌లాగే ఇది పని చేస్తుందని తెలిపారు. యుద్ధవిమాన వాహక నౌకలు ఐఎన్ఎస్ విక్రమాదిత్య, ఐఎన్ఎస్ విక్రాంత్‌లపై వచ్చే వారం సంయుక్తంగా నిర్వహించే కమాండర్ల సదస్సులో ఈ కొత్త స్థావరాన్ని ప్రారంభించాలని నౌకాదళం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సదస్సు సందర్భంగా ఉన్నతస్థాయి విన్యాసాలు చేపట్టనున్నారు. మరోవైపు, నాలుగు కొత్త ఎంహెచ్-60 రోమియో హెలికాప్టర్లు నౌకాదళంలో తమ సేవలను వచ్చే వారం కొచి నుంచి మొదలుపెట్టనున్నాయి. బహుళ ప్రయోజనార్థకంగా ఉండే ఈ హెలికాప్టర్లను అమెరికా నుంచి కొనుగోలు చేశారు. ఈ నెల 4వ తేదీన గోవాలో నౌకదళ యుద్ధ కళాశాలను కూడా ప్రారంభించనున్నారు.

మహిళల కన్నీళ్లకన్నా
ఓట్లే ముఖ్యమా?

» పశ్చిమ బెంగాల్‌లో మోదీ



కోల్‌కతాలోని రాజ్‌భవన్‌లో ప్రధాన మోదీతో మమత భేటీ

న్యూఢిల్లీ, మార్చి 1: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సందేశ్ ఖాళీలో బాధిత మహిళల కన్నీళ్లు తుడవడం కన్నా కొందరి ఓట్లే ముఖ్యమనుకొంటున్నారా... అని ఆ రాష్ట్ర ప్రజలు ప్రశ్నిస్తున్నారని ప్రధాని మోదీ చెప్పారు. మహిళల్ని లైంగికంగా వేధించిన కేసు, భూ ఆక్రమణల కేసులో అరెస్టయిన తృణమూల్ కాంగ్రెస్ నేత షేక్ షాజహాన్ అన్ని హద్దుల్ని దాటారని అయినా ఆయన్ను అరెస్టు చేయకుండా రెండు నెలలు కాపాడారని ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లోని ఆరాంబాగ్‌లో శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సందేశ్ ఖాళీ ఉదంతంపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేశారు. మా... మాటి... మానుష(తృణమూల్ కాంగ్రెస్ నినాదం) అనేవారు... సందేశ్ ఖాళీలో మహిళలకు చేసిన అన్యాయం చూసి దేశం యావత్తూ విస్తు పోయిందని చెప్పారు. తృణమూల్ నేత షాజహాన్ వేధింపుల్ని తట్టుకోలేక సందేశ్ ఖాళీ మహిళలు సాయం కోరితే... మమత, బెంగాల్ ప్రభుత్వం అతడిని కాపాడడానికి తమ అధికారాన్నంతా ఉపయోగించారని ఆరోపించారు. చివరికి బీజేపీ నేతల ఒత్తిడి వల్ల బెంగాల్ పోలీసులు గురువారం నిందితుల్ని అరెస్టు చేయక తప్పలేదని చెప్పారు. ప్రజలు తమకు తగిలిన ప్రతీ దెబ్బకు ఓటుతో జవాబు చెప్పాలన్నారు. ఇంత జరుగుతున్నా.. ఇండియా కూటమి నేతలు మహాత్ముడి మూడు కోతుల్లా తమ కళ్లు, చెవులు, నోరు మూసుకున్నారని ఎద్దేవా చేశారు. కాగా తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ కోల్‌కతాలోని రాజ్‌భవన్‌లో ప్రధాని మోదీని శుక్రవారం సాయంత్రం కలుసుకొన్నారు. మర్యాదపూర్వకంగానే ప్రధానిని కలిసినట్లు ఆమె విలేకరులకు చెప్పారు. కాగా జార్ఖండ్‌లో జేఎంఎం పార్టీ అవినీతికి పర్యాయపదంగా మారిందని ప్రధాని మోదీ ఆరోపించారు. జార్ఖండ్ రాష్ట్రంలోని బార్వాడలో నిర్వహించిన విజయ్ సంకల్ప్ మహా ర్యాలీలో మాట్లాడుతూ పాలకపక్షంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ రాష్ట్రంలో ప్రధాని శుక్రవారం రూ.35,700 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు.

మే 1 నుంచి సమ్మె తప్పదు

» పాత పింఛను కోసం డిమాండ్ చేస్తూ కేంద్ర ప్రభుత్వానికి రైల్వే సంఘాల హెచ్చరిక

» మార్చి 19న రైల్వే శాఖకు సమ్మె నోటీసు!

» 'కొత్త పెన్షన్' ఎత్తివేయాల్సిందే: జేఎఫ్ఆర్ఓపీఎస్



న్యూఢిల్లీ, మార్చి 1: కేంద్ర ప్రభుత్వానికి మరో తలనొప్పి తప్పదా? కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలంటూ ఇప్పటికే ఢిల్లీ శివార్లలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న దశలో రైల్వే యూనియన్లు కూడా ఆందోళన బాట పడతామని కేంద్రాన్ని హెచ్చరించాయి. కొత్త పెన్షన్ విధానాన్ని ఎత్తివేసి.. పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలని, లేదంటే మే నెల 1వ తేదీ నుంచి సమ్మెబాట పడతామని, ఇదే జరిగితే అన్ని రైళ్ల సేవలు నిలిచిపోయే అవకాశాలున్నాయని పలు సంఘాలు హెచ్చరించాయి. ఈ మేరకు రైల్వే శాఖకు మార్చి 19న రైల్వే సంఘాల ఆధ్వర్యంలో రైల్వే ఉద్యోగులు సమ్మె నోటీసు ఇవ్వనున్నారు. సమ్మె కోసం ప్రకటించిన మే నెల ఒకటో తారీఖు 'అంతర్జాతీయ కార్మిక దినోత్సవం' కావడం విశేషం. సమ్మె అనివార్యమైతే గనక దాన్ని "పాత పెన్షన్ విధాన పునరుద్ధరణ సంయుక్త సమాఖ్య (జేఎఫ్ఆర్ఓపీఎస్) అన్నీతానై నిర్వహించే అవకాశాలున్నాయి. కొత్త పెన్షన్ విధానాన్ని ఎత్తివేసి, పాత పెన్షన్ విధానాన్ని తేవాలనే డిమాండ్‌ను కేంద్రం పట్టించుకోవడం లేదని జేఎఫ్ఆర్ఓపీఎస్ కన్వీనర్ శివ్ గోపాల్ మిశ్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితంగా 'ప్రత్యక్ష కార్యాచరణ'కు దిగడం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని పేర్కొన్నారు. జేఎఫ్ఆర్ఓపీఎస్‌లో ఇతర విభాగాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులూ ఉన్నారని, రైల్వే ఉద్యోగులతో కలిసి వారంతా సమ్మెకు కదులుతారని హెచ్చరించారు. ఉద్యోగుల సంక్షేమానికి కొత్త పెన్షన్ విధానంతో ప్రయోజనం లేదని, పాత పెన్షన్ విధానమైతేనే మేలు జరుగుతుందనేది జేఎఫ్ఆర్ఓపీఎస్ ప్రగాఢంగా విశ్వసిస్తోందని స్పష్టం చేశారు. సాధారణంగా వేసవి సెలవుల్లో చాలామంది తమ కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి విహార, ఆధ్యాత్మిక యాత్రల కోసం ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఇది మే నెలలో ఎక్కువగా ఉంటుంది. ఒకవేళ.. రైల్వే సంఘాల ప్రతిపాదిత సమ్మె మే 1 నుంచి అమలైతే గనక రైలు సేవలకు తీవ్ర విఘాతం కలిగి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయి అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

ఏలూరులో అర్ధరాత్రి వైసీపీ అరాచకం

ఏలూరు క్రైం, మార్చి 1: వైసీపీ నాయకుల అండతో లక్షలాది రూపాయల విలువైన ఓ ఇంటి స్థలాన్ని కబ్జా చేయడానికి ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి పథకం పన్నాడు. ఆ స్థలం పదేళ్లుగా లీజుకు తనకు ఇచ్చారని, వెంటనే ఖాళీ చేయాలని... రిజిస్ట్రేషన్ కల్గి ఉండి ఆ స్థలంలో రేకుల షెడ్డు ఇంటిలో నివాసం ఉంటున్న ఓ కుటుంబంపై అర్ధరాత్రి వేళ వైసీపీ రౌడీమూకలతో దాడిచేశారు. ఈ ఘటనతో ఆ ఇంట్లోని మహిళ తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివీ.. జిల్లా కేంద్రమైన ఏలూరు శ్రీరామ్‌నగర్ 11వ రోడ్డులో ఆర్ఎస్‌నెంబర్ 35/3లో 336 చదరపు గజాల ఇంటి స్థలం నరాలశెట్టి వరలక్ష్మి పేరు మీద రిజిస్టర్ అయి ఉంది. ఆ స్థలాన్ని 2023 జూన్ 22న తన కుమార్తె పైడికొండల లక్ష్మీకుమారి (48) పేరు మీద ఆమె రిజిస్ట్రేషన్ చేయించారు. లక్ష్మీకుమారి, తన భర్త శ్రీనివాస్, కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో కలిసి ఆ స్థలంలో మూడేళ్లుగా ఇల్లు ఏర్పాటుచేసుకుని ఉంటున్నారు. ఒక కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మరో కుమార్తె డిగ్రీ పూర్తి చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతోంది. కాగా, అదే ప్రాంతానికి చెందిన రియల్ వ్యాపారి జొన్నకూటి రామ్మోహనరావు ఆ స్థలంపై కన్నేశారు. తనకు పదేళ్లకు లీజు ఇచ్చారని ఆ స్థలం తాను స్వాధీనం చేసుకుంటానని ఇల్లు ఖాళీ చేయాలని కొంత కాలంగా బెదిరింపులకు పాల్పడుతున్నారు. దీంతో బాధితురాలు సివిల్ కోర్టులో కేసు వేశారు. కేసులో కోర్టులో ఉన్నందున మూడు నెలల వరకు ఆ స్థలం పరిధిలో రక్షణ చర్యలు తీసుకోవాలని పోలీసులను ఎమ్మార్వో ఆదేశించారు. అయినా.. రామ్మోహనరావు గురువారం అర్ధరాత్రి మరికొందరితో కలిసి వచ్చి.. దౌర్జన్యానికి పాల్పడ్డారు. మరునాడు, శుక్రవారం ఉదయం వైసీపీ నాయకుల వేధింపులు భరించలేక లక్ష్మీకుమారి బలవ్మరణానికి యత్నించారు. ప్రస్తుతం ఆమెకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా, పక్కా రిజిస్టర్ డాక్యుమెంట్లు తమ వద్ద ఉండగా, అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్స్‌తో రామ్మోహనరావు, వైసీపీ నాయకులు తమను వేధిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ ఫిర్యాదు తీసుకుని పోలీసులు కేసు నమోదు చేయడంలేదని తెలిపారు.

రామేశ్వరం కేఫ్‌లో పేలుడు

పది మందికి గాయాలు

బెంగళూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరంలోని కుందలహళ్ళి సమీపంలో ఉన్న రామేశ్వరం కేఫ్‌లో శుక్రవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో మొత్తం పది మంది గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు... హోటల్ రద్దీగా ఉన్న సమయంలోనే మధ్యాహ్నం ఒంటిగంటకు రెండుసార్లు పేలుడు సంభవించింది. దీంతో కస్టమర్లతో పాటు హోటల్ సిబ్బంది బయటకు పరుగులు తీశారు. భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కేఫ్‌కు రెండు బ్యాగులతో వచ్చినవారు వాష్‌బేసిన్ వద్ద ఓ బ్యాగును వదిలి వెళ్లినట్లు గుర్తించారు. అక్కడే పేలుడు సంభవించింది. ఘటన జరిగిన ప్రాంతంలో బ్యాటరీ, వైర్లు, మేకులు, ఐడీ కార్డుకు సంబంధించిన ట్యాగ్ తదితర వస్తువులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్కడికి సమీపంలోనే మరో బ్యాగును కూడా గుర్తించారు. ఎన్ఐఏ, సీసీబీ, ఇంటెలిజెన్స్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించాయి. కేఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేఫ్‌లో పేలుడు జరిగినట్లు గుర్తించామని, మరిన్ని వివరాల కోసం సోదాలు చేస్తున్నామని డీజీపీ అలోక్ మోహన్ తెలిపారు. గాయపడ్డవారిలో ఒకరి పరిస్థితి కొంత విషమంగా ఉందని వివరించారు. కాగా, రామేశ్వరం కేఫ్‌లో పేలుడును తీవ్రంగా పరిగణిస్తున్నామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం సిద్దరామయ్య అన్నారు. అయితే దీన్ని ఉగ్రవాద చర్యగా ప్రకటించలేమన్నారు. పథకం ప్రకారమే పేలుళ్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా గుర్తించామని పేర్కొన్నారు. కాగా, కేఫ్‌లో బ్యాగ్ పెట్టిన వ్యక్తిని సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తించామని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తెలిపారు.

పది సెకన్ల వ్యవధిలో పేలుళ్లు: కేఫ్ ఎండీ

పది సెకన్ల వ్యవధిలో రెండుసార్లు పేలుడు జరిగిందని రామేశ్వరం కేఫ్ మేనేజింగ్ డైరెక్టర్ దివ్య తెలిపారు. బయట నుంచి వచ్చిన వ్యక్తి బ్యాగు తీసుకొచ్చి లోపల పెట్టారని తెలిపారు. కస్టమర్లు వాష్‌బేసిన్‌కు వెళ్లేచోట 12.55గంటలకు పేలుడు జరిగిందని, ఆ బ్యాగు విషయంలో తమకు అనుమానం ఉందన్నారు. గతంలోనూ రెండుసార్లు తమ కేఫ్‌లో అనుమానాస్పద బ్యాగులను గుర్తించామని, ఒక బ్యాగును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని దివ్య వివరించారు.

'గ్రేస్' షో

- హ్యారిస్ హాఫ్ సెంచరీ
- యూపీదే విజయం
- గుజరాత్‌కు హ్యాట్రిక్ ఓటమి



డబ్ల్యూపీఎల్‌లో నేడు
బెంగళూరు X ముంబై
రాత్రి 7.30 గం. నుంచి

గ్రేస్ హ్యారిస్ (60 నాటౌట్)

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్‌లో యూపీ వారియర్స్ విజయాల బాట పట్టింది. గ్రేస్ హ్యారిస్ (33 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 60 నాటౌట్) మరోసారి తన ఫామ్‌ను చాటుకుంటూ అజేయ అర్ధసెంచరీతో నిలువగా, శుక్రవారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో యూపీ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. ఆరంభ రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఈ జట్టుకిది వరుసగా రెండో విజయం కావడం గమనార్హం. అటు గుజరాత్ మాత్రం హ్యాట్రిక్ ఓటములతో డీలా పడింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 142 పరుగులు చేసింది. స్పిన్నర్ ఎకెల్‌స్టోన్ (3/20) కట్టుదిట్టమైన బంతులకు జెయింట్స్ పరుగుల కోసం తడబడింది. ముందుగా ఓపెనర్లు వోల్వార్ట్ (28), కెప్టెన్ మూనీ (16)లను తను పెవిలియన్‌కు చేర్చింది. అటు హర్లీన్ (18) నిదానంగా ఆడడంతో ఒత్తిడి పెరిగింది. ఈ స్థితిలో మిడిలార్డర్ బ్యాటర్లు లిచ్‌ఫీల్డ్ (35), గార్డ్‌నర్ (30) ఎదురుదాడి లక్ష్యంగా పరుగులు రాబట్టారు. 18వ ఓవర్‌లో గార్డ్‌నర్ రెండు ఫోర్లు, లిచ్‌ఫీల్డ్ సిక్సర్‌తో 19 రన్స్ సమకూరాయి. అయితే తర్వాతి ఓవర్‌లోనే ఈ ఇద్దరూ వెనుదిరిగినా జట్టు గౌరవప్రదమైన స్కోరు సాధించగలిగింది.

యూపీ జోరు: స్వల్ప ఛేదనను ధాటిగా ఆరంభించిన యూపీ 15.4 ఓవర్లలో 143/4 స్కోరుతో నెగ్గింది. లెఫ్టామ్ స్పిన్నర్ తనూజ కన్వర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఓపెనర్ కిరణ్ నవ్‌గిరె (12) విఫలమైనా, కెప్టెన్ హీలీ (33) వేగంగా ఆడింది. తద్వారా తొలి వికెట్‌కు 4.3 ఓవర్లలోనే 42 పరుగులు జత చేరాయి. పవర్‌ప్లేలోనే ఈ ఇద్దరూ వెనుదిరిగినా జట్టు ఇబ్బందిపడలేదు. చమరి (17) నాలుగు ఫోర్లతో ఆకట్టుకుంది. చివర్లో హ్యారిస్, దీప్తి శర్మ (17 నాటౌట్) జోడీ తమ క్రితం మ్యాచ్ మాదిరే భారీ షాట్లతో చెలరేగుతూ తుదికంటా నిలిచి జట్టుకు ఘనవిజయాన్నందించారు.

సంక్షిప్త స్కోర్లు
గుజరాత్ జెయింట్స్: 20 ఓవర్లలో 142/5 (లిచ్‌ఫీల్డ్ 35, గార్డ్‌నర్ 30, వోల్వార్ట్ 28; ఎకెల్‌స్టోన్ 3/20); **యూపీ వారియర్స్:** 15.4 ఓవర్లలో 143/4 (హ్యారిస్ 60 నాటౌట్, హీలీ 33, దీప్తి శర్మ 17 నాటౌట్; తనూజ 2/23).



ఎకెల్‌స్టోన్ (3/20)

అనుక్ష హ్యాట్రిక్

- భూటాన్‌పై భారత్ సూపర్ విన్
- శాఫ్ అండర్-16 ఫుట్‌బాల్

ఖాట్మండు: శాఫ్ అండర్-16 మహిళల చాంపియన్‌షిప్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు అదరగొట్టింది. అనుక్ష కుమారి హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగడంతో భారత్ 7-0తో భూటాన్‌పై భారీ విజయం సాధించింది. మిగతా క్రీడాకారిణుల్లో పెర్ల్ ఫెర్నాండెజ్ రెండు గోల్స్ చేయగా.. శ్వేతా రాణి, అన్విత చెరో గోల్ కొట్టారు. నాలుగు దేశాల ఈ టోర్నీలో ఆతిథ్య నేపాల్, బంగ్లాదేశ్ పోటీలో ఉన్న మిగతా రెండు జట్లు.

దేశవాళీలో అమ్మాయిలకూ రెడ్‌బాల్ టోర్నీ

28 నుంచి పుణెలో సీనియర్ ఇంటర్ జోనల్

న్యూఢిల్లీ: దేశవాళీ క్రికెట్‌పై ప్రత్యేక దృష్టి సారించిన బీసీసీఐ.. తాజాగా మహిళలనూ రెడ్‌బాల్ టోర్నీలో ఆడించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆరేళ్ల తర్వాత తొలిసారిగా సీనియర్ ఇంటర్ జోనల్ మల్టీ-డే ట్రోఫీని నిర్వహించేందుకు సిద్ధమైంది. డబ్ల్యూపీఎల్ ముగిసిన పదిరోజుల తర్వాత అంటే.. ఈనెల 28నుంచి పుణె వేదికగా ఈ టోర్నీ జరగనుంది. ఇటీవల భారత మహిళల జట్టు ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌తో టెస్టు మ్యాచ్‌లు ఆడింది. భవిష్యత్‌లోనూ మహిళలకు వీలైనన్ని ఎక్కువ టెస్టులు నిర్వహించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలో సుదీర్ఘ ఫార్మాట్‌లో మరింత ప్రాక్టీస్ కోసం మహిళలకు రెడ్‌బాల్ టోర్నీలు నిర్వహించాలనుకుంటోంది. మహిళలు చివరిసారిగా 2018లో దేశవాళీల్లో రెడ్‌బాల్ క్రికెట్ ఆడారు. అప్పుడు రెండురోజుల మ్యాచ్‌ల్లో తలపడ్డారు. ఈసారి టోర్నీ మూడురోజుల పాటు జరగనుంది. ఆరు జట్లు (ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్, సెంట్రల్, నార్త్-ఈస్ట్ జోన్) పోటీపడే ఈ టోర్నీలో లీగ్ దశ, క్వార్టర్‌ఫైనల్, సెమీఫైనల్స్ ఉంటాయి. ఫైనల్ ఏప్రిల్ 9న జరుగుతుంది.



పుణెరి పట్టేసింది

ప్రొ కబడ్డీ నయా చాంప్ పల్టన్

- ఉత్కంఠ ఫైనల్లో హరియాణాపై గెలుపు
- ఉత్తమ రైడర్‌గా అషు, డిఫెండర్‌గా రీజా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ సీజన్-10 టైటిల్‌ను పుణెరి పల్టన్ జట్టు కైవసం చేసుకుంది. శుక్రవారం గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో హోరాహోరీగా జరిగిన తుది పోరులో పుణె 28-25తో హరియాణా స్టీలర్స్‌పై నెగ్గి విజేతగా నిలిచింది. పుణె చాంపియన్‌గా నిలవడం ఇదే తొలిసారి. ఈ జట్టు గత సీజన్‌లో ఫైనల్ చేరినా, జైపూర్ పింక్‌పాంథర్స్ చేతిలో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఇక, తొలిసారి ఫైనల్ చేరిన హరియాణా ఆఖర్లో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది.

చెలరేగిన పంకజ్, మోహిత్: రైడర్లు పంకజ్ మోహిత్ 9 పాయింట్లు, మోహిత్ గోయత్ (5), అస్లం ఇనామ్‌దార్ (4), డిఫెండర్లు గౌరవ్ ఖత్రి (4) పుణె విజయంలో ముఖ్యభూమిక పోషించారు. హరియాణా స్టార్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్ నాలుగు పాయింట్లే సాధించి, నిరాశ పర్చాడు. ఫైనల్లో డిఫెండర్ల ఆటే గెలుపు అవకాశాలను ప్రభావితం చేసింది. ఇరు జట్ల రైడర్లు చెరో 17 పాయింట్లతో సమంగా నిలవగా, డిఫెన్స్‌లో పుణె 9 పాయింట్లు సహా ఒక ఆలౌట్ బోనస్ పాయింట్ దక్కించుకుని పైచేయి సాధించింది.

పోటాపోటీగా..: ఈ సీజన్‌లోని రెండు ఉత్తమ డిఫెన్స్ జట్ల మధ్య ఫైనల్ జరగడంతో పాయింట్ల కోసం రైడర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. ఆట ప్రారంభమైన తొలి పది నిమిషాల్లో ఇరు జట్లకూ పెద్దగా పాయింట్లు లభించలేదు. ఆతర్వాత పోటాపోటీగా ఒక్కో పాయింట్ సాధించడం మొదలవగా ఒక సమయంలో 7-7తో సమమైంది. ఈ దశలో పుణె రైడర్ పంకజ్ సూపర్ రైడర్‌తో 4 పాయింట్లు సాధించి, పుణెను ప్రథమార్ధంలో 13-9 ఆధిక్యంలో నిలిపాడు.

హరియాణా పోరాడినా..: ద్వితీయార్ధంలో హరియాణా గెలుపు కోసం తీవ్రంగా పోరాడినా విజయానికి చేరువగా వచ్చి.. ఆగిపోయింది. ఆట రెండో భాగంలో పుణెతో సమానంగా హరియాణా 15 పాయింట్లు సాధించి, స్కోరు అంతరాన్ని తగ్గించగలిగింది కానీ, విజయానికి అవసరమైన పాయింట్లను సాధించలేకపోయింది. ప్రథమార్ధంలో పుణె సాధించిన మూడు పాయింట్ల ఆధిక్యతే ఆ జట్టును విజేతగా నిలిపింది. ఈ సీజన్ ఉత్తమ రైడర్ అవార్డును అషూ మాలిక్ (దబాంగ్ ఢిల్లీ), ఉత్తమ డిఫెండర్ అవార్డును మహ్మద్ రీజా (పుణెరి పల్టన్) అందుకున్నారు.

ఐర్లాండ్ 'తొలి' గెలుపు

అఫ్ఘాన్‌తో ఏకైక టెస్టు

అబుధాబి: ఐర్లాండ్ క్రికెట్ జట్టు సంచలనం సృష్టించింది. తమ టెస్టు చరిత్రలోనే తొలి విజయాన్ని నమోదు చేసింది. అఫ్ఘానిస్థాన్‌తో మూడు రోజుల్లోనే ముగిసిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఈ జట్టు 6 వికెట్ల తేడాతో నెగ్గింది. 2018లో సుదీర్ఘ ఫార్మాట్‌లో అరంగేట్రం చేసిన ఐర్లాండ్‌కిది ఎనిమిదో టెస్టు మాత్రమే. అయితే 111 పరుగుల ఛేదనలో ఐర్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 13 రన్స్‌కే 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. కానీ కెప్టెన్ బల్బిర్నీ (58 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌తో ఆదుకోగా, ఐదో వికెట్‌కు టకర్ (27 నాటౌట్)తో కలిసి అజేయంగా 72 పరుగులు జత చేశాడు. దీంతో ఐర్లాండ్ 111/4 స్కోరు చేసి గెలిచింది. అంతకుముందు అఫ్ఘాన్ తొలి ఇన్నింగ్స్‌లో 155, రెండో ఇన్నింగ్స్‌లో 218 పరుగులు చేసింది. ఐర్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 263 రన్స్‌కు ఆలౌటైంది.



బల్బిర్నీ (58 నాటౌట్)



గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ ప్రీ వెడ్డింగ్ వేడుకలకు హాజరైన టీమిండియా మాజీ కెప్టెన్ ధోనీ, క్రికెటర్లు సూర్యకుమార్, రషీద్ ఖాన్, షట్లర్లు సైనా నెహ్వాల్, కశ్యప్.



బోర్డు మంచి పనే చేసింది

కపిల్ దేవ్

న్యూఢిల్లీ: రంజీల్లో ఆడనందుకు ఇషాన్ కిషన్, శ్రేయాస్ అయ్యర్‌కు సెంట్రల్ కాంట్రాక్ట్‌లు నిరాకరించడాన్ని దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్ సమర్థించాడు. దేశంకన్నా ఎవరూ పెద్దవారు కాదని, బీసీసీఐ చర్య కొంతమందికి బాధ కలిగించినా ఫర్వాలేదని తేల్చి చెప్పాడు. 'దేశవాళీ క్రికెట్ ఉనికిని కాపాడేందుకు బోర్డు తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎదిగాక కొంతమంది ఆటగాళ్లు రంజీలను విస్మరించడం శోచనీయం' అని కపిల్ అన్నాడు.

కుప్పకూలిన కివీస్

ఆసీస్ తొలి ఇన్నింగ్స్ 383

వెల్లింగ్టన్: ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో న్యూజిలాండ్ కేవలం 179 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ నాథన్ లియాన్ (4/43), హాజెల్‌వుడ్ (2/55) ధాటికి కివీస్ బ్యాటర్లు ఏ మాత్రం నిలవలేకపోయారు. గ్లెన్ ఫిలిప్స్ (71) అర్ధసెంచరీ చేశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 279/9తో రెండో రోజైన శుక్రవారం ఆట కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 104 పరుగులు జోడించి 283 పరుగులకు ఆలౌటైంది. కామెరూన్ గ్రీన్ (174 నాటౌట్) పదో వికెట్‌కు హాజెల్‌వుడ్ (22)తో కలిసి రికార్డుస్థాయిలో 116 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ క్రమంలో 2004లో కివీస్‌తో టెస్టులో గిలెస్పీ, మెక్‌గ్రాత్ కలిసి 10వ వికెట్‌కు జోడించిన 114 రన్స్ రికార్డును గ్రీన్, హాజెల్‌వుడ్ జోడీ బద్దలుకొట్టింది. ఇక, కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ (5/70) ఐదు వికెట్లు తీశాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన ఆసీస్ ఆట ముగిసేసరికి 2 వికెట్లకు 13 రన్స్ చేసింది. ప్రస్తుతం ఆసీస్ 217 పరుగుల ఆధిక్యంలో ఉంది.



లియాన్ (4/43)

గాయత్రి జోడీ అవుట్

న్యూఢిల్లీ: జర్మన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బరిలో మిగిలిన ఏకైక భారత జోడీ గాయత్రీ గోపీచంద్/ట్రీసా జాలీ పోరాటం ముగిసింది. ఈ ద్వయం క్వార్టర్ ఫైనల్లో పరాజయం పాలైంది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ పోరులో నాలుగో సీడ్ గాయత్రి జంట 16-21, 14-21తో చైనాకు చెందిన ఆరోసీడ్ జోడీ లి యి జింగ్/లూ గ్జూ మిన్ చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి వెనుదిరిగింది.

బిజినెస్

మార్కెట్లకు జీడీపీ జోష్


- సెన్సెక్స్ 1,245 పాయింట్లు అప్
- 22,300 ఎగువకు నిఫ్టీ
- రూ.4.29 లక్షల కోట్లు పెరిగిన ఈక్విటీ మదుపరుల సంపద

వృద్ధి గణాంకాల దన్నుతో సరికొత్త శిఖరాలకు సూచీలు

ముంబై: డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి జీడీపీ వృద్ధి రేటు విశ్లేషకుల అంచనాలను మించడం స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఉత్సాహాన్ని ఉరకలెత్తించింది. విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు, గ్లోబల్ మార్కెట్ల ర్యాలీ, గతనెల వాహన విక్రయ గణాంకాల్లో సానుకూలత ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరచడంతో కొనుగోళ్లు పోటెత్తాయి. దాంతో సూచీలు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. శుక్రవారం ట్రేడింగ్ ముగిసేసరికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1,245.05 పాయింట్ల (1.72 శాతం) లాభంతో సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయి 73,745.35 వద్ద స్థిరపడింది. ఒక దశలో సూచీ 1,318.91 పాయింట్ల వృద్ధితో 73,819.21 వద్ద కొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును సైతం నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒక దశలో 370.5 పాయింట్లు ఎగబాకి 22,353.30 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 355.95 పాయింట్ల (1.62 శాతం) లాభంతో 22,338.75 వద్ద క్లోజైంది. సూచీకిది సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయి కూడా. మార్కెట్ ర్యాలీతో మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.4.29 లక్షల కోట్లు పెరిగి రూ.392.25 లక్షల కోట్లకు (4.78 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 26 లాభపడ్డాయి. టాటా స్టీల్ షేరు 6.46 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఎల్ అండ్ టీ షేర్లు 4 శాతానికి పైగా పుంజుకోగా.. టైటాన్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతి సుజుకీ షేర్లు మూడు శాతానికి పైగా ఎగబాకాయి. మార్కెట్ దిగ్గజ షేరైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం 2 శాతానికి పైగా పెరిగాయి. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, సన్‌ఫార్మా షేర్లు మాత్రం ఒక శాతానికి పైగా నష్టపోయాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.89 శాతం వరకు పెరిగాయి.

రంగాలవారీ సూచీల్లో హెల్త్‌కేర్, ఐటీ, టెక్నాలజీ మినహా అన్నీ పాజిటివ్‌గా ముగిశాయి. లోహ రంగ సూచీ అత్యధికంగా 3.84 శాతం ఎగబాకింది. కమోడిటీస్, ఎనర్జీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్‌లు సైతం 2 శాతానికి పైగా వృద్ధి చెందాయి.



మరిన్ని విషయాలు..

- పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు 5 శాతం లాభంతో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.425.45కు చేరుకుంది. ఆర్‌బీఐ ఆంక్షలు ఎదుర్కొంటున్న పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్)-పేటీఎం మధ్య అంతర్గత ఒప్పందాలను నిలిపివేయాలని నిర్ణయించినట్లు కంపెనీ ప్రకటించడం ఇందుకు దోహదపడింది.
- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 2 పైసలు తగ్గి 82.91 వద్ద ముగిసింది.
- అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ రకం ముడి చమురు పీపా ధర ఒక దశలో 1.26 శాతం పెరిగి 82.94 డాలర్ల వద్ద ట్రేడైంది.
- ఢిల్లీ మార్కెట్లో పది గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.350 పెరిగి రూ.63,320కి చేరుకోగా.. కిలో వెండి రేటు రూ.400 పెరుగుదలతో రూ.74,500 పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒక దశలో 2,045 డాలర్లు, సిల్వర్ 22.60 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.
- గతనెల 23తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు 297.5 డాలర్లు పెరిగి మొత్తం 61,907.2 కోట్ల డాలర్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ వెల్లడించింది.

నమ్‌కీన్ ఉత్పత్తుల తయారీ సంస్థ గోపాల్ స్నాక్స్ ఐపీఓ ఈ నెల 6న ప్రారంభమై 11న ముగియనుంది. రూ.650 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వస్తున్న ఈ కంపెనీ ఇష్యూ ధరల శ్రేణిని రూ.381-401గా నిర్ణయించింది.

ఎన్ఎస్ఈ.. 9 కోట్ల మంది ఇన్వెస్టర్లు

తమ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన యూనిక్ ఇన్వెస్టర్ల సంఖ్య 9 కోట్లు దాటిందని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) వెల్లడించింది. అందులో కోటి మంది కేవలం ఐదు నెలల్లో చేరినట్లు తెలిపింది. స్టాక్ మార్కెట్ మదుపరులు గడిచిన ఐదేళ్లలో మూడింతలు పెరిగారు. శరవేగంగా సాగుతున్న డిజిటలీకరణ, ఇన్వెస్టర్లలో అవగాహన పెరుగుతుండటం, ఆర్థిక సవిృశితాభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో పాటు గత కొన్నేళ్లలో స్టాక్ మార్కెట్లు ఆకర్షణీయ రిటర్నులు పంచుతుండటం ఇందుకు దోహదపడింది.

నేడు మార్కెట్లో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్

భారీ అంతరాయాలు లేదా వైఫల్యాలను ఎదుర్కొనే విషయంలో తమ సంసిద్ధతను పరీక్షించుకునేందుకు ఈ నెల 2న (శనివారం) ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లలో ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను నిర్వహించనున్నట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ ప్రకటించాయి. ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను ఇంట్రాడేలో ప్రాథమిక సైట్ (పీఆర్) నుంచి డిజాస్టర్ రికవరీ సైట్(డీఆర్)కు మార్చనున్నారు. రెండు సెషన్లలో ఇది జరగనుంది. ఉదయం 9.15 గంటల నుంచి 10 గంటల వరకు ప్రాథమిక సైట్లో.. 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు డిజాస్టర్ రికవరీ సైట్లో ట్రేడింగ్‌ను నిర్వహించనున్నారు. ఈ స్పెషల్ ట్రేడింగ్‌లో అన్ని సెక్యూరిటీల ధరల గరిష్ఠ కదలిక శ్రేణి 5 శాతానికి పరిమితం కానుంది. ఇప్పటికే 2 శాతం లేదా అంతకంటే తక్కువ ప్రైస్‌బ్యాండ్ కలిగిన షేర్లకు పరిమితి యథాతథంగా కొనసాగనుంది.

జీఎస్‌టీ వసూళ్లు రూ.1.68 లక్షల కోట్లు

ఫిబ్రవరిలో 12.5 శాతం వృద్ధి

న్యూఢిల్లీ: దేశీయ అమ్మకాలతో పాటు దిగుమతులు కూడా జోరుగా సాగడంతో జీఎస్‌టీ వసూళ్లు ఫిబ్రవరి నెలలో 12.5 శాతం పెరిగి రూ.1,68,337 కోట్లకు చేరాయి. జీఎస్‌టీ వసూళ్లలో ఫిబ్రవరి నాలుగో అత్యుత్తమ నెలగా నిలిచింది. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-ఫిబ్రవరి నెలల మధ్య కాలంలో వసూళ్లు 11.7 శాతం వృద్ధితో రూ.18.40 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. విభాగాలవారీగా చూసినట్టయితే దేశీయ లావాదేవీల ద్వారా జీఎస్‌టీ వసూళ్లలో 13.9 శాతం వృద్ధి నమోదు కాగా దిగుమతులపై జీఎస్‌టీ వసూళ్లు 8.5 శాతం పెరిగాయి. కాగా నెలవారీ సగటు వసూళ్లు వర్తమాన ఆర్థిక సంవత్సరంలో రూ.1.67 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలంతో పోల్చితే వసూళ్లు రూ.1.5 లక్షల కోట్లు అధికం. రిఫండ్లను తీసివేయగా నికర జీఎస్‌టీ వసూళ్లు ఫిబ్రవరిలో రూ.1.51 లక్షల కోట్లున్నాయి. మొత్తం వసూళ్లలో సెంట్రల్ జీఎస్‌టీ రూ.41,856 కోట్లు కాగా రాష్ట్రాల జీఎస్‌టీ వాటా రూ.35,953 కోట్లుగా ఉంది.

- ఇప్పటివరకు జీఎస్‌టీ వసూళ్లలో అత్యుత్తమ రికార్డు 2023 ఏప్రిల్‌లో నమోదైన రూ.1.87 లక్షల కోట్లు. ఈ ఏడాది జనవరి రూ.1.74 లక్షల కోట్లతో రెండో స్థానంలోను, రూ.1.72 లక్షల కోట్లతో 2023 అక్టోబరు మూడో స్థానంలోను నిలిచాయి.

వినియోగంలో జోరుకు సంకేతం: జీఎస్‌టీ వసూళ్లలో వృద్ధి వినియోగంలో పెరిగిన జోరుకు దర్పణమని పరిశీలకులంటున్నారు. సుమారుగా అన్ని రాష్ట్రాలూ జీఎస్‌టీ వసూళ్లలో 8 నుంచి 21 శాతం వృద్ధిని నమోదు చేశాయని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణ అన్నారు. గురువారం విడుదలైన జీడీపీ గణాంకాలు, శుక్రవారం విడుదలైన ఆటోమొబైల్ అమ్మకాల్లో వృద్ధి భారత ఆర్థిక వ్యవస్థలో పటిష్ఠతకు సంకేతమని కేపీఎంజీ ఇండియా పార్ట్‌నర్ అభిషేక్ జైన్ అన్నారు.

ఏపీలో రూ.3,678 కోట్ల జీఎస్‌టీ వసూళ్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఫిబ్రవరి నెల జీఎస్‌టీ వసూళ్లు 18 శాతం వృద్ధి చెంది రూ.5,211 కోట్లుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే నెలలో జీఎస్‌టీ వసూళ్లు రూ.4,424 కోట్లుగా ఉన్నాయి. కాగా ఆంధ్రప్రదేశ్‌లో ఫిబ్రవరి నెల వసూళ్లు 3 శాతం వృద్ధితో రూ.3,557 కోట్ల నుంచి రూ.3,678 కోట్లకు చేరుకున్నాయి.



భారతీయ జీవిత బీమా కార్పొరేషన్ (ఎల్ఐసీ).. ప్రభుత్వానికి రూ.2,441.44 కోట్ల డివిడెండ్‌ను అందజేసింది. ఈ మేరకు శుక్రవారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఎల్ఐసీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి డివిడెండ్ చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సర్వీసుల కార్యదర్శి వివేక్ జోషి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీపీబీఎల్‌తో ఒప్పందాలకు పేటీఎం గుడ్‌బై

న్యూఢిల్లీ: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) కార్యకలాపాల నుంచి పేటీఎం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ తప్పుకుంది. పీపీబీఎల్-పేటీఎం మధ్య ఉన్న ఒప్పందాల నుంచి తప్పుకుంటున్నట్లు పేటీఎం బోర్డు శుక్రవారం ప్రకటించింది. ఒక సంస్థపై మరో సంస్థ ఆధారపడడాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేటీఎం రెగ్యులేటరీ సంస్థలకు తెలిపింది. అయితే ప్రస్తుతం పీకల్లోతు సంక్షోభంలో ఉన్న పీపీబీఎల్‌కు దూరమయ్యేందుకే పేటీఎం బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నట్లు భావిస్తున్నారు. పీపీబీఎల్ పార్ట్‌టైమ్ నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పదవి నుంచి పేటీఎం చీఫ్ విజయ శేఖర్ శర్మ తప్పుకున్న మరుసటి రోజే ఈ పరిణామం చోటు చేసుకోవడం విశేషం.

రూ.5.49 కోట్ల జరిమానా: మరోవైపు అక్రమ నగదు లావాదేవీల చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనలు అతిక్రమించినందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్వహణలోని ఫైనాన్షియల్ ఇంటలిజెన్స్ యూనిట్-ఇండియా (ఎఫ్ఐయూ) పీపీబీఎల్‌పై రూ.5.49 కోట్ల జరిమానా విధించింది. దర్యాప్తు సంస్థల నివేదికల ఆధారంగా ఎఫ్ఐయూ ఈ చర్య తీసుకుంది.

'ఆటో' టాప్‌గేర్

ఫిబ్రవరి అమ్మకాలు మూడో అత్యుత్తమం

న్యూఢిల్లీ: దేశంలో కార్ల డిమాండ్ మంచి జోరుమీదుంది. ఫలితంగా కార్ల అమ్మకాల్లో ఫిబ్రవరి నెల పరిశ్రమ చరిత్రలోనే మూడో అత్యుత్తమమైన నెలగా రికార్డు నమోదు చేసింది. మారుతి సుజుకీ, హ్యుండయ్, టాటా మోటార్స్ అమ్మకాల్లో మంచి వృద్ధిని ప్రకటించగా మహీంద్రా అండ్ మహీంద్రా, టయోటా కిర్లోస్కర్, హోండా కార్స్ కూడా డీలర్లకు అధిక సంఖ్యలో కార్లను డెలివరీ చేశాయి. ఎస్‌యూవీలకు డిమాండ్ చాలా బలంగా ఉన్నదని, రాబోయే నెలల్లో కూడా ఇదే ధోరణి కొనసాగుతుందని విశ్లేషకులంటున్నారు. ఫిబ్రవరి నెల మొత్తం కార్ల విక్రయాలు 3,41,088 యూనిట్లుగా ఉన్నాయి. కాగా 3,94,500 కార్ల అమ్మకాలతో ఈ ఏడాది జనవరి పరిశ్రమలోనే అత్యుత్తమమైన నెలగా రికార్డు నెలకొల్పగా 3,91,811 కార్ల అమ్మకాలతో గత ఏడాది అక్టోబరు రెండో అత్యుత్తమ నెలగా నిలిచింది.

మారుతి విక్రయాల్లో 9 శాతం వృద్ధి: ఫిబ్రవరి నెల అమ్మకాల్లో మారుతి సుజుకీ 9 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఫిబ్రవరి నెలతో పోల్చితే కార్ల అమ్మకాలు 1,47,467 నుంచి 1,60,271కి పెరిగాయి. ఫిబ్రవరి నెలలో హ్యుండయ్ మోటార్స్‌ను పరుగులో వెనక్కి నెట్టి టాటా మోటార్స్ రెండో స్థానం ఆక్రమించింది. గత ఏడాది ఫిబ్రవరితో పోల్చితే 19 శాతం వృద్ధితో 51,321 కార్లను విక్రయించింది. కాగా హ్యుండయ్ మోటార్స్ కేవలం 7 శాతం వృద్ధితో 50,201 కార్లను విక్రయించగలిగింది. మహీంద్రా అండ్ మహీంద్రా కార్ల అమ్మకాల్లో 40 శాతం వృద్ధి నమోదైంది. గత ఫిబ్రవరితో పోల్చితే అమ్మకాలు 30,358 ఉంచి 42,401కి పెరిగాయి. టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) హోల్‌సేల్ అమ్మకాల్లో అత్యుత్తమ నెలవారీ రికార్డును నెలకొల్పింది. మొత్తం 25,220 కార్లు విక్రయించింది.

అంతర్జాతీయ బెవరేజెస్ దిగ్గజం పెప్సీ.. భారత్‌లో కొత్త గ్లోబ్ లోగోను ఆవిష్కరించింది. కంపెనీ రీబ్రాండింగ్‌లో భాగంగా లోగోను మార్చినట్లు వెల్లడించింది. 14 సంవత్సరాల తర్వాత పెప్సీ తన కంపెనీ లోగోను మార్చటం విశేషం. ముంబైలోని గేట్‌వే ఆఫ్ ఇండియా వద్ద న్యూ పెప్సీ గ్లోబ్ లోగోను ఆవిష్కరించింది.

చమురుపై పెరిగిన విండ్‌ఫాల్ ట్యాక్స్

దేశీయంగా ఉత్పత్తి చేసే ముడి చమురుపై విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను ప్రభుత్వం పెంచింది. ఫిబ్రవరి నెలాఖరు వరకు టన్నుకు రూ.3,300గా ఉన్న ఈ ట్యాక్స్‌ను మార్చి 1 నుంచి రూ.4,600కు పెంచింది. చమురు, పెట్రో ఉత్పత్తుల కంపెనీలపై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ డ్యూటీ పేరుతో ప్రభుత్వం ఈ విండ్‌ఫాల్ ట్యాక్స్ విధిస్తోంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,160	57,900	76,200
ముంబై	62,816	57,540	69,898

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

1వ తేదీ	
హైదరాబాద్	460
2వ తేదీ	
చిత్తూరు	513
గోదావరి	460
విజయవాడ	460
విశాఖపట్నం	500
వరంగల్	462

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	126
వరంగల్	126
కరీంనగర్	126
మహబూబ్‌నగర్	126
కర్నూలు	126
విశాఖపట్నం	127
గోదావరి	134
విజయవాడ	134
గుంటూరు	134
ఒంగోలు	134
చిత్తూరు	135

నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా సాయిరెడ్డి!

(మొదటి పేజీ తరువాయి)

నిరాకరించారు. తాను సూచించిన అభ్యర్థులను అసెంబ్లీ ఇన్‌చార్జులుగా ప్రకటించకపోవడమే గాక.. తనతో మాటమాత్రమైనా చెప్పకుండా కొందరు ఇన్‌చార్జులను నియమించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. ఏకంగా టీడీపీలో చేరుతున్నారు. సరైన ప్రత్యామ్నాయం కనపడక.. చివరకు విజయసాయిరెడ్డిని నెల్లూరు లోక్‌సభ ఇన్‌చార్జిగా నియమించారు. సాయిరెడ్డి ఉత్తరాంధ్ర, ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సమన్వయకర్తగా పనిచేశారు. ప్రస్తుతం గుంటూరు, పల్నాడు జిల్లాల సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఎన్నికల్లో ఆయన పోటీచేయలేదు. నిజానికి విజయసాయిరెడ్డి బంధువు అరబిందో డైరెక్టర్ శరత్‌చంద్రారెడ్డిని నెల్లూరు లోక్‌సభ బరిలో దింపాలని కూడా జగన్ ఆలోచించారు. కానీ దీనివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండకపోగా.. ప్రతికూల ఫలితాలను రుచి చూడాల్సి వస్తుందని సర్వేలు చెప్పడంతో ఆ యోచన విరమించారు. ఇంకోవైపు ఎన్నికల షెడ్యూల్ ముంచుకొస్తుండడంతో చివరకు ఆ జిల్లాకే చెందిన సాయిరెడ్డిని ఇన్‌చార్జిగా ప్రకటించారు.

పాపం చిరంజీవి..!



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పోటీ చేస్తున్న మంగళగిరిలో ఎలాగైనా ఆయన్ను ఓడించేందుకు జగన్ ముందుగానే వ్యూహం పన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ తరఫున స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన మాజీ మున్సిపల్ చైర్మన్ గంజి చిరంజీవిని వైసీపీలో చేర్చుకున్నారు. సొంత ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఈసారి గెలిచే అవకాశం లేదని టికెట్ ఇవ్వనన్నారు. చిరంజీవిని ఇన్‌చార్జిగా నియమించారు. సామాజిక న్యాయంలో భాగంగా చేనేత సామాజిక వర్గానికి చెందిన చిరంజీవిని ఈసారి రంగంలోకి దింపుతున్నామని జగన్ ఆర్భాటంగా చెప్పారు. కానీ 2014లోనే ఆయన టీడీపీ తరఫున పోటీచేశారన్న విషయాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించారు. అయితే వైసీపీలోనే ఉన్న అదే సామాజిక వర్గం నేతలు చిరంజీవి అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆయనకు మద్దతిచ్చేది లేదని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల స్పష్టం చేశారు. దీంతో మల్లగుల్లాలు పడిన జగన్.. శుక్రవారం అకస్మాత్తుగా చిరంజీవి, ఆళ్ల, ఎమ్మెల్సీ మురుగుడు, ఆయన వియ్యపురాలు కమల, ఆయన కోడలు మురుగుడు లావణ్యను క్యాంపు కార్యాలయానికి పిలిచారు. తన వద్దకు వచ్చిన లావణ్యను ఆప్యాయంగా పలుకరించారు. చర్చల తర్వాత అందరూ వెనుదిరిగారు. సీఎంవో గుమ్మం దిగారో లేదో.. మంగళగిరి అసెంబ్లీ ఇన్‌చార్జిగా చిరంజీవిని తొలగించి మురుగుడు లావణ్య పేరు ప్రకటించేశారు. గతంలో బీసీ నేతగా ఆయన్ను ఆకాశానికెత్తిన జగన్.. ఇప్పుడు బీసీ మహిళ లావణ్య అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు.

పిఠాపురంలో పోటీకి వంగా గీత దూరం!



కాకినాడ సిటింగ్ ఎంపీగా ఉండి.. పిఠాపురం అసెంబ్లీ ఇన్‌చార్జి స్థానాన్ని కోరి మరీ తెచ్చుకున్న వంగా గీత శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌ను కలిశారు. పిఠాపురం నుంచి జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పోటీ చేస్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో తానక్కడ పోటీ చేయనని సీఎంకు చెప్పారని ప్రచారం జరుగుతోంది. దీంతో పిఠాపురం నుంచి కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభాన్ని బరిలోకి దించేందుకు వైసీపీ ముఖ్య నేతలు ప్రయత్నాలు చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో ఆ పార్టీ ప్రచారం చేస్తోంది. ఇటీవల వైసీపీలో చేరాలంటూ ముద్రగడ నివాసానికి వైసీపీ నేతలు వెళ్లారు. వారిని కలిసేందుకు ఆయన సుముఖత వ్యక్తం చేయలేదు. తాజాగా టీడీపీతో పొత్తుకు సంబంధించి పవన్ కల్యాణ్‌కు వ్యతిరేకంగా ముద్రగడ లేఖ రాయడంతో.. ఆయన్ను పార్టీలోకి తెచ్చుకునేందుకు జగన్ మళ్లీ ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలిసింది.



తిరుపతి కాంగ్రెస్ సభలో కేవీపీ, సీపీఐ నారాయణ, షర్మిల, సచిన్ పైలెట్, రఘువీరా సంఘీభావం



తిరుపతిలో కాంగ్రెస్ నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన జనం

గల్లీలో పులి, ఢిల్లీలో పిల్లి

- తల్లిలాంటి ఏపీని హత్యచేశారు
- ప్రత్యేక హోదా, రాజధాని డీఎస్సీ.. అంతా దగా
- తిరుపతి సభలో పీసీసీ చీఫ్ షర్మిల ఫైర్
- ప్రత్యేక హోదాపై డిక్లరేషన్ విడుదల

తిరుపతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): "ఏపీకి ప్రత్యేక హోదా వచ్చేవరకు కాంగ్రెస్ పార్టీ అలుపెరగని పోరాటం చేస్తుంది. అధికారంలోకి వచ్చాక తొలి మంత్రివర్గ సమావేశంలోనే పదేళ్లపాటు మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పిస్తామని రాహుల్ గాంధీ మాటిచ్చారు. హోదా కోసం పోరాడేవాళ్లు కావాలా? తాకట్టు పెట్టేవాళ్లు కావాలా? రాష్ట్ర ప్రజలు తేల్చుకోవాలి" అంటూ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల కోరారు. తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్, ఇతర కాంగ్రెస్ ప్రముఖులతో కలిసి షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలతో కలిసి ప్రత్యేక హోదాపై డిక్లరేషన్‌ను ప్రకటించారు. "ఇటీవల జరిగిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీ సమావేశం ప్రత్యేక హోదాపై తీర్మానం చేసింది. వైసీపీ, టీడీపీ అధినేతలు రాష్ట్రాన్ని నాశనం చేయడానికే ఉన్నారు. ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంది. కాబట్టే కోమాలో ఉన్న కాంగ్రెస్ పగ్గాలు చేపట్టా. రాజన్న సంక్షేమ పాలనలో రైతు రాజు అవుతాడు. 'ఇందిరమ్మ అభయహస్తం' పేరిట ప్రతి పేద ఇంటికీ ప్రతి నెలా రూ.5వేలు మహిళ అకౌంట్‌లోకి వచ్చేలా చేస్తాం. పేదరిక నిర్మూలన, అసమానతలు తొలగించేందుకు అభయహస్తం ఇవ్వబోతున్నాం."అని షర్మిల హామీ ఇచ్చారు.

ఇచ్చోటనే హోదాపై మోదీ వాగ్దానం...

2014 ఎన్నికల ప్రచార సభలో ఇదే వేదికగా పదేళ్లపాటు ప్రత్యేక హోదా ఇస్తామంటూ నాటి ప్రధాని అభ్యర్థి మోదీ వాగ్దానం చేశారని షర్మిల గుర్తు చేశారు. "ఆనాటి సభలో ఏపీని స్వర్ణాంధ్రగా మారుస్తామని మోదీ అన్నారు. ఢిల్లీని తలదన్నే రాజధాని కట్టేందుకు సాయపడతామన్నారు. హార్డ్‌వేర్ హబ్‌గా తయారు చేస్తామని చెప్పారు. పెట్రోలియం పరిశ్రమలు తెస్తామన్నారు. ఒక్కటంటే ఒక్కమాటైనా నిలబెట్టుకోలేదు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన ప్రతి అంశాన్నీ గాలికొదిలేశారు. పోలవరం పక్కన పెట్టేశారు. రాజధాని లేకుండా పోవడం బాధాకరం. విభజన చట్టంలో ఏపీకి రావలసిన హక్కులను ఒక్కటి కూడా సాధించుకోలేక పోయాం. రామభక్తుడినని చెప్పుకొనే ఆయన మూడు నామాల వాడికే పంగనామాలు పెట్టారు. ఐదు కోట్ల ఆంధ్రులను మోసం చేసిన మోదీ కేడీ కాక ఇంకేమవుతాడు. మోదీ అంటేనే మోసం' అంటూ షర్మిల ధ్వజమెత్తారు.

రేవు దాటేవరకే...

"రాష్ట్రంలో 23వేల డీఎస్సీ ఉద్యోగాలు ఖాళీగా ఉంటే 6వేలతో ఎన్నికల ముందు జగనన్న దగా డీఎస్సీని విడుదల చేశారు. 'రేవు దాటేంతవరకే ఓడ మల్లన్న, రేవు దాటినతర్వాత బోడి మల్లన్న' చందంగా జగనన్న తయారయ్యారు. స్పెషల్ స్టేటస్, క్యాపిటల్, మెగా డీఎస్సీ అంటూ నాసిరకం మద్యం బ్రాండ్లను విక్రయిస్తున్నారు. వాటిని తాగినవారి లివర్లు చెడిపోయి చనిపోతున్నారు. ఎన్నికల ముందు మద్యనిషేధం అన్నారు. ఇప్పుడు ప్రభుత్వమే మద్యం అమ్ముతోంది. వైఎస్సార్ జలయజ్ఞం కింద మిగిలిన ప్రాజెక్టులను కడతానని జగనన్న హామీ ఇచ్చారు. హోదాపై వీరికి చిత్తశుద్ధే లేదు. వారి స్వలాభం కోసం ప్రజలను ఎంతకైనా తాకట్టు పెడతారు" అంటూ షర్మిల మండిపడ్డారు.

సంపన్నులకోసమే బీజేపీ : సచిన్ పైలట్

దేశంలోని సంపన్నుల కోసమే బీజేపీ పనిచేస్తోందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ విమర్శించారు. "ఇండియా కూటమితో పాటు బీజేపీని వ్యతిరేకించే ప్రాంతీయ పార్టీలపై ఈడీ, సీబీఐలను కేంద్రం ఉసిగొలుపుతోంది. కేంద్రప్రభుత్వ అధికార దర్పంపై సోనియా, రాహుల్ గాంధీ పోరాడుతున్నారు. కాంగ్రెస్ ఐదేళ్లు ప్రత్యేక హోదా ఇచ్చింది. క్యాబినెట్ ఆమోద ముద్ర వేసింది.నాడు ఆర్థిక శాఖకు కూడా పంపించాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ అమలు చేయలేదు. నరేంద్ర మోదీ పదేళ్లు ప్రధానిమంత్రిగా ఉన్నారు. హోదా హామీని మాత్రం మరిచారు. ఈ రాష్ట్రాన్ని పాలించిన స్థానిక పార్టీలు కూడా హోదా సాధనలో విఫలమయ్యాయి. రైతులను, నిరుద్యోగులను బీజేపీ పూర్తిగా విస్మరించింది. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాష్ట్రానికి ఒక్క రూపాయి రాలేదు. మాటమీద నిలబడే తత్వం బీజేపీది కాదు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే చేసి తీరుతుంది. ఎన్నికల్లో ఆశీస్సుల కోసం వచ్చాం. ఏపీకి హోదా ఇచ్చి తీరుతాం" అని సచిన్ పైలట్ స్పష్టం చేశారు. వైఎస్ బొమ్మతో అధికారంలోకి వచ్చిన జగన్ నేడు ఆయన ఫొటోనే దూరం చేశాడని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఒక కేసు నుంచి బయటపడేందుకు 12మందిని హత్య చేయించారని తీవ్ర విమర్శ చేశారు. ఫ్యాన్, సైకిల్, కమలం గుర్తులను ఊరి బయట పడేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరా రెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నీ జగన్నాటకాలే

"జగనన్న మూడు రాజధానుల నాటకాలాడారు. ఒక్క రాజధానినైనా జగన్ అభివృద్ధి చేశాడా? మనకు సిగ్గుచేటు కాదా? పక్క రాష్ట్రాలన్నీ వేగంగా అభివృద్ధి పథంలో నడుస్తుంటే మనం మాత్రం వెనుకబడిపోతున్నాం. దక్షిణాదిన మెట్రోలేని ఏకైక రాష్ట్రం మనదే. తల్లిలాంటి ఏపీని మోదీ, జగన్ హత్య చేశారు. ఉత్తరాఖండ్‌కు ప్రత్యేక హోదా రావడంతో రెండు వేలు, హిమాచల ప్రదేశ్‌లో పదివేల పరిశ్రమలు వచ్చాయి. ఏపీకి పట్టుమని పది పరిశ్రమలు కూడా రాలేదు. చంద్రబాబు ప్రత్యేక హోదా విషయంలో ఊసరవెల్లిలా రంగులు మార్చారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న జగనన్న హోదా కోసం నిరాహార దీక్ష చేశారు. హోదా కోసం మూకుమ్మడి రాజీనామాలు చేస్తానన్న జగన్.. సీఎం అయ్యాక మాట నిలబెట్టుకోలేదు. ఇప్పటివరకు ఒక్క ఎంపీ కూడా ఎందుకు రాజీనామా చేయలేదు జగనన్నా? బీజేపీని ఎందుకు నిలదీయలేదు? ఢిల్లీలో పంజా విప్పుతామన్నారు. ఇప్పుడేమైంది? గల్లీలో జగనన్న పులి, ఢిల్లీకి వెళితే పిల్లిగా మారిపోతున్నారు. ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే సీటు లేకపోయినా బీజేపీనే మన రాష్ట్రంలో రాజ్యమేలుతోంది. పాలక, ప్రతిపక్షాలు బీజేపీ చుట్టూనే తిరుగుతున్నాయి. ట్రయాంగిల్ లవ్‌స్టోరీ నడుస్తోంది"అని షర్మిల ఎద్దేవా చేశారు.

ట్రాక్టరుతో గుద్ది చంపేశారు

(మొదటి పేజీ తరువాయి)

చెందిన బాణావత్ సామిని అనే గిరిజన మహిళ తాగు నీటి కోసం ట్యాంకర్ దగ్గరకు వెళ్లారు. అయితే, సామిని టీడీపీ అభిమాని అంటూ ఆమెకు నీళ్లు ఇవ్వడానికి ట్రాక్టరు డ్రైవరు నిరాకరించాడు. ఈ క్రమంలోనే ఆమెను ట్రాక్టరుతో గుద్దించాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగానే మార్గ మధ్యంలోనే మృతి చెందారు. తాగునీరు అడిగిన పాపానికి ప్రాణాలు తీసేశారు. మాచర్లలో వైసీపీ మార్కు రాజకీయం ఇలాగే ఉంటుందని అధికార పార్టీ నేతలు చాటుకున్నారు. తాగునీటి కోసం వెళితే ట్రాక్టర్‌తో తొక్కించి చంపేస్తారా, ఇదేం దారుణమని మాచర్ల టీడీపీ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి మండిపడ్డారు. బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. వీరికి అడ్డే లేకుండా పోయింది. టీడీపీ సానుభూతి పరులను పదేపదే టార్గెట్ చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అరాచకాలను మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కొనసాగిస్తున్నారని తెలుగుదేశం నేతలు ఆరోపిస్తున్నారు. అయినా, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవడంలేదని, వారు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఎన్నికల వేళ ఎటువంటి సంఘటనలు జరుగుతాయోనన్న భయాందోళనలను నియోజకవర్గ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

ఎంత కక్ష ఉంటే చేస్తారు?

నీళ్లు అడిగితే గుద్దేస్తారా? బిందె తీసుకొచ్చి ఆపమంటే ఆపాలి. ట్యాంకర్ పెట్టింది ఎందుకు? నీళ్ల కోసమేగా పెట్టింది? ఒక బిందె పట్టుకుంటే ఏమయింది? ట్రాక్టర్ ఆపితే ఏమవుతుంది? నీళ్లు అడిగితే గుద్దేస్తారా? కావాలనే గుద్దించారు. ఎంత కక్ష ఉంటే ఈ పని చేస్తారు? మనిషి ప్రాణమే పోయింది. తిరిగి తీసుకొచ్చి ఇస్తారా?

- మృతురాలి బంధువులు

నీటి కోసం వెళ్తే...

మా అమ్మ నీటి కోసం వెళ్తే వైసీపీ వాళ్లు ట్రాక్టర్‌తో గుద్దేసి వెళ్లిపోయాడు. ట్రాక్టర్ నడిపే డ్రైవర్ వైసీపీకి చెందిన వాడు. ఎందుకు ఆపలేదని అడిగినందుకు బూతులు తిట్టాడు. ముందు కాలి మీదకు ఎక్కిస్తే నుజ్జు నుజ్జు అయింది. వెనక్కి... ముందుకి... రెండు మూడుసార్లు గుద్దాడు.

- మృతురాలి కుమారుడు

నీళ్లడిగితే చంపేస్తారా?: అచ్చెన్న

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పార్టీలు చూడం.... కులం చూడం...అంటూ డబ్బాలు కొట్టిన జగన్.. గిరిజన మహిళ నీళ్లు అడిగినందుకు వైసీపీ కార్యకర్తలు ప్రాణాలు తీయడంపై ఏం సమాధానం చెబుతారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నిలదీశారు. తాగటానికి గుక్కెడు నీళ్లు అడిగితే ప్రాణాలు తీశారంటే జగన్ పాలన రాతియుగం కాక మరేంటని ప్రశ్నించారు. "టీడీపీ వాళ్లకు నీళ్లు ఎందుకు ఇవ్వరు అని ప్రశ్నిస్తే.. చంపేస్తారా? తాగే నీళ్ల దగ్గర కూడా పార్టీల పేరుతో పక్షపాతం చూపించడం ఎంత దౌర్భాగ్యం? నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూనే వారిపై వైసీపీ నేతలు సాగిస్తున్న మారణకాండ జగన్‌కు కనిపించడం లేదా?" అని ప్రశ్నించారు.



మైలవరం నుంచి హైదరాబాద్ బయల్దేరిన వసంత

నేడు టీడీపీలోకి వసంత కృష్ణ ప్రసాద్


- వైసీపీ ఎంపీలు వేమిరెడ్డి, లావు కూడా
- ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సైతం
- హైదరాబాద్‌లో బాబు సమక్షంలో కృష్ణప్రసాద్ చేరిక

విజయవాడ/అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా మైలవరం వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శనివారం ఉదయం టీడీపీలో చేరనున్నారు. వైసీపీ ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్), లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆ పార్టీ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా చేరుతున్నారు. కృష్ణప్రసాద్ తన ముఖ్య అనుచరులతో కలిసి ఆయన శుక్రవారం రాత్రి హైదరాబాద్ బయల్దేరి వెళ్లారు. పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో అక్కడ టీడీపీ కండువా కప్పుకోనున్నారు. మైలవరం నుంచే ఆయన టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది. 2019లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచి 12 మంది వైసీపీ ఎమ్మెల్యేలు గెలుపొందగా.. టీడీపీ నుంచి గెలిచిన గన్నవరం ఎమ్మెల్యే వంశీ కూడా వైసీపీ పంచన చేరారు. దీంతో వైసీపీ బలం 13కి చేరింది. వారిలో ముగ్గురు ఎమ్మెల్యేలు తాజాగా ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఇప్పటికే టీడీపీ కండువా కప్పుకోగా..తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి వైసీపీకి గుడ్‌బై చెప్పి తటస్థంగా ఉన్నారు. తాజాగా వసంత కృష్ణప్రసాద్ టీడీపీలో చేరుతున్నారు. ఆయనకు మైలవరం టీడీపీ టికెట్ ఖరారైతే..అక్కడ ఆ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న దేవినేని ఉమను పెనమలూరు నుంచి బరిలో దింపుతారన్న ప్రచారం జరుగుతోంది.

వైసీపీకి భారీ కుదుపు

సార్వత్రిక ఎన్నికల సమరానికి ముందు వైసీపీకి చెందిన ఇద్దరు సిటింగ్ ఎంపీలు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఒకేరోజు టీడీపీలో చేరుతుండడం.. అధికార పార్టీకి భారీ కుదుపుగా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. శనివారం ఉదయం హైదరాబాద్‌లో కృష్ణప్రసాద్ పార్టీలో చేరాక చంద్రబాబు హెలికాప్టర్లో నెల్లూరు చేరుకుంటారు. అక్కడ జరిగే సభలో ఆయన సమక్షంలో వైసీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టీడీపీలో చేరతారు. ఇదే సందర్భంగా వైసీపీ నుంచి భారీగా చేరికలు ఉంటాయని టీడీపీ వర్గాలు అంటున్నాయి. తర్వాత సాయంత్రం పల్నాడు జిల్లా గురజాలలో 'రా.. కదలిరా' సభలో చంద్రబాబు పాల్గొంటారు. ఈ సభలోనే నరసరావుపేట వైసీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా టీడీపీలో చేరతారు. వారితోపాటు ఆ జిల్లా పరిధిలోని మరికొందరు వైసీపీ నేతలు చేరనున్నారు. అనంతరం చంద్రబాబు ఆ రాత్రికి దాచేపల్లిలో బస చేస్తారు. ఆదివారం ఉదయం హైదరాబాద్ బయల్దేరి వెళ్తారు.

డీఆర్ఐ ముసుగులో తప్పుడు కేసులు



- గవర్నర్‌కు చంద్రబాబు లేఖ
- టీడీపీ నేతలను వేధించడానికే డీఆర్ఐని పెట్టినట్లుంది

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ సంస్థ ముసుగులో రాష్ట్రంలో టీడీపీ నేతలపై మోపుతున్న తప్పుడు కేసులను నిలువరించాలని రాష్ట్ర గవర్నర్‌కు ఆ పార్టీ అధినేత చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు లేఖ రాశారు. ఇందులోని ముఖ్యాంశాలు దిగువ విధంగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టరేట్ ఫర్ రెవెన్యూ ఇంటలిజెన్స్ సంస్థను పెట్టింది. టీడీపీ నేతలను బెదిరించి వారిని ఆర్థికంగా, రాజకీయంగా బలహీనపర్చడానికి ఈ సంస్థను ఒక ఆయుధంగా వాడుకొంటోంది. ఇది తాను చేయాల్సిన పనిని వదిలివేసి వైసీపీ చేతిలో ఒక పనిముట్టుగా మారి ఆ పార్టీకి ఇష్టం లేని వారిని వేధించడానికి ఉపయోగపడుతోంది. ఈ పని కోసమే వైసీపీకి విధేయుడైన చిలకల రాజేశ్వర్‌రెడ్డిని ఈ సంస్థకు ప్రత్యేక కమిషనర్‌గా పెట్టారు. ఈ సంస్థ పనిగట్టుకొని టీడీపీ వారిని లక్ష్యంగా ఎంచుకొని ముందస్తుగా ఏ నోటీసు ఇవ్వకుండా ఆకస్మిక దాడులు, సోదాలు నిర్వహించి అరెస్టులు చేయడం, భారీ జరిమానాలు విధించడం చేస్తోంది. కొద్ది రోజుల క్రితం బాపట్ల జిల్లాలో టీడీపీ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును వేధించారు. ఆ తర్వాత టీడీపీకి చెందిన మాజీ మంత్రి నారాయణ నివాసంపై దాడి చేసి బీభత్సం సృష్టించారు. ఇప్పుడు మరో మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు కుటుంబ సభ్యులపై పడ్డారు. పుల్లారావు కుమారుడు శరత్ ఆ సంస్థలో కేవలం 68 రోజులు మాత్రమే అదీ అదనపు డైరెక్టర్‌గా ఉన్నాడు. అది కూడా 2019 సంవత్సరం చివర్లో ఉన్నాడు. శరత్ అరెస్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ సంస్థకు చెందిన డిప్యూటీ డైరెక్టర్ సీతారామరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం సదరు సంస్థపై వచ్చిన ఫిర్యాదులపై కేంద్ర ప్రభుత్వ జీఎస్టీ సంస్థ విచారణ జరుపుతోంది. రూ.16 కోట్లు జరిమానాగా చెల్లించాలని ఒక నోటీసు కూడా ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ పరిధిలో విచారణలో ఉన్న అంశంలోకి రాష్ట్ర ప్రభుత్వ సంస్థ చొరబడి తప్పుడు ఫిర్యాదులతో అరెస్టులకు ఒడిగట్టడం దిగ్భ్రాంతికరం' అని చంద్రబాబు పేర్కొన్నారు. డీఆర్ఐ సంస్థను కేవలం టీడీపీ నేతలను వేధించడానికే పెట్టారా? అని ఆయన తన లేఖలో ప్రశ్నించారు. దీనిని పెట్టిన ఈ మూడేళ్లలో ఎన్ని కేసులు నమోదు చేశారని ఆయన అడిగారు. "మీరు వెంటనే జోక్యం చేసుకొని ఈ వేధింపులకు అడ్డుకట్ట వేయాలి' అని చంద్రబాబు గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థుల సొమ్ము 5వేలకోట్లు దోచేశారు: కొల్లు

విద్యార్థులకు మేలు చేసే సాకుతో జగన్‌రెడ్డి విద్యారంగాన్ని కూడా తన దోపిడీకి కేంద్రబిందువుగా మార్చుకున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర విమర్శించారు. 'విద్యావ్యవస్థని సర్వనాశనం చేసిన జగన్.. విద్యాదీవెన పేరుతో అబద్ధాలు చెప్పి, విద్యార్థుల్ని మోసం చేస్తున్నాడు. ట్యాబ్‌ల పేరుతో రూ.1,200 కోట్లు, విద్యాకానుక పేరుతో రూ.400 కోట్లు, నాడు-నేడు ముసుగులో రూ.3,000 కోట్లు వెరసి... విద్యార్థులకు దక్కాల్సిన దాదాపు రూ.5,000 కోట్లు దోచేశాడు. 57 నెలల పాలనలో రూ.3,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎగనామం పెట్టిన ఘనుడు జగన్‌రెడ్డి' అని కొల్లు విమర్శించారు.

నిన్నటిదాకా సీఐడీ... ఇప్పుడు డీఆర్ఐ

- తప్పుడు కేసులతో వేధిస్తున్న జగన్
- మీడియాతో పుల్లారావు, కొల్లు రవీంద్ర, ఆనంద సూర్య

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం నిన్నటిదాకా సీఐడీ పేరుతో చేసిన వేధింపులను ఇప్పుడు కొత్తగా డీఆర్ఐ పేరుతో మొదలుపెట్టిందని టీడీపీ ఆరోపించింది. చెత్త పాలనతో ప్రజల్లో పరపతి పోగొట్టుకొని ఇప్పుడు ప్రతిపక్ష పార్టీల వారిని కేసుల్లో ఇరికించి భయపెట్టి గెలవాలని జగన్‌రెడ్డి చూస్తున్నారని ఆ పార్టీ విమర్శించింది. సూట్‌కేసు కంపెనీలు పెట్టి రూ.లక్షల కోట్లు దోచుకోవడంలో ఘనాపాటిగా నిలిచిన జగన్ తన మోచేతి నీళ్లు తాగుతున్న అధికారులతో అవే కేసులు టీడీపీ నేతలపై పెట్టిస్తే ప్రజలు నమ్మరు. జగన్ తరహా మోసాలు ప్రజలకు అర్థమయ్యాయి. ఆ పార్టీకి చెందిన మాజీ మంత్రులు పత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద సూర్య, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు శుక్రవారం ఇక్కడ తమ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'చిలకలూరిపేటలో నాకు టీడీపీ టికెట్ ప్రకటించిన 24 గంటల్లో నా కుమారుడు, నా కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు మోపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ విభాగాన్ని సీఎం తన చేతిలో పెట్టుకొని దాని ఆధ్వర్యంలో తప్పుడు కేసులు పెట్టిస్తున్నారు. చిలకలూరిపేటలో నా విజయం ఏకపక్షంగా ఉండటాన్ని గమనించి నన్ను బలహీనపర్చడానికి ఈ కేసులు పెట్టారు. జగన్‌రెడ్డి ఏం చెబితే అది చేయడం డీఆర్ఐ పనిగా మారింది. పోలీసులు నా కుమారుడిని 16 గంటలపాటు ఆరు స్టేషన్లు తిప్పారు. ఎక్కడ ఎవరిని అడిగినా తమకు తెలియదని చెప్పారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వస్తే తప్ప ఎక్కడ ఉందీ చెప్పబోమని చెప్పడం దుర్మార్గం' అని పుల్లారావు విమర్శించారు. ఎన్నికల్లో ఎదురు గాలి వీస్తోందన్న భయంతోనే జగన్ ప్రభుత్వం టీడీపీ నేతలపై తప్పుడు కేసుల పెడుతోందని కొల్లు రవీంద్ర ఆరోపించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేమూరి ఆనంద సూర్య మాట్లాడుతూ... 'జగన్, పోలీసులు చాటున బతుకుతున్నారు. జగన్‌రెడ్డి పార్టీ తరఫున పోటీ చేయాల్సిన అభ్యర్థులు పరారవుతుంటే కాళ్లు పట్టుకొని కొత్త అభ్యర్థులను తెచ్చుకొంటున్నారు. ఈ పార్టీ త్వరలోనే బంగాళాఖాతంలో కలిసిపోవడం ఖాయం' అని ఆనంద సూర్య వ్యాఖ్యానించారు.



సంఘీభావం తెలుపుతున్న నేతలు

'ఏపీ యునైటెడ్ ఫ్రంట్' ఆవిర్భావం

- వీవీ లక్ష్మీనారాయణ కన్వీనర్‌గా ఏపీలో కొత్త రాజకీయ కూటమి

విజయవాడ(ధర్నాచౌక్), మార్చి 1: రాష్ట్రంలో 'ఏపీ యునైటెడ్ ఫ్రంట్' పేరుతో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటైంది. జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు వీవీ లక్ష్మీనారాయణ ఫ్రంట్ కన్వీనర్‌గా, ఆల్ తెలుగు ప్రజాపార్టీ అధ్యక్షుడు శివన్నారాయణ కో-కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వీవీ లక్ష్మీనారాయణ మాట్లాడారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీలను రాజ్యాధికారంలో భాగస్వాములను చేయాలనే లక్ష్యంతోనే ఏడు పార్టీలతో ఈ ఫ్రంట్‌ను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. 'సమాజంలో మార్పు రాజ్యాధికారంతోనే సాధ్యం. ప్రభుత్వాలు విచ్చలవిడిగా ఖర్చు చేయడం దేశానికి, రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరం. రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయింది. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ఏపీ యునైటెడ్ ఫ్రంట్ అధికారంలోకి రావాలి. రాష్ట్రంలో రెండు బలమైన విష సర్పాలు అధికారం కోసం కొట్లాడుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సంక్షేమాన్ని ఇస్తే తెల్లరేషన్ కార్డులు ఎందుకు పెరుగుతున్నాయి?' అని లక్ష్మీనారాయణ ప్రశ్నించారు. రాష్ట్రంలో రెండు కుటుంబాలు ఆధిపత్యం కోసం యుద్ధం చేస్తున్నాయని, గతిలేక పెత్తందార్లకు ఓట్లు వేస్తున్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ, ఓసీ ప్రజల కోసం ఫ్రంట్‌ను ఏర్పాటు చేశామని లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. జాతీయ సమసమాజం పార్టీ అధ్యక్షుడు రామయ్య యాదవ్, ప్రబుద్ధ రిపబ్లికన్ పార్టీ అధ్యక్షుడు డీ చెన్నకేశవులు, ఫ్రంట్ కో ఆర్డినేటర్ రఘు పాల్గొన్నారు.

వైసీపీలో జోగయ్య కుమారుడు

- సూర్యప్రకాశ్‌కు తాడేపల్లిలో కండువా కప్పిన జగన్

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య కుమారుడు చేగొండి సూర్యప్రకాశ్ వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. శుక్రవారమిక్కడ తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ఆయనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ పరిణామంతో.. ఇటీవల టీడీపీ-జనసేన మధ్య సీట్ల సర్దుబాట్ల విషయంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ హరిరామజోగయ్య ఎందుకు లేఖలు రాశారో స్పష్టమైపోయిందని.. తన కుమారుడి టికెట్ కోసమే వైసీపీకి రాజకీయంగా లబ్ధి చేకూర్చేలా జోగయ్య లేఖలు రాస్తూ వచ్చారని బాహ్యప్రపంచానికి అర్థమైందని జనసేన ముఖ్యనేతలు చెబుతున్నారు. టీడీపీ, జనసేన మధ్య పొత్తుల చిచ్చుకు ఎవరు కుట్ర పన్నారో కూడా తేలిపోయిందని అంటున్నారు.



జనసేన నేత చేగొండి సూర్యప్రకాశ్‌ను వైసీపీలోకి ఆహ్వానిస్తున్న సీఎం జగన్

పర్యాటక శాఖ వారి 'కళా'ధర పోషణ!

(మొదటి పేజీ తరువాయి)

సొమ్ము చేసుకునే కుట్ర ఉన్నట్లు తెలుస్తోంది. రూ.300 దర్శనం టికెట్లను రోజుకు 1200 చొప్పున ఏపీటీడీసీకి టీటీడీ కేటాయిస్తోంది. శ్రీవారి భక్తుల నుంచి ఈ ప్యాకేజీకి మంచి ఆదరణ లభిస్తోంది. అయితే... ఇప్పుడు దీనిని పూర్తిగా ప్రైవేటుకు కట్టబెట్టేశారు. ఇకపై.. టీటీడీ కేటాయించిన ఈ టికెట్లను కళాధర్ సంస్థ తమ బస్సులలో బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు. ఇందుకోసం ఏపీటీడీసీ తన బస్సు సేవలను నిలిపివేసింది. ఇప్పుడు టీటీడీ టికెట్ల మీద కళాధర్ ట్రావెల్స్ వ్యాపారం చేసుకుంటుంటే.. రాయల్టీ రూపంలో వచ్చే అరకొర ఆదాయం మాత్రమే ఏపీటీడీసీకి దక్కుతోంది.

బస్సులే లేని సంస్థతో...

కళాధర్ ట్రావెల్స్‌కు సొంత బస్సులు లేవు. బస్సులను అద్దెకు తీసుకుని నడుపుతోంది. అయినా సరే... అదే సంస్థను ఎంపిక చేసి 35 ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు రహస్య ఒప్పందం చేసుకున్నారు. టెండర్లు కూడా పిలవలేదు. ఏకపక్ష ఒప్పంద వివరాలు ఉన్నతాధికారులకు తప్ప మరొకరికి తెలియవు. ఒప్పందం జరిగి పక్షం రోజులు కావస్తున్నా అంతా రహస్యంగానే ఉంచారు. ప్రస్తుతం చెన్నై, బెంగళూరు నుంచి మాత్రమే తిరుమల ప్యాకేజీ అందుబాటులో ఉంది. నిబంధనల ప్రకారం ఎలక్ట్రిక్ బస్సులను మాత్రమే తిరుమలకు నడపాలి. ఏపీటీడీసీ వెబ్‌సైట్‌లో నియోగో ఎలక్ట్రిక్ బస్సులను నడుపుతున్నట్లుగా కనిపిస్తుంది. కానీ... మరో ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సులనే వినియోగిస్తున్నారు. ఈ బస్సుల కండీషన్ కూడా సరిగా లేదని పర్యాటకులు గొడవ పెడుతున్నారు. ఎలక్ట్రిక్ బస్సులు నడపాల్సిన కళాధర్ ట్రావెల్స్...సాధారణ బస్సులు నడుపుతున్నా ఏపీటీడీసీ ఉన్నతాధికారులకు ఎందుకనో పట్టడం లేదు. ఆ సంస్థ మీద ఉన్నతాధికారులకు ఉన్న ప్రేమే దీనికి కారణమని ఉద్యోగ వర్గాలే అంటున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో ఏపీటీడీసీ ఉన్నతాధికారుల సొంత ప్రయోజనాలు దాగున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై కోర్టును ఆశ్రయించబోతున్నారని తెలిసింది.

యూనిట్లన్నీ ప్రైవేటు చేతుల్లోకి..

ఏపీటీడీసీకి ఆరు మల్టీయాక్సిల్ బస్సులు, 15 హైటెక్ బస్సులు ఉన్నాయి. 'కళాధర్' కోసం వాటన్నింటినీ మూలన పెట్టారు. మరోవైపు తన పర్యాటక యూనిట్లన్నింటినీ రూ.100కోట్ల లీజు పేరుతో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కారుచౌకగా పెట్టేందుకు టెండర్లు పిలిచారు. వాస్తవానికి ఈ యూనిట్ల నిర్వహణ ద్వారా ప్రస్తుతం ఏపీటీడీసీకి రూ.500 కోట్ల ఆదాయం వస్తోంది. ఒకవేళ ప్రైవేటుకు అప్పగిస్తే దీనికంటే ఎక్కువకే ఇవ్వాలి. విజయవాడలోని హరిత బెర్మ్ పార్క్, భవానీ ద్వీపం ద్వారా ఏటా రూ.10కోట్లు వస్తుంటే రూ.5 కోట్ల లోపే లీజుకు కట్టబెట్టేందుకు తెగబడ్డారు.

వలంటీర్లను నిలువరించండి



- హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు
- ప్రతివాదులుగా సీఎం జగన్, మంత్రి ధర్మాన

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ పార్టీల కార్యకలాపాల్లో పాల్గొనకుండా గ్రామ-వార్డు సచివాలయ వలంటీర్లను నిలువరించాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. కేంద్ర ఎన్నికల సంఘం, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆదేశించిన విధంగా.. వలంటీర్లు ఏ అభ్యర్థికీ పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించకుండా ఆదేశించాలని పిటిషన్‌లో కోరారు. వైసీపీ అభ్యర్థుల తరపున ప్రచారం, ఓటర్ స్లిప్‌ల పంపిణీ చేయకుండా నిరోధించాలని కోరారు. ఎన్నికలు ముగిసేవరకు నవరత్నాలు, ప్రభుత్వ పథకాలు ఏవీ వలంటీర్లతో పంపిణీ చేయించకుండా ఆదేశించాలని కోరారు. కడప జిల్లా రాజంపేటకు చెందిన షేక్ అబుబాకర్ సిద్ధిఖి ఈ పిల్ దాఖలు చేశారు. గ్రామ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చేందుకు పంచాయతీరాజ్‌శాఖ 2019 జూన్ 22న జారీ చేసిన జీవో 104, వార్డు వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చేందుకు పురపాలకశాఖ 2019 జూన్ 23న జారీ చేసిన జీవో 201, తదనంతరం జారీ చేసిన జీవోలను చట్ట విరుద్ధమైనవిగా ప్రకటించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్ 2.57 లక్షల వైసీపీ కార్యకర్తలను వలంటీర్లుగా నియమించడాన్ని రాజ్యాంగ, చట్ట విరుద్ధాలుగా ప్రకటించాలని కోరారు. వైసీపీ అభ్యర్థుల గెలుపు కోసం సహకరించాలని వలంటీర్లను కోరడం ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(8)కు విరుద్ధమన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ కోసం ప్రచారం నిర్వహించాలని, పని చేయాలని వలంటీర్లను సీఎం కోరడం ఎన్నికల మూల సిద్ధాంతానికి వ్యతిరేకమని పిటిషన్‌లో పేర్కొన్నారు. సీఎస్, జీఏడీ ముఖ్యకార్యదర్శి, పంచాయతీరాజ్, పురపాలక, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శులు, వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, గ్రామ-వార్డు వలంటీర్లశాఖ ముఖ్యకార్యదర్శి, ఈసీ, ఏపీ సీఈవో, వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి; వ్యక్తిగత హోదాలో ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులను ప్రతివాదులుగా చేర్చారు.

పిటిషన్‌లో ఏముందంటే....

"వైసీపీ తన రాజకీయ లక్ష్యాలను నెరవేర్చుకొనేందుకు గ్రామ-వార్డు వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చింది. సీఎం, మంత్రులు, వైసీపీ నాయకులు.. వలంటీర్లు తమ పార్టీవారేనని బహిరంగ ప్రకటనలు చేస్తున్నారు. వీరికోసం ప్రభుత్వం ప్రజాధనాన్ని ఖర్చు చేస్తోంది. తమకు ఓటు వేయకుంటే పథకాలు రాకుండా చేస్తామని వలంటీర్ల ద్వారా వైసీపీ నేతలు.. ప్రజలను బెదిరిస్తున్నారు. వలంటీర్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరగలేదు. వారి నియామకం కోసం ఎలాంటి నోటిఫికేషన్ జారీ చేయలేదు. అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించలేదు. ప్రతిభను పట్టించుకోలేదు. అధికారపార్టీ కార్యకర్తలను, సానుభూతిపరులను వలంటీర్లుగా ఎంపిక చేశారు. గ్రామ-వార్డు సచివాలయ శాఖపై రూ.7770 కోట్లు ఖర్చుచేశారు. ఈ మొత్తాన్ని వలంటీర్లకే చెల్లించారు. రాజకీయ పార్టీ కార్యకర్తలకు ప్రజాధనం వెచ్చించడం రాజకీయ నిర్ణయం అవుతుందే తప్ప విధానపరమైన నిర్ణయం కాదు. గౌరవ వేతనంగా ఒక్కో వలంటీర్‌కు రూ.5వేలు చొప్పున రూ.1200 కోట్లు కేటాయించారు. వారి శిక్షణా కార్యక్రమాలకు 13.5 కోట్లు ఖర్చు చేశారు. వార్డు వలంటీర్లకు జీతాల కింద రూ.243 కోట్లు, శిక్షణ కోసం రూ.3.44కోట్లు కేటాయించారు. వైసీపీ, సీఎం జగన్ తమ ప్రయోజనాల కోసం ప్రజా సొమ్ము లూటీ చేస్తున్నారు. ఈ సొమ్మును ఆ పార్టీ నుంచి, జగన్ నుంచి వసూలుచేయాలి. వలంటీర్లకు ఎలాంటి సర్వీసు నిబంధనలు లేవు. పర్యవేక్షించేందుకు ఎలాంటి వ్యవస్థా లేదు. దీంతో వీరు ఏ భయం లేకుండా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి వీల్లేదని ఈసీ స్పష్టంచేసింది. అయితే సీఎం జగన్ బహిరంగంగా ప్రతిరోజూ వలంటీర్లు వైసీపీ విజయం కోసం పని చేయాలని ప్రకటనలు చేస్తున్నారు. అంతేకాక వలంటీర్లను తమ పార్టీని ముందుండి నడిపే ప్రధాన సైనికులుగా అభివర్ణిస్తున్నారు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలను ప్రభావితం చేయడానికి వైసీపీ, జగన్.. వలంటీర్లను వాడుతున్నారు. ఇలాంటివాటిని అనుమతిస్తే స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు సాధ్యపడవు"

వైసీపీకి ఓటేయొద్దు!



(మొదటి పేజీ తరువాయి)

"వైఎస్సార్‌సీపీకి ఓటు వేయొద్దు" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఐదేళ్లలో అతి తక్కువ సందర్భాల్లో మాత్రమే మీడియా ముందుకు వచ్చిన సునీతా రెడ్డి... శుక్రవారం ఢిల్లీలో సుదీర్ఘంగా విలేకరులతో మాట్లాడారు. వివేకా హత్య నుంచి తాజా పరిణామాల దాకా అనేక అంశాలపై స్పందించారు. వివేకా హత్య కేసులో సీఎం జగన్ పాత్రపైనా విచారణ జరగాలన్నారు. సీబీఐ దర్యాప్తు తీరుపై సందేహాలు వ్యక్తం చేశారు. "జగనన్న నోట విలువలు... విశ్వసనీయత అనే మాటలు పదేపదే వింటుంటాం! మాట తప్పను మడమ తిప్పను... నా అక్క, నా చెల్లెమ్మ అని పదేపదే అంటుంటారు. మా నాన్న విషయంలో ఇవన్నీ గుర్తుకు రావా? నేను ఆయన చెల్లెలినే కదా? ఈ చెల్లెలి విషయంలో ఏమయ్యాయి విలువలు? ఈ చెల్లెమ్మకిచ్చిన మాట ఏమైంది?" అని సునీత ప్రశ్నించారు. ఆయా అంశాలపై సునీతా రెడ్డి ఏమన్నారంటే...

ఎమ్మెల్సీ ఎన్నికలప్పుడే...

మార్చి 15కి నాన్నను చంపేసి ఐదేళ్లు అవుతుంది. సాధారణంగా హత్య కేసులో నాలుగైదు రోజుల్లో ఎవరు చేశారన్నది తెలిసిపోతుంది. ఈ కేసులో ఐదేళ్లయినా ఇంకా ఎందుకు తెలియడం లేదు? ఇది ఐదేళ్ల క్రితం జరిగిన హత్య అయినప్పటికీ దీని మూలాలు 2017లోనే ఉన్నాయి. ఆ రోజున ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకానంద రెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనను మోసం చేశారు. సొంత వాళ్ల మద్దతు లేక ఆయన ఓడిపోయారు. దాంతో ఆయన వెనక్కి తగ్గుతారని భావించారు. కానీ, ఆయన రెట్టింపు బలంతో జనంలోకి వెళ్లడం మొదలుపెట్టారు. ఎంత ప్రయత్నించినా ఈయన్ని అణచివేయలేక పోతున్నామని వారిలో భయం మొదలైంది. అదే ఆయన హత్యకు దారి తీసింది. అప్పట్లో మాకిదంతా అర్థం కాలేదు!

మన మధ్యే 'హంతకులు'

చాలాసార్లు క్రిమినల్ కేసులలో హంతకులు మనమధ్యనే ఉంటారు. కానీ... మనం అనుమానించలేం. గుర్తించలేం. వివేకా హత్య జరిగిన తర్వాత మేం మార్చురీ దగ్గర ఉన్నప్పుడు ఎంపీ అవినాశ్ రెడ్డి నా దగ్గరకు వచ్చి... పెదనాన్న ఆ రోజు రాత్రి 11:30 వరకు నా కోసం ప్రచారం చేశారని చెప్పారు. మూడు నాలుగు రోజుల తర్వాత కేంద్ర ఎన్నికల కమిషనర్ వద్దకు ధర్మారెడ్డి (ప్రస్తుతం టీటీడీ ఈవో) దగ్గరుండి తీసుకెళ్లారు. వాళ్ల నుంచి అంతగా సాయం వస్తుంటే వారిని అనుమానించలేం కదా? అప్పుడే ఈ కేసు సీబీఐకి అప్పగించాలని మా అమ్మ పిటిషన్ వేశారు. జగనన్న కూడా కేసు సీబీఐకి ఇవ్వాలని పిటిషన్ వేశారు. దాంతో అంతా సక్రమంగానే జరుగుతోందని భావించా! ఎన్నికలు ముగిసిన తర్వాత జగనన్న ముఖ్యమంత్రి అయ్యారు. అప్పుడు సీఎం జగన్‌ను కలిస్తే... 'చిన్నాన్నను చంపిన వారిని నేను పట్టుకోకుంటే ఎవరు పట్టుకుంటారు? నేను దీనిని పరిష్కరిస్తాను. నిందితులను గుర్తిస్తాం. పట్టుకుంటాం" అని హామీ ఇచ్చారు. నేనూ నమ్మాను!

ఆ రోజే జగన్ నైజం అర్థమైంది!

వివేకానందరెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహావిష్కరణకు జగనన్నను పిలిచాం. ఆ రోజే కియా ఫ్యాక్టరీలో ఒక ప్లాంట్‌ను సీఎం ప్రారంభించాల్సి ఉంది. అయితే, అక్కడిదాకా వచ్చి వివేకా విగ్రహావిష్కరణకు కూడా రావాల్సి వస్తుందని ఏదో నెపంతో ఆ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. ఆ తర్వాత ఈ కేసు చూస్తున్న విచారణాధికారులు, పోలీసు అధికారులు మారిపోయారు. ఒక రోజు కుటుంబ సమావేశంలో సీఎంగా, నా అన్నగా సహకరించాలని, సీబీఐ విచారణ కోసం ఒత్తిడి తేవాలని జగన్‌ను అడిగాను. 'సీబీఐకి వెళ్తే అవినాశ్ బీజేపీలోకి వెళ్తాడు' అని ఆయన బదులిచ్చారు. అంతేకాదు, 'సీబీఐకి ఇస్తే నాపై 11 కేసులున్నాయి.. అలాగే ఇది 12వ కేసు అవుతుంది' అన్నారు. ఇలా సంబంధం లేకుండా సమాధానం చెప్పడం ఆశ్చర్యం కలిగించింది. ఆ తర్వాత నాపైనా, నా భర్తపైనా అనుమానం వచ్చేలా మాట్లాడడం మొదలుపెట్టారు.

వైవీ, సజ్జల ఏమన్నారంటే...

"మమ్మల్నీ విచారించండి. అందరినీ విచారించండి. అంతిమంగా నాకు న్యాయం కావాలి" అని పదేపదే కుటుంబ సభ్యుల నుంచి అందరినీ కలిసి వేడుకుంటూనే ఉన్నా. వైవీ సుబ్బారెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డిలను చాలాసార్లు కలిసి మాట్లాడా. సీబీఐ దర్యాప్తు కోరతానని అన్నప్పుడు... వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డితోపాటు మరి కొందరు వద్దని చెప్పారు. సుమారు రెండు, మూడు నెలల పాటు నా మనసు మార్చే ప్రయత్నం చేశారు. మరోవైపు.. అంతకుముందు సీబీఐ విచారణ కోరుతూ జగన్ వేసిన పిటిషన్ వెనక్కి తీసుకోవడం మరింత విస్మయం కలిగించింది. చివరకు సీబీఐకి కేసును బదిలీ చేయాలని నేను కోర్టుకు వెళ్లాల్సి వచ్చింది.

కర్నూలులో అవినాశ్ డ్రామాలు..

వివేకా హత్య కేసులో ఏ5గా ఉన్న డి.శివశంకర్ రెడ్డిని సీబీఐ అరెస్టు చేయగానే సీన్ మొత్తం మారిపోయింది. 'నెక్స్ట్ ఎవరు?' అనే ప్రశ్న వస్తే... ఆ తర్వాత ఉన్నది వైఎస్ భాస్కర్ రెడ్డి, వైఎస్ అవినాశ్ రెడ్డి. దీంతో సీబీఐ అధికారులపైనే కేసులు పెట్టడం మొదలైంది. సీబీఐ అధికారులు కడప నుంచి వెళ్లిపోయేలా చేశారు. దర్యాప్తు త్వరగా పూర్తి చేయాలని, కేసు విచారణను తెలంగాణ హైకోర్టుకు మార్చాలని సుప్రీంకోర్టు ఆదేశించిన తర్వాతే మళ్లీ దర్యాప్తు మొదలైంది. స్థానిక ఎంపీగా, బాధ్యత కలిగిన వ్యక్తిగా కేసులో తనకు తెలిసిన విషయాలను చెప్పాల్సిన ఎంపీ అవినాశ్ రెడ్డి.. విచారణకు రమ్మని సీబీఐ పిలిచినా తనకు వేరే పనులున్నాయని, సమయం కావాలని కోరడమేంటి? కర్నూలులో ఆస్పత్రి వద్ద జరిగిన డ్రామా అందరూ చూశారు. మొత్తం తమాషా! తమకు కావాల్సిన వ్యక్తి ఎదురుగా ఉన్నా.. సీబీఐ అధికారులు అక్కడకు వెళ్లలేకపోయారు. అవినాశ్‌కు బెయిల్ వచ్చిన తర్వాత సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. మళ్లీ దర్యాప్తు ఆగిపోయింది!

అండగా షర్మిల, ప్రజలు...

జగన్‌కు భయపడి కుటుంబంలో ఎవరూ మాకు అండగా ముందుకు రాలేదు. షర్మిల ఒక్కరే తొలినుంచీ అండగా నిలిచారు. ప్రజలూ మద్దతు తెలుపుతున్నారు. నాకు న్యాయం జరగాలని ఆకాంక్షిస్తున్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్, మహాసేన రాజేష్, సీపీఐ నేత నారాయణ, సీపీఎం నేత గఫూర్, బీజేపీ నేతలు ఆదినారాయణ రెడ్డిలతో పాటు తులసిరెడ్డి, కొలికిపూడి శ్రీనివాస్, పట్టాభి, బొండా ఉమా, వర్ల రామయ్య, జడ శ్రవణ్ వంటివారెందరో నాకు మద్దతుగా నిలిచారు. అందరికీ ధన్యవాదాలు.

కాల్ లిస్ట్ విడుదల...

వివేకా హత్య రోజు తెల్లవారుజామున 1:37 నుంచి 5:18 గంటల వరకు వైఎస్ అవినాశ్ రెడ్డి, గంగిరెడ్డిల మధ్య జరిగిన కాల్ లిస్టును సునీత విడుదల చేశారు. కేసులో ఏ2గా ఉన్న సునీల్ యాదవ్‌కు అవినాశ్ రెడ్డితో సన్నిహిత సంబంధం ఉందన్నారు. తన తండ్రి హత్య జరిగిన రోజు రాత్రి 1:58 గంటలకు సునీల్ యాదవ్. అవినాశ్ రెడ్డి ఇంట్లోనే ఉన్నట్టు గూగుల్ లోకేషన్ కూడా చూపించిందని తెలిపారు. మరో నిందితుడు గజ్జల ఉదయ్ కుమార్ రెడ్డి తన తండ్రి హత్యకు ముందురోజు, హత్య జరిగిన రోజు ఉదయం అవినాశ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి ఇంటికి వెళ్లాడని తెలిపారు. హత్య జరిగిన రోజు ఉదయం అవినాశ్ రెడ్డి ఎక్కడ ఉన్నారో తేల్చాల్సిన అవసరం ఉందన్నారు. కేసులో ఏ5గా ఉన్న శివశంకర్ రెడ్డి కొడుకు జైలుకు వెళ్లి దస్తగిరిని కలిసి ప్రలోభ పెట్టినట్టు తెలిసిందని సునీత తెలిపారు. దర్యాప్తు అధికారి రామ్‌సింగ్ బలవంతంగా వాంగ్మూలం ఇప్పించినట్లు చెబితే రూ.20 కోట్లు ఇస్తామని దస్తగిరికి చెప్పారన్నారు. అనేక విషయాల్లో స్పష్టత రావాల్సి ఉందని...అందుకే అవినాశ్ రెడ్డిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించాలని ఆమె కోరారు.

'అన్న'కు సూటి ప్రశ్నలు...

- "జగనన్న దుష్ట చతుష్టయం అంటుంటారు కదా! విపక్షాలకు ఏమైనా పేర్లు పెట్టండి. కానీ, వివేకానంద రెడ్డిని చంపిన దుష్టులను వదిలేస్తే ఎలా? వదిలేయడం కాదు.. వారికి వత్తాసు పలికి.. అండగా నిలిస్తే తప్పు కాదా?
- మంచికి చెడుకు యుద్ధం అని అంటున్నారు కదా! ఇక్కడ ఏది మంచి? ఏది చెడు? చంపినవాళ్లను రక్షించడం మంచిదా?
- రాష్ట్రంలో పేదలకు పెత్తందారులకు మధ్య యుద్ధం అంటుంటారు. వివేకా కేసులో ఈ పెత్తందారులందరూ సాక్షులను ప్రభావితం చేస్తుంటే ఏం చేస్తున్నారు? కరోనా టైంలో విశాఖలో డాక్టర్ సుధాకర్ విషయంలో ఆయన కోసం ఎవరు పోరాడారు? ఒక ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపేసి డోర్ డెలివరీ చేస్తే వారికి అండగా ఎవరు నిలబడ్డారు?

వివేకా హత్యలో సునీత కుటుంబం పాత్ర!

- ఈ అనుమానంపైనా విచారణ జరగాలి: సజ్జల

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్యలో ఆయన కుమార్తె సునీత కుటుంబ సభ్యుల పాత్ర ఉండేమోననే అనుమానం చాలామందికి ఉందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'సీబీఐకి ఇచ్చిన కొన్ని వాంగ్మూలాలు లోతుగా చూస్తే అది కనిపిస్తోంది. దాన్ని తప్పించుకోడానికి దొంగే దొంగ అన్నట్లు తిప్పికొడుతున్నారేమో అనే అనుమానం వస్తోంది. విచారణ జరిగితే వాటి మీద కూడా జరగాలి. తన తండ్రిని ఎలా కిరాతకంగా గొడ్డలితో నరికి చంపాడో చెప్పినోడినే అక్కున చేర్చుకుని సోదరుడి కింద చూస్తున్న వీళ్లను ఏమనాలి? సునీత ఈరోజు ముసుగు తీసేసింది. చంద్రబాబు చేతిలో పావులా మారింది. ఆమె మాట్లాడినవన్నీ చంద్రబాబు పలికించిన చిలుక పలుకులే. ఎన్నికల వేళ రాజకీయ కుట్రతోనే ఢిల్లీలో సునీత ప్రెస్‌మీట్ పెట్టారు. నాడు వివేకాను ఓడించిన వ్యక్తులకే సునీత థ్యాంక్స్ చెప్తున్నారు. అన్యాయం జరిగిందని తప్పుడు ఆరోపణలు చేసి.. జగన్‌ను శిక్షించమనడం విచిత్రం. తన తండ్రిని కిరాతకంగా చంపినవాడు సునీతకు మంచోడెలా అయ్యాడు? ఆమె ఎవరి ప్రతినిధిగా మాట్లాడుతున్నారో, ఎవరి ప్రతినిధిగా ఇన్నాళ్లు తప్పుడు కేసు బిల్డ్ చేస్తున్నారో ఈ రోజు బయటపడింది. వైసీపీకి ఓటు వేయొద్దని సునీత నినాదం ఇవ్వడం ఏంటి? దీన్నిబట్టే ఆమె ప్రతిపక్షాలతో కలిసి పోయింది. ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి చంద్రబాబు ఉసిగొల్పారు. గత ప్రభుత్వ హయాంలో హత్య జరిగితే విచారణ అప్పుడే ఎందుకు ముగించలేకపోయారు? ఆమె ప్రజాకోర్టులో తేలాలి అంటోంది.. అదే తేలుతుంది' అన్నారు. పవన్ కల్యాణ్ 24సీట్లు తీసుకుని 240 సీట్లు అనుకుంటే ఎలా అని సజ్జల వ్యాఖ్యానించారు. చంద్రబాబు పెట్టుకున్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ జనసేన అని సజ్జల విమర్శించారు.

పంచాయతీరాజ్.. అధిపతులు అవుట్..!

- జీఏడీకి బుడితి రాజశేఖర్
- ఫిషరీస్ కమిషనర్‌గా సూర్యకుమారి
- పీఆర్ హెడ్‌లకు ఒకేరోజు స్థానచలనం
- అడుగులకు మడుగులు వత్తినా రాజశేఖర్‌కు తప్పని అవమానాలు!



బుడితి రాజశేఖర్



సూర్యకుమారి

అమరావతి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ నుంచి ఒకేసారి ఇద్దరు ఉన్నతాధికారులను ప్రభుత్వం తప్పించింది. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్‌కు కనీసం పోస్టు ఇవ్వకుండా సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్టు చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారిని ఫిషరీస్ కమిషనర్‌గా బదిలీచేశారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో పనిచేస్తున్న ముఖ్య అధికారితో వచ్చిన బేదాభిప్రాయాలే రాజశేఖర్‌పై వేటుకు కారణమని సీఎంవో వర్గాల్లో చర్చ జరుగుతోంది. వాస్తవానికి, బుడితి రాజశేఖర్ తొలి నుంచి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్నారు. ప్రభుత్వం ఏం చేయమంటే అది చేయడంతోపాటు, ప్రభుత్వ పెద్దలకు పూర్తిగా సహకరించారనే అభిప్రాయం ఉంది. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉండగా, జగన్ ఆదేశాల ప్రకారం పనిచేసి.. అప్పట్లో తీవ్ర విమర్శలపాలయ్యారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి లభించిన తర్వాత ప్రభుత్వం ఆయనకు కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు బదిలీ చేసింది. ఈ మధ్య కాలంలో సీఎంవోకి, ఆయనకి మధ్య బేదాభిప్రాయాలు వచ్చాయి. సీఎం కార్యాలయంలో పని చేస్తున్న ముఖ్య అధికారితో ఆయనకు కొద్దిరోజులుగా పడటం లేదు. సీఎంవో అధికారికి అనుచరునిగా ఉన్న వ్యక్తి పంచాయతీరాజ్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఆయన నిర్ణయాలను బుడితి రాజశేఖర్ వ్యతిరేకిస్తున్నారు. అక్కడ నుంచి వచ్చిన ఫైల్స్‌ను నెగటివ్ చేస్తున్నారు. దీంతో సదరు సీఎంవో అధికారి.. రాజశేఖర్‌పై కన్నెర్ర చేశారని చెబుతున్నారు. "మా నిర్ణయాలనే అడ్డుకుంటావా? మేం చెప్పినవి చేయవా" అంటూ బదిలీ అస్త్రం ప్రయోగించారు. చివరకు పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. ఆయనతోపాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారిపై కూడా బదిలీ వేటు పడింది. ఆమెను పంచాయతీరాజ్ నుంచి తప్పించి ఫిషరీస్ కమిషనర్‌గా బదిలీ చేశారు. పంచాయతీరాజ్ నుంచి ఒకేసారి ఇద్దరు కీలక అధికారులను బదిలీ చేయడం ఐఏఎస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

శశిభూషణ్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు..

జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌కు బుడితి రాజశేఖర్ స్థానంలో పంచాయతీరాజ్ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఫిషరీస్ కమిషనర్‌గా ఉన్న కె.కన్నబాబును సూర్యకుమారి స్థానంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా నియమించారు. పర్యాటక శాఖ ఎండీగానూ ఆయన అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. ఐఏఎస్ అధికారి ఎండీ ఇంతియాజ్ రాజకీయాల్లోకి రావడంతో, ఆయన తన సర్వీసుకు రాజీనామా చేశారు. ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించిన ఆయనకు కర్నూలు సీటును జగన్ కేటాయించారు. దీంతో ఇప్పటివరకు ఆయన నిర్వహించిన మైనార్టీ వెల్ఫేర్ సెక్రటరీ, సెర్ప్ సీఈవో, అడిషనల్ సీసీఎల్‌ఏ బాధ్యతలను కొత్త వారికి అప్పగించారు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్‌కు మైనార్టీ వెల్ఫేర్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు కట్టబెట్టారు. ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ డి. మురళీధర్‌రెడ్డికి సెర్ప్ సీఈవోగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. హౌసింగ్ ఎండీ కె.వెంకటరమణ రెడ్డికి అదనపు సీసీఎల్ఏ, సీసీఎల్ఏ సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు.

ప్రైవేటు బీఈడీ కళాశాలలకు ఊరట

- ఈడబ్ల్యూఎస్ కోటా సీట్ల భర్తీకి హైకోర్టు అనుమతి

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బీఈడీ కళాశాలల యాజమాన్యాలకు హైకోర్టులో ఊరట లభించింది. అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) కోటా కింద 10శాతం సీట్ల భర్తీని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ సదరన్ రీజినల్ కమిటీ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను హైకోర్టు సస్పెండ్ చేసింది. అవకతవకలకు పాల్పడిన కొన్ని ప్రైవేటు కళాశాలలపై విచారణ జరుగుతుందనే కారణంతో ఈడబ్ల్యూఎస్ కోటా అందకుండా చేయడానికి వీల్లేదని పేర్కొంది. ఆ కళాశాలలపై విచారణను కొనసాగించడానికి కోర్టు ఇచ్చిన ఉత్తర్వులు అవరోధం కాబోవని తెలిపింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శుక్రవారం ఉత్తర్వులు ఇచ్చారు. బీఈడీ కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం సీట్ల భర్తీని తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ సదరన్ రీజినల్ కమిటీ నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ వినుకొండకు చెందిన శ్రీవివేకానంద కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్‌తో పాటు మరో 19 కాలేజీల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్ల భర్తీకి అనుమతించకపోవడం ప్రాథమిక హక్కులను హరించడమేనని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. సీట్ల భర్తీలో ప్రైవేటు కాలేజీలు అవకతవకలకు పాల్పడుతున్నాయని, వాటిపై విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఈడబ్ల్యూఎస్ కోటా కింద సీట్ల భర్తీని నిలుపుదల చేశారని చెప్పారు. ఈ వాదనను న్యాయమూర్తి తప్పుబట్టారు.

హెల్త్ కార్డుల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): హెల్త్ కార్డుల సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబును ఉద్యోగ సంఘాల నేతలు కోరారు. వెలగపూడి సచివాలయంలో ఉద్యోగ సంఘాల నేతలతో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు అనేక సమస్యలను అధికారులను దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా హెల్త్ కార్డుల సమస్యలు ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే అర్హత కలిగిన కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల నేతల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని కృష్ణబాబు హామీ ఇచ్చారు.

రాజకీయ పార్టీలకు వర్క్‌షాపులు

- ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీకి ప్రాధాన్యం: మీనా

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, మీడియా ప్రతినిధులను ఎన్నికల ప్రక్రియలో పూర్తిస్థాయిలో భాగస్వాములను చేసేందుకు అవసరమైన వర్క్‌షాపులను ఈ నెల 10వ తేదీలోపు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనా జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఆరోపణలకు తావు లేకుండా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు వీరి సహకారం, భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. అందుకే ఎన్నికల షెడ్యూల్ ఖరారు కాకముందే వర్క్‌షాపులను నిర్వహించాలని నిర్దేశించారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల సంసిద్ధతకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు గుర్తింపు కార్డుల ముద్రణ పూర్తయిన వెంటనే జిల్లా ఎన్నికల అధికారులకు అందుతున్నాయని, వీటి పంపిణీకి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, దీని కోసం ప్రత్యేకంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పెండింగ్ ఫారంలను పరిష్కరించడంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారులు తప్పని సరిగా సందర్శిస్తూ, స్థానికులతో తరచుగా సమావేశాలు నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పనపై జిల్లాల్లో ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆయన సమీక్షించారు.

'కోనసీమ'లో జే ట్యాక్స్!


బడుగు, బలహీనవర్గాల నిరుపేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ కోసం 350 ఎకరాల భూమిని ఆ నియోజకవర్గంలో సుమారు రూ.175 కోట్ల ఖర్చుతో ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధమైంది. ఇదే అదునుగా ఆ ఎమ్మెల్యే పావులు కదిపారు. దాదాపు 250ఎకరాల పైగా మెయిన్‌రోడ్డుకు దూరంగా మారుమూల ప్రాంతాల్లో ఉన్న వాటిని తక్కువ ధరకు కొన్నారు. వాటిని ప్రభుత్వానికి ఎక్కువ రేటుకు అంటగట్టారు. ఎకరం భూమిని సదరు నేత రూ.20లక్షలకు కొంటే.. ఆయన నుంచి ప్రభుత్వం రూ.45లక్షలు వెచ్చించి కొనుగోలు చేసింది. ఒక్క పేదల ఇళ్ల స్థలాలపైనే రూ.70 కోట్ల రూపాయల మేర లాభాలు ఆర్జించారనే ఆరోపణలు ఉన్నాయి.

(మొదటి పేజీ తరువాయి)

చేస్తూ ఆయన సమీప బంధువొకరు షాడో ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి వేధించడం, వ్యాపార సంస్థల నుంచి దౌర్జన్యంగా మామూళ్ల వసూలు చేయడం, మద్యం షాపుల నుంచి అదనపు అద్దె నుంచి అక్రమ మద్యం విక్రయాల వరకు... ఇలా ఒక్కటేంటి నియోజకవర్గ ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారనే ఆరోపణలు ఆ ఎమ్మెల్యేపై వెల్లువెత్తుతున్నాయి. సీఎం జగన్ హయాంలో సామాజికవర్గ బలాన్ని వాడుకొని కోనసీమ జిల్లా వైసీపీ నేతలను శాసించే స్థాయికిచేరారు. ఆయన తండ్రి రెండు పర్యాయాలు ఎమ్మెల్యే ఆ రాజకీయ వారసత్వం దన్నుతో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కాంగ్రెస్ నుంచి యువ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. జగన్ వైసీపీ పార్టీని పెట్టగానే అందులో చేరి.. వరుసగా రెండుసార్లు విజయం సాధించారు. హ్యాట్రిక్ కొట్టేందుకు విచ్చలవిడిగా ఆయన అధికార దుర్వినియోగానికి తెగబడుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి.

బదిలీలే బహుమానం..వేధింపులే శరణ్యం...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ర్యాంపుల్లో అత్యధికం ఈ నియోజకవర్గంలోనే ఉన్నాయి. ఇక్కడి నుంచి నిత్యం వందల లారీల ఇసుక అటు ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, ఇటు విశాఖపట్నం జిల్లాలకు అక్రమంగా తరలిపోతోంది. ఇసుక ర్యాంపులపైనే రూ.కోట్లు ఆ ఎమ్మెల్యే ఆర్జించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక ర్యాంపుల పారదర్శకతకు పాతరేసిన జిల్లా యంత్రాంగం, ఎన్నిసార్లు న్యాయస్థానాల నుంచి హెచ్చరికలు వచ్చినా వాటన్నిటినీ బేఖాతరు చేస్తోంది. గ్రీన్ ట్రిబ్యునల్ పర్యావరణ అనుమతుల కోసం అడిగినప్పుడు తప్పుడు ధ్రువీకరణ అందజేస్తున్నారు. జగన్ ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఎస్ఈబీ అధికారులు ఈ నియోజకవర్గ పరిధిలో ఎన్ని అక్రమాలు జరిగినా పట్టించుకోరు. పోలీసు, రెవెన్యూ అధికారులు సదరు ఎమ్మెల్యే కనుసన్నల్లోనే విధులు నిర్వర్తించాలి. లేదంటే వారికి బదిలీలే బహుమానం. వేధింపులే శరణ్యం. తన నియోజకవర్గంలో 12వేల మంది నిరుపేదలకు జగనన్న కాలనీల పేరిట పట్టాలు పంపిణీ చేశామని ఆ నేత చెప్పుకొంటారు. కానీ, ఇప్పటికీ లబ్ధిదారులకు ఆ స్థలాలను అప్పగించలేదు. కానీ, ఆ పేదల ఇళ్ల స్థలాల మెరక పేరుతో గత మూడేళ్లుగా మట్టి దోపిడీ యథేచ్ఛగా సాగిపోతోంది. గౌతమి, వశిష్ఠ నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వందల ఎకరాల లంక భూములను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. ఇదేమిటని అడిగే అధికారులే కరువయ్యారు.



ఆ ఎమ్మెల్యే అనుచరులు కొందరు బ్రోకర్ల అవతారం ఎత్తి హస్తలాఘవం చూపుతున్నారు. మద్యంషాపుల కోసం బిల్డింగులను లీజుకు తీసుకుంటారు. వాటిని ప్రభుత్వానికి ఎక్కువ రేటుకు లీజుకు ఇస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఉదాహరణకు ఒక మద్యం షాపును రూ.10వేలకు లీజుకు తీసుకుని అదే షాపును రూ.20వేల నుంచి రూ.30వేలకు ప్రభుత్వానికి అంటగడుతున్నారు. ఈ నియోజకవర్గంలో మద్యం ఏరులై పారుతోంది. ఎంతగా అంటే.. నేరుగా డిస్టలరీల నుంచి మద్యం ఇక్కడ కొన్ని ప్రాంతాలకు సరఫరా అవుతోందని, ఇతర రాష్ట్రాల బ్రాండ్లతోపాటు సొంత మేడ్ మద్యం కూడా తయారుచేసిన ఆనవాళ్లు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గంజాయి ఈ ప్రాంతంలో విచ్చలవిడిగా లభ్యమవుతోందని గతంలో భారీగా పట్టుబడిన కేసుల ఆధారంగా తెలుస్తోంది.

భూ కబ్జాలు.. లేఅవుట్లపై దందాలు..

ఆ ఎమ్మెల్యే కన్ను పడిందంటే చాటు విలువైన ఆస్తులు ఆయన సొంతం కావాల్సిందే. బ్రాహ్మణ కుటుంబాలకు చెందినవారి ఆస్తులను నయానో, భయానో వారి నుంచి స్వాధీనం చేసుకున్న ఉదంతాలెన్నో ఉన్నాయి. వినకపోతే వారి బ్యాంకు అకౌంట్లలో సొమ్ములు జమచేసి మరీ ఆ భూములను కబ్జా చేస్తున్నారు. ఈ వ్యవహారంలో గ్రామస్థాయిలో కొందరు పంచాయతీ కార్యదర్శులే బ్రోకర్లుగా పనిచేస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. దీనికి వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా, నిజాయితీగా డ్యూటీ చేయాలని ప్రయత్నించినా కేసులు, వేధింపులే బహుమానం. ఓసారి దళిత యువకులపై కఠినమైన సెక్షన్లతో కేసులు పెట్టించిన వ్యవహారంలో ఆ ఎమ్మెల్యే పాత్ర కీలకమంటూ దళిత సంఘాలు రోడ్డెక్కాయి. ఇక మట్టి, ఇసుక మాఫియా, ఏ పనినైనా ఎదిరించే వారిపై రౌడీ షీట్లు తెరుచుకుంటాయి. పోలీసుశాఖ అధికారులు ఆ ఎమ్మెల్యే అక్రమ దందాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇంటి నుంచే షాడో పాలన!

ఎమ్మెల్యే సమీప బంధువొకరు అన్నీతానై షాడో ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు. అధికారులను ఇంటికి రప్పించుకుని పనులు పురమాయిస్తుంటారని చెబుతారు. రోడ్లు, ఇతర భవన నిర్మాణాలకు సంబంధించిన అంచనాలు ఎలా తయారుచేయాలో కూడా ఎమ్మెల్యే ఇంటి నుంచే షాడో ఎమ్మెల్యే ఆదేశిస్తుంటారట! వాటిని అధికారులు కచ్చితంగా పాటించాల్సిందే. ఆయన ఇంటికే వచ్చి ఫైళ్లపై కొందరు అధికారులు సంతకాలు చేయాల్సిన పరిస్థితి! పంచాయతీరాజ్ శాఖలో చేయని పనులకు సైతం కొందరు అధికారులు బిల్లులు చెల్లించారు. దీనికిగాను రూ.లక్షల్లోనే లాభపడినట్టు చెబుతున్నారు. బదిలీలకు భారీగానే గతంలో సొమ్ములువసూలు చేశారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. నియోజకవర్గంలోని ప్రసిద్ధి చెందిన ఆలయంలో అన్నదాన నిధులు కైంకర్యం చేయడంతోపాటు 'సూపర్ చైర్మన్'గా అక్కడ అధికారాలు చెలాయిస్తుంటారని చెబుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.



గన్నవరంలో తెలుగు మహిళలతో నిర్వహించిన మీతో మీ నాయకుడు చర్చా వేదికలో మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకట్రావు

ఎన్టీఆర్ బిడ్డను అవమానించిన
వారికి బుద్ధి చెబుదాం

- టీడీపీతోనే మహిళాభ్యున్నతి సాధ్యం
- నియోజకవర్గానికి ఎంఎన్‌సీలను తీసుకొస్తా: యార్లగడ్డ

గన్నవరం, మార్చి 1: "మహిళల అభ్యున్నతికి టీడీపీ ఎంతో చేసింది. అదే ఒరవడిని చంద్రబాబు కొనసాగిస్తున్నారు. ఎన్టీఆర్ బిడ్డను అవమానించిన వారికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుదాం." అని తెలుగు మహిళలకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మహిళలపై లైంగిక దాడులు పెరిగాయన్నారు. గన్నవరంలోని ఓ ఫంక్షన్ హాలులో తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమాదేవి అధ్యక్షతన శుక్రవారం తెలుగు మహిళలతో నిర్వహించిన మీతో మీ నాయకుడు చర్చావేదికలో యార్లగడ్డ మాట్లాడారు. వైసీపీ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలపై టీడీపీ అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తానని అన్నారు. కొండలు, గుట్టలు తవ్వి అక్రమ మైనింగ్ చేసి అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని దొంగ ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు రంగం సిద్ధమైందని, వెళ్లిపోయిన తహసీల్దారు పేరుతో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని చూస్తున్నారని అధికారులు ఇందులో పాలుపంచుకుంటే అధికారంలోకి వచ్చాక అంతకంతకు అనుభవిస్తారని ఆయన హెచ్చరించారు. బ్రహ్మయ్యలింగం చెరువును అడ్డగోలుగా దోచేసి దేవుడి విగ్రహాలను పెకిలించి తరలించారన్నారు. గన్నవరం ప్రశాంతంగా ఉండాలంటే టీడీపీ జెండా ఎగరాలన్నారు. మల్లవల్లి, వీరపనేనిగూడెంతో పాటు విమానాశ్రయం ఎదురుగా ఉన్న 15ఎకరాల్లో ఎంఎన్‌సీలను తీసుకువస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులపై, కార్యాలయంపై దాడి బాధాకరమన్నారు. మహిళలకు రుణ వసతి కల్పించి పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా ఉండి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. సీబీఎన్ ఫోరం మహిళా సభ్యురాలు సుమిత్ర, యార్లగడ్డ వెంకట్రావు సతీమణి జ్ఞానేశ్వరి, మూల్పూరు సాయి కల్యాణి, మండవ లక్ష్మి, చిక్కవరపు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

రాజధాని పేదలకు పెన్షన్
మరో పదేళ్లు పొడిగించాలి

- వైసీపీ ప్రభుత్వమొచ్చినప్పటి నుంచి పెన్షన్ పెంపు వర్తింపజేయాలి
- బకాయిలతో సహా ఆ మొత్తాన్ని చెల్లించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్

లబ్బీపేట, మార్చి 1: రాజధానిలో భూమిలేని పేదలకు మరో పదేళ్ల పెన్షన్ల కాలపరిమితిని పొడిగించాలని, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బకాయిలతో సహా పెంచిన పెన్షన్ చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. "రాజధాని అమరావతిలో భూమిలేని పేదల పెన్షన్‌ను వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నుంచి నయా పైసా పెంచలేదు. తాజాగా రూ.2,500 నుంచి రూ.5వేలకు పెంచుతూ జీవో జారీ చేసింది. ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే పెన్షన్ రూ.5వేలకు పెంచుతామని జగన్ హామీ ఇచ్చారు. ఆ మేరకు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి పెన్షన్ పెంపును వర్తింపజేయాలి. ఆ బకాయిలు చెల్లించి ముఖ్యమంత్రి తన చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలి. రాజధాని భూ సమీకరణ చట్టం ప్రకారం పదేళ్ల మాత్రమే పేదలకు పెన్షన్ సౌకర్యం ఉంది. మరో 10నెలల్లో ఈ కాల పరి మితి పూర్తవుతోంది. రాజధాని నిర్మాణం నిలిచిపోయింది. అక్కడి పేదలకు వ్యవసాయ పనులు లేక, రాజధాని నిర్మాణ పనులు, ఇతర పనులు లేక ఇబ్బంది పడుతున్నారు. భూమిలేని పేదలకు ఇచ్చే పెన్షన్ మరో పదేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం తక్షణమే ఆదేశాలు ఇవ్వాలి." అని బాబూరావు పేర్కొన్నారు. ఆశ, అంగన్వాడీ, సీఆర్డీయే, పారిశుధ్య కార్మికులు, సచివాలయం, హైకోర్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి రద్దు చేసిన రాజధాని పేదల పెన్షన్‌ను పునరుద్ధరించి వారికి బకాయిలతో సహా చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.



పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నేతలు

ముదిరాజ్‌ల సమస్యలను మేనిఫెస్టోలో పెట్టండి

ధర్నాచౌక్, మార్చి 1: ముదిరాజ్ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని ముదిరాజ్ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరికి శుక్రవారం వారు వినతిపత్రం అందజేశారు. బీసీల అభ్యున్నతికి బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందని ఆమె వారికి వివరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చప్పిడి కృష్ణమోహన్, ఎన్టీఆర్ జిల్లా, నగర అధ్యక్షులు దొప్పా దుర్గారావు, వేమారెడ్డి వీరబాబు, దుప్పల రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డ్స్ కమాండెంట్ బదిలీ



కాంతిరాణాకు మొక్కను అందిస్తున్న మహేష్‌కుమార్

విజయవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ హోంగార్డ్స్ కమాండెంట్‌గా ఎం.మహేష్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పోలీసు కమిషనర్ టి.కాంతి రాణాను కమిషనరేట్‌లో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన కేవీ ప్రేమజిత్‌ను విశాఖపట్నం హోంగార్డ్స్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. ప్రేమజిత్ బదిలీతో ఖాళీ అయిన స్థానంలో కర్నూలు రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్‌కుమార్‌ను నియమించారు.

రోడ్డు ప్రమాదంలో గొర్రెలకాపరి మృతి

మైలవరం, మార్చి 1: ఇబ్రహీంపట్నం-ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై మైలవరం ఎస్‌ఎస్పీ క్వార్టర్ సమీపంలో ఉన్న కొంబరి బొండాల పందిరిని ప్రమాదవశాత్తు బైక్ ఢీకొని బైక్‌పై ప్రయాణిస్తున్న గొర్రెల కాపరి అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని చంద్రగూడెం గ్రామానికి చెందిన మందా రమేష్(30) అనే యువకుడు గొర్రెలు కాపరిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం మైలవరంలో నిర్వహించే సంతలో గొర్రెలు కొనేందుకు మోటార్ బైక్‌పై వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వా సుపత్రికి తరలించారు. ఈ ప్రమాద ఘటనపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి
కార్గో రవాణా
నెలన్నరలో దేశీయ సేవలకు శ్రీకారం

- త్వరలోనే అంతర్జాతీయ కార్గో రవాణాకూ యత్నాలు
- ఏపీ చాంబర్స్ మీట్, ప్రెస్‌మీట్‌లో ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్ రెడ్డి



ఏపీ చాంబర్స్ మీట్‌లో మాట్లాడుతున్న లక్ష్మీకాంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి నెలన్నర రోజుల్లో కార్గో రవాణాకు శ్రీకారం చుడతామని విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. దేశీయంగా కార్గో రవాణాతో పాటు, అంతర్జాతీయంగానూ కార్గో సేవలు అందించటానికి ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కొవిడ్ తర్వాత నిలిచిన కార్గో సేవల పునరుద్ధరణ ప్రయత్నాలు ఓ కొలిక్కి వస్తున్నాయని తెలిపారు. విజయవాడ విమానాశ్రయం నుంచి వారంలో రెండు రోజులపాటు షార్జాకు విమానాలు నడుస్తున్నందున వ్యాపారవర్గాల నుంచి వస్తున్న సూచనల మేరకు విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా షార్జాకు కార్గో రవాణా చేసేందుకు కస్టమ్స్ ఉన్నతాధికారులతో చర్చించామన్నారు. త్వరలోనే దేశీయంగా, అంతర్జాతీయంగా కార్గో సేవలు ప్రారంభమవుతాయని తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్(ఏపీ చాంబర్స్) నేతృత్వంలో విజయవాడ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డితో గెట్ టు గెదర్ నిర్వహించారు. ఏపీ చాంబర్స్‌కు చెందిన వర్తక, వ్యాపార, రవాణా సంఘ సభ్యులు కార్గో సేవలపై ప్రస్తావించారు. అంతర్జాతీయ, దేశీయ విమాన సర్వీసులు, విమానాశ్రయ అభివృద్ధి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనపై సందేహాలను అడిగి తెలుసుకున్నారు. విజయవాడ ఎయిర్‌పోర్టు ప్రస్తుత పరిస్థితులను ఏపీ చాంబర్స్ ప్రతినిధులకు లక్ష్మీకాంత్‌రెడ్డి వివరించారు. ఏపీ చాంబర్స్ ప్రతిపాదనలను స్వీకరించారు. అనంతరం మీడియా సమావేశంలో లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ అభివృద్ధికి ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) వందలాది కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని ఆయన తెలిపారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విజయవాడ ఎయిర్‌పోర్టు సిద్ధంగా ఉందన్నారు. చెన్నై ఎయిర్‌పోర్టుతో సమానంగా విజయవాడ ఎయిర్‌పోర్టు దగ్గర భూములు ఉన్నాయన్నారు. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద విమానం దిగేందుకు వీలైన రన్‌వే ఉందని చెప్పారు. ఒకేసారి 22 ఎయిర్‌క్రాఫ్ట్‌లు నిలుపుదల చేసే భారీ పార్కింగ్ ఏరియాను కలిగి ఉందన్నారు. రూ.500 కోట్లతో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణ పనులు చేస్తున్నామని, ఈ ఏడాది నవంబరు నెలాఖరు నాటికి అందుబాటులోకి అది వస్తుందని తెలిపారు. ప్రస్తుతం విజయవాడ విమానాశ్రయం నుంచి రోజూ 36 విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయని తెలిపారు. వారంలో రెండు రోజులపాటు రెండు అంతర్జాతీయ విమానాశ్రయ విమానాలు నడుస్తున్నాయని తెలిపారు. అంతర్జాతీయంగా సింగపూర్, దుబాయ్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలకు డిమాండ్ ఉందని ఎయిర్‌లైన్స్ సంస్థలతో ఆమేరకు సంప్రదింపులు జరుపుతున్నామని లక్ష్మీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. నవంబరులో ఎయిర్‌లైన్స్‌తో ఏఏఐ సమావేశాన్ని నిర్వహించబోతోందని, విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి మరిన్ని విమానాలు నడిపేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. దేశీయంగా ముంబాయి, వారణాసిలతో పాటు ఈశాన్య రాష్ట్రాలను కవర్ చేసేలా వయా ఒడిశా, కోల్‌కత్తాలకు విమాన సర్వీసులు నడిపేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

మిలియన్ ప్రయాణికుల మార్క్ దాటనున్న ఎయిర్‌పోర్టు

2023-24 ఆర్థిక సంవత్సరంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం మిలియన్ ప్రయాణికుల మార్క్‌ను దాటబోతోందని లక్ష్మీకాంత్‌రెడ్డి చెప్పారు. సగటున నెలకు 90 వేల మంది ప్రయాణిస్తున్నారని తెలిపారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో టాక్సీ స్టాండ్‌కు టెండర్లు పిలిచామన్నారు. ట్రావెల్స్ సంస్థలతో పాటు ఓలా వంటి సంస్థలకు కూడా ఆహ్వానం అందించినా టెండర్లలో పాల్గొనటం లేదన్నారు. నిబంధనల ప్రకారం పది లక్షల ప్రయాణికులు రాకపోకలు సాగించే విమానాశ్రయాల్లో టాక్సీస్టాండ్‌కు టెండర్లు పిలవాల్సి ఉంటుందన్నారు. విమానాశ్రయంలో టాక్సీవాలాల దుందుడుకు చర్యలను నివారించటానికి వీలుగా ప్రీపెయిడ్ స్టాండ్ ఏర్పాటు చేయాలన్న ఆలోచనతో ఎస్పీకి లేఖ రాశామని తెలిపారు.

కస్టమ్స్ క్లియరెన్స్ కోసం లేఖ రాస్తాం

- ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కార్గో రవాణాతో పాటు, అంతర్జాతీయ సర్వీసులు అనేక ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చించామని ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు తెలిపారు. విజయవాడ నుంచి యూఎస్ఏ, యూరోప్, యూఏఈ, ఆస్ట్రేలియా వంటి దేశాలకు విమాన కనెక్టివిటీ లేదని, ప్రాంతీయంగా విజయవాడ, విశాఖపట్నంల మధ్యన కూడా కనెక్టివిటీ లేదని ఆయన తెలిపారు. దేశీయంగా ముంబయి, అహ్మదాబాద్, కోలకత్తా వంటి నగరాలకు కూడా విమాన సర్వీసులు లేక పోవటాన్ని ఎయిర్‌పోర్టు డైరెక్టర్ దృష్టికి తెచ్చామన్నారు. అంతర్జాతీయ డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులు దుబాయ్, సింగపూర్‌లకు విమానాలు లేకపోవటం వల్ల ఇక్కడి ప్రజలు హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సి వస్తోందన్నారు. షార్జాకు అంతర్జాతీయ విమాన సర్వీసులు నడుస్తున్న నేపథ్యంలో విదేశీ సరకు రవాణా కోసం కూడా తాము కస్టమ్స్ క్లియరెన్స్‌ల కోసం లేఖ రాస్తామని, వ్యాపార వర్గాలు కలిసి విజ్ఞప్తి చేయటం జరుగుతుందని తెలిపారు. దీనివల్ల సాధారణ రైతులు చాలా తక్కువ ఖర్చుతో నేరుగా ఎగుమతులు చేయగలుగుతారని పొట్లూరి భాస్కరరావు చెప్పారు. ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

కేశినేని నాని, వెలంపల్లి..
లంబూజంబూలు

- 'సెంట్రల్'లో తిరుగుతూ నాపై తప్పుడు ఆరోపణలు, దుష్ప్రచారాలు చేస్తున్నారు
- ఆధారాలుంటే నిరూపించాలి..లేకుంటే తీవ్ర పరిణామాలు: బొండా ఉమా

పాయకాపురం, మార్చి 1: "వైసీపీ నేతలు కేశినేని నాని, వెలంపల్లి సెంట్రల్ నియోజకవర్గంలో లంబూజంబూల్లా తిరుగుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ నియోజకవర్గంలో నన్ను కబ్జాకోరుగా, గూండాగా చిత్రించేందుకు దుష్ప్రచారం చేస్తున్నారు. నాపై చేస్తున్న ఆరోపణలకు వారిద్దరు ఆధారాలు చూపాలి. లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయి. నాని, వెలంపల్లిపై నేను చేసిన ఆరోపణలను ఆధారాలతో సహా బయటపెట్టా. ఆ ఆక్రోశంతోనే నాపై దుష్ప్రచారం చేస్తున్నారు." అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయంగా తనను దెబ్బతీసేందుకు దిగజారుడు వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. దమ్ముంటే ఆధారాలు చూపాలని సవాల్ విసిరారు. పాయకాపురంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం టీడీపీ-జనసేన సెంట్రల్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్టీఆర్, వీఎం రంగా విగ్రహాలకు కేశినేని చిన్నితో కలిసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు.

కేశినేని నానీ అవినీతిపై చర్చకు వస్తా: కేశినేని చిన్ని

"నగరంలో వైసీపీ నేతలను మించిన కబ్జాకోరులు ఎవరూ లేరు. నా వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయి. స్థలాలు కబ్జా చేసిన ఘనుడు కేశినేని నాని. ఎమ్మెల్యే సీట్లు ఆశించే అభ్యర్థుల నుంచి డబ్బులు వసూలు చేసిన చరిత్ర కేశినేని నానీది. నా దగ్గర ఉన్న ఆధారాలతో ఎక్కడకు రమ్మన్నా చర్చకు వస్తా. దమ్ముంటే కేశినేని నాని చర్చకు రావాలి" అని కేశినేని చిన్ని సవాల్ విసిరారు.

వైసీపీలోకి రమ్మని వెలంపల్లి బేరాలాడారు: కార్పొరేటర్ వీరమాచినేని లలిత

"సెంట్రల్ నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలు, నేతలకు వెల్లంపల్లి డబ్బులు ఎరచూపి వైసీపీలోకి లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. నాతోనూ ఇటీవల బేరాలు ఆడారు. పార్టీ నేతలు వారి ప్రలోభాలకు లొంగవద్దు." అని 28వ డివిజన్ కార్పొరేటర్ వీరమాచినేని లలిత పేర్కొన్నారు. అనంతరం టీడీపీ-జనసేననేతలు కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను బొండా ఉమా, కేశినేని చిన్ని వివరించారు. గొట్టుముక్కల రఘురామరాజు, పరుచూరి ప్రసాద్, ఎరుబోతు రమణ, దాసరి ఉదయశ్రీ, పైడి శ్రీను, బత్తుల కొండ, దాసరి కనకారావు, నవనీతం సాంబశివరావు, ఘంటా కృష్ణ మోహన్, కంచి ధనశేఖర్, కంచి దుర్గ, లబ్బా వైకుంఠం, బెజవాడ తిరుపతి, బోను వెంకాయమ్మ, సాయిరామ్‌గౌడ్, సూరవరపు నాగరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఆర్యవైశ్యుల సమావేశంలో మాట్లాడుతున్న బొండా ఉమా, కేశినేని చిన్ని

చంద్రబాబు పాలన ఆర్యవైశ్యులకు స్వర్ణయుగం

- వెలంపల్లి..సన్నాసి, బఫూన్, తులసివనంలో గంజాయి మొక్క
- సెంట్రల్ నియోజకవర్గ ఆర్యవైశ్యుల సమావేశంలో బొండా ఉమా

వన్‌టౌన్: చంద్రబాబు పాలనలో ఆర్యవైశ్యులకు స్వర్ణయుగంలా నడిచిందని టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని), ఆ పార్టీ పొలిట్‌బ్యూరో బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం రాత్రి టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డూండీ రాకేశ్, వాసవీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వీవీకే నరసింహరావు, పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మలపెంట శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఐలాపురం హోటల్‌లో సెంట్రల్ నియోజకవర్గ ఆర్యవైశ్య ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. తనకు ఆర్యవైశ్యులంటే ఎంతో గౌరవమని, వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని బొండా ఉమా కోరారు. వెలంపల్లి శ్రీనివాసరావు రాజకీయాల్లో ఓ చీడపురుగు, బఫూన్, సన్నాసి, తులసి వనంలో గంజాయి మొక్క అని ఉమా ఆగ్రహం వ్యక్తంచేశారు. పది మంది పోలీసులను వెంట వేసుకుని ఉదయాన్నే కొత్తపిచ్చోడు మాదిరి ఆలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నాడని, రెండు నెలల టూరిస్ట్ లాగా నియోజకవర్గంలో తిరుగుతున్నాడని అన్నారు. కరోనా సమయంలో అందరూ బాధపడుతుంటే సేవా కార్యక్రమాల పేరుతో రూ.9 కోట్లు, ఆర్యవైశ్యుల వన భోజనాల పేరుతో రూ.5 కోట్లు వెలంపల్లి దండుకున్నాడన్నారు. అతని ఇంట్లో ఏం జరిగినా ఆర్యవైశ్యుల నుంచి భారీగా డబ్బు దండుకుంటున్నాడన్నారు. ఆర్యవైశ్యులు తనకు అండగా ఉండాలని, తాను అండగా ఉంటానని, చంద్రబాబును సీఎం చేసుకుందామని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య నాయకుడు కొణిజేటి రమేష్, పేర్ల రవి, బి.శేషుబాబు, పి.మల్లికార్జున్, నూకల నాగేశ్వరరావు, ఎన్.కోటేశ్వ రరావు, వక్కలగడ్డ భాస్కరరావు, నియోజకవర్గంలోని వాసవీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బొండా జగన్మోహనరావుకు స్టార్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డు

విద్యాధరపురం, మార్చి 1: గిరిజనుల జీవన చిత్రాలను గీస్తూ పేరొందిన భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన చిత్రకారుడు బొండా జగన్మోహనరావుకు రాజస్థాన్‌కు చెందిన ఇండియా స్టార్ కమ్యూనిటీ సంస్థ స్టార్ క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డును అందించింది. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యకు చెందిన కళా సంస్కృతి మహాకుంబ్ సంస్థ నిర్వహించిన చిత్రకళా పోటీల్లో నవరత్న అచీవర్స్ అవార్డు, గౌరవ సమ్మాన్ అవార్డును శుక్రవారం ఆయన కొరియర్ ద్వారా అందుకున్నారు.



స్టార్ క్రియేటివ్ అవార్డుతో బొండా జగన్మోహనరావు



ఏపీ ఎన్జీవో రాష్ట్ర నేతలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాజుబాబు తదితరులు

ఏపీ ఎన్జీవో నేతలకు రవాణా ఉద్యోగుల అభినందన

ధర్నాచౌక్, మార్చి 1: ఏపీ ఎన్జీవోస్ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నూతనంగా ఎన్నికైన కె.శివారెడ్డి, సీహెచ్ పురుషోత్తమ నాయుడును ఏపీ రవాణాశాఖ ఉద్యోగుల సంఘం నేతలు అభినందించారు. గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవోహోంలో సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు అధ్వర్యంలో శుక్రవారం వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. రవాణా శాఖ ఉద్యోగులకు సంబంధించిన సమస్యలపై ఏపీ జేఏసీలో మాట్లాడాలని, అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా సమస్యలను పరిష్కరించాలని రాజుబాబు వారిని కోరారు. కోశాధికారి ఎం.ఆనంద్ కుమార్, జోనల్ కార్యదర్శి కేవీవీ నాగమురళీ, సహాధ్యక్షురాలు జి.ఉషాసుందరి, సంఘం సభ్యులు ఎం.రవితేజ, కె.లోకేష్ పాల్గొన్నారు.

గొల్లపూడి సెక్టర్ ఎస్సై నాతో కప్పగంతులు
వేయించి గుంజీలు తీయించారు

- లాక్కున్న ఫోన్ ఇమ్మని అడిగితే పెట్టీ కేసు పెడతానంటున్నారు
- భవానీపురానికి చెందిన ఓ యువకుడి ఆరోపణ

విద్యాధరపురం, మార్చి 1: తనను గొల్లపూడి సెక్టర్ ఎస్ఐ రామకృష్ణ గుంజీలు తీయించి, కప్పగంతుల వేయించి కొట్టాడని, శుక్రవారం రాత్రి నల్లకుంట సెంటర్ వద్ద ఈ ఘటన జరిగిందని ఓ యువకుడు(24) ఆరోపిస్తున్నాడు. "భవానీపురానికి చెందిన నేను భవానీపురం నుంచి సూరాయ పాలానికి తన బైక్‌పై బయలుదేరాను. నల్లకుంట సెంటర్ వద్ద విధుల్లో ఉన్న గొల్లపూడి సెక్టర్ ఎస్ఐ రామకృష్ణ యువకుడి బండి ఆపి, ఫోన్ తీసుకుని పరిశీలించాడు. వివాహమైందా..నీమీద కేసులు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించారు. కొత్త బండి కావడంతో నెంబరు ప్లేటు లేదు. నావద్ద ఉన్న ఫోన్ లాక్కుని మా కుటుంబ సభ్యులతో మాట్లాడాడు. సమాధానం చెబుతున్న నన్ను చేతులతో కొట్టి 50 గుంజీలు తీయించాడు. కప్పగంతులు వేయించాడు. స్టేషన్‌కు వచ్చి ఫోన్ తీసుకెళ్లాలని చెప్పి వెళ్లిపోయాడు. తిరిగి పోలీసుస్టేషన్‌కు వెళ్లి నా ఫోన్ గురించి అడగ్గా, నీ మీద పెట్టీ కేసు పెడుతున్నానంటూ ఎస్సై బదులిచ్చాడు." అని యువకుడు తనతో ఎస్సై ప్రవర్తించిన తీరుపై లబోదిబో అంటున్నాడు.

అదుపు తప్పి
చెట్టును ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

మోపిదేవి: విజయవాడ నుంచి కృష్ణానది కరకట్ట మీదుగా వస్తున్న కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఘటన మండలంలోని బొబ్బర్లంక వద్ద శుక్రవారం ఉదయం జరిగింది. అవనిగడ్డ వస్తున్న కారు బొబ్బర్లంక వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి చెట్టును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలు కావటంతో 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మోపిదేవి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్తల మనోభావాలు చంద్రబాబుకు తెలిపా..

- టీడీపీ - జనసేన కూటమిదే అధికారం: దేవినేని ఉమా

గొల్లపూడి, మార్చి 1: గత వారం అధినేత చంద్రబాబుతో సమావేశమై కార్యకర్తల మనోభావాలు ఎంత బలంగా ఉన్నాయో తెలియజేశానని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడి పార్టీ కార్యాలయంలో మైలవరం నియోజకవర్గ శంఖారావం సభలో ఆయన మాట్లాడారు. మరో 50 రోజుల్లో టీడీపీ - జనసేన కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు. అధికారమదంతో అరాచకం చేస్తున్న వారందరికీ రాబోయే ఎన్నికల్లో బడిత పూజ ఖాయమని ఆయన హెచ్చరించారు. వైసీపీ పాలనలో రాష్ట్ర పరువు, ప్రతిష్టలు దిగజారిపోయాయన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత నిరుద్యోగులుగా మారిపోయారన్నారు. ఇటీవల సోషల్ మీడియాలో చేస్తున్న అసత్య ప్రచారాలతో మనోవేదనకు గురై మృతి చెందిన లక్కింశెట్టి పుల్లారావు, నూతక్కి సురేష్ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సమన్వయ కమిటీ సభ్యులు, క్లస్టర్ యూనిట్ పోలింగ్ బూత్ ఇన్‌చార్జిలు, కుటుంబ సాధికార సారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు ఇంజనీరింగ్ కాలేజీలో క్రీడా వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న సతీగీత, యాజమాన్యం తదితరులు

కఠోర శ్రమతో లక్ష్యసాధన

వన్‌టౌన్, మార్చి 1: జీవితంలో ఎదుగుతున్న కొద్దీ ఎదురుదెబ్బలు తగలడం సహజమని, వాటిని ధైర్యంతో ఎదుర్కొని కఠోర శ్రమ చేస్తే లక్ష్యాలు సాధించవచ్చని 2016 మేజర్ ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సతీగీత పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు సాంకేతిక ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి విక్టర్ జాన్సన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ క్రీడా వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తన కాలుకు దెబ్బ తగిలినప్పుడు చాలామంది నిరుత్సాహపరిచారని, కొందరు స్నేహితులు, శ్రేయోభిలాషులు ఇచ్చిన ప్రోత్సాహంతో ఇబ్బందులను ధైర్యంగా అధిగమించి, ఒలింపిక్స్‌లో పతకం సాధించానని ఆమె తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు, అధ్యాపకులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కొత్తమాసు వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్స్ పి.లక్ష్మణస్వామి, జె.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

విజయవాడ వాకర్స్ సిల్వర్ జూబ్లీ మహోత్సవాలు రేపు

భవానీపురం, మార్చి 1: విజయవాడ వాకర్స్ అసోసియేషన్ స్థాపించి పాతికేళ్లు పూర్తైన సందర్భంగా ఈనెల 3న మాకినేని బసవపున్నయ్య విజ్ఞానకేంద్రంలో సిల్వర్ జూబ్లీ మహోత్సవాలను ఘనంగా నిర్వహించ దానికి ఏర్పాట్లు చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మోటూరి ప్రభాకర్ రావు, ఆహ్వానకమిటీ ఛైర్మన్ ఆలమూరి అమర్‌నాథ్, మాజీ గవర్నర్ తొండెపు హనుమంతరావు తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో సిల్వర్ జూబ్లీ ఉత్సవాల బ్రోచర్లను వారు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు హాజరవుతారని, ఉదయం 9 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సాంస్కృతిక, సినీ సంగీత విభావరి, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, వాకర్స్ అసోసియేషన్ స్థాపించిన నాటి నుంచి ఇప్పటి వరకు వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్లుగా పనిచేసిన 20 మందిని సత్కరిస్తామని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్‌లో 520మందికి పైగా సభ్యులున్నారని వారంతా ఐజీఎంసీలో రోజూ ఉదయం, సాయంత్రం నడక, స్టాండింగ్ యోగా చేస్తారని తెలిపారు. ఏటా వేసవిలో 45 నుంచి 60 రోజులు వాకర్స్ అందరికీ ఉచితంగా మజ్జిగ, ప్రతీ సంవత్సరం అసోసియేషన్ వార్షికోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ స్కూళ్లలో పదోతరగతి పాసై వివిధ కాలేజీల్లో చదువుతున్న 60 మంది పేద విద్యా ర్థులు ఒక్కొ క్కరికి రూ.2వేల స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామని తెలిపారు.

వాహనాలు నడిపేందుకు లైసెన్స్ తప్పనిసరి

- పద్దెనిమిదేళ్లు దాటిన వారంతా లైసెన్స్‌కు అర్హులే
- మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు

లబ్బీపేట, మార్చి 1: వాహనాలు నడిపేందుకు లైసెన్స్ తప్పనిసరి అని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటేశ్వరరావు విద్యార్థినులకు సూచించారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో శుక్రవారం విద్యార్థినులకు రహదారి భద్రతపై కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నిర్లక్ష్యంతో పాటు సరైన డ్రైవింగ్ అనుభవం లేని కారణంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. 18 ఏళ్లు దాటిన వారందరూ లైసెన్స్‌కు అర్హులని, ఇప్పుడు లైసెన్స్ పొందాలంటే ఆన్‌లైన్ సౌకర్యం ఉందని దానికి ఆధార్ కార్డ్ అవసరమని తెలిపారు. లైసెన్స్ పొందాక 6నెలలు శిక్షణ ఉంటుందని, తరువాత పర్మినెంట్ లైసెన్స్ వస్తుందని, మళ్లీ 40 ఏళ్లు దాటాక రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ చేసే సమయంలో కొన్ని జాగ్రత్తలతో పాటు నియమనిబంధనలు పాటించాలని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు, ఇతర వాహనాల్లో సీటు బెల్ట్ పెట్టుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలు పాటిస్తూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని ఆయన సూచించారు. రోడ్ సేఫ్టీ ఎన్జీవో ఫౌండర్ ఎమ్.వాసు, త్రిమూర్తులు, కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, టి.నాగరాణి, జి.జ్యోత్స్న పాల్గొన్నారు.

వైఎస్ షర్మిలను ఏపీ ప్రజలు నమ్మొద్దు

- ఆమెను నమ్మి వైఎస్సార్‌టీపీలో ఎంతో ఖర్చు చేసి అప్పులపాలయ్యాం: వైఎస్సార్‌టీపీ మాజీ నాయకులు

ధర్నాచౌక్, మార్చి 1: వైఎస్ షర్మిల తమను ఆర్థికంగా, రాజకీయంగా మోసం చేసిందని ఇప్పుడు ఏపీలో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఇక్కడి ప్రజలను మోసం చేస్తోందని తెలంగాణకు చెందిన పలువురు వైఎస్సార్‌టీపీ మాజీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. తమను మోసం చేసిన షర్మిల ఏపీలో ఎక్కడ పోటీ చేసినా ఆమెకు వ్యతిరేకంగా పనిచేసి ఓడిస్తామన్నారు. రాజన్న బిడ్డనని చెప్పి ఆయన ఆశయాలను సాధించేందుకు వైఎస్సార్‌టీపీని స్థాపించానని చెప్పిన మాటలను నమ్మి ఆ పార్టీలో చేరి ఆమెతో నడిచామన్నారు. పార్టీ కార్యక్రమాల కోసం ఎంతో ఖర్చు చేసి అప్పులపాలయ్యామన్నారు. డేవిడ్ శాంతరాజ్, బానోతు రాజ్‌కుమార్ మాట్లాడారు.

జెండా సభకు వెళ్లారని పింఛన్ ఆపేశారు..

- వైసీపీ ఎంపీటీసీని కలవాలని వలంటీరు సూచన
- టీడీపీ నాయకులు ప్రశ్నించడంతో అందజేసిన అధికారులు



కసిరెడ్డి సరోజిని




ఎస్.దుర్గ

పెంటపాడు, మార్చి 1: పార్టీలకతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గొప్పగా చెబుతుంటారు. కానీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటోంది. పశ్చిమగోదావరి జిల్లా ప్రత్తిపాడులో తెలుగుదేశం, జనసేన నిర్వహించిన జెండా సభకు వెళ్లారన్న అక్కసుతో పెంటపాడు గ్రామంలో ఇద్దరు మహిళా లబ్ధిదారులకు పింఛన్ నిలిపివేశారు. గ్రామానికి చెందిన కసిరెడ్డి సరోజిని, ఎస్.దుర్గ పింఛన్ లబ్ధిదారులు. శుక్రవారం సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా వలంటీరు తన పరిధిలోని లబ్ధిదారులందరికీ పింఛన్లు ఇచ్చి.. ఈ ఇద్దరికీ ఆపేశారు. ఎందుకని.. బాధితులిద్దరూ ప్రశ్నించగా 'మీ పింఛన్ వేరే లాగిన్‌లోకి వెళ్లింది.. గ్రామ వైసీపీ ఎంపీటీసీ-2 రెడ్డి సూరిబాబును కలవండి' అని బదులిచ్చారు. వారు ఎంపీటీసీ వద్దకు వెళ్లగా ఆయన ఇంట్లో లేకపోవడంతో ఆయనకు ఫోన్ చేసి విషయం చెప్పారు. ఆయన 'మీరు జెండా సభకు వెళ్లడం ఫొటోలలో వచ్చింది. సాయంత్రానికి పింఛన్ వస్తుంది' అని బదులిచ్చారు. దీంతో బాధిత మహిళలిద్దరూ విషయాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావుకు దృష్టికి తీసుకెళ్లాగా.. ఆయన సచివాలయానికి వెళ్లి వలంటీరును నిలదీశారు. ఘర్షణ పెద్దది కావడంతో స్పందించిన అధికారులు వారికి పింఛన్లు అందజేశారు.

ఆదివారం స్కూలు.. సోమవారం సెలవు

- 4న సీఎం సభ కోసం నంద్యాల డీఈవో ఆదేశాలు





Message to All educational institutions ,

There is a program of Hon'ble CM garu on 4th March at Banaganapalle

In view of this program On4th March All the managements r Requested to run the school on 3rd March instead of 4th in Nandyal dist to avoid inconvenience

All Private Educational institutions are requested to handover all buses to Transport Dept on 3rd March evening by 5 pm without fail .

DEO, Nandyal.

7:59 pm

సోమవారం పాఠశాలలకు సెలవు ఇచ్చి బస్సులు పంపాలంటూ డీఈవో పంపిన వాట్సాప్ సందేశం

నంద్యాల (నూనెపల్లె), మార్చి 1: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బహిరంగ సభ అంటే చాలు.. విద్యార్థులకు, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలకు తిప్పలు తప్పడం లేదు. ఈ నెల 4న నంద్యాల జిల్లా బనగానపల్లెలో సీఎం జగన్ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా డీఈవో ఈ నెల 3న (ఆదివారం) పనిదినంగా పెట్టుకుని.. సోమవారం (4న) సెలవు ప్రకటించాలని కోరుతూ అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీచేశారు. సభకు జనాన్ని తరలించేందుకు బస్సులు కావాలి కాబట్టి.. అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఆదివారం సాయంత్రం 5 గంటల్లోగా వారి స్కూల్ బస్సులను అప్పగించాలని పేర్కొన్నారు. వాట్సాప్ గ్రూపులో డీఈవో పంపిన ఈ సందేశం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. విద్యాశాఖాధికారిగా ఉంటూ ప్రభుత్వ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న డీఈవోపై విద్యార్థి, ప్రజా సంఘాలు మండిపడుతున్నాయి. కాగా, ఈ ఆదేశాలపై ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. జగన్ సభ ఉన్న ప్రతిసారీ ఇలా వాహనాలు పంపించమంటే తమకు ఇబ్బందిగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు పంపిస్తే ఒక బాధ.. లేకపోతే మరో బాధ.. అన్నట్టుగా ఉందని వాపోతున్నారు. ఈ అంశంపై 'ఆంధ్రజ్యోతి' డీఈవోను వివరణ కోరగా శాఖా పరమైన ఆదేశాలతో అలా చేశామని, ఇది ఆనవాయితీగా వస్తోందని అన్నారు.

ప్రత్తిపాటి శరత్‌కు రిమాండ్

- జిల్లా జైలుకు తరలింపు
- ఐపీసీ 409 సెక్షన్ కింద రిమాండ్‌కు కోర్టు నో
- 467 సెక్షన్ కింద 14 రోజులు విధింపు
- బెయిల్ వ్యాజ్యం వేసిన శరత్
- పది రోజుల కస్టడీకి పోలీసుల పిటిషన్
- రెండు పిటిషన్లపై విచారణ 4కి వాయిదా



ప్రత్తిపాటి శరత్

విజయవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పన్ను ఎగవేత కేసులో పోలీసులు అరెస్టు చేసిన మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌కు విజయవాడ మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు రిమాండ్ విధించింది. ఆయన్ను గురువారం ఉదయం గుంటూరులో అరెస్టుచేసిన మాచవరం పోలీసులు విజయవాడకు తరలించి.. అర్ధరాత్రి సమయంలో మొదటి అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కరీముల్లా ఎదుట హాజరుపరచిన సంగతి తెలిసిందే. రిమాండ్ రిపోర్టును న్యాయాధికారి పరిశీలించిన తర్వాత.. శరత్ తరఫున ప్రముఖ న్యాయవాది కిలారు బెనర్జీ, ప్రభుత్వం తరఫున హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి వాదనలు వినిపించారు. శరత్ రిమాండ్‌ను తిరస్కరించాలని బెనర్జీ కోరారు. 'పోలీసులు నమోదు చేసిన ఐపీసీ సెక్షన్లలో 409 ఆయనకు వర్తించదు. ఈ సెక్షన్ ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తుంది. అవెక్సా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు శరత్ అదనపు డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ పదవిలో ఉన్న వ్యక్తికి ఎలాంటి అధికారాలూ ఉండవు. అవెక్సా సంస్థ ప్రభుత్వంతో ఎలాంటి ఒప్పందాలూ చేసుకోలేదు. ఇది సబ్ కాంట్రాక్టు సంస్థ మాత్రమే. ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న సంస్థకు సబ్ కాంట్రాక్టరుగా వ్యవహరించింది. అదేవిధంగా 467 సెక్షన్ కూడా వర్తించదు. నకిలీ పత్రాలు, రశీదులు సమర్పించినట్లు పోలీసులు ఆధారాలను చూపించలేదు. పన్ను ఎగవేతకు సంబంధించి హైదరాబాద్‌లో డీజీజీఐ(డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ ఇంటెలిజెన్స్) కేసు నమోదు చేసింది. ఒకే నేరంపై రెండు ఎఫ్ఐఆర్‌లు ఉండవు. డీజీజీఐ కేసు నమోదు చేసిన తర్వాత తిరిగి పోలీసులు ఎలా కేసు నమోదు చేస్తారు' అని ప్రశ్నించారు. నాగిరెడ్డి వాదనలు వినిపిస్తూ.. శరత్ షెల్ కంపెనీలను ఏర్పాటు చేసి వాటి ద్వారా ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్‌ను పొందారని తెలిపారు. ప్రభుత్వానికి నకిలీ రశీదులు, బిల్లులు సమర్పించారని అన్నారు. వాదనలు విన్న న్యాయాధికారి శుక్రవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో తీర్పును వెలువరించారు. ఐపీసీ 409 సెక్షన్ కింద రిమాండ్‌ను తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. 467 సెక్షన్ కింద 14 రోజులు రిమాండ్ విధిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం శరత్‌ను విజయవాడలోని జిల్లా కారాగారానికి తరలించారు. ఇంకోవైపు.. శరత్‌కు బెయిల్ మంజూరు చేయాలని ఆయన తరఫు న్యాయవాది కిలారు బెనర్జీ ఇదే కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. శరత్ నుంచి మరిన్ని వివరాలు రాబట్టాల్సి ఉందని, ఆయనను పది రోజులు కస్టడీకి ఇవ్వాలని మాచవరం పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై విచారణను న్యాయాధికారి సోమవారానికి వాయిదా వేశారు.

ఇలా చేస్తే ఉద్యోగం నుంచి తీసేస్తాం!

- యోగా టీచర్లకు బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ బెదిరింపులు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ఉలికిపాటు
- వాట్సాప్ గ్రూపుల నుంచి వందల మంది తొలగింపు
- గుంటూరుకు వస్తే సెటిల్ చేస్తామని బుజ్జగింపులు

అనంతపురం విద్య, మార్చి 1: బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్(బీవైహెచ్ఎఫ్) ఆగడాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. ఏజెంట్లు, బ్రోకర్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులకు వల వేసి లక్షలు గుంజిన వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. 'అక్రమాల యోగాసనం' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం కలకలం రేపడంతో ఆ సంస్థ నిర్వాహకుల్లో కీలకంగా వ్యవహరించే ఓ వ్యక్తి కొందరు యోగా టీచర్లకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగారు. బీవైహెచ్ఎఫ్ బ్యాచ్‌ల పేరుతో ఉన్న గ్రూపుల నుంచి ఆ సంస్థ నిర్వాహకులు సుమారు వంద మందిని తొలగించినట్లు తెలిసింది. 'న్యూసెన్స్ క్రియేట్ చేయవద్దని ఆరు నెలల నుంచి చెబుతున్నాను. అయినా చేస్తున్నారు' అని ఓ టీచర్‌కు ఫోన్ చేసి మండిపడినట్టు సమాచారం. 'మీరు ఎంప్లాయిమెంట్ అగ్రిమెంట్ ఫాంను క్లియర్‌గా చదువుకుని సంతకాలు చేశారు. ఇలా చేస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తాం' అని హెచ్చరించారని బాధితులు వాపోయారు. 'మీడియాకు సమాచారం ఇస్తే మీకే ఇబ్బంది' అని హెచ్చరించినట్లు తెలిసింది. యోగా టీచర్స్ ఫౌండేషన్ పేరిట గ్రూపులు పెట్టుకుని చర్చలు జరిపినా, న్యూసెన్స్ క్రియేట్ చేసినా ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, జీతాలు కూడా ఇవ్వబోమని బెదిరించినట్టు సమాచారం. 'మార్చి 10వ తేదీన గుంటూరు వంద మంది కాకుంటే.. వెయ్యి మంది రండి. కూర్చుని సెటిల్ చేస్తా' అని కొందరిని బుజ్జగించే ప్రయత్నాలు కూడా ఆ వ్యక్తి చేశారని సమాచారం.

ఇచ్చిన హామీలకు జీవోలు ఇచ్చాం

- మంత్రి ఆదిమూలపు

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మంత్రి ఆదిమూలపు సురేశ్ అన్నారు. జనవరి నెలలో మంత్రుల కమిటీ సమావేశంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ జీవోలు జారీ చేశామన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర మున్సిపల్ ఉద్యోగులకు పెంచిన జీతభత్యాలు, కల్పించిన ఇతర సౌకర్యాలు తదితర అంశాలపై మంత్రి అధ్యక్షతన మున్సిపల్ కార్మిక సంఘాలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి ఆదిమూలపు, సజ్జల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల 16 డిమాండ్లలో 9 పరిష్కారం చేసి జీవోలు కూడా జారీ చేశామన్నారు. మిగతా 7 డిమాండ్ల పరిష్కారానికి త్వరలో చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపుకు సంబంధించిన జీవోఎంఎస్ నంబర్ 36ను విడుదల చేశామని చెప్పారు. మున్సిపల్ కార్మికులకు జీతం ఎంతెంత పెరిగిందో విపులీకరించిన ఆయన.. దానివల్ల ఏటా రూ.243 కోట్ల 55 లక్షల అదనపు భారాన్ని మున్సిపల్ శాఖ భరిస్తోందన్నారు. మురుగు శుద్ధి చేస్తూ చనిపోయే కార్మికులకు ఇచ్చే రూ.10 లక్షల నష్టపరిహారాన్ని రూ.30 లక్షలకు, శాశ్వత అంగవైకల్యానికి నష్టపరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచామన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో పని చేసే పారిశుధ్య కార్మికులకు ఇక నుంచి మున్సిపాలిటీలే వేతనాలు చెల్లిస్తాయన్నారు. సమ్మె కాలాన్ని రెగ్యులరైజ్ చేసి జీతాలు చెల్లిస్తామన్నారు.

పెంచిన వేతనాలు ఎప్పుటి నుంచి ఇస్తారో చెప్పాలి

'జీవో ఎంఎస్ 36 ద్వారా క్లీన్ ఎన్విరాన్మెంట్ వర్కర్స్‌కు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం జీవోలు జారీ చేయడం సంతోషమే. అయితే ఆ జీవోల్లో ఎప్పటి నుంచి వేతనాల పెంపు అమలు చేస్తారో చెప్పలేదు. మంత్రుల కమిటీ సమావేశంలో ఇచ్చిన హామీ మేరకు జనవరి 1వ తేదీ నుంచే వేతనాలు పెంచాలి.. జనవరి 10 తేదీన ఇంజనీరింగ్ వర్కర్స్‌కు సంబంధించి అధ్యయనం చేయడం కోసం వేసిన కమిటీ 15 రోజుల్లో నివేదికను ప్రభుత్వానికి ఇచ్చిందని అది ఫైనాన్స్‌లో పెండింగ్‌లో ఉంది. దాన్ని కూడా త్వరితగతిన పరిష్కరించాలి. క్యాబ్ డ్రైవర్ల విషయంలో కాంట్రాక్టర్లకు వదిలేయకుండా ప్రభుత్వమే బాధ్యతగా వారికి వేతనాలు చెల్లించాలి. పర్మినెంట్ ఉద్యోగులకు సంబంధించి లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ రూ.18 కోట్ల 40 లక్షల బకాయిలు ఉన్నాయి. వాటిని వెంటనే చెల్లించాలి. స్కూళ్లలో పని చేసే స్వీపర్లకి కూడా జీతం పెంచాలి. తాము చెప్పిన డిమాండ్స్ నెరవేరకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని కొనసాగిస్తాం.'

- ఉమామహేశ్వరరావు, ప్రధానకార్యదర్శి, ఏపీ మున్సిపల్ వర్కర్స్, హెల్పర్స్ ఫెడరేషన్

18కి కుదించింది... 7 డిమాండ్లు అంగీకరించింది

'ఈ ప్రభుత్వం 21 డిమాండ్లను 18కి కుదించి 7 డిమాండ్లను అంగీకరించింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంపును స్వాగతిస్తున్నాం. పర్మినెంట్ ఉద్యోగులకు సంబంధించి సరెండర్ లీవ్‌లు, జీపీఎఫ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని చెల్లించమని కోరాం. వాటిపై స్పష్టత ఇవ్వకుండా ప్రభుత్వం మెతక వైఖరి అవలంబిస్తోంది.

- సుబ్బారాయుడు, నాయకుడు, మున్సిపల్ కార్మిక సంఘాల జేఏసీ



సదస్సులో ప్రసంగిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం

అవినీతి నేతలను ప్రశ్నించాలి..

ఓటర్ల దొంగలున్నారు జాగ్రత్త

- ప్రభుత్వ విశ్రాంత చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రహ్మణ్యం

మచిలీపట్నం టౌన్, మార్చి 1: అవినీతి రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులను ప్రజలు ప్రశ్నించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి, సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఉపాధ్యక్షుడు ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలోని పద్మావతి మహిళా హిందూ కళాశాలలో 'ఓటు వేద్దాం - ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అంశంపై శుక్రవారం జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల దొంగలు ఉన్నారు. ఓటర్లు అప్రమత్తమై తమ ఓటు ఉందో లేదో సరి చూసుకోవాలి. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజలకు భావ వ్యక్తీకరణకు స్వేచ్ఛ లేకుండా పోయింది. అందరికీ సమాన హక్కులు లభించడం లేదు. కొండలు తవ్వేస్తున్నారు. చెట్లను నరికేస్తున్నారు. ఇసుకను దోపిడీ చేస్తున్నారు. మద్యం మాఫియా కొనసాగుతోంది. తెలుగుజాతి అభివృద్ధిలో వెనుకబడిపోతుంది. గెలుపే లక్ష్యంగా వందల కోట్లు వెచ్చిస్తూ కుల, మత, ప్రలోభాలను ప్రేరేపిస్తూ రాజకీయ నాయకులు, ఓటర్లను సంతలో వస్తువుగా మారుస్తున్నారు. చట్టాలు రూపొందించే పాలకులకు చట్టాలపై అవగాహన ఉండటం లేదు. అధికారులను అక్రమంగా బదిలీలు చేస్తున్నారు' అని ఎల్వీ ఆరోపించారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసి సంయుక్త కార్యదర్శి వీ లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ, అధికార పార్టీ నేతలకు అధికార యంత్రాంగం తొత్తులుగా మారి ఓటర్ల జాబితాలను లోపభూయిష్టంగా మారుస్తున్నారన్నారు. వలంటీర్లను పోలింగ్ ఏజెంట్లుగా, ఎన్నికల సైన్యంగా వాడుకోవాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

బడి బిల్లు కట్టేదెవరు?

- కరెంటు బిల్లులు కట్టొద్దన్న సర్కారు
- ఇటు ప్రభుత్వమూ చెల్లించని వైనం
- బిల్లుల కోసం విద్యుత్ శాఖ ఒత్తిళ్లు
- కనెక్షన్ కట్ చేస్తామని బెదిరింపులు
- భారమంతా బడిపైనే వేస్తారేమోనని ప్రధానోపాధ్యాయుల ఆందోళన
- పాఠశాల నిర్వహణ నిధులకూ సున్నం
- గతేడాది 120 కోట్లకు గాను 50కోట్లు విడుదల
- ఈ ఏడాది పైసా కూడా విదిల్చని ప్రభుత్వం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పాఠశాలల విద్యుత్ బిల్లులపై జగన్ సర్కారు నాలుక మడతేసింది. ఓవైపు ప్రధానోపాధ్యాయులు బిల్లులు కట్టొద్దని గతంలో ప్రకటించిన ప్రభుత్వం... వాటిని ఎవరు కట్టాలనే విషయాన్ని గాలికొదిలేసింది. అటు హెచ్ఎంలను కట్టొద్దని, ఇటు ప్రభుత్వమూ కట్టకపోవడంతో ఇప్పుడు ఆ బిల్లులు భారీగా పేరుకుపోయాయి. కొన్నిచోట్ల బిల్లుల కోసం విద్యుత్ శాఖ సిబ్బంది హెచ్ఎంలను ఒత్తిడి చేస్తున్నారు. దీనికి పరిష్కారం చూపాలంటూ వారు ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఏదో ఒక రోజు ఆ బిల్లుల భారాన్ని బడులపైనే వేస్తారని హెచ్ఎంలు ఆందోళన చెందుతున్నారు.

గతంలో పాఠశాలలకు ఇచ్చే నిర్వహణ నిధుల నుంచి కరెంటు బిల్లు చెల్లించేవారు. అయితే జగన్ ప్రభుత్వం నిర్వహణ నిధులు మొత్తం చెల్లించకుండా ఎగ్గొడుతోంది. ఏడాదికి ఐదు విడతల్లో ఈ నిధులు విడుదల చేయాల్సిన పాఠశాల విద్యాశాఖ 2022-23 విద్యా సంవత్సరంలో కేవలం రెండే విడతలే ఇచ్చింది. రాష్ట్రంలోని మొత్తం 45వేల పాఠశాలలకు నిర్వహణ నిధుల కింద రూ.120 కోట్లు ఇవ్వాలి. కానీ అందులో కేవలం రూ.50 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకొంది. ప్రస్తుత విద్యా సంవత్సరం దాదాపు ముగింపుకొచ్చినా ఇంతవరకూ ఒక్క విడత నిధులు కూడా ఇవ్వలేదు. దీంతో పాఠశాలల్లో నిర్వహణ ఖర్చులకు తిప్పలు తప్పడం లేదు. అందులో విద్యుత్ బిల్లులు కీలకం. ఉన్నత పాఠశాలలకు నెలకు రూ.5వేల వరకు బిల్లులు వస్తాయి. వాటిని ఎలా చెల్లించాలని హెచ్ఎంలు ప్రశ్నించడంతో ఏడు నెలల కిందట ఓ సమావేశంలో ఆ బిల్లులు ప్రభుత్వమే కడుతుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ హామీ ఇచ్చారు. అప్పటినుంచీ బడుల్లో కరెంట్ బిల్లులు చెల్లించడం లేదు. అయితే మంత్రి హామీ ఇచ్చినా ఆ బిల్లులు ఎవరు కడతారనేదానిపై ఇంతవరకూ స్పష్టత లేదు. బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుందనే జీవో ఇవ్వాలని టీచర్లు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఉత్తర్వులు లేకపోవడంతో పలుచోట్ల బిల్లులు కట్టాలంటూ విద్యుత్ శాఖ ఒత్తిడి చేస్తోంది. కట్టకపోతే కనెక్షన్ కట్ చేస్తామంటూ బెదిరింపులూ వస్తున్నాయి.

హెచ్ఎంలపైనే భారం

విద్యుత్ బిల్లులతో పాటు పాఠశాల నిర్వహణకు ఒక్క రూపాయి లేక హెచ్ఎంలు సతమతమవుతున్నారు. చాక్‌పీస్‌లు, పత్రికలు, ఇతరత్రా చిన్నపాటి అవసరాలు, తల్లిదండ్రుల కమిటీ నిర్వహణ అవసరాలు, అధికారిక కార్యక్రమాలకు ఆర్థిక కష్టాలు వచ్చిపడ్డాయి. వాటిని ఎలా అధిగమించాలని అధికారులను అడిగితే ఎలాగోలా సర్దుకోవాలన్న సమాధానం తప్ప నిధులు ఇచ్చే హామీ ఏదీ కనిపించడం లేదు. మరో రెండు నెలల్లో విద్యా సంవత్సరం ముగుస్తున్నా ఒక్క రూపాయి విడుదల చేయకపోతే బడులను ఎలా నడపాలని హెచ్ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఉన్నత పాఠశాలలకు ఏడాదికి రూ.75వేల నుంచి రూ.లక్షకు పైగా నిధులు వస్తాయి. ప్రాథమిక పాఠశాలలకు రూ.25వేల వరకూ ఇస్తారు. ఒక్క విద్యుత్ బిల్లులు కట్టొద్దని చెప్పి ఇప్పుడు ఆ మొత్తం నిధులను ప్రభుత్వం ఆపేసింది. ఏవైనా కార్యక్రమాలు చేస్తే టీ, బిస్కెట్లు ఇచ్చే పరిస్థితి కూడా లేదని హెచ్ఎంలు వాపోతున్నారు. ఇటీవల ట్యాబ్ పంపిణీకి అన్ని పాఠశాలలకూ స్థానిక ఎమ్మెల్యేలు వెళ్లారు. అందుకోసం అయిన ఖర్చులన్నీ హెచ్ఎంలపైనే వేశారు. గణతంత్ర, స్వాతంత్ర్య దినోత్సవాల ఖర్చుల భారం కూడా వారిపైనే పడుతోంది.

సునీత ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలి: వర్ల

అమరావతి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వివేకానందరెడ్డి హత్య కేసులో ఆయన కూతురు సునీత ప్రశ్నలకు సీఎం జగన్ సమాధానాలు చెప్పగలరా? అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య నిలదీశారు. శుక్రవారం టీడీపీ జాతీయ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. '2019, మార్చి 14న అర్ధరాత్రి బాబాయిని హత్య చేసిందెవరో జగన్‌కు తెలుసని సునీత ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పారు. చెల్లెలు సునీత ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం జగన్‌కు ఉందా? జగన్‌కు ఓటేయ్యొద్దు.. ఘోరంగా ఓడించండి అని సునీత చెప్పడం కంటే జగన్‌కు సిగ్గుచేటు మరొకటి ఉందా? సునీత ప్రశ్నలకు సమాధానం చెప్పకపోతే.. వివేకా హంతకులెవరో జగన్‌కు తెలిసినట్లే అని భావించాల్సి ఉంటుంది' అని వర్ల అన్నారు.

జగన్‌కు ఓటెయ్యొద్దని చెల్లెలే చెబుతోంది

- వివేకా హత్యలో ఆయన పాత్రపై సందేహం: సత్యకుమార్

న్యూఢిల్లీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ పాత్రపై విచారించాలని ఆయన చెల్లెలు సునీతా రెడ్డే డిమాండ్ చేస్తుంది. అంటే అందులో ఆయన పాత్ర ఉందనే సందేహం కలుగుతుంది' అని బీజేపీ నేత సత్యకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన ఎక్స్‌లో స్పందించారు. 'బాబాయి కూతురే తన అన్న పార్టీకి ఓటేయవద్దని, ప్రజాకోర్టే తన తండ్రి మరణంపై తీర్పు ఇవ్వాలని కోరుతున్నారు. చెల్లే ఈ మాట చెపితే.. జగన్ ఈ రాష్ట్రానికి ఏం మేలు చేసినట్టు' అని ఆయన ప్రశ్నించారు.

దూషించిన జయరాంకు అందలమా..?

- కర్నూలు టీడీపీ శ్రేణుల ఆగ్రహం
- ఆ పార్టీలో చేరేందుకు మంత్రి గుమ్మనూరు తీవ్ర యత్నాలు
- కర్ణాటక అడ్డాగా పావులు
- కొందరు కీలక నేతల ద్వారా ఒత్తిడి
- టీడీపీ అధిష్ఠానం సానుకూల స్పందన!
- ఆలూరు, గుంతకల్‌లో ఒక చోట టికెట్ ఇచ్చేందుకు ఆమోదం?
- 2-3 రోజుల్లో బాబు సమక్షంలో చేరిక
- జీర్ణించుకోలేకపోతున్న టీడీపీ శ్రేణులు

(కర్నూలు/అమరావతి-ఆంధ్రజ్యోతి)




టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబుపై వ్యక్తిగత దూషణలు చేశారు.. నీవు చంద్రబాబుకే పుట్టి ఉంటే.. అంటూ యువనేత లోకేశ్‌నూ దుర్భాషలాడారు. ఇప్పుడే అదే పార్టీలో చేరేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన ఎవరో కాదు కర్నూలు జిల్లాకు చెందిన కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం. కర్ణాటక అడ్డాగా పావులు కదిపారని.. ఆయన చేరికకు టీడీపీ అధిష్ఠానం కూడా సానుకూలంగా స్పందించిందనే ప్రచారం జోరుగా సాగుతోంది. కేవలం సీఎం జగన్ మెప్పు కోసం ప్రతిపక్ష నేతలను పరుష పదజాలంతో దూషించిన వ్యక్తిని పార్టీలో ఎలా చేర్చుకుంటారు..? కార్యకర్తలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు.. ఇన్నాళ్లూ ఆయనకు వ్యతిరేకంగా పోరాడిన కార్యకర్తల మనోభావాలు పట్టవా అని జిల్లావ్యాప్తంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యేగా ఉన్న జయరాం, ఆయన సోదరులపై తీవ్ర అవినీతి ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగా ఆయనకు వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని సీఎం జగన్ తేల్చిచెప్పారు. ఆలూరు వైసీపీ ఇన్‌చార్జి చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు బి.విరుపాక్షిని అధికారికంగా ప్రకటించారు కూడా. ఈ నిర్ణయం మంత్రి జయరాం, ఆయన సోదరులకు మింగుడుపడలేదు. వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేశారు. ఏపీ నాయకులతో పాటు కర్ణాటక సీఎం సిద్దరామయ్య కేబినెట్‌లో మంత్రిగా ఉన్న బళ్లారి రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర (జయరాంకు సోదరుడు), మరికొందరు కీలక నేతల ద్వారా ఒత్తిడి తేవడంతో టీడీపీ అధిష్ఠానం కూడా సానుకూలంగా స్పందించిందని తెలుస్తోంది. ఆలూరు లేదా అనంతపురం జిల్లా గుంతకల్లు టికెట్ ఇవ్వాలని జయరాం కోరారని, టీడీపీ ఒకే చెప్పిందనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. రెండు మూడు రోజుల్లో అధికారికంగా చంద్రబాబు సమక్షంలోనే టీడీపీలో చేరతారని సమాచారం.

టీడీపీ నేతల్లో ఆందోళన..

ఎన్నికల సమయంలో నేతలు పార్టీలు మారడం సహజమే. అయితే.. తమ అధినేత చంద్రబాబు, యువ నేతలోకేశ్‌లపై వివిధ సందర్భాల్లోనూ.. మీడియా ఎదుట వ్యక్తిగతంగా దూషణలు చేసిన జయరాంను ఎలా చేర్చుకుంటారని టీడీపీ నాయకులు నిలదీస్తున్నారు. మంత్రి హోదాలో ఉండి.. పత్రికల్లో రాయడానికి వీలుకాని పదాలతో వ్యక్తిగతంగా లోకేశ్‌ను ఆయన దూషించారని గుర్తుచేస్తున్నారు. అలాంటి వ్యక్తిని పార్టీలో చేర్చుకుంటే ఎలా కలసి పనిచేయగలమని ప్రశ్నిస్తున్నారు. టీడీపీ నుంచి వైసీపీలోకి వెళ్లి చంద్రబాబు, లోకేశ్‌లను మాజీ మంత్రి కొడాలి నాని, ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వ్యక్తిగతంగా దారుణమైన పరుష పదజాలంతో దూషించారని.. వాళ్లు మళ్లీ పార్టీలోకి వస్తామన్నా ఇలాగే తీసుకుంటారా అని నిలదీస్తున్నారు. సీఎం జగన్ తన ఎమ్మెల్యేలను నియోజకవర్గాలు మారిస్తే.. ఈ ఇంట్లో చెత్త తీసుకెళ్లి పక్కింట్లో వేస్తే బంగారం అవుతుందా అని తమ నేతలే ప్రశ్నిస్తున్నారని... మరి అవినీతి, ఆరోపణలతో గెలవలేవని జగన్ పక్కన పెట్టిన జయరాంను టీడీపీలోకి తీసుకుంటే నీతిమంతుడు అయిపోతాడా అని మండిపడుతున్నారు. ఆయన విషయంలో అధిష్ఠానం పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

హైదరాబాద్‌కు షాడోలుగా ఏపీ విమానాశ్రయాలు

- ఇక్కడ డిమాండ్ ఉన్నా అంతర్జాతీయ సర్వీసులు తక్కువ
- విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ సంచలన వ్యాఖ్యలు



మాట్లాడుతున్న విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి

విజయవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, రాజమండ్రి ఎయిర్‌పోర్టులు.. హై దరాబాద్ విమానాశ్రయానికి షాడోలుగా మారిపోయాయని విజయవాడ ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎం లక్ష్మీకాంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం విజయవాడలో ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఏపీ చాంబర్స్) నేతృత్వంలో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాంబర్స్ ప్రతినిధులు అంతర్జాతీయ విమాన సర్వీసులకు సంబంధించి పలు ప్రశ్నలు సంధించారు. విజయవాడ కేంద్రంగా ఎన్నారై కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని, విదేశాల్లో చదువుకునే విద్యార్థులతో పాటు, విదేశాలకు ఉపాధి కోసం వెళ్లే వారి సంఖ్య కూడా అధికంగా ఉందని, పర్యాటకంగా వెళ్లే వారి సంఖ్య కూడా చాలా ఎక్కువగా ఉందని చాంబర్ ప్రతినిధులు ప్రస్తావించారు. కానీ, ఏపీ నుంచి అంతర్జాతీయ సర్వీసులు తక్కువగా ఉండటం వల్ల హైదరాబాద్ నుంచి 70 శాతం మంది, తమిళనాడులోని చెన్నై నుంచి 30 శాతం మంది వెళ్లాల్సి వస్తోందన్నారు. విజయవాడ విమానాశ్రయం నుంచి షార్జాకు మాత్రమే విమానాలు నడుస్తున్నాయని చెప్పారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ వయబిలిటీ గ్యాప్ ఫండ్ (వీజీఎఫ్) విధానంలో సింగపూర్‌కు విమాన సర్వీసు నడిపేదని.. ప్రస్తుతం అది కూడా లేదని చెప్పారు. సింగపూర్‌తో పాటు దుబాయ్, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాలకు విమానాలు నడపగలిగితే హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. వాటికి లక్ష్మీకాంత్‌రెడ్డి బదులిస్తూ.... ప్రస్తుతం పరిస్థితుల రీత్యా ఏపీలోని ఎయిర్‌పోర్టులన్నీ హైదరాబాద్‌కు షాడోలుగా ఉన్నాయన్నారు. విజయవాడ నుంచి ఉన్న అధిక డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విమానయాన సంస్థలతో తరచూ సంప్రదింపులు జరుపుతున్నా ఎవరూ ముందుకు రావడంలేదన్నారు. ఎయిరిండియా ముందుకు రావడం వల్ల ప్రస్తుతం షార్జాకు రెండు అంతర్జాతీయ విమానాలు నడుస్తున్నాయన్నారు. తాము సింగపూర్, దుబాయ్, శ్రీలంక, థాయ్‌లాండ్ వంటి దేశాలకు విమాన సర్వీసులు నడిపేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. దుబాయ్‌కు స్లాట్లు కూడా దొరకడం లేదని, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాలకైతే ఇప్పట్లో నేరుగా విమానాలు నడపలేమని చెప్పారు. వచ్చే నవంబరులో విమానాశ్రయ సంస్థలతో సమావేశం జరుగుతుందని అప్పుడు గట్టిగా ప్రస్తావిస్తామని చెప్పారు. ఏపీ చాంబర్స్ నుంచి ట్రావెలింగ్ సంస్థల విభాగం ప్రతినిధులు మాట్లాడుతూ... విజయవాడ నుంచి విదేశాలకు అనూహ్య డిమాండ్ ఉంటోందన్నారు. కనీసం సింగపూర్, దుబాయ్‌లకు అయినా విమాన సర్వీసులు నడిపితే.. అవి వరల్డ్ డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులు కాబట్టి.. అక్కడి నుంచి ప్రపంచంలోని ఏ దేశానికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుందన్నారు. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి నెలన్నర రోజుల్లో దేశీయంగా, అంతర్జాతీయంగా కార్గో సర్వీసులు ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

రూ.1000 ఇస్తామని.. రూ.500 చేతికి...

- కాకినాడలో పాస్టర్ల సదస్సు రసాభాస
- ముఖ్య ప్రసంగీకురాలుగా వైఎస్ సోదరి విమలారెడ్డి హాజరు



కాకినాడ రూరల్‌లోని ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో జీ కన్వెన్షన్ హాలువద్ద డబ్బులు పంచుతున్న సిబ్బంది

సర్పవరం జంక్షన్ (కాకినాడ), మార్చి 1: రాబోయే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఉద్దేశంతో వైసీపీ రకరకాల ప్రయత్నాలు చేస్తోంది. క్రైస్తవ ఓట్లను పూర్తిగా రాబట్టాలన్న యోచనతో ఆ పార్టీ పెద్దలు పాస్టర్ల సదస్సుల పేరిట కార్యక్రమాలు నిర్వహించి.. ఆయా సంఘాల ఓట్లను తమవైపు తిప్పుకొనే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలోనే కాకినాడ రూరల్‌లోని ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో జీ కన్వెన్షన్ హాలులో వైసీపీ క్రిస్టియన్, మైనారిటీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పాస్టర్ల సదస్సు రసాభాసాగా మారింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరి, సువార్త బోధకురాలు డాక్టర్ వైఎస్ విమలారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్లకు పంపిణీ చేసిన కరపత్రాల్లో... జరగబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించేలా అనుగ్రహించేలా ప్రార్థించాలని పాస్టర్లను కోరారు. వైఎస్ సోదరి విమలారెడ్డి వస్తున్నారని, ఈ సదస్సుకు వచ్చే పాస్టర్లకు భోజనంతోపాటు తలో రూ.1000 ఇస్తామని నిర్వాహకులు సందేశాలు పంపారు. కార్యక్రమానికి సుమారు 2వేల మంది హాజరవుతారని నిర్వాహకులు అంచనా వేశారు. అందుకు తగ్గట్లు మీటింగ్‌కు వచ్చిన పాస్టర్ల చేతికి ట్యాగ్ వేసి వారికి తలో రూ.వెయ్యి కవర్‌లో పెట్టి ఇవ్వాలని వారు భావించారు. అయితే మొత్తం 4 వేలమందికి పైగా హాజరయ్యారు. ఏం చేయాలో పాలుపోని నిర్వాహకులు ఒక్కొక్కరికీ రూ.500 మాత్రమే అందజేశారు. దీంతో సదస్సు రసాభాసాగా మారింది. నిర్వాహకులు ఏదోలా సర్దిచెప్పి పంపించారు.

బాబాయ్ హంతకులెవరో అందరికీ తెలుసు.. సీబీఐకి తప్ప

- జగన్ స్వచ్ఛందంగా విచారణను ఎదుర్కోవాలి: ఎంపీ రఘురామరాజు

న్యూఢిల్లీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): 'హూ కిల్డ్ బాబాయ్? అన్నది రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు... ఒక్క సీబీఐకి తప్ప' అని ఎంపీ రఘురామకృష్ణరాజు ఎద్దేవా చేశారు. వైఎస్ వివేకా హంతకులెవరో తెలిసినప్పటికీ, అందరూ నటిస్తూ దాంట్లోనే జీవిస్తున్నారని విమర్శించారు. శుక్రవారం, రచ్చబండలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. హంతకులు నడిపే పార్టీకి ఓటు వేయొద్దని కోరడం ద్వారా డాక్టర్ వైఎస్ సునీతా రెడ్డి ఆమె తండ్రి వైయస్ వివేకాను ఎవరు చంపారో చెప్పకనే చెప్పారన్నారు. 'వైఎస్ వివేకాను ఎవరు చంపారో అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. ఎవడు, ఎవడికి చెప్పి వేసేయమంటే... వాడు, ఎవడికి చెప్పాడో... వాడు, ఎవరికి సుపారి కిల్లింగ్ ఆర్డర్ ఇచ్చాడో ప్రజలందరికీ తెలుసు. మా చిన్నాన్నను చంపేశారని గతంలో బావురుమన్న జగన్... స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీబీఐ విచారణను ఎదుర్కోవాలి' అని రఘురామ డిమాండ్ చేశారు. విచారణ అధికారి రామ్‌సింగ్‌పై తప్పుడు కేసు పెట్టడాన్ని తప్పు పట్టిన ఎంపీ... యోధాన యోధుల్ని, ఆఖరికి జగన్మోహన్‌రెడ్డిని కూడా అరెస్టు చేసిన సీబీఐ... అవినాశ్‌ను అరెస్టు చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమయిందని విమర్శించారు.

మాగుంట రాఘవ అప్రూవర్‌గా మారొచ్చు

- ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో రౌస్ అవెన్యూ కోర్టు అనుమతి
- విచారణకు రాఘవ అన్నివిధాలా సహకరిస్తున్నారన్న సీబీఐ

న్యూఢిల్లీ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కుంభకోణానికి సంబంధించి సీబీఐ దాఖలు చేసిన కేసులో వైసీపీ ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు రాఘవరెడ్డి అప్రూవర్‌గా మారేందుకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతినిచ్చింది. అప్రూవర్‌గా మారి క్షమాపణ పొందేందుకు కోర్టు అనుమతి కోరుతూ 306 సీఆర్‌పీసీ కింద రాఘవ సీబీఐ స్పెషల్ కోర్టును ఆశ్రయించాడు. రాఘవ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్‌పాల్.. రాఘవ అప్రూవర్‌గా మారేందుకు అనుమతిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాఘవ బెయిల్ పిటిషన్ కోర్టు ముందుకురాగా సీబీఐ ఎలాంటి అభ్యంతరం తెలపలేదు. అలాగే లిక్కర్ కేసు ఎఫ్ఐఆర్‌లో రాఘవను నిందితుడిగా గానీ, అతని కుటుంబ సభ్యులకు సంబంధించిన ఏ సంస్థల పేర్లను గానీ ప్రస్తావించలేదు. అంతేకాకుండా దర్యాప్తులో రాఘవ సహకరించారని, తమ సమన్లకు విధిగా హాజరయ్యారని సీబీఐ అధికారులు కోర్టుకు తెలిపారు.

వెకేషన్ నుంచి ఫుడ్ వరకు ప్లానింగ్ చేసే

మైక్రోసాఫ్ట్ కోపైలెట్ జీపీటీ



చాట్ జీపీటీ గురించి అందరికీ తెలిసిందే. కొద్ది కాలంలోనే అది ఎంత పాపులర్ అయిందో మనకు తెలుసు. కొన్ని సంవత్సరాల్లో ఇది గూగుల్‌ను రిప్లేస్ చేసినా ఆశ్చర్య లేదు. చాట్ జీపీటీ తరహాలో మైక్రోసాఫ్ట్ కోపైలెట్ జీపీటీని తీసుకుని వస్తోంది. ఇది ఫుడ్ ప్రిపరేషన్ మొదలుకుని టూర్‌లు ప్లాన్ చేసుకోడానికి సహకరిస్తుంది.

మైక్రోసాఫ్ట్ తెచ్చే ఈ కోపైలెట్ జీపీటీ చాలా విషయాల్లో సహకరిస్తుంది. మైక్రోసాఫ్ట్ కొద్దికాలంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సామర్థ్యాన్ని పెంచుకుంటోంది. రాబోయే సెలవులు గడపడం నుంచి డిజైన్ క్రియేషన్, కొత్త వంటకాలు, ప్రత్యేకంగా వర్కౌట్ ప్లాన్ వరకు వివిధ టాస్కులను నెరవేర్చుకునేందుకు ఈ కోపైలెట్ ఉపయోగపడుతుంది. అలాగే జీపీటీ బిల్డర్స్‌కు అవకాశం ఉంది. దీంతో యూజర్లు తమ అవసరాలకు అనుగుణంగా జీపీటీలను రూపొందించుకోవచ్చు. అయితే ప్రస్తుతం ఇది ఎక్స్‌పెరిమెంట్ దశలో ఉంది. మైక్రోసాఫ్ట్ కోపైలెట్ - డిఫాల్ట్ అసిస్టెంట్ యాప్‌గా ఆండ్రాయిడ్‌లో ఉంటుంది. గూగుల్ అసిస్టెంట్ మాదిరిగా యాక్సెస్ పొందవచ్చు. పవర్ బటన్‌ను లాంగ్ ప్రెస్ లేదా స్క్రీన్‌పై డయాగ్నల్‌గా స్వైప్ చేయడం ద్వారా తీసుకోవచ్చు.

మాట్లాడలేని వాళ్ళకు గొంతు 'విష్'



సర్వరోగ నివారిణిగా సాంకేతికతను ముమ్మరంగా వినియోగించుకునే రోజులివి. సుదూరంగా ఉన్న రోగులను సైతం ఆదుకునే మార్గాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఈ క్రమంలో డచ్ స్టార్టప్ ఒకటి గొంతుపోయిన వ్యక్తుల పాలిట కల్పవృక్షంగా మారింది. వారి కోసం ప్రత్యేకించి విష్ పేరిట ఒక యాప్‌ను రూపొందించింది. బార్సిలోనాలో జరిగిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో సదరు యాప్‌ను ప్రదర్శించింది. తగ్గిపోయిన వాయిస్, బలహీనపడిన ఓకల్‌కార్డ్(స్వరతంత్రి)ని సహజమైన వాయిస్‌గా ఈ యాప్ మారుస్తుంది. అనారోగ్యం, వయసు మీరడం తదితరాల్లో ఏదైనా కావచ్చు - సహజమైన గొంతును కోల్పోయిన వ్యక్తులకు ఇది బాసటగా నిలుస్తుంది. ఆడియో టు ఆడియో ఆధారిత ఏఐ ఇది. సంప్రదాయ పద్ధతిలో అంటే స్పీచ్ టు టెక్స్ట్‌కు బదులు రియల్‌టైమ్ వాయిస్ పెంపునకు ఇది దోహదపడుతుంది. లెటెన్సీని తగ్గిస్తుంది. సంభాషణ ఫ్లో ఆగకుండా కాపాడుతుంది. దీనికోసం ముందుగా సదరువ్యక్తి వాయిస్‌ని రికార్డు చేయాలి. అప్పుడు మాత్రమే దాన్ని విస్తరించవచ్చు. యాప్‌లో ఉండే ఈ ఆప్షన్‌తో బ్యాక్‌గ్రౌండ్ వాయిస్‌ని తొలగించడమే కాదు, సహజ గొంతును పెంచవచ్చు. ముందుగా సెట్ చేసుకున్న వాయిస్‌ను కూడా పొందవచ్చు. అదో అదనపు వెసులుబాటు. రమారమి ఇరవై డాలర్లు నెలకు చెల్లించి గొంతు మూగపోయిన వ్యక్తులు ప్రయోజనం పొందవచ్చు.



టోల్ కట్టకుండా సేఫ్ ట్రావెల్!



ప్రయాణం అంటే పెట్రోల్‌కు తోడు టోల్ టాక్సులతో కలిపి ఖర్చు తడిసి మోపెడు అవుతోందన్న ఆవేదనను చాలామంది వ్యక్తం చేస్తుంటారు.. ఇందుకు తరుణోపాయం గూగుల్ మ్యాప్స్‌లోనే ఉంది. గూగుల్ మ్యాప్స్‌లోనే మరింత సెర్చ్‌తోనే ఇది సాధ్యమవుతుంది. జస్ట్ కొద్దిపాటి టిప్స్‌తో టోల్ ట్యాక్స్‌లను తప్పించుకోవచ్చు. తద్వారా ఆ ఖర్చు తగ్గించుకోవచ్చు. బడ్జెట్ ఫ్రెండ్లీ డ్రైవ్ చేసుకోవచ్చు. అందులో భాగంగా....

- గూగుల్ మ్యాప్స్ యాప్‌లో స్టార్టింగ్, డెస్టినేషన్ లొకేషన్‌లను తెలియజేయాలి.
- ఐఫోన్‌లో త్రీడాట్ మెనూని టాప్ చేయాలి. ఆండ్రాయిడ్ యూజర్లు త్రీ వెర్టికల్ డాట్స్‌ను టాప్ చేయాలి.
- మెనూ నుంచి ఆప్షన్స్‌ని ఎంపిక చేయాలి. సెట్టింగ్స్‌లో అవాయిడ్ టోల్స్, అవాయిడ్ మోటార్ వేస్ అని రెండే ఉంటాయి. వాటిని టోగెల్ చేయాలి.
- గూగుల్ మ్యాప్స్ యూజర్ ప్రాధాన్యాలను గుర్తిస్తుంది. ఆటోమేటిక్ ప్లానింగ్ చేసేస్తోంది. టోల్స్, హైవేస్ లేకుండా చూస్తుంది. ఇది వద్దనుకుంటే ఇందాకటి స్టెప్స్‌ని రిపీట్ చేయాలి.
- నిజానికి మోటారు సైకిలిస్టులు, వ్యక్తులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ముఖ్యంగా ఈ రూట్స్‌లో వేగంగా వెళ్ళకూడదు. ప్రధాన రహదారులు కానందున రోడ్స్ ఎలా ఉంటాయన్నది కూడా చెప్పలేం. ప్రధాన రహదారుల మాదిరిగా విశాలంగా డివైడర్స్ తదితరాలతో ఉండకపోవచ్చు. ఖర్చు మాత్రం గణనీయంగా తగ్గుతుంది. ఇక ఎంపిక యూజర్ అభీష్టాన్ని బట్టి ఉంటుందని వేరే చెప్పాల్సిన పనిలేదు.

హ్యాండ్‌రిటెన్ యానొటేషన్ ఫీచర్





గూగుల్ డాక్స్ - ఒక మలుపుతిప్పే ఫీచర్‌ను పరిచయం చేస్తోంది. యూజర్లు ఇకపై డాక్యుమెంట్స్‌పైనే చేత్తో రాయడంలో భాగంగానే యానొటేషన్ అంటే అదనపు నోట్స్, కామెంట్ లేదా ఆదేశం ఇచ్చే అవకాశాన్ని కల్పిస్తోంది. చేతిరాత అంటే చేతి వేళ్ళే కాకుండా స్టయిలస్‌ను కూడా ఉపయోగించుకోవచ్చు. గూగుల్ వర్క్‌స్పేస్ కస్టమర్స్‌కు దీన్ని అందుబాటులోకి తెచ్చారు. సబ్‌స్క్రయిబర్లు, పర్సనల్ గూగుల్ అకౌంట్స్ ఉన్న వ్యక్తులు కూడా ఈ ఫీచర్‌తో ప్రయోజనం పొందవచ్చు. ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ని ఆండ్రాయిడ్ డివైజ్‌లకు పరిమితం చేశారు. రేపిడ్ రిలీజ్ యూజర్లకు దీన్ని ఫిబ్రవరి 27న రిలీజ్ చేశారు. మార్చి 11లోగా గూగుల్ స్టాండర్డ్ రిలీజ్‌కు చేరుకోవాలి. అలా చేస్తే స్టాండర్డ్ పెన్, హైలైటర్ కలర్స్ తదితరాలను ఆఫర్ చేసింది. ఈ ఫీచర్‌ని ఎడ్యుకేటర్లు కూడా ఉపయోగించుకోవచ్చు. విద్యార్థులు రాసే వ్యాసాలపై ఫీడ్‌బ్యాక్ అందించడం సహా క్రియేటివిటీకి సంబంధించిన పలు ప్రొఫెషనల్ పనుల్లో దీన్ని వాడుకోవచ్చు.

ఇన్‌స్టాగ్రామ్‌లో స్నాప్‌చాట్ ఫీచర్స్!





స్నాప్‌చాట్‌లో ప్రస్తుతం ఉన్న మంచి ఫీచర్లను ఇన్‌స్టాగ్రామ్ సైతం అందించే యత్నాల్లో ఉంది. అందులో ఫ్రెండ్స్ మ్యాప్ ఫీచర్ ఒకటి. దీంతో ఫ్రెండ్స్ షేర్ చేసిన కంటెంట్‌ను లొకేషన్ ట్యాగ్స్‌తో కలిపి చూడవచ్చు. నోట్స్‌లో గ్రూప్ చాట్ సంభాషణలు, స్టోరీలకు ఏఐ స్టిక్కర్లు, కెరోసల్ పోస్టులు తదితరాలు కూడా ఇన్‌స్టాగ్రామ్‌లో ఉండనున్నాయి. మొబైల్ డెవలపర్ ఒకరు ఎక్స్‌లో ఈ మేరకు పోస్టు ఒకటి పెట్టారు. మ్యాప్ ఫీచర్ రాబోతున్నట్టు తనే వెల్లడించారు. స్నాప్‌చాట్‌లో యూజర్లకు స్నాప్ మ్యాప్ ఉంటుంది. లొకేషన్ సహా తమ స్నేహితుల యాక్టివిటీస్‌ని తెలుసుకోగలుగుతారు. సరిగ్గా అదే పద్ధతిలో ఇన్‌స్టాగ్రామ్‌లోనూ ఉండొచ్చని చెబుతున్నారు. లొకేషన్ ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్ట్ అయి ఉంటుందని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోందని సదరు లీకర్ కథనం

అయిదు మోడల్స్‌తో ఐఫోన్ 16?



యాపిల్ ఈసారి స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌ను ఒక కుదుపునకు గురిచేసే ఎత్తుగడలో ఉందన్న పుకార్లు వినిపిస్తున్నాయి. ఎకాఎకిన అయిదు మోడల్స్‌తో ఐఫోన్ 16 సిరీస్ విడుదల కానుందని సమాచారం. వివరాల్లోకి వెళితే...

- **ఐఫోన్ 16 ఎస్ఈ, ఐఫోన్ 16 ప్లస్ ఎస్ఈ:** ఇవి బడ్జెట్ ఫోన్లు. సింగిల్ పిల్ షేప్‌తో రేర్ కెమెరా లేఔట్, డైనమిక్ ఐలండ్ టెక్నాలజీ, స్టాండర్డ్ 60హెచ్‌జెడ్ డిస్‌ప్లే, కాంపాక్ట్ బ్యాటరీ కాన్ఫిగరేషన్స్ వీటి సొంతం.
- **ఐఫోన్ 16:** మిడిల్ రేంజ్ మార్కెట్‌ను ఉద్దేశించి దీన్ని రూపొందించారు. 120హెచ్‌జెడ్ స్క్రీన్ డిస్‌ప్లే, డ్యూయల్ రేర్ కెమెరా సెటప్, ఎన్‌హ్యాన్స్‌డ్ ఫొటోగ్రఫీ, గరిష్టీకరించిన బ్యాటరీ పర్ఫార్మెన్స్‌తో వస్తోంది.
- **ఐఫోన్ 16 ప్రొ, ఐఫోన్ 16 ప్రొమాక్స్:** కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీతో వచ్చే ప్రీమియమ్ ఫోన్లు ఇవి. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, వెర్టికల్ అరేంజ్‌మెంట్స్‌తో అడ్వాన్స్‌డ్ ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్, స్లీక్ పిల్ షేప్డ్ కెమెరా బంప్స్ ఉంటాయి.

మొత్తమ్మీద వీటి రేట్లు 700 డాలర్ల నుంచి 1100 డాలర్ల వరకు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. వేరియంట్, వెర్షన్, మోడల్‌ను బట్టి ధరలో మార్పులు ఉంటాయి. ఈ ఏడాది సెప్టెంబరులో ఇవి రావచ్చని అనుకొంటున్నారు.

ఎక్స్‌లోడర్

ఆండ్రాయిడ్ తాజా మాల్వేర్



ఆండ్రాయిడ్ డివైజ్‌లకు తాజాగా మరో మాల్వేర్ ముప్పు పొంచి ఉంది. క్రోమ్ బ్రౌజర్‌తో అదృశ్య శక్తిగా చొచ్చుకువస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆండ్రాయిడ్ డివైజ్‌లను అల్లకల్లోలం చేసే పరిస్థితులు నెలకొన్నాయని నివేదికలు వెలువడుతున్నాయి. ఆండ్రాయిడ్ ఎక్స్‌లోడర్ మాల్వేర్ పూర్తి మోసపూరిత విధానాలను అనుసరిస్తోంది. దీనిలో భాగంగా మోసపూరిత వెబ్‌సైట్ లింకులతో ఎస్ఎంఎస్ మెసేజెస్ అందుతాయి. వాటిపై క్లిక్ చేయగానే డివైజ్‌ల యాక్సెస్ హ్యాకర్లకు లభిస్తుంది. అక్కడి నుంచి తస్కరణ ఆరంభమవుతుంది. క్రోమ్ బ్రౌజర్ అంటూ మాల్వేర్ ఉన్న ఎపీకే ఫైల్స్ వాటి ఇన్‌స్టలేషన్‌కు వీలుకల్పిస్తాయి. చివరాఖరుకు అనాథరైజ్డ్ యాక్సెస్‌తో నేపథ్యంలో ఉంటూ అనుచిత కార్యకలాపాలకు ఈ మాల్వేర్ వీలుకల్పిస్తుంది. అనధికారికంగా యాక్సెస్ పొంది అనుచిత చర్యలకు పాల్పడటానికి దోహదపడుతుంది. పాస్‌వర్డ్స్, ఫొటోలు, కాంటాక్ట్ వివరాలు తదితరాలన్నింటినీ తస్కరించే అవకాశం ఏర్పడుతుంది. ఇలాంటి ప్రమాదాలను ఎదుర్కొనేందుకు ప్లే ప్రొటెక్ట్‌ను ఆసరా చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

వాట్సాప్ 'సెర్చ్ బై డేట్'



వాట్సాప్ తాజాగా 'సెర్చ్ బై డేట్' ఫీచర్‌ను ప్రకటించింది. ఇది అందుబాటులోకి వస్తే, తేదీ ప్రకారం మెసేజ్‌లను కనుగొనవచ్చు. అంటే ఇంతకుమునుపు షేర్ చేసిన మెసేజ్‌ను ఈ ఫీచర్‌తో మళ్ళీ పొందవచ్చు. ఇది వ్యక్తిగతం అలాగే గ్రూప్ చాట్స్‌కు కూడా వర్తిస్తుంది. ఈ మేరకు జుకర్‌బర్గ్ ఒక వీడియోను తన వాట్సాప్ అధికారిక చానల్‌లో పోస్ట్ చేశారు. ఆండ్రాయిడ్ డివైజ్‌లకు తోడు ఐఓఎస్, మేక్, వాట్సాప్ వెబ్‌లో ప్రస్తుతం ఈ ఫీచర్ అందుబాటులో ఉందని 'టెక్‌క్రంచ్' తెలిపింది. మీడియా టైప్ అంటే లింక్స్, మీడియా, డాక్యుమెంట్స్, నేరుగా జరిపిన సంభాషణల ఆధారంగా సెర్చ్ చేసుకోవచ్చు. డేట్ గుర్తుంటే నేవిగేషన్ చాలా సులువు అవుతుంది. కుడివైపు టాప్‌లో మూడు డాట్స్‌ని టాప్ చేయాలి. అక్కడ సెర్చ్‌ను కనుగొనాలి. దానికి కుడిపక్కన క్యాలండర్ ఐకాన్ ఉంటుంది. అందులో డేట్ ఎంపిక చేసుకుంటే ఆ రోజు షేర్ చేసిన లింకులు, మీడియా, డాక్యుమెంట్స్‌కు తోడు సంభాషణలు కనిపిస్తాయి. ఇవి కాకుండా చాట్ ఫిల్టర్స్, ఫేవరైట్స్ వంటి ఫీచర్లపై కూడా వాట్సాప్ పనిచేస్తోందని సమాచారం.

5ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో టెట్రాప్రిజిమ్ కెమెరా



ఐఫోన్ 16లో - 5ఎక్స్ ఆప్టికల్ జూమ్‌తో టెట్రాప్రిజిమ్ కెమెరా ఉంటుందని మరో వార్త. 'ట్రెండ్‌ఫోర్స్' రిపోర్ట్‌లో ఉన్న విషయమిది. పెరిస్కోపిక్ లెన్స్‌కు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో యాపిల్ దీన్ని ఐఫోన్ 16 సిరీస్‌లో పరిచయం చేస్తోంది. టెట్రాప్రిజిమ్ అంటే నాలుగు ప్రిజమ్స్(పట్టకాలు). పెరిస్కోప్ మాదిరిగా అంటే అందులో సింగిల్ ప్రిజమ్ ఉంటుంది. కాంతిని 90 డిగ్రీలకు వంచుతుంది. అది నాలుగు రెట్లు అంటే డీఎస్ఎల్ఆర్ కెమెరాలో 120ఎంఎం లెన్స్‌కు సమానమని అర్థం చేసుకోవాలి. అలా లాంగర్ పాత్ క్రియేషన్‌కు ఇది ఉపయోగపడుతుంది. దీంతోపాటు స్క్రీన్ సైజును 6.3 ఇంచీలకు పెంచుతోందని పేర్కొంది. ఐఫోన్ 15 ప్రొ మోడల్ స్క్రీన్ 6.1 ఇంచీలు మాత్రమే. ఫలితంగా ఇంటర్నల్ స్పేస్ పెరిగి, టెట్రాప్రిజిమ్ కెమెరాను ఉంచడానికి వీలవుతోందని వివరించింది. మొత్తమ్మీద ఈ పుకార్లు, వేర్వేరు కథనాలు కలిపి ఐఫోన్ 16పై అంచనాలను పెంచేస్తున్నాయంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదని చెప్పవచ్చు.

టెలికం ఆపరేటర్లకు తలనొప్పి స్మిషింగ్



స్మిషింగ్ - టెలికం ఆపరేటర్లకు నిజంగానే తలనొప్పిగా మారింది. ఎస్ఎంఎస్, ఫిషింగ్‌ని కలిపి స్మిషింగ్ అంటారు. ఫేక్ మొబైల్ టెక్స్ మెసేజ్‌లతో సైబర్ క్రిమినల్స్ చెలరేగిపోతుంటారు. ఆ మెసేజ్‌లు తద్వారా లింకులతో దిగుమతి అయ్యే మాల్వేర్ - యూజర్ల సెన్సిటివ్ సమాచారం సహా డబ్బుల తస్కరణకు ఉపయోగించుకుంటారు. అసలు విషయానికి వస్తే, రోజుకు సగటున మూడు నుంచి నాలుగు లక్షలు మేర ఎస్ఎంఎస్ అటాక్స్ ఉంటున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గుర్తు తెలియని సోర్సుల నుంచి ఈ దాడి జరుగుతోంది. కొవిడ్ సమయంలో ఆరంభమైన ఈ దాడి రోజురోజుకు తీవ్రమౌతోంది. మొబైల్ ఎకోసిస్టమ్ ఫోరమ్(ఎంఈఎఫ్) పది దేశాల్లో నిర్వహించిన అధ్యయనంలో 39 శాతం మంది వినియోగదారులు - ఈ స్మిషింగ్ బారిన పడుతున్నారని తేలింది. బార్సిలోనాలో ఇటీవల జరిగిన మొబైల్ వరల్డ్ కాంగ్రెస్‌లో ఈ విషయం ప్రస్తావనకు వచ్చింది. నిజానికి ఇదో సీరియస్ వ్యవహారమని తైవానీస్ సైబర్ సెక్యూరిటీ సంస్థ పిన్‌ట్రస్ట్ హెడ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క అమెరికాలోనే 2022లో ఈ స్మిషింగ్‌తో 330 మిలియన్ డాలర్ల మొత్తాన్ని దోచారని ఫెడరల్ ట్రేడ్ కమిషన్ పేర్కొంది. ఈ విషయంలో కొన్ని దేశాలు సీరియస్‌గానే వ్యవహరిస్తున్నాయి. అయితే యూజర్ల అప్రమత్తతే దీనికి విరుగుడని పలువురు నిపుణులు పేర్కొనడం గమనార్హం.

మొబైల్ ఫోన్ పిల్లలతో జాగ్రత్త సుమా!

నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు మొబైల్ ఫోన్ ఇవ్వకతప్పదు. అదేవిధంగా ఏవి చూస్తారో, మరి వేటికి అడిక్ట్ అవుతారో అన్న భయం కూడా తల్లిదండ్రులకు ఉంటుంది. అలాగని ఇవ్వబోమని భీష్మించుకుని కూర్చోవడం తగదు. ఈ నేపథ్యంలో పేరెంట్స్ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలంటే...



- ఇప్పటి డివైజుల్లో పేరెంటల్ కంట్రోల్ ఫీచర్స్ చాలానే ఉన్నాయి. కొన్ని యాప్స్, వెబ్‌సైట్స్ అలాగే పిల్లలకు అవసరం లేని కంటెంట్‌ను వాటితో చాలా సులువుగా నియంత్రించవచ్చు.
- కంటెంట్ ఫిల్టర్లు మరొకటి. పూర్తిగా బ్లాక్ చేయడం ఒక విధానం. యాక్సెస్‌ను పరిమితం చేయడం మరొకటి. నిజానికి ఈ ఫిల్టర్లు ప్రొటెక్షన్‌కు సంబంధించి అదనపు లేయర్‌గా ఉపయోగపడతాయి.
- వెబ్ బ్రౌజర్స్‌పై సేఫ్ సెర్చ్ సెట్టింగ్స్‌ను యాక్టివేట్ చేయవచ్చు. పిల్లల వయసుకు తగ్గట్టుగా మాత్రమే సెర్చ్ ఇంజన్ పనిచేసేలా ఫిల్టర్ పెట్టవచ్చు. వారికి తగ్గ లేదా అవసరమైన మెటీరియల్ మాత్రమే అందుబాటులోకి వచ్చేలా చూడవచ్చు.
- యాప్ పర్మిషన్స్ నిర్వహణ, సమీక్ష కూడా చాలా అవసరం. సెన్సిటివ్ డేటా విషయంలో కంట్రోల్ ఉంచాలి. అంటే కాంటాక్ట్ నుంచి అత్యంత ముఖ్యమైన సమాచారం విషయంలో పిల్లల ప్రైవసీకి ఆటంకం కలుగకుండా చూడాలి.
- స్క్రీన్‌టైమ్ లిమిట్ మరొకటి. వయసు, అవసరాలను దృష్టిలో పెట్టుకుని పిల్లలు వీక్షించే సమయాన్ని కంట్రోల్ చేయాలి. ఆ పరిమితి దాటకుండా చూడాలి. వారి కంటి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి.

వీటికి తోడు పిల్లల విషయంలో మరికొన్ని జాగ్రత్తలు కూడా పాటించాలి.

- ఇంటర్నెట్ సేఫ్టీపై పిల్లలతో కూలంకుషంగా, ఓపెన్‌గా మాట్లాడాలి.
- ఆన్‌లైన్ రిస్కులపై అవగాహన కలిగించాలి.
- పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను మానిటర్ చేయాలి.
- ఇతరుల ప్రైవసీని గౌరవించడం, ఆన్‌లైన్ మర్యాదలను తెలియజేయాలి. డిజిటల్ సిటిజన్‌షిప్ విషయం బాధ్యతాయుతంగా ప్రవర్తించాల్సిన అవసరాన్ని పక్కాగా చెప్పాలి.
- చెప్పడానికి ముందు ఆచరించాలన్న విషయాన్ని కూడా తల్లిదండ్రులు గుర్తుంచుకోవాలి.

ట్రూకాలర్ నుంచి కాల్ రికార్డింగ్...!





ట్రూకాలర్ - కాల్ రికార్డింగ్స్‌కు తోడు ఏఐ పవర్డ్ ట్రాన్స్‌క్రిప్షన్ ఫీచర్లను ఇండియాకు కూడా తీసుకువచ్చింది. ఇంతకు మునుపు ఇది అమెరికాకు పరిమితం. ఏడాదిలోపే వివిధ ప్రాంతాలకు ఈ రెంటినీ విస్తరించింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు ఇద్దరికీ ఈ ఫీచర్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి ప్రీమియమ్ ఫీచర్లు. యాప్ పెయిడ్ యూజర్లు మాత్రమే వీటిని వినియోగించగలరు. యాప్ పరిధిలోనే కాల్స్‌ను నేరుగా రికార్డ్ చేస్తుంది. మూడో పార్టీ ప్రమేయాన్ని అనుమతించదు. అదేవిధంగా అందుకున్న కాల్‌కు సంబంధించి ట్రాన్స్‌క్రిప్షన్ సదుపాయం కూడా ఉంటుంది. కాల్ ఒకసారి పూర్తి కాగానే ట్రాన్స్‌క్రిప్షన్ అందుబాటులోకి వస్తుంది. ఈ యాప్ ఇంతకుమునుపే ఈ సదుపాయాన్ని అందించేందుకు ముందుకు వచ్చింది. అయితే గూగుల్ పెట్టిన ఆంక్షలతో ఆపేసింది.

అలాగే ఐఫోన్‌లో ఆంక్షలు ఎక్కువ. అందువల్ల ట్రూకాలర్ యూజర్లు సెర్చ్ పేజీలోకి వెళ్ళి 'రికార్డ్ ఎ కాల్'ని టాప్ చేయాలి. తదుపరి స్పెషల్ నంబర్ ఒకటి ఇస్తుంది. దాంతో ఈ బెనిఫిట్‌ను ఉపయోగించుకోవచ్చు. ఆండ్రాయిడ్‌లో ఈ సదుపాయం సూటిగా ఉంటుంది. ట్రూకాలర్ దీని కోసం డెడికేటెడ్ బటన్ ఒకటి ఉంచింది. దాంతో పని కానిచ్చేయవచ్చు. ట్రాన్స్‌క్రిప్షన్ సదుపాయం ప్రస్తుతం ఇంగ్లీష్, హిందీలో మాత్రమే లభ్యమవుతుంది.

గూగుల్ పిక్సెల్ 8 సిరీస్, పాత జనరేషన్‌లో సపోర్ట్ చేసే గూగుల్ మోడల్స్, గెలాక్సీ ఏఐని సపోర్ట్ చేసే శాంసంగ్ స్మార్ట్‌ఫోన్లలో ఇది ఇన్‌బిల్ట్ ఫీచర్. అలా లేనివాళ్ళు రేటు భరించి ట్రూకాలర్ నుంచి పొందవచ్చు. ఇది పెయిడ్ ఫీచర్. ఇండియాలోని సబ్‌స్క్రయిబర్లు నెలకు రూ.75 అదే ఏడాదికి రూ.529 ఈ రెంటికీ చెల్లించాల్సి ఉంటుంది.

కాల్ హిస్టరీ కావాలంటే...!



అవసరాలు వేర్వేరుగా ఉంటాయి. సమస్త పనులకు మొబైల్ ఉపయోగించే వ్యక్తులకు కాల్ చరిత్ర అవసరం ఎప్పుడైనా పడవచ్చు. అలాంటి సందర్భాల్లో, ఆరు నెలల హిస్టరీ కావాలంటే ఎయిర్‌టెల్, జియో యూజర్లు సులువుగా పొందవచ్చు. ఎయిర్‌టెల్ యూజర్లు ఎస్ఎంఎస్ లేదా ఎయిర్‌టెల్ వెబ్‌సైట్ నుంచి వివరాలు తీసుకోవచ్చు. జియో యూజర్లకు ఈ విషయంలో మైజియో యాప్ ఉపయోగపడుతుంది.

ఎయిర్‌టెల్ యూజర్లకు రెండు విధాలుగా గడచిన ఆరు నెలల కాల్ హిస్టరీని పొందవచ్చు. మొదటిది ఎస్ఎంఎస్ విధానం. మెసేజ్ యాప్‌ని ఓపెన్ చేసి రిసీవర్ దగ్గర 121ని ఎంటర్ చేయాలి. "EPREBILL" అని టైప్ చేయాలి. ఎప్పటి నుంచి మరెప్పటివరకు కావాలో వివరాలను పొందుపర్చాలి. ఈమెయిల్ ఐడీని కూడా ఎంటర్ చేసి ఉపయోగిస్తున్న ఎయిర్‌టెల్ మొబైల్ నంబర్ నుంచి పంపాలి. రెండో పద్ధతిలో ఎయిర్‌టెల్ కస్టమర్ సర్వీసును సంప్రదించవచ్చు. ఎయిర్‌టెల్ కస్టమర్ కేర్ నంబర్‌ని కాంటాక్ట్ చేయాలి లేదంటే ఎయిర్‌టెల్ స్టోర్‌కి వ్యక్తిగతంగా వెళ్ళాలి. దీనికి కొంత మొత్తం ఫీజుగా వసూలు చేయవచ్చు. వెబ్‌సైట్‌లో అంటే అక్కడ మొబైల్ నంబర్, పాస్‌వర్డ్‌తో ఎంటర్ కావాలి. 'యూజింగ్ డీటెయిల్స్' సెక్షన్‌లోకి వెళ్ళాలి. వ్యూకాల్ రికార్డ్స్ ఆప్షన్‌ని పట్టుకోవాలి. అక్కడ కోరుకున్న తేదీ - రేంజ్ వివరాలు ఎంచుకుని సబ్మిట్‌పై క్లిక్ చేయాలి. వెంటనే స్క్రీన్‌పై ఆ వివరాలు ప్రత్యక్షమవుతాయి. జియో నంబర్స్ విషయానికి వస్తే, మైజియో యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. యాప్‌లోకి వెళ్ళి జియో నంబర్ని లింక్ చేసుకోవాలి. మూడు హారిజాంటల్ లైన్స్‌పై క్లిక్ చేయాలి. మై స్టేట్‌మెంట్ ఆప్షన్‌పై టాప్ చేయాలి. కాల్ రికార్డ్స్ ఏ మేరకు అవసరమో తేదీ సహా వివరాలను ఎంటర్ చేయాలి. వ్యూపై టాప్ చేస్తే చాలు, కాల్ రికార్డ్స్ ప్రత్యక్షమవుతాయి.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శనివారం 2 మార్చి 2024

ఏపీ ఏకలవ్య గురుకులాల్లో ప్రవేశాలు



గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తున్న - ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. రాత పరీక్ష ద్వారా ఆరో తరగతిలో అడ్మిషన్స్ ఇస్తారు. అలాగే ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో మిగిలిన సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మొత్తం 28 గురుకులాల్లో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. బోధన, వసతి ఉచితం. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్‌ను అనుసరిస్తారు. తెలుగు మాధ్యమంలో చదువుకున్న విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. విద్యార్థులు దరఖాస్తు ఫారంలో తాము ఎంచుకొన్న గురుకులాల ప్రాధాన్య క్రమాన్ని తప్పనిసరిగా సూచించాలి.

సీట్లు: శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల వారీగా కేటాయించిన గురుకులాల్లో ఆరోతరగతిలో మొత్తం 1680 సీట్లు ఉన్నాయి. ప్రతి గురుకులంలో 60 సీట్లు ఉన్నాయి. వీటిలో సగం సీట్లను బాలికలకు ప్రత్యేకించారు.

- ఏడోతరగతిలో బాలురకు 17, బాలికలకు 19; ఎనిమిదోతరగతిలో బాలురకు 32, బాలికలకు 8; తొమ్మిదోతరగతిలో బాలురకు 35, బాలికలకు 11 బ్యాక్‌లాగ్ సీట్లు ఉన్నాయి.

అర్హత: ఆరోతరగతిలో చేరాలంటే విద్యార్థులు గుర్తింపు పొందిన పాఠశాలలో అయిదోతరగతి చదివి ఉండాలి. ఇంటిదగ్గరే చదువుకున్న విద్యార్థులు కూడా అర్హులే. వీరికి తల్లిదండ్రులు/సంరక్షకులు డిక్లరేషన్‌ను సమర్పించాలి. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతుల్లో చేరే విద్యార్థులు వరుసగా ఆరు, ఏడు, ఎనిమిది తరగతులు ఉత్తీర్ణులై ఉండాలి.


- ఆరోతరగతిలో చేరే విద్యార్థుల వయసు 2024 మార్చి 31 నాటికి పదేళ్ల నిండి 13 ఏళ్లలోపు ఉండాలి. ఏడోతరగతికి పదకొండేళ్ల నిండి 14 ఏళ్లలోపు, ఎనిమిదోతరగతికి పన్నెండేళ్ల నిండి 15 ఏళ్లలోపు, తొమ్మిదోతరగతికి 13 ఏళ్ల నిండి 16 ఏళ్లలోపు ఉండాలి.
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.1,00,000లు మించకూడదు.

రాత పరీక్ష: ఆరోతరగతికి నిర్వహించే పరీక్ష 100 మార్కులకు ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ నుంచి 50; అర్థమెటిక్, తెలుగు అంశాల నుంచి ఒక్కోదానిలో 25 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకు నిర్వహించే పరీక్షలు 200 మార్కులకు ఉంటాయి. వీటిలో ఇంగ్లీష్, తెలుగు సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10; మేథమెటిక్స్, సైన్స్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 30; సోషల్ సైన్స్ నుంచి 20 ప్రశ్నలు ఇస్తారు.ప్రశ్నకు రెండు మార్కులు ఉంటాయి. ప్రశ్నపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **రాత పరీక్ష తేదీ:** ఏప్రిల్ 13
- **మెరిట్ జాబితా విడుదల:** ఏప్రిల్ 25
- **ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** aptwgurukulam.ap.gov.

ఆర్ఐఎంసీలో ప్రవేశానికి టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్



డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్ (ఆర్ఐఎంసీ)లో ఎనిమిదోతరగతి(2025 జనవరి టర్మ్) ప్రవేశాలకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) వెబ్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. స్థానిక బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. రాత పరీక్ష, వైవా, మెడికల్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2025 జనవరి 1 నాటికి ఏడోతరగతి ఉత్తీర్ణులు/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల వయసు 2025 జనవరి 1 నాటికి పదకొండున్నరేళ్ల నుంచి పదమూడేళ్ల మధ్య ఉండాలి.

రాత పరీక్ష: మొత్తం మార్కులు 400. ఇంగ్లీష్ నుంచి 125, మేథమెటిక్స్ నుంచి 200, జనరల్ నాలెడ్జ్ నుంచి 75 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు సమాధానాలను హిందీ లేదా ఆంగ్ల మాధ్యమంలో రాయవచ్చు. ఈ పరీక్షలో అర్హత సాధించినవారికి వైవా వోస్ నిర్వహిస్తారు. దీనికి 50 మార్కులు ఉంటాయి. ఇందులో ఇంటెలిజెన్స్, పర్సనాలిటీ, కమ్యూనికేషన్ స్కిల్స్ తదితర అంశాలు పరీక్షిస్తారు. ఇందులో కూడా అర్హత సాధించినవారికి మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫీజు చెల్లించగానే ఆర్ఐఎంసీ దరఖాస్తు ఫారం, ప్రాస్పెక్టస్, పాత ప్రశ్నపత్రాలను స్పీడ్ పోస్ట్ ద్వారా పంపుతుంది. విద్యార్థులు దరఖాస్తు ఫారాన్ని నింపి అవసరమైన ధ్రువపత్రాలు జతచేసి టీఎస్‌పీఎస్సీ చిరునామాకు పంపించాలి. దరఖాస్తు ఫీజును డీడీ ద్వారా కూడా ఆర్ఐఎంసీకి పంపవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.555
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** మున్సిపల్ కార్పొరేషన్/గ్రామ పంచాయతీ జారీ చేసిన బర్త్ సర్టిఫికెట్; నివాసం, కులం ధ్రువీకరణ పత్రాలు; బోనఫైడ్ సర్టిఫికెట్; ఆధార్ కార్డ్; విద్యార్థి ఫొటోలు 2
- **చిరునామా:** తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, నాంపల్లి, హైదరాబాద్ - 500001
- **ఆర్ఐఎంసీ చిరునామా:** రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్, గర్హి కంటోన్మెంట్, డెహ్రాడూన్, ఉత్తరాఖండ్-248003
- **రాత పరీక్ష తేదీ:** జూన్ 1
- **పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.rimc.gov.in, tspsc.gov.in

బిట్స్ పిలానీ డబ్ల్యుఐఎల్‌పీ పీజీ డిప్లొమా



బిట్స్ పిలానీ - వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐఎల్‌పీ) కింద పీజీ డిప్లొమా ఇన్ స్మార్ట్ మాన్యుఫాక్చరింగ్ ప్రోగ్రామ్‌ని ఆఫర్ చేస్తోంది. కెరీర్‌కు బ్రేక్ ఇవ్వకుండానే ఈ కోర్సు చేయవచ్చు. వివిధ పరిశ్రమల్లో పనిచేసే ఇంజనీర్ల కోసం దీన్ని రూపొందించారు. మాన్యుఫాక్చరింగ్‌లో డిజైన్, ఇంప్లిమెంటేషన్, మేనేజ్‌మెంట్ వ్యవహారాలపై ఇదంతా ఉంటుంది. మెకట్రానిక్స్, ఇండస్ట్రియల్ ఐఓటీ, బిగ్ డేటా అనలిటిక్స్, మెషీన్ లెర్నింగ్, బ్లాక్‌చైన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ తదితర టాపిక్స్ ఈ కోర్సులో ఉంటాయి. మార్చి 18లోపు దరఖాస్తు చేసుకోవాలి.

మరిన్ని వివరాలకు: https://bitspilaniwilp.ac.in/pgd/post-graduatediplomainsmartmanufacturing.php చూడవచ్చు.

సమ్మర్ ఇంటర్న్‌షిప్

ఆర్‌జీఐపీటీ

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ(ఆర్‌జీఐపీటీ)- పెట్రోలియం అండ్ ఎనర్జీ ఇంజనీరింగ్ విభాగంలో 'సమ్మర్ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్' ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి ఆరు వారాలు. ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. సంస్థకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్ ఆధ్వర్యంలో రీసెర్చ్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

అర్హత: ఇంజనీరింగ్ డిగ్రీ రెండో సంవత్సరం లేదా మూడో సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు; ఎమ్మెస్సీ మొదటి ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 30
- **ప్రోగ్రామ్ తేదీలు:** మే 27 నుంచి జూలై 12 వరకు
- **వెబ్‌సైట్:** www.rgipt.ac.in



నిట్ రూర్కెలా

రూర్కెలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్ ఆర్‌కేఎల్)-సమ్మర్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. మే 16 నుంచి ప్రోగ్రామ్ ప్రారంభమౌతుంది. ఏ విధమైన ఫెలోషిప్, ఫైనాన్షియల్ అసిస్టెన్స్ ఇవ్వరు. వసతి ఉచితం. ల్యాబొరేటరీ, లైబ్రరీ, ఇంటర్నెట్, మెడికల్ సౌకర్యాలు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, టెక్నికల్ క్వాలిఫికేషన్స్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

విభాగాలు: బయోటెక్నాలజీ అండ్ మెడికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, సిరామిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎర్త్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇండస్ట్రియల్ డిజైన్, లైఫ్ సైన్స్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ, మేనేజ్‌మెంట్.

అర్హత: ప్రస్తుతం నాలుగో సెమిస్టర్ పరీక్షలు రాసిన బీఈ/బీటెక్ అభ్యర్థులు; ఆరో సెమిస్టర్ పరీక్షలు రాసిన బీఆర్క్/ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ/ఇంటిగ్రేటెడ్ ఎంటెక్/డ్యూయెల్ డిగ్రీ అభ్యర్థులు; రెండో సెమిస్టర్ పరీక్షలు రాసిన ఎమ్మెస్సీ/ఎంఏ డెవలప్‌మెంట్ స్టడీస్/ఎంబీఏ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. చివరి ఏడాది పరీక్షలు రాసినవారు, ఇప్పటికే డిగ్రీ/పీజీ పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- **సమ్మర్ ఇంటర్న్‌షిప్ వ్యవధి:** మే 16 నుంచి జూలై 15 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 28
- **ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 11
- **వెబ్‌సైట్:** nitrkl.ac.in

జాబ్ కార్నర్

ఎన్ఐఏబీలో ఇంజనీర్, క్లర్క్‌లు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ)... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్: **1 పోస్టు**
2. క్లర్కులు: **2 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్, డిగ్రీ(సివిల్/ఎలక్ట్రికల్/మెకానికల్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం, టైప్‌రైటింగ్ నైపుణ్యాలు ఉండాలి.

వయోపరిమితి: సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ ఇంజనీర్‌కు 35 ఏళ్లు; క్లర్క్ పోస్టులకు 25 ఏళ్లు మించకూడదు

దరఖాస్తు ఫీజు: రూ.200. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 22

వెబ్‌సైట్: https://www.niab.res.in/

ఎన్ఐడీలో టెక్నికల్ అసిస్టెంట్‌లు

అహ్మదాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్... డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 5

1. డిజైన్ అసిస్టెంట్: **1 పోస్టు**
2. టెక్నికల్ అసిస్టెంట్: **2 పోస్టులు**
3. సీనియర్ అసిస్టెంట్‌లు: **2 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: డిజైన్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లకు 30 ఏళ్లు; సీనియర్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు మించకూడదు.

వేతనం: నెలకు డిజైన్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లకు రూ.25,500 - రూ.81,100; సీనియర్ అసిస్టెంట్‌కు రూ.29,200 - రూ.92,300.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: మార్చి 11

వెబ్‌సైట్: www.nid.edu/home

ఏపీలో లైబ్రేరియన్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్... ఏపీ మెడికల్ అండ్ హెల్త్ సబార్డినేట్ సర్వీసులో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 4

అర్హత: మొదటి లేదా ద్వితీయ శ్రేణిలో ఎంఏ/ఎమ్మెస్సీ/ఎంకాం, ఎంఎల్ఐఎస్సీ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉండాలి.

వయోపరిమితి: 2024 జూలై 1 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.

పే స్కేల్: నెలకు రూ.48,440 - రూ.1,37,220

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, కంప్యూటర్ ప్రొఫిషియెన్సీ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.370. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మన్ అభ్యర్థులకు రూ.250

ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు: మార్చి 27 నుంచి ఏప్రిల్ 16 వరకు

వెబ్‌సైట్: https://psc.ap.gov.in/

బెల్‌లో ట్రైనీ ఇంజనీర్లు

రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగుళూరు కాంప్లెక్స్ తాత్కాలిక ప్రాతిపదికన దేశవ్యాప్తంగా హెచ్ఎల్ఎస్ అండ్ ఎస్‌సీబీ ఎన్‌బీయూ ప్రాజెక్టులో భాగంగా 517 ట్రైనీ ఇంజనీర్ల నియామకానికి దరఖాస్తులు కోరుతోంది.

కేటగిరీ రిజర్వేషన్: అన్‌రిజర్వ్‌డ్ - 210, ఓబీసీ-139, ఈడబ్ల్యూఎస్-52, ఎస్సీ-77, ఎస్టీ-39.

బెల్ జోన్ల వారీ ఖాళీలు: సెంట్రల్- 58, ఈస్ట్- 86, వెస్ట్ - 139, నార్త్-78, నార్త్ ఈస్ట్-15, సౌత్-132.

అర్హత: బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్(ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్/ టెలీ కమ్యూనికేషన్/ కమ్యూనికేషన్/ మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ). జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 55 శాతం మార్కులు అవసరం. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు ఉత్తీర్ణత చాలు.

గరిష్ఠ వయసు: బీఈ/ బీటెక్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఎంఈ/ ఎంటెక్ అభ్యర్థులకు 30 ఏళ్లు మించకూడదు.

జీతభత్యాలు: నెలకు రూ.30,000 నుంచి రూ.40,000

ఎంపిక ప్రక్రియ: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.150, 18 శాతం జీఎస్‌టీ(ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది).

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: మార్చి 13

వెబ్‌సైట్: www.bel-india.in/


ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు

న్యూఢిల్లీలోని బసాయిదరాపూర్‌లోని ఈఎస్ఐసీ మెడికల్ కాలేజీ... తాత్కాలిక ప్రాతిపతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్

విభాగాలు: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు టీచింగ్/రీసెర్చ్ విభాగంలో పని అనుభవం తప్పనిసరి.

వెబ్‌సైట్: https://esic.gov.in/



విభిన్న


మీకు తెలుసా?

- జుట్టు ఎక్కువగా ఉండి, కొమ్ములుండే ఈ జంతువును 'వైల్డ్ యాక్' అని పిలుస్తారు.
- రెండు మీటర్లుండే ఎత్తు, 3.8 మీటర్ల పొడవు.. ఈ జంతువు బరువు 800 కేజీల బరువు ఉంటుంది.
- హిమాలయాలు, టిబెట్ ప్రాంతాల్లో ఇవి జీవిస్తాయి.
- ఒంటరిగా ఉంటాయి. ఒక్కోసారి గుంపులో ఉంటాయి. ఒక్కో గుంపులో కనీసం 25 జంతువులు ఉంటాయి.
- సంవత్సరానికి ఒక్క బిడ్డనే కంటుంది ఇది.
- మగ జంతువును 'బుల్' అని.. ఆడ జంతువును 'కౌ' అని పిలుస్తారు.
- ఇవి సవాల్ విసరటంలో ముందుంటాయి. ఇవి కొట్లాడుకోవటం ప్రారంభిస్తే కనీసం రెండు రోజులు పలు దఫాలుగా మాట్లాడతాయి.



- ఇవి కేవలం 10 వేల జంతువులే ఉన్నాయి.
- వైల్డ్ యాక్స్ పిల్లలను పెంచుకుని వాటిని పెద్దయ్యాక బరువును మోయటానికి ఉపయోగిస్తారు.
- హిమాలయాల్లో ఇరవై వేల మీటర్ల ఎత్తులో కూడా ఇవి బతకగలవు.
- ఆఫ్ఘనిస్తాన్ లాంటి దేశంలో వీటి ఫొటోలతో స్టాంపులు కూడా వేశారు.
- 17 వ శతాబ్దంలో సైబీరియా ప్రాంతంలో వీటి శిలాజాలు ఉన్నాయి. అయితే ఇవి ఐదువేల సంవత్సరాల కిందటి నుంచి ఉన్నాయని పరిశోధకులు చెబుతున్నారు.

దారి కనుక్కోండి



5 తేడాలను గుర్తించండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 244

		3			7	1	8	
				9				6
		8		3				7
	3		9		6			
	9		2	8	3		5	
			1		5		6	
6				2		7		
5				1				
	8	9	7			2		

సుడోకు - 243 సమాధానం

1	4	7	6	8	3	2	5	9
3	9	5	7	1	2	4	8	6
2	8	6	9	5	4	1	3	7
9	5	3	8	6	1	7	2	4
6	7	4	3	2	9	5	1	8
8	2	1	4	7	5	9	6	3
7	3	2	1	4	8	6	9	5
5	6	9	2	3	7	8	4	1
4	1	8	5	9	6	3	7	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.